


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



మంగళవారం | 5-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 320 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: నవమి ఉ. 8.05, దశమి తె. 6.30 వరకు; నక్షత్రం: మూల సా 4.01 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: మ. 2.26-4.01, రా. 1.09-2.41; దుర్ముహూర్తం: ఉ. 8.56-9.43, రా. 10.21-11.08; అమృతఘడియలు: ఉ. 9.42-11.17; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 6.20 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మర్చంట్లకు తక్షణ సెటిల్‌మెంట్

● ఇంటర్నెట్ బ్యాంకింగ్ కోసం ఇంటరాపరబుల్ పేమెంట్ సిస్టమ్
● ఈ ఏడాదిలోనే అందుబాటులోకి

ముంబై: మర్చంట్లకు నిధుల తక్షణ సెటిల్‌మెంట్ సేవలు ఈ ఏడాదిలోనే అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్ కోసం ఇంటరాపరబుల్ పేమెంట్ సిస్టమ్‌ను ఈ ఏడాదిలోనే ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ సోమవారం తెలిపారు. ఈ వ్యవస్థ ఏర్పాటుకు ఎన్‌పీసీఐ భారత్ బిల్‌పే లిమిటెడ్ (ఎన్‌బీబీఎల్) అనుమతివ్వడం జరిగిందన్నారు. తద్వారా మర్చంట్లకు నిధుల సెటిల్‌మెంట్ త్వరితగతిన జరగడంతో పాటు డిజిటల్ చెల్లింపులపై వినియోగదారుల్లో ధీమా పెంచేందుకు ఇది దోహదపడనుందన్నారు. "ఆన్‌లైన్ మర్చంట్ పేమెంట్ లావాదేవీల కోసం ఉపయోగిస్తున్న పాత విధానాల్లో ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఒకటి. ఆదాయ పన్ను, బీమా ప్రీమియం, మ్యూచువల్ ఫండ్ పేమెంట్స్, ఈ-కామర్స్ తదితర చెల్లింపుల లావాదేవీలకు అధికంగా వినియోగించుకుంటున్న మార్గాల్లో ఒకటిగా ఉంది. ప్రస్తుతం ఇంటర్నెట్ బ్యాంకింగ్ లావాదేవీల ప్రాసెసింగ్ పేమెంట్ అగ్రిగేటర్ల (పీఏ) ద్వారా జరుగుతోంది. కానీ ఈ వ్యవస్థ ఇంటరాపరబుల్ కాదు. అంటే, భిన్న ఆన్‌లైన్ మర్చంట్లకు చెందిన ప్రతి పీఏతో బ్యాంక్ విడిగా అనుసంధానితం కావాలి. దాంతో లావాదేవీల ప్రాసెసింగ్ సంక్లిష్టంగా ఉంది"ని దాస్ అన్నారు. డిజిటల్ చెల్లింపుల అవగాహన వారోత్సవాల కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

డిజిటల్ చెల్లింపుల్లో 80 శాతానికి యూపీఐ వాటా

భారత డిజిటల్ చెల్లింపుల యాత్రలో తమ వంతు పాత్ర పోషించేందుకు ఆర్‌బీఐ కట్టుబడి ఉందని దాస్ అన్నారు. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) త్వరితగతి చెల్లింపుల విధానంగా దేశీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తం ప్రాచుర్యం పొందిందని అన్నారు. గత ఏడాది చివరినాటికి దేశంలోని మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ వాటా 80 శాతానికి చేరుకుందన్నారు. 2017లో 43 కోట్ల స్థాయిలో నమోదైన యూపీఐ లావాదేవీలు గడిచిన ఆరేళ్లలో అనూహ్య వృద్ధి చెందాయని, 2023లో 11,761 కోట్ల స్థాయికి చేరుకున్నాయన్నారు. ప్రస్తుతం యూపీఐ రోజుకు 42 కోట్ల లావాదేవీలను ప్రాసెసింగ్ చేస్తోందన్నారు.

ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌కు ఆర్‌బీఐ షాక్



బంగారు రుణాల మంజూరుపై నిషేధం

ముంబై: ప్రముఖ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ) ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ లిమిటెడ్‌పై గట్టి వేటు పడింది. బంగారం తాకట్టుపై సంస్థ జారీ చేసే రుణాలపై నిషేధం విధించిన ఆర్‌బీఐ.. ఇది తక్షణమే అమలులోకి వస్తుందని స్పష్టం చేసింది. రుణం మంజూరు లేదా రుణ చెల్లింపుల్లో విఫలమైన సమయంలో రుణగ్రహీత తాకట్టు పెట్టిన బంగారం స్వచ్ఛత మదింపు, బరువు లెక్కింపు ధ్రువీకరణ విధానంలో తీవ్ర అతిక్రమణలు, లోన్ టు వేల్యూ నిష్పత్తి, తనఖా బంగారం వేలం నిబంధనలు, కస్టమర్లపై చార్జీల విధింపులో పారదర్శకత లేకపోవడంతో పాటు సంస్థలో పలు పర్యవేక్షణ లోపాలను గుర్తించిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్‌కు దేశంలోని 500కు పైగా నగరాల్లో 2,600కు పైగా శాఖలున్నాయి. గత ఏడాది డిసెంబరు 31 నాటికి కంపెనీ గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో రూ.24,692 కోట్లకు చేరుకుంది. ఈ పోర్ట్‌ఫోలియో వార్షిక ప్రాతిపదికన 35 శాతం వృద్ధి చెందింది. అంతేకాదు, కంపెనీ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల్లో (ఏయూఎం)లో గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో వాటా 32 శాతంగా ఉంది. ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ గోల్డ్ లోన్స్‌తో పాటు పలు రకాల రుణాలు, తనఖా సేవలను అందిస్తోంది. అందులో బంగారం రుణాల వ్యాపారంపైన మాత్రం ఆర్‌బీఐ నిషేధం విధించింది. గోల్డ్ లోన్స్ మంజూరు/ విడుదల/ కేటాయింపు/ సెక్యూరిటైజేషన్/ రుణాల విక్రయాన్ని తక్షణమే నిలిపివేయాలని సంస్థను ఆదేశించడం జరిగిందని ఆర్‌బీఐ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే రుణాలిచ్చిన వారికి మాత్రం సేవలను కొనసాగించేందుకు అనుమతిచ్చింది. అలాగే, సంస్థ గోల్డ్ లోన్ వ్యాపారంపై ప్రత్యేక ఆడిటింగ్‌కు ఆదేశించింది. ప్రత్యేక ఆడిటింగ్ పూర్తయి, ఆ ఆడిటింగ్‌తో పాటు ఆర్‌బీఐ తనిఖీలో గుర్తించిన లోపాలను సంస్థ సరిదిద్దుకున్న తర్వాతే తాజా ఆంక్షలపై పునఃసమీక్షించనున్నట్లు నియంత్రణ మండలి స్పష్టం చేసింది. గత ఏడాది మార్చి 31 నాటికి కంపెనీ ఆర్థిక స్థితి ఆధారంగా తనిఖీలు జరిపినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. కాగా, ఈ తనిఖీల్లో కంపెనీ గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియోలో పలు పర్యవేక్షణ లోపాలను గుర్తించినట్లు తెలిపింది. బీఎస్ఈలో ఐఐఎఫ్ఎల్ షేరు ధర 3.35 శాతం క్షీణించి రూ.598.10 వద్ద ముగిసింది.

ఇక రెండు లిస్టెడ్ కంపెనీలుగా టాటా మోటార్స్..



ఆమోదం తెలిపిన డైరెక్టర్ల బోర్డు

న్యూఢిల్లీ: టాటా మోటార్స్ తన వాణిజ్య, ప్రయాణికుల వ్యాపారాన్ని రెండు లిస్టెడ్ కంపెనీలుగా విభజిస్తోంది. సోమవారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. రెండు రంగాల్లో ఉన్న వ్యాపార అవకాశాల్ని మరింతగా అందిపుచ్చుకునేందుకు ఈ విభజన చేపడుతున్నట్టు తెలిపింది. డైరెక్టర్ల బోర్డు ఆమోదించిన విభజన ప్రకారం వాణిజ్య వాహనాలు, దానికి సంబంధించిన పెట్టుబడులు ఒక లిస్టెడ్ కంపెనీగా, విద్యుత్ వాహనాలు, జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) వంటి ప్రయాణికుల వాహనాల వ్యాపారం, అందుకు సంబంధించిన పెట్టుబడులను మరో లిస్టెడ్ కంపెనీగా విభజిస్తారు.

అందరికీ మేలే: ఈ విభజన కంపెనీ కస్టమర్లు, ఉద్యోగులు, వాటాదారులతో సహా అందరికీ మేలు చేస్తుందని టాటా మోటార్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ఒక ప్రకటనలో తెలిపారు. కస్టమర్లకు మరింత మేలైన అనుభవం, ఉద్యోగులకు మంచి అవకాశాలు, వాటాదారుల వద్ద ఉన్న షేర్లకు మరింత విలువ ఏర్పడుతుందన్నారు. ఈ విభజనకు వాటాదారులు, రెగ్యులేటరీ సంస్థల అనుమతి లభించేందుకు 12 నుంచి 15 నెలల సమయం పడుతుందని భావిస్తున్నారు.

రిలయన్స్ షేరు @ రూ.3,000

స్టాక్ మార్కెట్ దిగ్గజ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేరు ధర తొలిసారిగా రూ.3,000 మైలురాయిని దాటింది. సోమవారం బీఎస్ఈలో కంపెనీ షేరు ట్రేడింగ్ రూ.2,981 వద్ద ప్రారంభమై.. ఒక దశలో రూ.3,024.80 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 1.03 శాతం లాభంతో రూ.3,011.60 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20.37 లక్షల కోట్లు దాటింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్ఐఎల్ షేరు ధర 16.65 శాతం పెరిగింది. గడిచిన ఏడాది కాలంలో 36.52 శాతం వృద్ధి కనబరిచింది. గత ఐదేళ్లలో కంపెనీ షేరు 167 శాతం రిటర్నులు పంచింది. రిలయన్స్ షేరు ముందుముందు మరింత పరుగు తీయవచ్చని బ్రోకరేజీ సంస్థలంటున్నాయి.

ఈ ఏడాది భారత వృద్ధి రేటు 6.8%

మూడీస్

న్యూఢిల్లీ: భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాలను అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ మూడీస్ మరింత పెంచింది. ఈ సంవత్సరం జీడీపీ వృద్ధి రేటు 6.1 శాతం ఉంటుందని గతంలో ప్రకటించిన మూడీస్ ఇప్పుడు దాన్ని 6.8 శాతానికి పెంచింది. జీ-20 దేశాల్లో ఒక్క భారత జీడీపీ మాత్రమే ఇంత భారీ వృద్ధి రేటు నమోదు చేయనుందని తెలిపింది. అయితే వచ్చే ఏడాది (2025) మాత్రం భారత వృద్ధి రేటు కొద్దిగా తగ్గి 6.4 శాతం మించక పోవచ్చని అంచనా వేసింది. 2023 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో భారత జీడీపీ 8.4 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. అంతర్జాతీయ ఆటుపోట్లు కూడా సన్నగిల్లుతున్నందున ఈ సంవత్సరం భారత జీడీపీ వృద్ధి రేటుకు ఢోకా ఉండదని పేర్కొంది.

సామ్‌సంగ్ 'గెలాక్సీ ఎఫ్ 15' 5జీ స్మార్ట్‌ఫోన్



ప్రారంభ ధర రూ.11,999

న్యూఢిల్లీ: సామ్‌సంగ్.. మార్కెట్లోకి సరికొత్త 5జీ స్మార్ట్‌ఫోన్ గెలాక్సీ ఎఫ్ 15 విడుదల చేసింది. 4జీబీ, 6జీబీ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న ఈ స్మార్ట్‌ఫోన్ ధరలు వరుసగా రూ.11,999, రూ.13,499గా ఉన్నాయి. మేకిన్ ఇండియా విజన్‌కు అనుగుణంగా ఈ ఫోన్‌ను ఇక్కడే అభివృద్ధి చేసినట్లు సామ్‌సంగ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ ఆదిత్య బబ్బర్ వెల్లడించారు. జెన్ జెడ్, మిల్లీనియల్స్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ఫోన్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. 6.5 అంగుళాల ఎస్అమోలిడ్ డిస్‌ప్లే, మీడియాటెక్ డైమెన్సిటీ 6100 ప్లస్ చిప్‌సెట్, 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 50 ఎంపీ ట్రిపుల్ కెమెరా,13 ఎంపీ ఫ్రంట్ కెమెరా ఈ ఫోన్ ప్రత్యేకతలు. 4జీబీ ప్లస్ 128 జీబీ, 6జీబీ ప్లస్ 128 జీబీ స్టోరేజ్‌తో మూడు రంగుల్లో ఈ ఫోన్ అందుబాటులో ఉంటుంది. ఈ నెల 11 నుంచి ఫ్లిప్‌కార్ట్, సామ్‌సంగ్ డాట్‌కామ్, ఎంపిక చేసిన రిటైల్ స్టోర్లలో ఈ ఫోన్ విక్రయాలు ప్రారంభమవుతాయని బబ్బర్ తెలిపారు. అయితే తొలిసారిగా ఫ్లిప్‌కార్ట్‌పై ఎఫ్15 5జీ ఎర్లీ సేల్‌ను సోమవారం నుంచి ప్రారంభించినట్లు సామ్‌సంగ్ తెలిపింది. కాగా వచ్చే ఏడాది కాలంలో 20 లక్షల గెలాక్సీ ఎఫ్ 15 స్మార్ట్‌ఫోన్లను విక్రయించవచ్చని అంచనా వేస్తున్నట్లు ఆదిత్య బబ్బర్ తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	64,080 ▲	58,740 ▲	77,100 ▲
ముంబై	63,480 ▲	58,148 ▲	70,777 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	469	విజయవాడ	463
5వ తేదీ		విశాఖపట్నం	500
చిత్తూరు	523	వరంగల్	471
గోదావరి	463	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126	గోదావరి	128
వరంగల్	126	విజయవాడ	128
కరీంనగర్	126	గుంటూరు	124
మహబూబ్‌నగర్	126	ఒంగోలు	124
కర్నూలు	126	చిత్తూరు	120
విశాఖపట్నం	121		

కొత్త గరిష్ఠాలకు సూచీలు

ఇంట్రాడేలో 74,000కు చేరువైన సెన్సెక్స్
22,400 ఎగువన ముగిసిన నిఫ్టీ

ముంబై: వరుసగా నాలుగో రోజూ లాభాల్లో పయనించిన భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం సరికొత్త రికార్డు గరిష్ఠాలకు చేరుకున్నాయి. సెన్సెక్స్ 66.14 పాయింట్ల వృద్ధితో 73,872.29 వద్ద ముగిసింది. సూచీకిది జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయి. అంతేకాదు, ఒక దశలో 183.98 పాయింట్ల వరకు లాభపడి 73,990.13 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డు సైతం నమోదు చేసింది. 22,440.90 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని రికార్డు చేసిన నిఫ్టీ.. చివరికి 27.20 పాయింట్ల లాభంతో సరికొత్త గరిష్ఠ ముగింపు స్థాయి 22,405.60 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఈ ఏడాదికి భారత వృద్ధి రేటు అంచనాను భారీగా పెంచడం మార్కెట్ ర్యాలీకి దోహదపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సగం లాభాల్లో ముగిశాయి. ఎన్‌టీపీసీ 3.50 శాతం పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. పవర్‌గ్రిడ్ 2.63 శాతం, మార్కెట్ దిగ్గజ షేరు రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.03 శాతం పెరిగాయి. కాగా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎం అండ్ ఎం రెండు శాతానికి పైగా నష్టపోయాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.78 శాతం పెరగగా.. మిడ్‌క్యాప్ సూచీ 0.16 శాతం తగ్గింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.393 లక్షల కోట్లకు (4.80 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

ముక్క ప్రొటీన్ ఐపీఓకు 137 రెట్ల బిడ్లు

ఫిష్‌మీల్, ఫిష్‌ఆయిల్ తయారీ సంస్థ ముక్క ప్రొటీన్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. సోమవారంతో ముగిసిన ఈ ఆఫర్‌కు ఇష్యూ సైజుకు 136.89 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. రూ.224 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వచ్చిన కంపెనీ 5.60 కోట్ల షేర్లను విక్రయానికి పెట్టగా.. ఇన్వెస్టర్లు 766.58 కోట్ల షేర్ల కొనుగోలుకు బిడ్లు సమర్పించినట్లు ఎన్ఎస్ఈ వెల్లడించింది. కాగా, ఆర్‌కే స్వామి ఐపీఓ తొలిరోజు పూర్తయ్యేనాటికి ఇష్యూ సైజుకు 2.18 రెట్ల బిడ్లు లభించాయి. ఇక పోతే, మౌలిక రంగ కంపెనీ సిగల్ ఇండియా ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ తాజా ఈక్విటీ ద్వారా రూ.618 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఆనంద్‌ను దాటేసిన అర్జున్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగు గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ క్లాసిక్ చెస్ విభాగం అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో పదోస్థానంతో టాప్-10లోకి ప్రవేశించి సంచలనం సృష్టించాడు. ఈ క్రమంలో భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌ను అధిగమించాడు. క్లాసిక్ ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి ప్రస్తుతం అర్జున్ (2754.6) ఒక్కడే టాప్-10లో ఉన్నాడు. ఆనంద్ (2751) 11వ, ప్రజ్ఞానంద 15వ, గుకేష్ 16వ ర్యాంకుల్లో నిలిచారు. బ్లిట్జ్‌లో టాప్-20లో భారత్ నుంచి ఇద్దరే ఉన్నారు. ఇందులో అర్జున్ 13వ ర్యాంక్‌లో నిలవగా, ఆనంద్ 18వ స్థానంలో ఉన్నాడు. ఇక, చైనాలో జరుగుతున్న షెంజెన్ మాస్టర్స్ టోర్నీలో సోమవారం ముగిసిన నాలుగో రౌండ్‌లో అర్జున్ తెల్ల పావులతో బరిలోకి దిగాడు. సుదీర్ఘంగా సాగిన ఈ పోరులో అర్జున్ 70వ ఎత్తుల్లో చైనా జీఎం మా కున్‌పై గెలిచాడు. ఈ టోర్నీలో అర్జున్‌కు ఇది మూడో విజయం. చైనా జీఎంలు బు జియాంగ్జి, యు యాంగితో కలిసి అర్జున్ ప్రస్తుతం 3 పాయింట్లతో సమంగా ఉన్నా, మెరుగైన టైబ్రేక్ స్కోరు కారణంగా పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచాడు.

భారత టీటీ జట్లకు ఒలింపిక్ బెర్త్

న్యూఢిల్లీ: భారత మహిళల, పురుషుల టేబుల్ టెన్నిస్ (టీటీ) జట్లు పారిస్ ఒలింపిక్ బెర్త్‌లు దక్కించుకొని చరిత్ర సృష్టించాయి. ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా టీటీలో భారత జట్లు ఒలింపిక్ బెర్త్‌లు సాధించడం ఇదే ప్రథమం. గతనెల బుసాన్‌లో జరిగిన వరల్డ్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో కనబర్చిన ప్రదర్శనతో భారత జట్ల ర్యాంకింగ్స్ మెరుగుపడ్డాయి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత మహిళల జట్టు 13, పురుషుల జట్టు 15వ స్థానాల్లో ఉన్నాయి. టాప్-16 ర్యాంకింగ్స్‌లోపు ఉన్న జట్లను విశ్వక్రీడలకు ఎంపిక చేసినట్టు ప్రపంచ టీటీ సమాఖ్య ప్రకటించింది. భారత మహిళల బృందంలో హైదరాబాద్ అమ్మాయి ఆకుల శ్రీజ, మనికా బాత్రా, అర్చన, అహిక, దియా.. పురుషుల జట్టులో వెటరన్ స్టార్ శరత్ కమల్, హర్మీత్ దేశాయ్, మనవ్ ఠక్కర్, సాథియన్, మనుష్ షా ఒలింపిక్స్ టీమ్ ఈవెంట్ రేసులో ఉన్నారు.



బ్యాడ్మింటన్‌కు సాయి ప్రణీత్ వీడ్కోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలుగు షట్లర్ భమిడిపాటి సాయిప్రణీత్ బ్యాడ్మింటన్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. కోచ్‌గా కొత్త ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నట్టు సోమవారం తన సోషల్ మీడియా ఖాతాల్లో తెలిపాడు. 2010లో వరల్డ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గి, అందరి దృష్టినీ ఆకర్షించిన ప్రణీత్, టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ఈ 31 ఏళ్ల షట్లర్ 2017లో సింగపూర్ సూపర్ ఓపెన్ సిరీస్‌ను, 2019లో ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించి సంచలనం సృష్టించాడు. టోక్యో ఒలింపిక్స్ తర్వాత వరుస గాయాలతో సతమతమవుతున్న ప్రణీత్.. కొన్నాళ్లుగా టోర్నీల్లో ఆడడం లేదు. ఇక, త్వరలో అతను అమెరికాలోని ఓ బ్యాడ్మింటన్ అకాడమీలో కోచ్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. '24 ఏళ్లుగా నాతో బ్యాడ్మింటన్ పెనవేసుకుపోయింది. మిశ్రమ భావోద్వేగాల నడుమ రిటైర్మెంట్ నిర్ణయాన్ని తీసుకున్నా. కోచ్‌గా త్వరలో కొత్త జీవితాన్ని ప్రారంభించనున్నా. ఈ ప్రయాణంలో నన్ను ప్రోత్సహించిన కోచ్‌లు గోపీచంద్, ఆరిఫ్, గోవర్ధన్‌లకు, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు' అని ప్రణీత్ చెప్పాడు.

స్పోర్ట్స్

ఫేవరెట్ సాత్విక్ జోడీ

నేటి నుంచి ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: డబుల్స్ నెం:1 జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మంగళవారం నుంచి జరగనున్న ఫ్రెంచ్ ఓపెన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. గతేడాది చైనా మాస్టర్స్, మలేసియా ఓపెన్, ఇండియా ఓపెన్‌లో ఫైనల్లో ఓడిన సాత్విక్ జంట.. ఈసారి టైటిల్ నెగ్గాలనే పట్టుదలతో ఉంది. 2022లో ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన తర్వాత సాత్విక్-చిరాగ్ నిలకడైన ఆటతో టాప్ ర్యాంక్‌కు ఎగబాకారు. తొలి రౌండ్‌లో మలేసియాకు చెందిన ఆంగ్ యు సిన్-టియో యి యి జోడీతో సాత్విక్ జోడీ తలపడనుంది. అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టోతో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెల ఆడనుంది. ఇక సింధు.. తొలి రౌండ్‌లో మిషెల్లి లీ (కెనడా)తో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ బరిలోకి దిగనున్నారు.

మూడేళ్లలో నాలుగో సారథి

సన్‌రైజర్స్ కొత్త కెప్టెన్ కమిన్స్



హైదరాబాద్: ఐపీఎల్ జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా వరల్డ్‌కప్ విన్నింగ్ సారథి ప్యాట్ కమిన్స్‌ను నియమించారు. గత డిసెంబరులో జరిగిన మినీ వేలంలో 30 ఏళ్ల పేసర్ కమిన్స్‌ను సన్‌రైజర్స్ రూ. 20.50 కోట్ల భారీ ధరకు ఖరీదు చేసింది. అప్పుడే కమిన్స్‌కు సారథ్య బాధ్యతలు అప్పగిస్తారనే వార్తలు వచ్చాయి. సౌతాఫ్రికా ఆటగాడు మార్‌క్రమ్ నుంచి కవిన్స్ పగ్గాలందుకోనున్నాడు. మొత్తంగా గత మూడేళ్లలో వార్నర్, విలియమ్సన్, మార్‌క్రమ్ తర్వాత జట్టు బాధ్యతలు అందుకోనున్న నాలుగో కెప్టెన్ కమిన్స్. సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌ను వరుసగా రెండోసారి మార్‌క్రమ్ విజేతగా నిలిపాడు. కానీ, మేనేజ్‌మెంట్ ఈ ప్రదర్శనను పట్టించుకోలేదు. 2023లో సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌ల్లో 4 మాత్రమే నెగ్గింది.

ధోనీ 'కొత్త పాత్ర' పోస్టు కలకలం



న్యూఢిల్లీ: ఐపీఎల్ కోసం సర్వం సిద్ధమవుతుండగా.. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ ధోనీ 'కొత్త అవతారం' అంటూ నెట్‌లో చేసిన పోస్టు క్రికెట్ వర్గాల్లో కలకలం రేపింది. ఫేస్‌బుక్‌లో అతడు చేసిన పోస్టు..ఊహాగానాలకు కారణమవుతోంది. 'కొత్త సీజన్, నూతన పాత్ర కోసం ఇక ఆగలేను' అని ధోనీ రాశాడు. దీంతో భవిష్యత్‌లో మహీ ఇక సీఎస్‌కే మెంటార్‌గా వ్యవహరిస్తాడంటూ నెటిజన్లు తమదైన విశ్లేషణలు చేస్తున్నారు.

కాన్వే ఐపీఎల్ ఆడేనా?

చెన్నై జట్టుకు ఐపీఎల్ ఆరంభానికి ముందే గట్టి షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఓపెనర్ డెవాన్ కాన్వే గాయం కారణంగా లీగ్‌లో అత్యధిక మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. మే వరకు అతడు అందుబాటులో ఉండడని సమాచారం. ఇటీవల ఆసీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఈ కివీస్ బ్యాటర్ ఎడమ బొటనవేలికి గాయమైంది. ఈ వారంలోనే సర్జరీ చేయించుకోనున్న కాన్వే కోలుకునేందుకు రెండు నెలల సమయం పట్టనుంది.

మంధాన మెరుపులు!



• ఎలిస్ పెర్రీ హాఫ్ సెంచరీ
• యూపీపై బెంగళూరు విజయం

మహిళల ప్రీమియర్ లీగ్

50 బంతుల్లో 80

బెంగళూరు: సొంత మైదానంలో తమ చివరి లీగ్ మ్యాచ్‌ను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) విజయంతో ముగించింది. వరుసగా రెండు ఓటముల తర్వాత కెప్టెన్ స్మృతి మంధాన (50 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 80) సూపర్ బ్యాటింగ్‌తో ఆర్‌సీబీ అద్భుతంగా కోలుకుంది. ఫలితంగా సోమవారం యూపీ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 23 పరుగుల తేడాతో నెగ్గింది. యూపీకి కెప్టెన్ అలీసా హీలీ (38 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 55) పోరాటం సరిపోలేదు. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 3 వికెట్లకు 198 పరుగులు చేసింది. ఎలిస్ పెర్రీ (37 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 58) హాఫ్ సెంచరీ సాధించింది. ఛేదనలో యూపీ 20 ఓవర్లలో 175/8 స్కోరుకు పరిమితమై ఓడింది. దీప్తి శర్మ (33), పూనమ్ (31) రాణించారు. డివైన్, మోలినెక్స్, వేర్‌హమ్, శోభనలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మంధాన నిలిచింది.

హీలీ పోరాడినా..: భారీ ఛేదనలో యూపీ ఆరంభం బాగున్నా.. మిడిలార్డర్ పేలవ ప్రదర్శన దెబ్బతీసింది. ఓపెనర్ అలీసా హీలీ కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో అదరగొట్టింది. చివర్లో దీప్తి శర్మ, పూనమ్ గెలిపించే ప్రయత్నం చేశారు. మరో ఓపెనర్ కిరణ్ నవ్‌గిరె (18)తో తొలి వికెట్‌కు 47 పరుగులు జత చేసిన హీలీ.. ఓ ఎండ్‌లో వికెట్లు పడుతున్నా ఎదురుదాడి కొనసాగించింది. తొమ్మిదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో ఆకట్టుకున్న ఆమె 34 బంతుల్లోనే ఫిఫ్టీని పూర్తి చేసింది. అయితే ధాటిగా ఆడే ప్రయత్నంలో 13వ ఓవర్‌లో కీపర్ రిచా అద్భుత స్టంపింగ్‌కు పెవిలియన్‌కు చేరింది. అప్పటికి యూపీ ఓవర్‌కు 9 పరుగుల రన్‌రేట్‌తో ఆడుతుండడంతో విజయంపై ఆశలు కనిపించాయి. అటు దీప్తి కూడా బౌండరీల జోరుతో ఆర్‌సీబీని ఒత్తిడికి గురి చేసింది. అయితే ఆశా శోభనకు రిటర్న్ క్యాచ్ ఇవ్వడంతో దీప్తి ఇన్నింగ్స్ ముగిసింది. ఆ తర్వాత పూనమ్ చెలరేగినా ఫలితం లేకపోయింది.

బాదుడే బాదుడు..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి బరిలోకి దిగిన ప్రతీ బ్యాటరూ అదరగొట్టింది. ఓపెనర్ మంధాన, ఎలిస్ పెర్రీ ధాటికి ఆఖరి 6 ఓవర్లలోనే జట్టు 72 రన్స్ సాధించడం విశేషం. ఆరంభంలో మరో ఓపెనర్ సబ్బినేని మేఘన (28)తో కలిసి మంధాన మెరుపు ఆరంభాన్ని అందించింది. ఇద్దరూ ఎడాపెడా బౌండరీలతో రెండు, మూడో ఓవర్లలో 12 పరుగుల చొప్పున రాబట్టారు. అయితే ఐదు ఫోర్లతో వేగం చూపిన మేఘన తొలి వికెట్‌కు 51 పరుగులు జోడించి వెనుదిరిగింది. అనంతరం మంధానకు పెర్రీ జత కలవడంతో యూపీ బౌలర్లు చేసేదేమీ లేకపోయింది. 34 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసిన మంధాన కళ్లు చెదిరే షాట్లతో ఆకట్టుకుంది. ఇక 15, 16వ ఓవర్లలో మూడేసి ఫోర్లతో 80 పరుగులకు చేరడంతో స్మృతి సెంచరీ ఖాయమనిపించింది. కానీ ఆమె దూకుడుకు స్పిన్నర్ దీప్తి శర్మ బ్రేక్ వేసింది. దీంతో పెర్రీతో రెండో వికెట్‌కు అందించిన 95 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. 33 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన పెర్రీ 19వ ఓవర్‌లో బాదిన ఓ సిక్సర్ నేరుగా డిస్‌ప్లే కారు అద్దాన్ని పగలగొట్టింది. ఆఖరి ఓవర్‌లో పెర్రీ వెనుదిరగ్గా, రిచా (21 నాటౌట్) ఫోర్‌తో ఇన్నింగ్స్‌ను ముగించి స్కోరును 200 దరిదాపుల్లోకి తెచ్చింది.

నేటి మ్యాచ్
ఢిల్లీ x ముంబై
రాత్రి 7.30 గం. నుంచి

సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 198/3 (మంధాన 80, పెర్రీ 58, మేఘన 28; ఎకెల్‌స్టోన్ 1/22).
యూపీ: 20 ఓవర్లలో 175/8. (హీలీ 55, దీప్తి 33, పూనమ్ 31; శోభన 2/29, మోలినెక్స్ 2/29, డివైన్ 2/37, వేర్‌హమ్ 2/38).

ఐదో టెస్టుకు వర్షం ముప్పు!



ధర్మశాల: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరగాల్సిన ఐదో టెస్టుకు వరుణుడు ఆటంకపరిచే అవకాశం ఉంది. ఈనెల 7 నుంచి ధర్మశాలలో ఈ మ్యాచ్ జరగనుండగా.. తొలి రోజు గురువారం ఉష్ణోగ్రత ఆరు డిగ్రీలకు పడిపోనుంది. అలాగే వర్షం కురిసే అవకాశం 82 శాతంగా ఉంది. శుక్రవారం కూడా చిరు జల్లులకు ఆస్కారం ఉన్నట్టు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. మూడు, నాలుగు రోజుల్లో సూర్యుడు కనిపించినా ఆఖరి రోజు మేఘావృతంగా ఉండి తిరిగి వర్షం పడే చాన్స్ ఉంది. అయితే ఇలాంటి వాతావరణం ఇంగ్లండ్ జట్టుకు కలిసి వస్తుందని, భారత్ జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుందని మాజీ కెప్టెన్ గవాస్కర్ సూచించాడు.

రంజీ ఫైనల్లో ముంబై



ముంబై: దేశవాళీ క్రికెట్‌లో బలమైన జట్టు ముంబై 48వసారి రంజీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శార్దూల్ ఠాకూర్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో.. సెమీస్‌లో తమిళనాడుపై ఇన్నింగ్స్ 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 232 పరుగుల లోటుతో.. ఆటకు మూడో రోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన తమిళనాడు 162 రన్స్‌కే కుప్పకూలింది. దీంతో ముంబై మరో రెండు రోజుల ఆట మిగిలుండగానే జయకేతనం ఎగురవేసింది. బాబా ఇంద్రజిత్ (70) మినహా మిగతా బ్యాటర్లు కనీస పోరాటం కూడా చేయలేదు. షామ్స్ ములానీ 4 వికెట్లు పడగొట్టగా.. శార్దూల్, మోహిత్, తనుష్ తలో 2 వికెట్లు దక్కించుకొన్నారు. అంతకుముందు 359/9తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ముంబై 378 పరుగులకు ఆలౌటైంది. తమిళనాడు మొదటి ఇన్నింగ్స్‌లో 146 పరుగులు చేసింది. కాగా ఈనెల 10 నుంచి జరగనున్న రంజీ ఫైనల్‌కు ముంబైలోని వాంఖడే స్టేడియాన్ని వేదికగా ఎంపిక చేసినట్టు ముంబై క్రికెట్ సంఘం సోమవారం ప్రకటించింది.

విదర్భ ఆధిక్యం 261: యష్ రాథోడ్ (97 బ్యాటింగ్) రాణించడంతో.. మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న రెండో సెమీస్‌లో విదర్భ పోరాడుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 13/1తో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విదర్భ 343/6 స్కోరు చేసి, మొత్తంగా 261 పరుగుల ఆధిక్యం సాధించింది. రాథోడ్, అక్షయ్ ఆరో వికెట్‌కు 158 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 170 రన్స్‌కే ఆలౌట్ కాగా.. మధ్యప్రదేశ్ 252 పరుగులు చేసింది.

హైదరాబాద్ హ్యాట్రిక్ ఓటమి

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ వరుసగా మూడో ఓటమిని మూటగట్టుకుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 0-3తో బెంగళూరు టార్పెడోస్ చేతిలో పరాజయం పాలైంది. మొత్తంగా హైదరాబాద్ జట్టు ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో కేవలం ఒక్కటి మాత్రమే నెగ్గింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 5-3-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ఈ వేసవిలో మంటలే!

మార్చి, ఏప్రిల్, మే నెలల్లో భానుడు భగభగ

వేడి గాలులతో వడదెబ్బ బారిన పడే ప్రమాదం

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక, సూచనలు



అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శివరాత్రికి ముందే సూర్యుడు సుర్రుమనిపిస్తున్నాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే పగటి ఉష్ణోగ్రతల్లో పెరుగుదల నమోదైంది. మార్చిలో ఎండ తీవ్రత మరింత పెరగనుంది. ఏప్రిల్, మే నెలల్లో భానుడి భగభగలతో ఎండలు మండిపోనున్నాయి. దీంతోపాటు ఈ వేసవిలో వడగాడ్పుల ప్రభావం అధికంగా ఉంటుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ

మిగతా 12వ పేజీలో...

లంచాలు తీసుకున్న చట్టసభల సభ్యులు పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ పొందలేరు. 1998లో ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 105, 194లకు పూర్తి విరుద్ధం. అందుకే ఆ తీర్పును కొట్టేస్తున్నాం. చట్టసభ సభ్యుల అవినీతి, లంచగొండితనం భారత దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దుంప నాశనం చేస్తుంది.

-సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం



చట్టాలకు మీరేమీ అతీతులు కాదు!

లంచం, అవినీతి కేసుల్లో ప్రజాప్రతినిధులు శిక్షార్హులే

ఎంపీలు, ఎమ్మెల్యేల లంచాల కేసులపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు

పార్లమెంటరీ అధికారాల నుంచి రక్షణ పొందలేరని తేల్చిచెప్పిన జడ్జీలు

1998 నాటి సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు కొట్టివేత

న్యూఢిల్లీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దేశంలోని పార్లమెంటు, విధాన/శాసన సభల సభ్యులు లంచాలు, అవినీతి కేసుల నుంచి ఎలాంటి రక్షణా పొందలేరని, వారేమీ చట్టాలకు అతీతులు కారని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఇలాంటి కేసుల్లో చట్టసభల సభ్యులు శిక్షార్హులేనని స్పష్టం చేసింది. చట్టసభ సభ్యుల అవినీతి, లంచగొండితనం భారత దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దుంప నాశనం చేస్తుందని వ్యాఖ్యానించింది. లంచాలు తీసుకుని సభల్లో ప్రసంగించడం, ప్రశ్నలు సంధించడం, ఓటు వేయడం సహా అవినీతికి పాల్పడే ఎంపీలు, ఎమ్మెల్యేలను

మిగతా 10వ పేజీలో...

గొప్ప తీర్పు

స్వచ్ఛ రాజకీయాలకు మార్గం: ప్రధాని మోదీ

అవసరమైన తీర్పిది

ఇప్పటికే ఈ నిర్ణయం తీసుకోవాల్సింది: కాంగ్రెస్

తాకట్టు కనికట్టు!

అప్పుల కోసం సర్కార్ అడ్డగోలు పనులు

అందిన కాడికి అప్పులు! అడ్డగోలుగా అప్పులు! కేంద్రం అనుమతించిన మేరకు, ఆపైనా ఆర్బీఐ నుంచి అప్పులు! కార్పొరేషన్ల ద్వారా ఎడాపెడా అప్పులు! అయినా... రుణ దాహం తీరడంలేదు. ఎన్నికల ముందు విచ్చలవిడిగా అప్పులు తెచ్చేందుకు 'తాకట్టు వ్యాపారం' మొదలుపెట్టేశారు. ఎన్నికల తర్వాత ఏమవుతుందో... ఏమో! ఓటమి పాలైతే... 'అస్మదీయ' కంపెనీల బిల్లులు ఆగిపోతాయేమో! ఇదే ఆందోళనతో కనిపించిన భూములు, భవనాలు, కార్పొరేషన్ల ఆదాయాలు తాకట్టు పెట్టి మరీ వేల కోట్లు తెస్తున్నారు. బిల్లులు చకచకా చెల్లిస్తున్నారు. ఇప్పటికే... సచివాలయాన్ని తాకట్టు పెట్టేసి రూ.370 కోట్లు అప్పు తెచ్చిన సంగతి 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. తాజాగా విశాఖ జిల్లా ఎండాడలో భూములు చూపించి రూ.255 కోట్లు తెచ్చుకుని రెండు నియోజకవర్గాల పరిధిలో 'భూసేకరణ' బిల్లులు చెల్లించాలని హౌసింగ్ కార్పొరేషన్‌ను సర్కారు ఆదేశించింది. ఇక... గనుల శాఖ ఆదాయాన్ని తాకట్టు పెట్టి బాండ్ల అమ్మకం ద్వారా రూ.7వేల కోట్లు తీసుకొచ్చింది. ఈ డబ్బులన్నీ... బిల్లుల చెల్లింపులకే వాడుతున్నట్లు సమాచారం! ఇది... కనీవినీ ఎరుగని ఘోరం!


తాకట్టులో సచివాలయం!
జగన్ సర్కారు మరో దా'రుణం'
370 కోట్ల కోసం హెచ్‌డీఎఫ్‌సీకి రాసిచ్చేశారు

సమర్థించుకోలేక సీఆర్డీయే తంటాలు

సంస్థ ఖాతా నుంచి 385 కోట్లు మాయం

చెప్పకుండా లాగేసుకున్న సర్కారు

వెనక్కివ్వాలని ఆర్థిక శాఖకు సీఆర్డీయే లేఖ

అవి తాకట్టు పెట్టగా వచ్చిన డబ్బులేనా?

కాదని.. సీఆర్డీయే చెప్పగలదా?

మరో 7వేల కోట్ల అప్పు!

ఏపీఎండీసీ ఆదాయం తాకట్టు.. బేషరతు ష్యూరిటీ ఇచ్చిన సర్కారు

రేటింగ్ లేదు, అన్‌లిస్టెడ్ బాండ్లు.. అయినా కేవలం 8.7 శాతం వడ్డీ!

కొన్నదెవరు అనేది మిస్టరీ.. వాడుకునేది మాత్రం ప్రభుత్వమే

భూములు అమ్మి బిల్లులు!

అస్మదీయుల కోసం సర్కారు దారుణం

జగనన్న కాలనీల బిల్లుల కోసం ఎండాడలో 'స్వగృహ' భూములు బలి

రూ.255 కోట్లు అప్పు తీసుకోండి.. భూములు అమ్మి అప్పు తీర్చండి!

రాజీవ్ స్వగృహ సొమ్ము హౌసింగ్ కార్పొరేషన్‌కు

అనపర్తి, రాజమండ్రి అర్బన్‌లో రూ.290 కోట్లు చెల్లింపులకు ప్లాన్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు మరో దారుణానికి తెరలేపింది. అప్పు తెచ్చి మరీ సొంత పార్టీ నేతలకు బిల్లులు చెల్లించేందుకు సిద్ధమైంది. ఆ అప్పు తీర్చేందుకు 'రాజీవ్ స్వగృహ' భూములను తెగనమ్మాలని ఆదేశించింది. రాష్ట్ర మున్సిపల్ శాఖ ఈ మేరకు జీవో కూడా జారీ చేసింది. జగనన్న కాలనీల కోసం

మిగతా 12వ పేజీలో...



పెనుకొండలో 'కియ' కార్ల ఫ్యాక్టరీకి సమీపంలో నిర్వహించిన 'రా.. కదలిరా..' సభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబు

రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు తెలుగు తమ్ముళ్ల మాదిరిగా ప్రజలంతా టీడీపీ జెండా పట్టుకోవాలి. జనసేన, టీడీపీ కలిసి మీ ముందుకొచ్చాం. మా స్వార్థం కోసం కాదు. అధికారం కోసం కాదు. ఈ రాష్ట్రాన్ని కాపాడేందుకే వచ్చాం. - చంద్రబాబు

వివేకా హత్యపై చర్చకు సిద్ధమా?

తొలుత గుండెపోటు అన్నారు

తర్వాత గొడ్డలివేటు అన్నారు

మరి ఆ గొడ్డలి ఎవరిచ్చారని మీ చెల్లెలే అడుగుతోంది

ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీబీఐ కావాలన్నావా లేదా?

గద్దెనెక్కాక వద్దంటూ నాటకాలు

హత్య చేసిన వాళ్లకు సీఎం అయ్యే అర్హత ఉందా?: బాబు

సీఎం జగన్‌కు చంద్రబాబు సవాల్

అనంతపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తన చిన్నాన్న, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై సీఎం జగన్మోహన్ రెడ్డి ఇంకా నాటకాలాడుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు ధ్వజమెత్తారు. ఈ హత్యోదంతంపై చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. టీడీపీ-జనసేన శ్రేణులు పాలు-నీళ్లలా కలిసిపోయి పనిచేయాలని పిలుపిచ్చారు. రాష్ట్రంలో

మిగతా 11వ పేజీలో...

వలంటీర్లను తొలగించం

వారికి మంచి భవిష్యత్ ఇస్తా

వారు వైసీపీ దొంగలకు పనిచేయకూడదు

పెనుకొండ 'రా కదలిరా' సభలో టీడీపీ అధినేత స్పష్టీకరణ

రేపు ఢిల్లీకి పవన్?



బీజేపీ పెద్దలతో 'పొత్తు' మంతనాలు!


మంగళగిరి చేరుకున్న జనసేనాని

రెండో జాబితాపై కసరత్తు

2-3 రోజుల్లో మరో 10 పేర్లు ప్రకటన 11

4 వారాల టైమివ్వండి!

'టెట్, టీఆర్టీ షెడ్యూల్‌పై సర్కారుకు హైకోర్టు షాక్



2018లో 60 రోజుల గడువు.. ఇప్పుడెందుకు కుదించారు?

ఇది అభ్యర్థులకు న్యాయం పొందే హక్కును దూరం చేయడమే

రెండింటికీ మధ్య తగిన సమయమివ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం 7

బీసీలకు జగన్ దగా

కోతలు, వాతలతో వంచనలు.. అడుగడుగునా అవమానాలు

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు కోత

16,800 మందికి పదవుల వంచన

బీసీల ప్రాబల్య జిల్లాల్లో రెడ్ల పెత్తనం

34 రకాల టీడీపీ పథకాలకు స్వస్తి

నవరత్నాలతో సరిపెట్టిన ప్రభుత్వం

అటకెక్కిన విదేశీ విద్య, బెస్ట్ స్కూళ్లు

బీసీ ఉప ప్రణాళిక ఊసెత్తని సర్కారు

హత్యలు, దాడులు షరా మామూలే

వైసీపీ పాలనలో బీసీల గగ్గోలు

వైసీపీ పాలనలో బీసీలకు భంగపాటు తప్పలేదు. మూడు దశాబ్దాలుగా టీడీపీని వెన్నంటి ఉన్న బీసీ వర్గాల్లో చాలా మంది జగన్ మాటలు నమ్మి గత ఎన్నికల్లో ఓట్లేశారు. 2019లో బీసీల ఓట్లతో గెలిచిన తర్వాత జగన్.. వారి ఆశలు అడియాసలు చేశారు. జగన్ హయాంలో అడుగడుగునా తాము అవమానాలపాలవుతున్నామని బీసీ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. బీసీలకు వాతలు, కోతలతో సాగిన పాలనకు ముగింపు పలకాలనే నిర్ణయానికి వచ్చారు.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బీసీలకు పెద్దపీట వేస్తామంటూ గత 2019 ఎన్నికల్లో వారిని ఊరించి, తనవైపు తిప్పుకొన్న వైసీపీ అధినేత, సీఎం జగన్.. అధికారంలోకి వచ్చాక వారిని అన్నివిధాలా అణచివేస్తున్నారనే వాదన సర్వత్రా వినిపిస్తోంది. పదవుల నుంచి పథకాల వరకు

మిగతా 11వ పేజీలో...

టీడీపీ-సేన బీసీ డిక్లరేషన్ నేడే!

నాగార్జున వర్సిటీ సమీపంలో 'జయహో బీసీ' సభ

హాజరు కానున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

బడుగుల రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రగతికి బాటలు వేయడమెలా?

టెక్నాలజీ యుగంలో చేతివృత్తులకు సవాళ్లు

బీసీల శ్రేయస్సుకు ప్రత్యేక చర్యలు 11



డిక్లరేషన్ కమిటీ సుదీర్ఘ చర్చలు



నేను రెడీ..

11

నార్కో అనాలసిస్‌కు అవినాశ్ సిద్ధమా?

ప్రజలందరికీ తెలిసేలా ఆ పరీక్షను లైవ్‌లో నిర్వహించాలి

అదీ ఎన్నికల ముందే జరగాలి

అవినాశ్‌కో, జగన్ వాళ్ల ఇంట్లో వారికో వీడియోకాల్‌లో చూపిస్తూ వివేకాను చంపారు

చంద్రబాబు పట్టించుకోలేదన్నది అసత్యం

ఎన్నికల నేపథ్యంలోనే జగన్ మీడియాలో తప్పుడు కథనాలు: బీటెక్ రవి

టీడీపీ నేత నారాయణ అల్లుడిపై కేసు నమోదు

పన్నులు ఎగ్గొట్టారని డీటీసీ ఫిర్యాదు

సెర్చ్ వారెంట్ లేకుండానే పలువురి ఇళ్లలో తనిఖీలు

రాజకీయ వర్గాల్లో కలకలం 8

కక్ష సాధింపే: టీడీపీ

అరాచకముల్లు!



ఎమ్మెల్యే, బామ్మర్ది గారి మాఫియా రాజ్యం

- కడప జిల్లాలోని ఆ నియోజకవర్గ కేంద్రానికి.. గోల్డ్ బిజినెస్‌లో రెండో ముంబైగా పేరు. అలాగే ముంబైలో ఉండే కొన్ని అవలక్షణాలు ఇక్కడకు పాకాయి. స్థానిక ఎమ్మెల్యే తన బామ్మర్దిని అడ్డం పెట్టుకుని ముంబై తరహాలో మాఫియాకు తెరలేపారనే ప్రచారం ఉంది. సదరు నాయకుడు తన అక్రమ సంపాదనకు ఏ వనరునూ వదులుకోరు. పైకి మాత్రం మైకు దొరికితే చాలు 'నా పేదలు.. పేదల కోసమే' అంటూ ఎనలేని ప్రేమ ఒలకబోస్తారు.

పేకాటే జీవితంగా...

- సదరు నేత జీవితం పేకాటలోనే మొదలైందని, జూదం ఆడిస్తూ దాన్నే జీవనోపాధిగా మార్చుకున్నారని చెబుతారు. తొలినాళ్లలో బ్రేక్ ఇన్‌స్పెక్టర్ తరహాలో ఖాకీ దుస్తులు వేసుకుని రోడ్లపై తిరిగే వాహనాలను ఆపి బెదిరించి డబ్బులు వసూలు చేసేవారనే విమర్శ కూడా ఉంది. కాంగ్రెస్ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించినపుడు సొంతిల్లు కూడా ఉండేది కాదు. ఇప్పుడు రూ.150 కోట్లకు పైగా పోగేశారు.

అడ్డొస్తే దాడులు, హత్య

- అక్రమాలకు అడ్డొస్తే పోలీసులపైనా దాడులు తప్పవు. ఎస్‌ఐ, సీఐపైనే దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయి. అక్రమాలు ప్రశ్నించిన టీడీపీ బీసీ నేత పట్టపగలే అత్యంత దారుణ హత్యకు గురయ్యారు.

కడప జిల్లాలో ముంబైని తలపించేలా అరాచకాలు

బెట్టింగ్‌లు, జూదం, కబ్జాలు, దాడులు

ఇసుక, భూ ఆక్రమణలు, సెటిల్మెంట్లు

ప్రశ్నించే వారి గొంతు నొక్కేస్తున్న వైనం

వ్యతిరేకంగా వార్తలు రాస్తే బూతులు

ఎస్సై, సీఐపై దాడి చేసినా దిక్కులేదు

ప్రశ్నించారని టీడీపీ బీసీ నేత హత్య



(కడప-ఆంధ్రజ్యోతి)

కడప జిల్లాలోని ఆ నియోజకవర్గ కేంద్రం.. రాష్ట్రంలోనే ఓ బ్రాండ్. బిజినెస్‌కు అడ్డా. గోల్డ్ మార్కెట్ నుంచి వస్త్ర, కిరాణా వస్తువుల వరకూ ఇక్కడి నుంచి సీమ జిల్లాలకే కాదు.. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు వెళుతుంటాయి. అయితే నియోజకవర్గంలో ముంబై తరహాలో మాఫియా రాజ్యమేలుతోంది. బెట్టింగ్‌లు, జూదం, కబ్జాలు, ఇసుక అక్రమ రవాణా, భూ ఆక్రమణలు, సెటిల్మెంట్లు, బెదిరింపులు, దాడులు, దందాలు.. అన్నీ ఇన్నీ కావు. వాటిని కట్టడి చేయాల్సిన వారే ప్రోత్సహిస్తున్నారు. జగన్ సీఎం అయ్యాక స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అరాచకాలు మరింత ఎక్కువయ్యాయని చెబుతారు. 'నేనే రాజు, నేనే మంత్రి' అన్నట్లుగా

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రానురాను తీసికట్టు

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో, తాము సాధించిన ఘనకార్యాలను, అందించబోయే స్వర్గాలను రాజకీయ పక్షాలు ప్రజల ముందు ఏకరువు పెడుతుంటాయి. గత ప్రభుత్వ హయాంలో తాము నిజంగా పొందిందేమిటో, కోల్పోయిందేమిటో ఓటర్లు సమీక్షించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా భావోద్వేగాల సందడి చేస్తుంటారు. నిత్యావసరాల ధరల పెరుగుదల, అధికమవుతున్న ఆర్థిక అంతరాలు, సామాజిక ఉద్రిక్తతలు, నియంతృత్వ ధోరణి, హక్కులు స్వేచ్ఛల కుదింపు, ఇటువంటి కీలక అంశాలపై చర్చ జరగవలసిన సమయం ఇది.

రానురాను భావ ప్రకటనా స్వేచ్ఛపై, ముఖ్యంగా మీడియా స్వాతంత్ర్యం మీద ఆంక్షలు పెరిగిపోతున్నాయి. ప్రధానంగా కేంద్రప్రభుత్వం నేరుగా, పరోక్షంగా విధిస్తున్న నిర్బంధ వాతావరణం వల్లనే అధికంగా ఈ ఉల్లంఘనలు జరుగుతున్నాయి. పోయిన సంవత్సరం పత్రికా స్వేచ్ఛ సూచికలో మన దేశం స్థానం దారుణంగా పడిపోయింది. మొత్తం 180 దేశాల పరిశీలనలో భారత్ 161వ స్థానంలో ఉంది. అంతకు ముందు సంవత్సరం ఉన్న 150 స్థాయి నించి ఇంకా పడిపోయిందన్న మాట. ఇంకా సులువుగా అర్థం కావాలంటే, పాకిస్థాన్ కంటె, ఆఫ్ఘనిస్థాన్ కంటె, శ్రీలంక కంటె కూడా మనం దిగువన ఉన్నామన్నమాట. బాధ్యతలు, కర్తవ్యాలు మాత్రమే ఉండాలి తప్ప, హక్కుల స్మరణ అప్రధానం కావాలనుకుంటున్న అమృతకాలంలో రానురాను పరిస్థితి మరెంతగా దిగజారుతుందో చూడాలి.

'కశ్మీర్ నరేటర్' అనే మాస పత్రికకు సహాయ సంపాదకుడిగా, విలేఖరిగా పనిచేసే ఆసిఫ్ సుల్తాన్ అనే పాత్రికేయుడిని 2018 ఆగస్టులో అరెస్టు చేశారు. మిలిటెంట్లకు ఆశ్రయం ఇస్తున్నాడని ఆయన మీద అభియోగం. కానీ, అంతకు నెలరోజుల కిందట బుర్హాన్ వనీ అనే మిలిటెంట్ మీద రాసిన ముఖచిత్ర కథనమే సుల్తాన్ మీద అధికార యంత్రాంగానికి ఆగ్రహం తెప్పించిందని అందరికీ తెలుసు. అప్పటినుంచి, అతనికి బెయిలు లేదు. 2022లో ఒకసారి బెయిల్ వచ్చింది కానీ, వెంటనే మళ్లీ అరెస్టు చేశారు. అతని మీద అభియోగాలకు ఆధారాలు లేవని బెయిల్ ఇచ్చిన స్పెషల్ కోర్టు చెప్పగా, తాజాగా, గత డిసెంబర్‌లో జమ్మూకశ్మీర్ హైకోర్టు అతని మీద కేసు కొట్టివేసి, నిర్బంధం అక్రమమని చెప్పింది. అయినా, ఫిబ్రవరి 27 దాకా విడుదల చేయలేదు. విడుదలై తన ఇంటికి వెళ్లిన సుల్తాన్‌ను మరో కేసు పేరిట తిరిగి 29వ తేదీన అరెస్టు చేశారు.

కశ్మీర్ వంటి చోట పాత్రికేయులు ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితులు తెలిసినవే. అయితే, తక్కినచోట్ల పరిస్థితులు ఏమీ మెరుగుగా లేవు. సుదీర్ఘ నిర్బంధాలు, కోర్టు తీర్పులను ఖాతరు చేయకపోవడం దేశమంతటా ఉంది. కేవలం వార్తా సేకరణకు వెళ్లిన పాపానికి సిద్ధిఖీ కప్పన్ మూడేళ్ల నిర్బంధంలో గడిపారు. గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన 'న్యూస్ క్లిక్' దాడులలో అరెస్ట్ అయిన ఎడిటర్ ప్రబీర్ పురకాయస్థకు ఇంకా బెయిల్ దొరకలేదు. దాదాపు అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లో 'దస్తక్' పత్రిక సంపాదకురాలు సీమా ఆజాద్ మీద, మరికొందరి మీద జరిగిన ఎన్ఐఏ దాడులు తెలిసినవే. తాజాగా తెలంగాణలో 'వీక్షణం' పత్రిక సంపాదకుడి ఇంటిలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. కొవిడ్ సామూహిక అంత్యక్రియల కాలంలో గంగానదిలో కళేబరాల ఫోటోలు తీసి ప్రచురించిన కోపంతోనే కాబోలు, పాతికేళ్ళుగా ఉంటూ, దేశంలోనే స్థిరపడిన ఫ్రెంచి పాత్రికేయురాలు వనెసా డౌనాక్‌ను బలవంతంగా వెనక్కు పంపించారు. దేశంలో వాస్తవికత కంటె, దాన్ని బయటకు చెప్పడమే పాలకులకు ఇబ్బందికరం అవుతోంది. తాజాగా జార్ఖండ్‌లో ఒక స్పానిష్ మహిళపై జరిగిన సామూహిక అత్యాచారం సందర్భంగా వస్తున్న ట్వీట్ల నిరసనను జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు తప్పుపట్టారు. దేశాన్ని అప్రదిష్టపాలు చేసే విధంగా సోషల్ మీడియాలో ఎందుకు రాయాలని ఆమె ప్రశ్న. పాలకుల ఒడిలో కూర్చున్న మీడియా తప్ప, తక్కిన అన్నిటికి గడ్డుకాలమే కొనసాగుతోంది. మునుముందు, కొత్త నేరచట్టాలు, డిజిటల్ మీడియా చట్టాలు పాత్రికేయుల స్వేచ్ఛకు మరిన్ని సంకెళ్లు బిగించబోతున్నాయి కూడా.

అన్నిటి కంటె దురదృష్టకరం ఏమిటంటే, ఈ స్వేచ్ఛల గురించి గట్టిగా నిలదీయగలిగిన ప్రజాస్వామిక ఉద్యమమేదీ దేశంలో లేకపోవడం. గొంతువిప్పగలిగిన అతి కొద్ది మందిని దేశద్రోహులుగా, కమ్మీలుగా, ప్రభుత్వ వ్యతిరేకులుగా చిత్రించే దుర్మార్గం కొనసాగుతున్నది. ప్రజాస్వామ్యానికి కాపలాదారులుగా ఉండే పాత్రికేయుల విశ్వసనీయతను, నైతిక స్థైర్యాన్ని దానదండోపాయాల ద్వారా దెబ్బతీస్తున్నప్పుడు, నష్టపోయేది కేవలం మీడియా మాత్రమే కాదు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం, తాను తిరిగి అధికారంలోకి వస్తే మెరుగైన స్వేచ్ఛలను కల్పిస్తామని తమ మేనిఫెస్టోలో ప్రకటించాలి. ప్రతిపక్ష కూటమిగా రంగంలో ఉన్న పక్షాలు, తమ ప్రధాన ప్రచారాంశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణను చేర్చుకోవాలి. ప్రస్తుతం దేశంలో ఉన్న వాతావరణంలో, పత్రికాస్వేచ్ఛతో సహా ఏ స్వేచ్ఛలనయినా పునరుద్ధరిస్తామని చెప్పడం ఏ పక్షానికయినా రాజకీయంగా ప్రమాదకరమే. కానీ, నష్టాలకు సిద్ధపడి అయినా ముందుకు అడుగువేసేవారే ఫలితాలను కూడా సాధిస్తారు.

అనేక రకాల మాధ్యమాలలో పనిచేస్తున్న పాత్రికేయులు, వారి వృత్తి సంఘాలు పత్రికాస్వేచ్ఛను అణచిపెడుతున్న ధోరణులను గట్టిగా వ్యతిరేకించాలి. ప్రజాభిప్రాయాలను ప్రభావితం చేయగలిగే రంగమే భయానికో, భక్తికో మౌనంగా ఉండిపోతే, ప్రజాస్వామ్యానికి ఏది రక్షణ?

30 ట్రిలియన్ ఆర్థికంగా భారత్

'నేను మూడోసారి అధికారాన్ని చెలాయించడానికి తాపత్రయపడడం లేదు. ఈ దేశంలో పేద పిల్లల భవిష్యత్తు కోసం, కోట్లాది మహిళలు, యువత కలలు నెరవేర్చడం కోసం, ప్రపంచ దేశాల్లో అగ్ర రాజ్యంగా భారత్ గుర్తింపు పొందడం కోసం బీజేపీ మళ్లీ అధికారంలోకి రావాలని భావిస్తున్నాను' అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇటీవల బీజేపీ జాతీయ సదస్సులో స్పష్టం చేశారు. మరోసారి అధికారం రావడం అతి పెద్ద బాధ్యతగా భావిస్తున్నాను. దేశ ప్రజలు బీజేపీపై మరింత విశ్వాసం పెంచుకుని తమ కలల్ని మరింత సార్థకం చేస్తుందనే ఆశలతో మనను అధికారంలోకి తీసుకువస్తున్నారు. అందువల్ల మన బాధ్యత మరింత పెరుగుతుందని' మోదీ చెప్పారు. ప్రజల కలల్ని తప్పక నెరవేరుస్తామనే విశ్వాసం కలిగించేందుకు మన పార్టీ ప్రతి కొత్త ఓటరును చేరుకోవాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని మోదీ అన్నారు. 'రాబోయే 100 రోజుల్లో, మన మందరం ప్రతి కొత్త ఓటరు, ప్రతి లబ్ధిదారుడు, ప్రతి కమ్యూనిటీని చేరుకోవాలి. అందరి విశ్వాసం, మద్దతును మనం గెలుచుకోవాలి...' అని ఆయన చెప్పారు. ప్రతిపక్షాలకు ఎలాగూ అభివృద్ధి గురించిన ఆలోచన లేదు. వికసిత్ భారత్ గురించి దేశమంతటా మారుమ్రోగుతున్నప్పటికీ ప్రతిపక్ష నేతలు దాని గురించి పెదవి విప్పడం లేదు. అందుకు కారణం కళ్ల ముందు జరుగుతున్న అభివృద్ధి గురించి తప్పుడు వ్యాఖ్యలు చేస్తే ప్రజలు తమను తిరస్కరిస్తారని వారు భయపడుతున్నారు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

కేంద్రంలో మూడోసారి మోదీ సారథ్యంలో బీజేపీ అధికారంలోకి వచ్చే విషయంపై దేశంలో ఎవరికీ సందేహం లేదు. అసలు అధికారంలోకి వస్తామా, లేదా అన్న సంశయం మోదీకి ఎప్పుడూ లేదు. 370 సీట్లకు పైగా బీజేపీ సాధించాలనే లక్ష్యాన్ని ఎలా నెరవేర్చుకోవాలన్న విషయంపై ఆయన ఎప్పుడో పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఆ విషయానికి సంబంధించి పార్టీ వ్యూహరచన ఇప్పటికే పూర్తయింది. ఎంతో ముందుగా వ్యూహరచన చేయకపోతే ఒక్క రోజులోనే బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఒకేసారి 195 మంది అభ్యర్థులను ఖరారు చేయగలిగేదే కాదు. మొదటి జాబితాలోనే 33 మంది సిట్టింగ్ ఎంపీలను తొలగించారంటే, 34 మంది కేంద్రమంత్రులకు మళ్లీ అవకాశాలిచ్చారంటే బీజేపీ ఎంతో కాలం నుంచి అభ్యర్థుల పనితీరును, బలాబలాలపై విభిన్న వర్గాల నుంచి సమాచారం సేకరించిందని అర్థమవుతోంది.

అధికారంలోకి రావడం మాత్రమే కాదు, అధికారంలోకి వచ్చిన వెంటనే ఏమి చేయాలన్న విషయమై కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికే నిర్ణయించుకున్నారు. మరో రెండు నెలల పాటు దేశంలో ఎన్నికల హడావిడి ఉన్నప్పటికీ అభివృద్ధి ఆగకూడదని ఆయన భావిస్తున్నారు. అందుకే ఎన్నికల షెడ్యూలు ప్రకటించడానికి ముందే ఆయన బుధవారం నాడు అత్యంత కీలకమైన కేంద్ర కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే వంద రోజులకే కాదు, అధికారంలోకి వచ్చిన తర్వాత వంద రోజుల్లో, ఆ తర్వాత రానున్న అయిదు సంవత్సరాల్లో ఏమి చేయాలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సిందిగా ఆయన కేంద్ర కేబినెట్ మంత్రులను, అధికారులను ఆదేశించారు. మనం తీసుకోవాల్సిన కీలక చర్యలేమిటి, వాటిలో వేగంగా ఎన్నిటిని అమలు చేయగలం, మన ప్రాధాన్యాలేమిటో, వ్యూహాలేమిటో రూపొందించి కేబినెట్ సెక్రటేరియట్‌కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. ఎన్నికలైన తర్వాత తమ మంత్రి పదవులు ఉంటాయా లేదా అన్న ఆలోచన లేకుండా దేశం గురించి ఆలోచించి ప్రణాళికలు సమర్పించాలని ఆయన స్పష్టం చేశారు.




మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత్‌ను ప్రపంచ అగ్రరాజ్యంగా మార్చాలన్న లక్ష్యం తప్ప మరే లక్ష్యమూ మోదీ మనసులో లేదు. మేలో అధికారంలోకి రాగానే వికసిత్ భారత్‌ను సాధించేందుకు వందరోజుల ఎజెండాను ఆయన రూపొందించుకున్నారు. ప్రస్తుతం బడ్జెట్ ప్రవేశపెడుతున్న తీరునే కాకుండా ప్రభుత్వ వ్యవస్థల్ని నిర్మాణాత్మకంగా మార్చేందుకు ఆయన మనసులో ఎన్నో నిర్ణయాలు ఉన్నాయని కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆయన సుదీర్ఘ ప్రసంగం ద్వారా అర్థమవుతోంది.

మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దేశాన్ని ప్రపంచంలో అగ్ర రాజ్యంగా మార్చాలన్న లక్ష్యం తప్ప మరే లక్ష్యం మోదీ మనసులో లేదు. మేలో అధికారంలోకి రాగానే వికసిత్ భారత్‌ను సాధించేందుకు వందరోజుల ఎజెండాను కూడా ఆయన రూపొందించుకున్నారు. ప్రస్తుతం బడ్జెట్ ప్రవేశపెడుతున్న తీరునే కాకుండా ప్రభుత్వ వ్యవస్థల్ని కూడా నిర్మాణాత్మకంగా మార్చేందుకు ఆయన మనసులో ఎన్నో నిర్ణయాలు ఉన్నాయని కేంద్ర కేబినెట్ సమావేశంలో ఆయన చేసిన సుదీర్ఘ ప్రసంగం ద్వారా అర్థమవుతోంది. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే ఈ దేశం రూపురేఖలు మార్చివేసే సంస్కరణలను ప్రవేశపెట్టేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. జూన్‌లో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్‌లో విప్లవాత్మక, ప్రగతిశీలమైన నిర్ణయాలు ఉంటాయని ఆయన ఇప్పటికే సంకేతాలు పంపుతున్నారు. బడ్జెట్‌లో వార్షిక లక్ష్యాలతో పాటు, దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు తగిన చర్యలు ఉండాలని ఆయన భావిస్తున్నారు. 2047 కల్లా దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు వచ్చే అయిదేళ్లలో ఏమి చేయాలో ఆయన మనసులో ఒక స్పష్టత ఉన్నది. తన టీమ్ కూడా తన లాగే ఆలోచించేందుకు ఆయన ఇప్పటి నుంచే వారిని మానసికంగా సిద్ధం చేస్తున్నారు.

2047 కల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశం కావాలని ఆయన ఎందుకు అంటున్నారు? 1947లో స్వాతంత్ర్యం వచ్చిన రీత్యా ఆ తర్వాత వందేళ్లకైనా దేశం అగ్రరాజ్యంగా మారకపోతే, ఇంకా వర్ధమాన దేశంగానే మిగిలిపోతే ఆ దేశ నాయకుల గురించి ప్రజలు ఏమనుకుంటారు? నిజానికి ఈ వందేళ్లలో 60 ఏళ్ల పాటు కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలే దేశాన్ని పాలించాయి. అయినప్పటికీ కాంగ్రెస్ సాధించలేని ఫలితాలను బీజేపీ హయాంలోనైనా సాధించేందుకు మోదీ కృతనిశ్చయంతో ఉన్నారు. 2047 కల్లా భారత్ 30 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మారినప్పుడే, భారతీయుడి తలసరి ఆదాయం 2400 డాలర్ల నుంచి 18వేల అమెరికన్ డాలర్లకు పెరిగినప్పుడే, స్థూల దేశీయోత్పత్తి 29.02 డాలర్లకు చేరుకున్నప్పుడే అది అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. భారత్‌ను అగ్రరాజ్యంగా చూడాలన్న ఆకాంక్ష నెరవేర్చే దిశగా మోదీ 2021 డిసెంబర్ 17న చర్యలు ప్రారంభించారు. వివిధ కీలక ప్రభుత్వ శాఖలకు చెందిన కార్యదర్శులతో ఉజ్వల భవిష్యత్‌కు భారత్‌ను సిద్ధం చేయడం అనే లక్ష్యంతో బ్లూప్రింట్ తయారు చేయడం గురించి చర్చలు జరిపారు. గ్రామీణ రంగం–వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, వనరులు, సంక్షేమం, ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం–పరిశ్రమ, టెక్నాలజీ, సుపరిపాలన, దేశ భద్రత, విదేశాంగ వ్యవహారాలు అనే రంగాల్లో విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేశారు. ఏ ఏ రంగాల్లో ఎన్నెన్ని రెట్లు అభివృద్ధి జరిగితే వికసిత్ భారత్‌గా మారతామో ఈ పత్రంలో అంచనా వేశారు. ఎగుమతి లక్ష్యాలను నిర్దేశించారు. ప్రాంతీయ అసమానతలను చెరిపివేసేందుకు అవసరమైన వ్యవస్థాగత సంస్కరణలను నిర్ణయించారు. ప్రపంచంలోని వంద గ్లోబల్ సంస్థల్లో కనీసం పది కంపెనీలు మన దేశానికి చెందినవై ఉండాలని, 100 గ్లోబల్ విద్యాసంస్థల్లో పది యూనివర్సిటీలు మన దేశానికి చెందాలని మోదీ కలలు కన్నారు. అనుక్షణం ఈ దిశన జరుగుతున్న అభివృద్ధిని సమీక్షించి, తప్పులను సవరించుకునే యంత్రాంగాన్ని రూపొందించాలని భావించారు. ఈ మధ్య కాలాన్ని అమృత కాలంగా ఆయన అభివర్ణించారు. ఏ లక్ష్యాన్నైనా ముందే నిర్ణయించుకుని దాన్ని నిర్ణీత కాలవ్యవధిలో సాధించడం మోదీ స్వభావం. ప్రతి భారతీయుడూ దేశం గురించి మోదీలా ఆలోచిస్తే మన దేశం అనతి కాలంలో అగ్రరాజ్యంగా మారుతుందనడంలో సందేహం లేదు.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

అహింస వెనుక అసలు నిజం!



ప్రపంచ నాగరికతకు భారతదేశం ఏం అందించింది? అంటే వెంటనే యోగా గుర్తుకొస్తుంది. చదరంగం ఆట మనసులో మెదులుతుంది. సర్వసంగ పరిత్యాగులైన రుషులు స్ఫురణకు వస్తారు. గణితం గమనంలోకి వస్తుంది. భారత నాగరికతా ప్రయాణంలో విశిష్టతలకు సంబంధించిన నిర్ధారణలు చాలానే ఉన్నాయి. భిన్న నాగరికతలతో సరిపోల్చి చరిత్రకారులు తేల్చిన వాటిల్లో కొన్నిటిని చూస్తే హృదయాలు ఉప్పొంగుతాయి. మరికొన్నిటి విషయాల్లో విముఖతలూ వ్యక్తమవుతాయి. గొప్ప సంగతులన్నిటికీ భారతదేశమే మూలమన్న సంకుచితత్వం ఆ నిర్ధారణల్లో కనపడదు. ప్రజాస్వామ్యానికి భారతదేశమే పుట్టినిల్లుగా చెప్పే అతిశయోక్తులకు వాటిలో చోటుండదు. ఆధునిక రాజ్యాంగ ఆదర్శాలన్నిటికీ రామరాజ్యంలో పునాదులు ఉన్నాయన్న విపరీత వాదనా వినపడదు. అనాదిగా భారత్‌ది విశ్వగురు పాత్రేనంటూ సాగుతున్న విపరీత ప్రచారమూ కనపడదు. మన చరిత్రను నిష్పక్షపాతంగా పరిశీలించిన వారిలో ఎ.ఎల్. బాషమ్ ఒకరు. ఆయన 1950ల్లో రాసిన 'ద వండర్ దట్ వజ్ ఇండియా' పుస్తకం చాలా ప్రాచుర్యం పొందింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాలు ఇప్పటికీ దాన్ని.. ప్రాచీన భారత చరిత్రకు సంబంధించి ఎంతో విలువైన పుస్తకంగా భావిస్తాయి. సంస్కృతంతో పాటు మరికొన్ని భారతీయ భాషలను స్వయంగా నేర్చుకుని మరీ మన చరిత్రను అర్థంచేసుకోటానికి, మదింపువేయటానికి బాషమ్ చేసిన ప్రయత్నం అందులో అడుగడుగునా కనపడుతుంది. గతం పట్ల తీవ్ర విముఖతో మితిమీరిన ఆరాధనో లేకుండా సమతూక చిత్రణనే అందులో చూస్తాం.

యుద్ధాలు, హింసలు, ఆక్రమణలు, పరాజితులపై విజేతల జీవన విధానాన్ని రుద్దటం, బలవంతపు మతమార్పిడులు, అధిక భూశిస్తు పీడనలు, బానిసత్వ బంధనాలు అన్ని దేశాల్లోనూ ఒకనాడు ప్రబలంగా ఉండేవి. వీటిల్లో కొన్నిటికి సంబంధించి భారత్ భిన్నదారుల్లో నడిచింది. ఆ భిన్నదారులే ఒకనాడు భారత్‌ను ముందుకు నడిపించాయి. కాల గమనంలో అవే అడ్డుగోడలుగా మారాయి. భిన్నదారుల్లో ప్రధానమైందిగా చెప్పుకోవాలంటే ముందుగా మనకు కనపడేది అహింస. అంటే భారత చరిత్రలో హింస నిర్వహించిన పాత్ర తక్కువగా ఉండటం. దీన్ని గురించి విపులంగా, వాస్తవిక దృష్టితో అనితరసాధ్యం అన్నట్లుగా విశ్లేషించిన వారిలో దామోదర ధర్మానంద కోసంబికి మొదటి స్థానం ఇవ్వాలి. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పుకోవాలి. ఎంతో సంక్లిష్టతలతో కూడిన సుదీర్ఘచరిత్రపై కోసంబిదైనా మరొకరిదైనా తుది తీర్పు లాంటిదేమీ ఉండదు. కొత్త ఆధారాలు, నూతన విశ్లేషణలు వచ్చినప్పుడు కొన్ని నిర్ధారణలు మారటం సహజం.

భారతీయ సంస్కృతి ఆగ్నేయాసియా దేశాల్లో ప్రవేశించటాన్ని అహింసాయుత పరివర్తనకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. క్రీస్తు పూర్వమే ఈ దేశాలకు భారత వర్తకుల ప్రయాణాలు మొదలయ్యాయి. అక్కడే కొందరు శాశ్వత నివాసాలు, స్థానికులతో వివాహబంధాలు ఏర్పరచుకున్నారు. ఆ తర్వాత బ్రాహ్మణులూ బౌద్ధ బోధకులూ వెళ్లారు. వలస వచ్చిన భారతీయుల ప్రభావంతో స్థానిక సంస్కృతులు ఉత్తేజితమయ్యాయి. క్రమేపీ భారతీయ సమాజాన్ని పోలిన కొన్ని వ్యవస్థలు ఏర్పడ్డాయి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం స్థానికులకు అందింది. వర్గాలు ఏర్పడ్డాయి. వ్యవసాయం బలపడింది. సంస్కృతం వందలేళ్లు రాజభాష అయ్యింది.

శాంతియుత పరివర్తన కోసం ఒకనాడు స్వీకరించిన భావాలు, విశ్వాసాలు అనంతర కాలంలో సమాజ పరివర్తననే అడ్డుకునే స్థాయికి చేరాయి. అందుకే చరిత్రలో అన్నికాలాలకు వర్తించే మంచి భావాలు పరిమిత సంఖ్యలోనే ఉంటాయి. చరిత్ర చెప్పే ఈ పాఠాన్ని నేర్చుకోటానికి వీల్లేని వాతావరణం దేశంలో ఇప్పుడు క్రమేపీ విస్తరిస్తోంది. మన గతాన్ని అంతా యథాతథంగా స్వీకరించి ప్రతిరోజూ భుజాలు చరుచుకోవాలనే విపరీత ధోరణితో కృత్రిమ దేశభక్తి పెరిగితే పెరగొచ్చు. సుదీర్ఘ చరిత్రలోని పరిణామాల పట్ల వివేచన మాత్రం పెరగదు.

దేవాలయాలు ఏర్పాటయ్యాయి. తర్వాతి కాలంలో ఆ దేశాలపై చైనా, ఇస్లాం సంస్కృతుల ప్రభావం పడినా భారతీయులు ఆదిలో అందించిన ఘన ఉత్తేజం గణనీయమైంది. అహింసాదారుల్లోనే మరో ముఖ్య పరిణామం మధ్య ఆసియా మీదుగా జరిగింది. మనిషి కేంద్రంగా, అతని పరివర్తనే ఆలంబనగా కొత్త నైతిక దృష్టితో తలెత్తిన జీవన విధానం బౌద్ధం. మొదట్లో ఎంతో హేతుబద్ధతతో, మూఢనమ్మకాలకు తావియ్యని కొత్త జీవన తత్వంగా బౌద్ధం ఉనికిలోకి వచ్చింది. ఆ తర్వాత చాలా మార్పులకు లోనైనా కొన్ని శతాబ్దాలు సమాజాన్ని ముందుకు నడిపించటంలో బౌద్ధం గణనీయ పాత్రను పోషించింది. అటువంటి బౌద్ధం మధ్య ఆసియా మీదుగా చైనా, జపాన్, కొరియాలకు వ్యాపించటం ప్రపంచ చరిత్రలో మరో ముఖ్యమైన పరిణామం. సంస్కృతీ విస్తరణ, తాత్విక ఆలోచనల వ్యాప్తి వంటివి కాకుండా ప్రపంచానికి భారతదేశం అందించిన వాటిల్లో ఇంకా ఘనమైనవీ ఉన్నాయి. పత్తి, చెరకు, బియ్యం, సుగంధ ద్రవ్యాలు, కోళ్ల మచ్చిక, చదరంగం, దశాంశ పద్ధతి, బీజగణితం, సూర్య కేంద్ర సిద్ధాంత పోకడలు లాంటివి ప్రపంచానికి అందటంలో భారత్ పాత్ర ఎనలేనిది. పత్తి లేనిదే ప్రపంచ వస్త్ర పరిశ్రమ ఉండేది కాదు. పారిశ్రామిక యుగానికి ముందు వ్యవసాయం తర్వాత అత్యంత కీలమైనది వస్త్రపరిశ్రమే. భారత దేశానికి పాశ్చాత్య వర్తకులు ఒకనాడు వరుసకట్టడానికి వస్త్ర తయారీలో మన నైపుణ్యమే ప్రధాన కారణం. అంతెందుకు వస్త్ర తయారీలో కొత్త సాంకేతికతను ప్రవేశపెట్టటంతోనే బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం మొదలైంది.



■ రాహుల్ కుమార్

వేరే దేశాల్లో అహింసాయుతంగా భారత సంస్కృతీ వ్యాప్తి గురించి ఎవరికీ పెద్దగా భిన్నాభిప్రాయాల్లేవు. కానీ అంతర్గతంగా కులం ఆధారంగా నెలకొన్న సామాజిక వ్యవస్థ వందల ఏళ్ల పాటు దేశంలో నలుమూలలకు విస్తరించటంలో హింస కంటే అహింస పాత్రే ఎక్కువ. చాలా దేశాల్లో పరాజితులను సంపూర్ణంగా లొంగదీసుకున్నారు. కొన్నేళ్లకు వాళ్ల సంస్కృతీ పునాదులను పెకలించి వేశారు. మరికొన్ని చోట్ల బానిసలుగా మార్చారు. బలప్రయోగం, హింసతో విజేతలు తాము అనుకున్న సామాజిక మార్పును సాధించారు. భారతదేశంలో వేల తెగలు ఒకనాడు విడివిడిగా స్వంత అస్తిత్వంతో కొనసాగాయి. ఉత్తరాదిలో గంగా సింధు నదుల మధ్య నాలుగు కులాలతో ప్రారంభమైన సామాజిక వ్యవస్థ విస్తరించే క్రమంలో యుద్ధాలు అసలు జరగకుండా ఉండలేదు. కానీ అవి పరాజితుల సంపూర్ణ అస్తిత్వ హరణానికి దారితీయలేదు. విస్తరణ క్రమంలో బలవంతుల ఆధిపత్యాన్ని అంగీకరించిన తెగలను, జాతులను కొత్తకులాలుగా స్వీకరించి రైతులుగా, చేతివృత్తుల వారుగా, శ్రామికులుగా వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో చోటు కల్పించారు. అట్లా చోటు కల్పించటమే కాకుండా అప్పటిదాకా ఉన్న వారి కట్టుబాట్లను, సంప్రదాయాలను, ప్రత్యేకతలను కూడా కొనసాగనిచ్చారు. తెగల దేవతలకు స్థాయిని బట్టి సముచిత స్థానాలను ఇచ్చారు. అమ్మదేవతలు పార్వతి ప్రతిరూపాలుగా మారారు. పురుష దేవుళ్లు శివ, విష్ణు అంశాలను పుణికిపుచ్చుకున్న వారిగా చిత్రీకరించారు. హనుమాన్, గణేశ్ లాంటి ఒకనాటి తెగల దేవుళ్లు హిందూ దేవతా ప్రపంచంలో ప్రముఖ స్థానాన్ని పొందారు. ఈ పరిణామం వందలేళ్లు కొనసాగింది. ఇందులో భాగంగానే దేవతా ప్రపంచం విస్తరించింది. పురాణాలు, స్థలపురాణాల్లో కొత్త కథలు, గాథలు చరిత్ర పొడవునా చేరుతూనే ఉన్నాయి. అందుకే సంఖ్యలో భారత దేవతా ప్రపంచంతో సాటిరాగల లోకం మరొకటి లేదు. తెగలు పవిత్ర చిహ్నాలుగా భావించే కొన్ని జంతువులు ప్రధాన దేవుళ్లకు వాహనాలుగా మారిపోయాయి. కొన్ని వృక్షాలు పవిత్ర స్థానాన్ని పొందాయి. తెగలు కులాలుగా మారే పరిణామం ఏదో ఒక శతాబ్దానికే పరిమితం కాలేదు. సుదీర్ఘకాలం అది సాగింది కాబట్టి కులాల సంఖ్యకూడా క్రమంగా పెరుగుతూ వచ్చింది. వేదకాలంలో చాతుర్వర్ణ ప్రస్తావన మాత్రమే కనపడుతుంది. అదే మనుస్మృతి కాలం నాటికి వందల కులాలు వచ్చాయి. వీటిని వివరించటానికే వర్ణసాంకర్య సిద్ధాంతాన్ని పుట్టించారు. సంప్రదాయం ప్రకారం నాలుగు వర్ణాలు దైవ సృష్టి కాబట్టి.. కొత్తకులాలను వివరించటానికి వర్ణసాంకర్య సిద్ధాంతమే స్మృతికారులకు సహజం అనిపించింది. తెగల్లోని అంతర్వివాహ పద్ధతి యథాతథంగా కులాల్లోకి వచ్చింది. దాంతో కులం ఇంకా గట్టిగా స్థిరపడింది. వ్యవసాయాన్నో, వృత్తినో స్వీకరించి విస్తరిస్తున్న సమాజంలో భాగం కాకుండా సొంత అస్తిత్వం కోసం పట్టుపట్టిన వారిని దూరంగా అట్టిపెట్టి, హీనంగా చూడటం కూడా ఈ పరిణామంలో భాగంగా జరిగింది.

అతి తక్కువ హింసతో జరిగిన ఈ సామాజిక పరివర్తనను ఇతర దేశాల కంటే నాగరికమైనదిగా కోసంబి భావించారు. చారిత్రకంగా అమిత ప్రాధాన్యం కలిగిన విషయంగానూ పరిగణించారు. అమెరికా, యూరపులో జరిగినట్లుగా ఆదిమ తెగలను, జాతులను హింసతో లొంగదీసుకుంటే భారత్ ఎంతో క్రూరత్వానికి పాల్పడాల్సి వచ్చేదని కూడా వ్యాఖ్యానించారు. తక్కువ హింసతో జరిగిన సమాజ పరివర్తనకు కావల్సిన సైద్ధాంతిక, భావజాల సంపత్తిని సృష్టించటంలో బ్రాహ్మణుల పాత్ర చాలా ఉంది. సృష్టికర్తలు తామే కాబట్టి మత, పురాణసాహిత్యంలో ఆధిపత్యాన్ని కల్పించుకున్నారు. శాంతియుత సమాజ పరివర్తనకు ఒక దశలో తోడ్పడిన ఈ పద్ధతులను దైవిక నిర్ణయాలుగా భావించటం క్రమేపీ పెరిగింది. దీంతో తర్వాతి దశల్లో ప్రగతి పరంగా ముందడుగులు వేయటానికి కావాల్సిన భావనా సంపత్తిని సమకూర్చుకోలేని దుస్థితి ఏర్పడింది. విదేశీ ఆక్రమణలను ఎదుర్కోలేని నిస్సత్తువ ఆవహించింది. సముద్ర ప్రయాణం ద్వారా ఆగ్నేయాసియా దేశాల్లో నాగరికతను విస్తరింపచేసిన దేశానికి తర్వాత చరిత్రలో సముద్రయానమే అరిష్టంగా పరిణమించింది. తెగల ఆచారాలను, మూఢ భావాలను మార్పులూ చేర్పులతో కొనసాగించటంతో పూజారి వర్గానికి స్థిరవృత్తి దండిగా దొరికింది.

శాంతియుత పరివర్తన కోసం ఒకనాడు స్వీకరించిన భావాలు, విశ్వాసాలు అనంతర కాలంలో సమాజ పరివర్తననే అడ్డుకునే స్థాయికి చేరాయి. అందుకే చరిత్రలో అన్ని కాలాలకు వర్తించే మంచి భావాలు పరిమిత సంఖ్యలోనే ఉంటాయి. చరిత్ర చెప్పే ఈ పాఠాన్ని నేర్చుకోటానికి వీల్లేని వాతావరణం దేశంలో ఇప్పుడు క్రమేపీ విస్తరిస్తోంది. మన గతాన్ని అంతా యథాతథంగా స్వీకరించి ప్రతిరోజూ భుజాలు చరుచుకోవాలనే విపరీత ధోరణితో కృత్రిమ దేశభక్తి పెరిగితే పెరగొచ్చు. సుదీర్ఘ చరిత్రలోని పరిణామాల పట్ల వివేచన మాత్రం పెరగదు.

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

కార్పొరేట్ ఎజెండాకు జెండామోసిన జేపీ!

దేశవ్యాప్తంగా రైతుల ఉద్యమం బలపడుతున్న కొద్దీ కేంద్ర ప్రభుత్వం ఉద్యమ నాయకత్వంపై, ఉద్యమ డిమాండ్లపై దుష్ప్రచారం సాగిస్తున్నది. పంటలకు ప్రకటించే కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని రైతు ఉద్యమం ముందుకు తెచ్చిన ముఖ్యమైన డిమాండ్‌ను, ఇతర డిమాండ్లను తప్పు పడుతూ, కేంద్ర ప్రభుత్వానికి నిత్యం వత్తాసు పలికే లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ (జేపీ) లాంటి వాళ్ళు కూడా మీడియాలో మాట్లాడుతున్నారు. ఫిబ్రవరి 25న ఆంధ్రజ్యోతిలో 'జబ్బు కంటే ప్రమాదం 'మద్దతు' ఔషధం' పేరుతో ఆయన రాసిన వ్యాసం ఇందులో భాగమే.

రైతు పక్షపాతిగా చెప్పుకునే ఆయన ఈ వ్యాసంలో ఎక్కడా, తమ డిమాండ్లను వినిపించడానికి కేంద్ర ప్రభుత్వం రైతులను ఢిల్లీలోకి అనుమతించాలని గానీ, రైతు సంఘాలతో చర్చించాలని గానీ, రైతులపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని గానీ కోరకపోగా, రైతులను రైతు సంఘాలు పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించడం గమనార్హం. ఆయన వ్యాసంలో ఎక్కడా రైతులు పండించే అన్ని రకాల పంటలకు, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు ప్రకటించాల్సిన అవసరం గురించి ప్రస్తావించ లేదు. అన్ని పంటలకు సమగ్ర ఉత్పత్తి ఖర్చులను లెక్కించి, స్వామినాథన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా కనీస మద్దతు ధరలను ప్రకటించాలని కూడా అడగలేదు.

కనీస మద్ధతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి భారతదేశం బయటకు రావాలని, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని రైతులు చేసే డిమాండ్లు ఆయనకు పనికిమాలిన డిమాండ్లుగా కనిపించాయి. రైతు సంఘాలు తప్పుడు వాదనలతో ఈ డిమాండ్లు ముందుకు తెచ్చి రైతులను పక్కదారి పట్టిస్తున్నాయని ఆయన వ్యాసంలో విమర్శించారు. పైగా రైతుల డిమాండ్లను నెరవేర్చడానికి బడ్జెట్‌లో డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయని కూడా ఆయన వాపోయారు. జేపీ చేసే ఈ వాదనలన్నీ రైతుల గొంతును బలహీనపరిచి, మోదీ ప్రభుత్వ చర్యలను బలపరిచేవే. అంటే అసంఘటితమైన, ఆర్థికంగా బలహీనమైన భారత రైతులను తిమింగలాల వంటి కార్పొరేట్ మార్కెట్ శక్తులకు వదిలేసి, ప్రభుత్వం పక్కకు తప్పుకోవాలని ఆయన చెప్పకనే చెబుతున్నారన్నమాట.

2020 జూన్‌లో మోదీ ప్రభుత్వం తెచ్చిన మూడు రైతు వ్యతిరేక చట్టాలను దేశమంతా వ్యతిరేకిస్తే డాక్టర్ జేపీ మాత్రం వాటిని బలంగా సమర్థించారు. రైతు ఉద్యమ ఒత్తిడికి లొంగి మోదీ ప్రభుత్వం ఆ మూడు చట్టాలను రద్దు చేయడాన్ని కూడా ఆయన సహించలేకపోయారు. ప్రభుత్వం చేతకాని తనాన్ని ప్రదర్శించి రైతులకు లొంగిపోయిందని విమర్శించారు.

1990 దశకం నుంచీ నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల సమర్థకుడిగా, దేశ అభివృద్ధి నమూనాలో ప్రభుత్వాల పాత్ర తగ్గి, మార్కెట్ శక్తుల క్రియాశీల పాత్ర పెరగాలన్నది జేపీ కోరిక. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలని, అన్ని రంగాల్లోకీ విదేశీ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య సంస్థలు రావాలని, దేశాల మధ్య వాణిజ్యంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ముఖ్యమైన పాత్ర పోషించాలని జేపీ గట్టిగా వాదిస్తారు.

ఈ దేశం సంక్షేమ రాజ్యంగా వర్ధిల్లాలని; పేదరికం, ఆర్థిక అసమానతలూ, సామాజిక వివక్షా దేశంలో కొనసాగినన్ని రోజులూ ప్రభుత్వాలు ప్రజల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించాలని భారత రాజ్యాంగం కోరుకున్నదనీ మర్చిపోయి ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక పేరుతో పనిచేసే డాక్టర్ జేపీ చేసే వాదనలు చూస్తే దేశంలో ఆయన ఎటువంటి సంస్కరణలను కోరుకుంటున్నారో స్పష్టమవుతుంది.

కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతూ, మొత్తం దేశ పాలనా వ్యవస్థలో కీలక సంస్థలను నియంత్రణలోకి తెచ్చుకుంటూ, రాష్ట్రాల హక్కులను కూడా హరిస్తూ, దేశ ప్రజల పట్ల అత్యంత నిరంకుశ పాలకుడిగా వ్యవహరిస్తున్న మోదీనీ, ఆయన విధానాలనూ జయప్రకాష్ నారాయణ అమితంగా ఆరాధిస్తారని కూడా మనం ఈ సందర్భంగా గుర్తుంచుకోవాలి. మొత్తం ప్రభుత్వ యంత్రాంగం అవినీతిలో కూరుకుపోయింది కనుక, ప్రజలు దానిపై ఆధారపడకూడదని, సమర్థంగా పని చేసే ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు ప్రజలకు న్యాయం చేస్తాయని కూడా ఆయన నమ్ముతున్నారు. మనల్ని నమ్మమంటున్నారు.

జయప్రకాష్ నారాయణ బలంగా సమర్థించే నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన గత మూడు దశాబ్దాలుగా ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి ఎందుకు బయటపడవేయలేకపోయాయో, రైతు కుటుంబాల ఆదాయాలను ఎందుకు పెంచలేకపోయాయో, ఈ మూడు దశాబ్దాల్లో మూడు లక్షలమంది రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో ఆయన మనకు ఎప్పుడూ చెప్పరు.



వివిధ రంగాలలో కార్పొరేట్ సంస్థల వైఫల్యం, ప్రభుత్వాలు పెద్ద ఎత్తున పన్ను రాయితీలు అందించినా, ఆయా సంస్థలను నడపలేక ఆర్థికంగా దివాళా తీయడం, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఎగ్గొట్టడం– వీటిపై ఆయన పెద్దగా విమర్శనాత్మకంగా స్పందించరు. ఈ బడా కార్పొరేట్ సంస్థలకు దేశ సహజ వనరులను కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను కూడా పెద్దగా విమర్శించరు. ఆయా ప్రైవేట్ సంస్థల లాభాపేక్షపై, అక్రమ పద్ధతులపై ఎప్పుడైనా ప్రభుత్వాలు విధించే ఆంక్షలను కూడా ఆయన సహించరు. పైగా అటువంటి వాటిని లైసెన్స్‌రాజ్ చర్యలుగా విమర్శిస్తారు.

భారత రైతుల ఆదాయాలు పెంచడానికి ప్రభుత్వాలు నిర్దిష్టంగా ఏమి చేయాల్సి ఉంటుందో ఆయన తన వ్యాసంలో ఎక్కడా సూచించలేదు. ఆయన ఈ వ్యాసంలో చేసిన కొన్ని సూచనలు – పంట ధరలని అణగదొక్కుతున్న అన్ని నియంత్రణలను తొలగించడం, చౌక ధర దిగుమతులు వెల్లువెత్తకుండా హేతుబద్ధమైన సుంకం విధించడం, ధరల అంతరాల్ని తట్టుకునేలా నిల్వ, ఋణ వ్యవస్థలను బలోపేతం చేయడం, అదనపు విలువను ప్రోత్సహించడం, మార్కెట్ గొలుసును కుదించడానికి రిటైల్ చెయిన్ల ఏర్పాటు, ఎగుమతులకు ప్రోత్సాహం... ఈ సూచనలన్నీ కూడా ప్రభుత్వాల పాత్రను పూర్తిగా పక్కన పెట్టి, ప్రైవేట్ రంగ పాత్రను పెంచేవే. ఆహార శుద్ధి పరిశ్రమల ఆవశ్యకతను, నిల్వ సదుపాయాల అవసరాన్ని ఆయన గుర్తిస్తారు కానీ, ఇందులో రైతు సహకార సంఘాల పాత్రను బలోపేతం చేయడం కాకుండా, ఆయన ఆ బాధ్యతను కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని వాదిస్తారు.

భాష వేరు గానీ, ప్రపంచ వాణిజ్య సంస్థలో అమెరికా చాలా కాలంగా భారత దేశాన్ని అడుగుతున్న డిమాండ్లు ఇవే. మన దేశంలో కనీస మద్దతు ధరలను ప్రకటించడం మానేయాలని, ప్రభుత్వ సేకరణను మానేయాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను ఎత్తేయాలని అమెరికా చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నది. రైతుల సంక్షేమం పేరుతో భారత ప్రభుత్వం చేసే పై చర్యలన్నీ, మార్కెట్‌ను వక్రీకరిస్తున్నాయని, భారత రైతులకు సరైన ధరలు అందకుండా చేస్తున్నాయని కూడా అమెరికా వాదిస్తున్నది. ఈ మేరకు ఆ దేశం WTO కోర్టులో భారతదేశంపై కేసు కూడా వేసింది. డాక్టర్ జయప్రకాష్ నారాయణ చేసిన ప్రధాన సూచనలు కూడా ఈ అమెరికా చేస్తున్న వాదనల కోవకు చెందినవే.

సన్నకారు, చిన్నకారు రైతులు 80శాతం ఉన్న మన దేశంలో ఆయన సూచనలు, నిజంగా వ్యవసాయ కుటుంబాల సంక్షోభాన్ని పరిష్కరిస్తాయా? రైతులు గ్రామం దాటి తమ ఉత్పత్తులను బయటకు తీసుకువెళ్లలేని పరిస్థితి ఉన్నచోట, తమ ఆర్థిక అవసరాల కోసం వెంటనే పంటను అమ్ముకోవాల్సిన దుస్థితి ఉన్నచోట, ప్రభుత్వాల సేకరణ వ్యవస్థలు ఉనికిలో ఉండాలని, కేవలం, వరి గోధుమ లాంటి పంటలను మాత్రమే కాకుండా ఇతర ఆహార పంటలను కూడా సేకరించడం లాంటి చర్యలను కేంద్ర ప్రభుత్వం తీసుకోవాలని ఆయన తన వ్యాసంలో ఎక్కడా అడగలేదు. ప్రభుత్వ జోక్యం లేకుండా, ప్రైవేట్ వ్యాపారులు రైతులకు ఎక్కువ ధరలు చెల్లించిన ఉదాహరణలను కూడా ఆయన తన వ్యాసంలో ఎక్కడా ప్రస్తావించలేదు. పైగా అన్ని చోట్లా ప్రైవేట్ వ్యాపారులు కనీస మద్దతు ధరలు చెల్లించకుండా, అతి తక్కువ ధరలకే పంటలను సేకరించడానికి ప్రయత్నం చేయడం రైతులకు ఉన్న అనుభవం.

జయప్రకాష్ నారాయణ బలంగా సమర్థించే నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన గత మూడు దశాబ్దాలుగా ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి ఎందుకు బయటపడవేయలేకపోయాయో, రైతు కుటుంబాల ఆదాయాలను ఎందుకు పెంచలేకపోయాయో, ఈ మూడు దశాబ్దాల్లో మూడు లక్షలమంది రైతులు ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో ఆయన మనకు ఎప్పుడూ చెప్పరు.

అమెరికా, యూరప్‌లలో కార్పొరేట్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వ్యవసాయ రంగాన్ని శాసిస్తున్నప్పటికీ, అక్కడి ప్రభుత్వాలు వందల బిలియన్ల డాలర్లు అక్కడి రైతులకు సబ్సిడీలుగా ఎందుకు అందిస్తున్నాయో కూడా ఆయన మనకు చెప్పడు. ఆయా దేశాల రైతులలో కూడా ప్రతి సంవత్సరం చిన్న రైతులు ఎందుకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారో కూడా ఆయన మనకు వివరణ ఇవ్వడు.

కానీ మళ్ళీ మళ్ళీ వ్యవసాయ కుటుంబాల సంక్షోభ నివారణ బాధ్యతను కార్పొరేట్ సంస్థల కేంద్రంగా పనిచేసే మార్కెట్ వ్యవస్థ పైనే ఆయన పెడతారు. ఆయన లక్ష్యం స్పష్టం. రైతులే ఆయనను మరింత లోతుగా కొత్త కోణంలో అర్థం చేసుకోవాల్సిన అవసరముంది.

• కన్నెగంటి రవి
రైతు స్వరాజ్య వేదిక



దుర్గగుడిలో శివరాత్రి శోభ

రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

వన్‌టౌన్, మార్చి 4 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 6 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఈవో కేఎస్ రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9.30 గంటలకు ఉత్సవమూర్తులకు మంగళస్నానాలు చేయిస్తారు. అనంతరం వధూవరులుగా అలంకరిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, కలశస్థాపన, అగ్ని ప్రతిష్ఠాపన, మండపారాధన పూజ, ధ్వజారోహణ, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరుగుతాయి. 7వ తేదీ గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 6.30 గంటల వరకు మండపారాధన, అవుపాసనలు, బలిహరణ, మూలమంత్ర హవనం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతాయి. 8వ తేదీ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మల్లేశ్వరస్వామికి త్రికాల అర్చనలు, అభిషేకాలు, రాత్రి 9.30 గంటలకు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 12.30 గంటలకు గంగా పార్వతీ సమేత మల్లేశ్వరుల దివ్యలీలా కల్యాణోత్సవం జరుగుతాయి. 9వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మండపారాధన పూజ, అవుపాసనలు, బలిహరణ, మూలమంత్ర హవనం, 9 గంటలకు మల్లేశ్వరాలయంలో సదస్యం, వేదస్వస్తి, సాయంత్రం 4 గంటలకు మండపారాధన, అవుపాసనలు, బలిహరణ, మూలమంత్ర హవనం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, రథోత్సవం జరుగుతాయి. 10వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు పూర్ణాహుతి, ధాన్యకొట్నోత్సవం, వసంతోత్సవం, అనంతరం దుర్గాఘాట్‌లో అవభృథోత్సవం, సాయంత్రం 6.30 గంటలకు ధ్వజారోహణం నిర్వహిస్తారు. 11వ తేదీ సోమవారం సాయంత్రం పంచహారతులు, 7 గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ, పుష్పయాగోత్సవం జరుగుతాయి.

మెట్టినింటికి వీరమ్మ

ముగిసిన తిరునాళ్ల మహోత్సవాలు

ఉయ్యూరు, మార్చి 4 : ఉయ్యూరులో 15 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన వీరమ్మతల్లి తిరునాళ్ల సోమవారం ముగిసింది. తిరునాళ్లలో లక్షలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకున్నాక చివరి రోజు రాత్రి ఆలయం నుంచి బయల్దేరిన అమ్మవారు.. తిరుగుగండ దీపాలతో భక్తులు వెంటరాగా మేళతాళాలతో ముందుకు కదిలారు. ఊరంతా ఊరేగి సోమవారం అర్ధరాత్రి దాటాక ప్రధాన రహదారిపై ఉన్న ఆలయానికి చేరుకున్నారు. కాగా, 15 రోజుల పాటు తిరునాళ్లలో దర్శనమిచ్చిన అమ్మవారు భక్తుల పసుపు కుంకుమ, చీర సారెలందుకున్నారు. రెండు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నవారు తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్లలో చివరి రోజు పట్టణ పోలీసులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సీఐ హబీబ్ బాషా, ఎస్సై గణేశ్‌కుమార్, ఏఎస్సైలు, రైటర్, సిబ్బంది పసుపుకుంకుమ, చీర, సారె, పొటేళ్లతో ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కు చెల్లించుకున్నారు.



తిరునాళ్లలో భక్తుల కోలాహలం (ఇన్‌సెట్‌లో) మొక్కులు తీర్చుకుంటున్న పోలీసులు

స్థలాల తంత్రం

సెంట్రల్‌లో ఎమ్మెల్యే వెలంపల్లి పంపకాలు



జనాలను కొట్టుకు తినడం.. ఆ సొమ్ములో కొంతభాగం తాయిలాలుగా పంచడం... సర్కారీ స్థలాలను కబ్జా చేయడం.. చేయగా మిగిలిన స్థలాలను ఓటుబ్యాంకు రాజకీయాల కోసం పప్పులు బెల్లాల మాదిరి పంచేయడం... విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు తీరిది. ప్రజల కోసం జేబు నుంచి పైసా డబ్బు తీయని వైసీపీ నాయకులు ప్రజల సొమ్మునే సొంత సొమ్ము మాదిరి పంపకాలు మాత్రం జోరుగా చేస్తున్నారు.

- ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాలు ధారాదత్తం
- నిన్న బుడమేరు కట్టపై మందిరానికి 300 గజాలు
- నేడు ముత్యాలంపాడులో కల్యాణమండపానికి 500 గజాలు
- మాయమవుతున్న ఇరిగేషన్ స్థలాలు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/సత్యనారాయణపురం) : సెంట్రల్ నియోజకవర్గంలో బీసీ ఓటర్లను ఆకర్షించేందుకు సుమారు రూ.2 కోట్ల విలువైన 500 గజాల నీటిపారుదల శాఖ స్థలాన్ని వెలంపల్లి ధారాదత్తం చేసేశారు. ప్రజలందరికీ ఉపయోగపడాల్సిన నీటిపారుదల శాఖ భూములను కులాలవారీగా పంచుతూ పోతుండటంపై ప్రజల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ముత్యాలంపాడు జీఎస్‌రాజు రోడ్డు సత్యసాయిబాబా మందిరం పక్కన ఇరిగేషన్ స్థలం ఉంది. దానిలో కొంతభాగం రజకులకు దోబీఖానా నిర్మించారు. మిగిలిన 500 గజాల్లో రజకులు కల్యాణమండపం కట్టుకుంటామని ఎప్పటి నుంచో అడుగుతున్నారు. ఇరిగేషన్ స్థలం కావడంతో ఇంతకాలం ఎవరికీ అనుమతి ఇవ్వలేదు.

రజకులకు కాకుండా..

ఎన్నికలు సమీపిస్తుండంతో వైసీపీ నాయకులు బరితెగించారు. ఇదే సమయంలో అనుమతి ఇస్తే.. ప్రతిపక్ష నాయకులకు మాట్లాడే అవకాశం ఉండదని, అదేమని ప్రశ్నిస్తే బీసీల ఓట్లు వారికి పడకుండా ఉంటాయని పక్కా ప్లాన్ వేశారు. రజకులకు కాకుండా బీసీల కోసం అక్కడ కల్యాణ మండపం కట్టేందుకు అనధికార అనుమతి ఇచ్చారు. దీంతో కాల్వ ఒడ్డున స్థలం చదును చేసి, పిల్లర్లు వేసి కల్యాణమండపం నిర్మాణ పనులు చకాచకా చేస్తున్నారు. ఇరిగేషన్ స్థలంలో చిన్న పాక వేసినా వాలిపోయి తొలగించే అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో అటువైపు చూడలేదు. వెలంపల్లి అనధికార ఆదేశాల కారణంగానే వారు అటువైపు రావడం లేదని సమాచారం. ఎన్నికల నోటిఫికేషన్ త్వరలో వస్తున్న తరుణంలో సుమారు రూ.2 కోట్ల విలువైన భూమిని ఇలా అన్యాక్రాంతం చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ముత్యాలంపాడులో కల్యాణ మండపం కడుతున్న స్థలం

ఇప్పటికే జీఎస్ రాజు రోడ్డులో రెండున్నర కోట్ల రూపాయల విలువైన భూమిని బ్రాహ్మణులకు, రెండు కోట్ల రూపాయల విలువైన భూమిని ఆర్యవైశ్యులకు దారాదత్తం చేసిన విషయం తెలిసిందే. ఇవికూడా ఇరిగేషన్ భూములే. అంతకుముందు అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో పైపుల రోడ్డు నుంచి నందమూరి నగర్‌కు వెళ్లే దారిలో బుడమేరు కట్టపై సుమారు 300 గజాలను ఓ మందిరం నిర్మాణం కోసం కట్టబెట్టారు.

నకిలీ మంత్రం

గన్నవరంలో మళ్లీ వంశీ నకిలీ పట్టాలు



గన్నవరం నియోజకవర్గంలో అధికార వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ మరోసారి నకిలీ పట్టాల మంత్రాన్ని జపిస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు సుమారు 11 వేల మందికి నకిలీ పట్టాలు ఇచ్చిన వంశీ మరోసారి అదే బాటలో పయనించేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే పదవి ఊడినా.. అదే హోదాలో మంగళవారం పట్టాలు పంపిణీ చేసేందుకు కుట్ర పన్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

2019 ఎన్నికల ముందు 11వేల మందికి నకిలీ పట్టాలు

- అప్పుడు బాపులపాడు మండలంపైనే దృష్టి
- ఈసారి నియోజకవర్గంలోని అన్ని మండలాలపైనా
- చెరువులను చెరబట్టి.. పట్టాలు సిద్ధం చేసి..
- ఎమ్మెల్యే పదవి ఊడినా.. అదే హోదాలో నేడు పంపిణీ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గత ఫిబ్రవరి 26న గన్నవరం ఎమ్మెల్యే వంశీపై అసెంబ్లీ స్పీకర్ అనర్హత వేటు వేశారు. దీంతో ఆయన ఎమ్మెల్యే పదవి ఊడింది. కానీ, మంగళవారం ఎమ్మెల్యే హోదాలో ఆయన పలు ప్రారంభోత్సవాలు, రంగన్నగూడెంలో పట్టాల పంపిణీ చేపట్టనున్నారు. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ఎలాగైనా ఓటు బ్యాంకును కొల్లగొట్టాలన్న లక్ష్యంతో వంశీ ఈ పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఈసారి వంశీకి వైసీపీ టికెట్ వస్తుందా, రాదా అనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. అయితే, కోర్టు కేసులకు హాజరయ్యేందుకు సుదీర్ఘకాలం తర్వాత సోమవారం వంశీ నియోజకవర్గానికి వచ్చారు. పనిలో పనిగా మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా పట్టాల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అయితే, ఈసారి కూడా ఆయన 2019 ఎన్నికల ముందు తరహాలోనే నకిలీ పట్టాలనే పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ఏడాది మేలో గన్నవరం రెవెన్యూ అధికారులు 48 ఎకరాల వెదురుపావులూరు చెరువు భూములను సర్వేచేసి హడావిడి చేశారు. ఆ తర్వాత నియోజకవర్గంలోని పలు మండలాల్లో చెరువులనూ సర్వేచేసి ఆ భూముల్లో పేదలకు పట్టాలు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రజావసరాలకు ఉపయోగపడే చెరువులను ఎలా స్వాధీనం చేసుకుంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వంశీ చెప్పిందే తడువుగా రెవెన్యూ అధికారులు సైతం చెరువులు, డీ పట్టా భూములపై పడి సర్వే చేస్తూ హడావిడి చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. దీంతో ప్రస్తుతం ఇచ్చే పట్టాలు ఏ మేరకు పేదలకు ఉపయోగపడతాయన్నది ప్రశ్నార్థకమే.

2019లోనూ నకిలీ మంత్రమే..

బాపులపాడు మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ పోరంబోకు స్థలాలు, చెరువు గట్లపై స్థిర నివాసాలు ఏర్పరుచుకుని జీవిస్తున్న పేదలకు 2019, ఏప్రిల్ 7న అర్ధరాత్రి నకిలీ ఇళ్ల పట్టాలను అప్పట్లో టీడీపీ తరఫున పోటీ చేసిన వంశీ, ఆయన అనుచరులు పంపిణీ చేశారు. బాపులపాడుతో పాటు కొయ్యూరు, పెరికీడు గ్రామాల్లో 3వేల మందికిపైగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మొత్తం మీద 11 వేల వరకు ఇలా పట్టాలు పంపిణీ చేశారు. అయితే, ఇళ్ల పట్టాలపై మంజూరు చేసిన తేదీ, లబ్ధిదారుడి ఫొటో, ఆర్సీ నంబరు, ఎల్‌డీ ఫైల్ నంబర్లు లేకపోవడంతో పలువురు లబ్ధిదారులకు అనుమానాలు రేకెత్తడంతో అసలు విషయం బయటపడింది. 2018, ఆగస్టులో బదిలీ అయిన తహసీల్దార్ సంతకాన్ని రబ్బరు స్టాంపు చేయించి ఇళ్ల పట్టాలపై ముద్రించి ఉండటం వారి అనుమానాలకు మరింత బలాన్ని చేకూర్చింది. ఎన్నికల అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగా, ఈ విషయంపై గన్నవరానికి చెందిన ముప్పలనేని రవికుమార్ స్పందనలో అప్పటి జిల్లా కలెక్టర్ ఇంతియాజ్‌కు తొలి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత సుమారు 100 మందికిపైగా లబ్ధిదారులు అప్పటి తహసీల్దార్ సీహెచ్ నరసింహారావును కలిసి నకిలీ ఇళ్ల పట్టాలపై ఫిర్యాదు చేశారు. ఇళ్ల పట్టాలపై ఉన్న తహసీల్దార్ పాస్‌మెయిల్ సంతకం, కార్యాలయం స్టాంపు పూర్తిగా ఫోర్జరీ చేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించిన ఆయన సమగ్ర విచారణ జరపాలంటూ 2019, అక్టోబరు 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. వల్లభనేని వంశీ, ఆయన ప్రధాన అనుచరులు ఓలుపల్లి మోహనరంగా, కాట్రు శేషు, జాస్తి ఫణి, కొల్లి రంగారావు, వేగిరెడ్డి పాపారావు, కొత్తూరి అంజనేయులు, సింగవరపు దుర్గా ప్రసాద్, లావేటి నారాయణ, బండారు సత్యనారాయణపై పోలీసులు కేసు నమోదు చేశారు. చీటింగ్, ఫోర్జరీ, ఎన్నికల నియమావళి ఉల్లంఘన అభియోగాలపై కేసు రిజిస్టర్ చేశారు. ఈ కేసు తీవ్రత పెరుగుతుండటంతో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న వంశీ పార్టీ మారి వైసీపీ పంచన చేరారు. దీంతో ఈ కేసు కూడా అటకెక్కింది. తాజాగా మళ్లీ నకిలీ మంత్రాన్న వంశీ జపిస్తున్నారు.



గత ఎన్నికలకు ముందు వంశీ ఇచ్చిన నకిలీ పట్టా

సమగ్ర విచారణ జరపాలి

టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మార్చి 4 : గన్నవరం నియోజకవర్గంలో నకిలీ ఇళ్ల పట్టాల మంజూరుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఉన్నతాధికారులకు సోమవారం లేఖ రాశారు. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా, జిల్లా కలెక్టర్ రాజాబాబుకు ఆయన ఈ లేఖ రాశారు. నకిలీ ఇళ్ల పట్టాలు కేటాయించి ఓటర్లను ప్రలోభ పెట్టి మోసగించాలని చూస్తున్నారని, గన్నవరంపై ప్రత్యేక దృష్టిసారించి నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీని అడ్డుకోవాలని కోరారు. ఐదేళ్ల క్రితం వల్లభనేని వంశీ బాపులపాడు మండలంలో 11వేల మంది ఓటర్లకు నకిలీ ఇళ్లపట్టాలిచ్చి ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని, ఆ సమయంలో అతనితో పాటు మరికొందరిపై క్రిమినల్ కేసులు, ఫోర్జరీ కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. ఆ తర్వాత వంశీ పార్టీ మారి కేసుల నుంచి తప్పించుకున్నారన్నారు. ఇలాంటి కార్యకలాపాలను అరికట్టడంతో పాటు అతనికి సహకరిస్తున్న రెవెన్యూ, ఇతర ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కామన్ సైట్లపై కన్ను

కండ్రిక కాలనీలోని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించే కుట్ర

నగర శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్తున్నాయి. నిన్న మొన్నటి వరకు ఇరిగేషన్, పోరంబోకు, బుడమేరు పరివాహక ప్రాంతాలపై పడిన కబ్జాదారులు నేడు నగరపాలక సంస్థకు చెందిన కామన్ సైట్లను చెరపట్టారు. అధికార పార్టీ నేతల అండ చూసుకుని కబ్జాకోరులు రెచ్చిపోతుంటే, కాసులకు కక్కుర్తి పడి అధికారులు వారికి సహకరిస్తున్నారు. కండ్రికలోని కామన్ సైట్ల ఆక్రమణకు ప్రయత్నాలు జరుగుతుండటమే ఇందుకు నిదర్శనం.

- అధికార పార్టీ నేతల అండతో తెరవెనుక ప్రయత్నాలు
- సుమారు 100 గజాలు.. రూ.40 లక్షల విలువ
- ఖాళీ స్థలానికి మీటరు కేటాయించిన విద్యుత్ శాఖ



కండ్రిక కాలనీలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలమిదే..

పాయకాపురం : నగర శివారున కండ్రిక కాలనీ సుమారు పాతికేళ్ల క్రితం ఏర్పాటైంది. నగరంలోని కాల్వగట్ల వెంబడి, ప్రభుత్వ స్థలాల్లో ఉంటున్న పేదలకు ఇక్కడ ప్రభుత్వం ఇళ్లు కేటాయించింది. ఆ సమయంలో ప్రభుత్వ అవసరాల నిమిత్తం కాలనీలో పలుచోట్ల స్థలాలు వదిలారు. అయితే, చాలాకాలంగా ఈ స్థలాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కబ్జాదారులు కన్నేశారు. ఇప్పటికే పలు స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి.

- మిగతా 4లో

ఓ ఎస్‌ఐ.. అన్నీ తానై..

పోలీసు కమిషనరేట్‌లో చక్రం తిప్పుతున్న ఎస్‌ఐ

● ఓ కానిస్టేబుల్ తన బదిలీ అర్జీని పోలీసు కమిషనర్‌కు ఇవ్వాలని కొద్దిరోజుల క్రితం కమిషనర్ కార్యాలయానికి వచ్చాడు. ఆయన లోపలకు రాగానే వరండాలో ఒక ఎస్‌ఐ కనిపించాడు. కానిస్టేబుల్ ఆయనకు సెల్యూట్ చేశాడు. ఇలా వచ్చావేంటి.. అని ఎస్‌ఐ అడిగాడు. పనిచేస్తున్న స్టేషన్ నుంచి మరో పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేయించుకోవాలని, సీపీని కలిసి అర్జీని ఇవ్వాలనుకుంటున్నానని చెప్పాడు. ఎస్‌ఐ ఆ అర్జీని చదివి కమిషనర్ ఇప్పుడు వినతులు స్వీకరించరని, తర్వాత ఎప్పుడైనా రమ్మని చెప్పి పంపేశాడు.

● ఓ సందర్శకుడు సమస్య చెప్పుకోవడానికి కమిషనరేట్‌కు వచ్చాడు. సీపీ బిజీగా ఉండడంతో శుక్రవారం నిర్వహించే డయల్ యువర్ కమిషనర్ పూర్తయ్యాక కలవాలని అక్కడి సిబ్బంది చెప్పారు. అయినా ఆ సందర్శకుడు మర్నాడు సీపీవోకి వచ్చాడు. ఇది గమనించిన అధికారులు శుక్రవారం రమ్మంటే మళ్లీ ఈరోజు వచ్చావేంటి అని ప్రశ్నించారు. ఆ ఎస్‌ఐ పేరు చెప్పి ఆయనే పంపించారని చెప్పడంతో కమిషనరేట్ సిబ్బంది కంగుతిన్నారు. వారం క్రితం జరిగిన ఘటన ఇది.

..ఆయన కమిషనర్ పేషీలో ఉద్యోగి కాదు. పేషీ ఇన్‌స్పెక్టర్ అంతకన్నా కాదు. ఆయన పోస్టింగ్‌కు, కమిషనరేట్‌కు సంబంధమే లేదు. అయినా కమిషనరేట్‌లో అన్నీ తానై వ్యవహరిస్తున్నాడు. ఎదురుగా ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు కనిపించినా లెక్క చేయడు. డీసీపీలు, ఆపై స్థాయి అధికారులకు మాత్రమే తాను జవాబుదారీ అన్నట్టు అడుగులు వేస్తాడు. కమిషనరేట్‌లో ఈ ఎస్‌ఐ వ్యవహారశైలికి పై ఘటనలే ఉదాహరణలు.



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దేవుడి దర్శనానికి ముందు పూజారి వద్దకు వెళ్లినట్టు కమిషనర్‌ను కలవడానికి ముందు కమిషనరేట్‌లో ఆ ఎస్‌ఐ దర్శనం చేసుకోవాలి. అలాగని ఆ ఎస్‌ఐ కమిషనర్ పేషీ ఇన్‌చార్జి కాదు. అక్కడ విధులు కూడా నిర్వహించడు. అయినా నిత్యం సీపీవోకు వస్తాడు. కార్యాలయ కింది హాల్లో వేచి ఉండే సందర్శకులు, పోలీసు కానిస్టేబుళ్లతో మాట్లాడతాడు. వాళ్లు ఏ పనులపై వచ్చారో, ఎవరి సిఫార్సులతో వచ్చారో తెలుసుకుంటాడు. ఆ తర్వాత కమిషనర్ పేషీ అధికారులు చెప్పాల్సిన నిర్ణయాలను ఈ ఎస్‌ఐ చెబుతాడు. పోలీసు వర్గాల్లోను, సందర్శకుల్లోనూ ఈ మోనార్క్ ఎస్‌ఐ ప్రవర్తన చర్చనీయాంశంగా మారింది. ఈ ఎస్‌ఐ వ్యవహరిస్తున్న తీరు అధికారులకు తెలుసా, తెలిసినా వదిలేశారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

- అధికారులను కలవాలన్నా.. వినతులు ఇవ్వాలన్నా అన్నీ ఆయనే..
- తన స్టేషన్‌లో విధులు వదిలేసి సీపీవోలో మకాం
- ఉన్నతాధికారులకు తెలియకుండా అనధికారిక ఆదేశాలు

పనిలేకపోయినా హాజరు

నేర పరిశోధన విభాగంలో ఉండే ఈ ఎస్‌ఐ మొన్నటి వరకు ఉత్తర మండలంలో పనిచేశారు. తర్వాత ఎన్నికల బదిలీల్లో దక్షిణ మండలానికి వచ్చారు. సీసీఎస్ విధులు నిర్వర్తించే వారికి ఖాకీ దుస్తుల వేసుకోవడంలో మినహాయింపు ఉంటుంది. ఆయన స్టేషన్‌లో ప్రజెంట్ వేయించుకున్నా, లేకపోయినా కమిషనర్ కార్యాలయంలో నిత్యం హాజరు వేయించుకుంటాడు. తమ సమస్యలు విన్నవించుకోవడానికి, బదిలీలకు వినతులు ఇవ్వడానికి కమిషనరేట్ పరిధిలోని సిబ్బంది వస్తుంటారు. వారిని పలకరించి మరీ వివరాలను ఈ ఎస్‌ఐ సేకరిస్తాడు. కమిషనర్, ఆయన పేషీ అధికారులు చెప్పాల్సిన నిర్ణయాలను ఎలాంటి సంబంధం లేని ఈయనే వెల్లడిస్తాడు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసు ఉద్యోగులను కమిషనర్ కలవరని చెప్పి కార్యాలయం నుంచి వెనక్కి పంపేసిన దాఖలాలు ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. బదిలీ కోసం వచ్చిన వారి నుంచి దరఖాస్తు తీసుకు చదివి.. బదిలీ జరగదు, ప్రస్తుతం ఉన్నచోటే పనిచేయాలని అనధికారిక ఆదేశాలిస్తాడు. ఈ పరిణామాలు పోలీసు ఉద్యోగుల్లో అసంతృప్తికి దారితీస్తున్నాయి. కమిషనర్ కార్యాలయంతో గానీ, ఆయన పేషీతో గానీ సంబంధం లేని ఎస్‌ఐ తమపై ఎలా పెత్తనం చెలాయిస్తాడని కొందరు ప్రశ్నిస్తున్నారు. తన రక్తసంబంధీకులకు డీజీపీ కార్యాలయంలోని ఉన్నతాధికారి ఒకరు బాగా పరిచయం ఉండడంతోనే ఈ ఎస్‌ఐ ఇలా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరపరిశోధన విభాగంలో విధులను వదిలేసి కమిషనరేట్ వ్యవహారాల్లో తలదూర్చుతున్న ఈ ఎస్‌ఐ తీరుపై కొంతమంది ఉన్నతాధికారులు సైతం గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. ఇకనైనా అధికారులు ఈ ఎస్‌ఐ దూకుడుకు బ్రేకులు వేస్తారా, లేక ఇంకా భుజాన వేసుకుని మోస్తారా అన్నది వేచి చూడాలి.



కృష్ణామిల్క్ యూనియన్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న తెలంగాణ మంత్రి తుమ్మల

పాడిపరిశ్రమ హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో కృష్ణామిల్క్ యూనియన్ స్టాల్

» ప్రారంభించిన తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చిట్టినగర్, మార్చి 4 : 50వ పాడిపరిశ్రమ సదస్సును పురస్కరించుకొని ఇండియన్ డెయిరీ అసోసియేషన్ సౌత్‌జోన్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న హైటెక్స్ ఎగ్జిబిషన్‌లో కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) ఏర్పాటు చేసిన స్టాల్‌ను యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ఆహ్వానం మేరకు సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంలో కృష్ణా మిల్క్ యూనియన్ స్టాల్‌ను వీక్షించిన ఆయన పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి యూనియన్ చేస్తున్న విశేష కృషిని అభినందించారు. స్టాల్‌ను తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, ఇండియన్ డెయిరీ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ఎస్ సోధి, సందర్శించారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘటన్ అధ్యక్షురాలిగా విజయలక్ష్మి



జగ్గయ్యపేట, మార్చి 4 : టీడీపీ రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా జగ్గయ్యపేటకు చెందిన రాచూరి విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం లో జరిగిన ఆర్‌బీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమెకు జాతీయ అధ్యక్షుడు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు వేమూరి రామకృష్ణారావు, యనమంట సురేశ్‌లు నియామకపత్రం అందజేయగా, ఆర్‌బీఎస్ వ్యవస్థాపకులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనందసూర్య ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తన నియామకానికి కృషి చేసిన విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జాతీయ టీడీపీ కోశాధికారి శ్రీరాం తాతయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బ్రాహ్మణులకు టీడీపీ హయాంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందిన సంక్షేమ ఫలాలను వివరించి, చంద్రబాబుకు మద్దతు కూడగడతామని చెప్పారు. జిల్లా, నియోజకవర్గ కమిటీలు వేసి సంఘటన్‌ను పటిష్ఠం చేస్తామని తెలిపారు.



బహుమతులు సాధించిన చిన్నారులతో పాఠశాల డైరెక్టర్ మంజుల

ఘనంగా విశ్వభారతి 56వ వార్షికోత్సవం

గుడివాడ, మార్చి 4 : రాజేంద్రనగర్‌లోని విశ్వభారతి ప్రైమరీ పాఠశాల 56వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. తొలుత వేడుకలను పాఠశాల డైరెక్టర్ ఆర్.మంజుల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. ఇటీవల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనల్లో బహుమతులు సాధించిన చిన్నారులు, కరాటే, రోలర్ స్కేటింగ్‌లో పతకాలను సాధించిన విద్యార్థులను అభినందించారు. 2023-24 వార్షిక సంవత్సరానికిగాను నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలు జి.యశ్విన్ (5వ తరగతి), ఎస్.కె అహమ్మద్ కబీర్ (4వ తరగతి), జి.వర్షిత్(3వ తరగతి)లకు పాఠశాల డైరెక్టర్లు మంజుల, కీర్తిలు ట్రోఫీలను బహుకరించారు. ప్రిన్సిపాల్ రాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆధార్‌లో సరైన సమాచారం పొందుపరచండి

● జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి అనురాధ

ధర్నాచౌక్, మార్చి 4: గ్రామ, వార్డు సచివాలయాల్లో మంజూరు చేస్తున్న ఆధార్‌కార్డుల్లో సరైన సమాచారం పొందుపరచడంలో ప్రతి ఉద్యోగి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని గ్రామ, వార్డు సచివాలయ విభాగ కార్యదర్శి కొడాలి అనురాధ సూచించారు. జిల్లాలోని డిజిటల్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషనల్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు శిక్షణా శిబిరం నగరంలోని ఐవీ ప్యాలెస్‌లో సోమవారం నిర్వహించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ ఆధార్ స్టేట్ కో-ఆర్డినేటర్ వి.సుందరం, ఏపీ ఆన్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ వైవీ సురేష్ పాల్గొన్నారు.

క్షురకులను మోసం చేసిన జేఏసీ నేతలపై ఫిర్యాదు

వన్‌టౌన్, మార్చి 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలోని బాల బాలాజీ దేవస్థానంలో పనిచేస్తున్న క్షురకులు తమకు 110 జీవో అమలు పరుస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన నాయీ బ్రాహ్మణ సంఘాల జేఏసీ నేతలు రామేశ్వరరావు, వెంకట రమణమూర్తి, దుర్గగుడిలో క్షురకుడిగా పనిచేస్తున్న గుంటుపల్లి రాందాస్‌పై సోమవారం గొల్లపూడిలో దేవదాయకమిషనర్‌కు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లక్రితం ఆలయాల్లో పనిచేస్తున్న క్షురకులకు కమిషన్‌తో పనిలేకుండా నెలకు రూ.20 వేలు చెల్లించేలా 110 జీవో ఇచ్చారు. ఈ జీవోను అమలు చేయిస్తామని అప్పనపల్లి దేవస్థానంలో పనిచేస్తున్న సుమారు 37 మంది నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.60వేలు చొప్పున జేఏసీ నేతలు ఒప్పందం కుదుర్చుకుని రూ.50వేలు చొప్పున అడ్వాన్స్‌గా మొత్తం రూ.18లక్షలు వసూలు చేశారు. వీరిలో 24 మందికే జీవో వర్తించేలా పని చేశారు. మిగిలిన 13 మందికి వర్తింపజేయలేదు. వీరు జేఏసీ నేతలను ప్రశ్నించగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. దీంతో బాధితులు ఈవో, డిప్యూటీ కమిషనర్ విజయరాజుకు, కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందన లేకపోవడంతో తాజాగా మరోమారు దేవదాయ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జేఏసీ నేతలు తమను మోసం చేశారన్నారు.



పోస్టుబాక్సులో కార్డును వేస్తున్న కేశినేని చిన్ని

ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలి: కేశినేని చిన్ని

వన్‌టౌన్, మార్చి4: ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని టీడీపీ సీనియర్ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. ఈ మేరకు రాష్ట్రపతికి విన్నవించేందుకు పోస్టుకార్డుల ఉద్యమం సోమవారం గురునానక్ కాలనీలోని శివనాథ్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని కోరుతూ రాష్ట్రపతి కార్యాలయానికి వినతులు పంపే క్రమంలో పోస్టు కార్డు ఉద్యమం, సంతకాల సేకరణ ప్రారంభించామన్నారు. దీనికి ముందడుగు వేసిన తెలుగు ప్రొఫెషన్ వింగ్స్ మెంబర్ కమలకు అభినందనలు తెలిపారు. సుపరిపాలన అందించిన పాలనా దక్షుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, 4వ డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, సొంగా సంజయ్‌వర్మ, అమ్మిశెట్టి వాసు, బొప్పన భవకుమార్, ఫార్మాసూటికల్ అధినేత ఫణీంద్ర పాల్గొన్నారు. తొలుత నేతలు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

మొగల్రాజపురం, మార్చి 4: నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి జనశిక్షణా సంస్థాన్ ఛైర్మన్ విద్యాఖన్నా ఆధ్వర్యంలో మార్చిలో శిక్షణా కార్యక్రమాలను డైరెక్టర్ పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. 5న కటింగ్ టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, 7 నుంచి ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్కు, 11 నుంచి హ్యాండ్ ఎంబ్రాయిడరీ, మెషీన్ ఎంబ్రాయిడరీ, 13 నుంచి ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ రిఫ్రిజరేషన్, ఐస్‌క్రీం మేకింగ్, 17 నుంచి స్క్రీన్ ప్రింటింగ్, జామ్ అండ్ జ్యూస్ తయారీ, బాతిక్ ప్రింటింగ్, హోమ్ క్రాఫ్ట్, వంటి వాటిలో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన యువత స్థానిక మొగల్రాజపురంలోని కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

సీఎంపై పోరుకు సిద్ధం

» వందమంది నానీలు వచ్చినా తరిమికొడతాం

» తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత

» గుడివాడలో మహిళా గళం సదస్సు



మహిళా సదస్సు వేదికపై రాము, రావి, కొనకళ్ల, మహిళా ప్రతినిధులు

గుడివాడ రూరల్, మార్చి 4 : ఎన్నికల సమరంలో జగన్‌ను ఢీకొనేందుకు కొంగు బిగించి.. తామూ సిద్ధమేనని తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. గుడివాడ పట్టణం బంటుమిల్లి రోడ్డులోని తాళ్లూరి కళ్యాణ మండపంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో 'మహిళా గళం' సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని స్వర్ణలత, టీడీపీ నేతలు ప్రారంభించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, గుడివాడ అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ, గుడివాడ నడిబొడ్డున ఉండి చెబుతున్నాం.. వందమంది కొడాలి నానిలు వచ్చినా తరిమికొట్టడానికి సిద్ధమన్నారు. వైసీపీ దుర్మార్గులు అధికార మదంతో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. జగన్ రెడ్డి ప్రచారానికి తప్ప.. దిశ చట్టం వల్ల మహిళలకు కలిగిన ప్రయోజనం శూన్యమన్నారు.

తెలుగు తల్లులకు చేతులెత్తి మొక్కుతున్నా..

: వెనిగండ్ల రాము

అరాచక ప్రభుత్వంపై తెగువతో పోరాడుతున్న మహిళా తల్లులకు చేతులెత్తి మొక్కుతున్నా అని వెనిగండ్ల రాము అన్నారు. మహిళల సభతో మరింత స్ఫూర్తి పెరిగిందన్నారు. వాడవాడలా మహిళల స్పందన, ప్రోత్సాహం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. యావత్ మహిళా లోకం చంద్రబాబుకు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గుడివాడలోనే కాదు, జిల్లా వ్యాప్తంగా మహిళలు నడుం బిగించి టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచి గెలిపించాలన్నారు. గుడివాడలో కొడాలి నానిని ఓడించి, ప్రజలకు మంచి పాలన అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మహిళలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పామర్రు అభ్యర్థి వర్ల కుమార్‌రాజా, అంగన్‌వాడీ డ్వాక్రా విభాగాల రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత, తెలుగు మహిళా జిల్లా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర, పొదిలి లలిత, మైనేని ఇందిర, మూల్పూర్తి కళ్యాణి, షేక్ ఆషా, చక్రాల ఉష, అనంతలక్ష్మి, సాయ పుష్పావతి, తూము పద్మజ, యార్లగడ్డ సుధారాణి, కొల్లి రమ్య, వేమూరి సుజాత, కాటూరి గంగాభవాని, పొట్లూరి రమాదేవి, మరీదు నాగలక్ష్మి, తెల్లాకుల నాగలక్ష్మి, అసిలేటి నిర్మల, బొర్రా శాంతి, యలమంచిలి సుష్మ, మాదాల సునీత, మల్లికా బేగం, నిమ్మగడ్డ శశికళ, బంటు రోజా, దివ్య చౌదరి, గుడివాడ టీడీపీ అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, కొసరాజు బాపయ్య చౌదరి, జిల్లా తెలుగు మహిళ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట సమన్వయానికి కమాండ్ కంట్రోల్ కేంద్రం

» ఫిర్యాదుల పరిష్కారంతో పాటు నివేదికల నిర్వహణ కీలకం » అవగాహనతో ఎన్నికల విజయవంతానికి కృషి చేయాలి : కలెక్టర్ ఢిల్లీరావు



ఎన్నికల అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 4 : ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందులో భాగంగా పటిష్ట సమన్వయానికి జిల్లాస్థాయి సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని (ఐసీసీసీ) ఏర్పాటు చేస్తున్నట్టు కృష్ణాజిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సోమవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఎన్నికల వ్యయ నిర్వహణ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్), ఫిర్యాదుల పరిష్కారం, నివేదికల నిర్వహణ, సోషల్ మీడియాసెల్ విధి విధానాలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ తదితరాలపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా నోడల్ అధికారులు, ఆర్వోలు, ఏఆర్వోలు, ఫయింగ్‌స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్ స్క్వాడ్స్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పర్యవేక్షణ, స్వీప్ కార్యక్రమాలు తదితరాల మధ్య పటిష్ట సమన్వయ సాధనకు కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం కీలకంగా వ్యవహరించనుందని వివరించారు. ఈ కేంద్రం విజయవంతంగా పనిచేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. సీ విజిల్, నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం (ఎన్‌జీఆర్ఎస్) తదితర మార్గాల ద్వారా వచ్చే ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించడం ఎంత ముఖ్యమో సరైన విధంగా నివేదికల్లో పొందుపరిచి సమర్పించడం కూడా అంతే ప్రధానమన్నారు. వివిధ విభాగాల కార్యకలాపాలు, నివేదికల సమర్పణలో వేగంతో పాటు ఖచ్చితత్వం కూడా కీలకమని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన యాప్, పోర్టల్ ఆధారిత ఐసీటీ వేదికలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని విధులపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకొని బృంద స్ఫూర్తితో, నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఓటర్లకు అవగాహన కల్పించడం, చైతన్యవంతులను చేసేందుకు చేపడుతున్న కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు ఇందుకు సోషల్ మీడియా వేదికలను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంసీఎంసీ, సోషల్ మీడియా సెల్ ద్వారా పెయిడ్ న్యూస్, ఫేక్ న్యూస్‌పైనా పటిష్ట పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల సమన్వయ వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి సీహెచ్.శైలజ, అదనపు డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు, డిప్యూటీ కమిషనర్ (ఐటీ) సతీష్ శర్మ, కలెక్టరేట్ ఏఓ సీహెచ్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో 108 అర్జీల నమోదు

కృష్ణలంక : స్పందనలో 108 అర్జీలు నమోదయ్యాయని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ పి.సంపత్‌కుమార్, డీఆర్వో వి.శ్రీనివాసరావులు అర్జీదారుల వినతులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో అర్జీలను అలసత్వం లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేస్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు ఏ స్థాయిలోను రీ ఓపెన్ కాకుండా ఉండాలన్నారు. అర్జీదారుల వినతులను సంబంధిత శాఖలకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, హౌసింగ్ పీడీ రజనికుమారి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

లింగ వ్యత్యాసంలేని చదువు కావాలి: వక్తలు

గవర్నర్‌పేట: పిల్లల పెంపకంలో ఆడ, మగ వ్యత్యాసం లేని చదువు ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని సామాజిక విశ్లేషకులు దేవి అన్నారు. విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్స్ అండ్ టుటోరియల్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సోమవారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదిగే ఆడపిల్ల ఏం తెలుసుకోవాలనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సేఫ్ స్వచ్ఛంద సంస్థ ఛైర్మన్ జి.జ్యోత్స్న, అసోసియేషన్ అధ్యక్షుడు వై. అమ్మాజీ, గౌరవాధ్యక్షుడు డి.కిషోర్ కుమార్, సెక్రటరీ షేక్ షరీఫ్ ఉన్నీసా, ట్రెజరర్ ఉషారాణి, కమిటీ సభ్యులు, ప్రోగ్రామ్ కమిటీ ఛైర్మన్ డి.జోసీకుమారి పాల్గొన్నారు.

కెమెరామెన్‌పై దాడి

సత్యనారాయణపురం, మార్చి 4: 'వైసీపీ నేత కబ్జా కాండ' అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తను చూసిన ఓ ప్రముఖ చానల్ విలేకరి, కెమెరామెన్‌పై వైసీపీ నేత అనుచరులు సోమవారం దాడి చేసినట్టు తెలుస్తోంది. వైసీపీ నేతపైన ఆరోపణలు చేసిన బాధితుడి వద్ద వివరాలు తెలుసుకున్న విలేకరి, సంబంధిత స్థలం వద్ద చిత్రీకరించడానికి వచ్చిన కెమెరామెన్‌పై దాడి చేసినట్టు తెలిసింది. సీఐ వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కెమెరామెన్, బాధితుడు, ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదు.

భోజనంపై ఈవో అభిప్రాయ సేకరణ

వన్‌టౌన్: దుర్గగుడిలోని అన్నదాన, పలు విభాగాల్లో ఈవో రామారావు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. నిత్యాన్నదాన విభాగంలో అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తుల నుంచి అభిప్రాయాలను తీసుకున్నారు. వడ్డించిన కూరలు, చట్నీ, సాంబారు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. భక్తులకు మరింత మెరుగైన విధానంలో అన్నప్రసాద వితరణ జరగాలని సూచించారు.

టీడీపీ బీసీ డిక్లరేషన్ కమిటీలో మహేష్‌కు చోటు

వన్‌టౌన్: తెలుగుదేశం పార్టీ బీసీ డిక్లరేషన్ కమిటీలో జనసేన అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేష్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు 19 మందితో కూడిన కమిటీని నియమించారు. వీరిలో పోతిన మహేష్‌కు స్థానం కల్పించారు. మహేష్ స్పందిస్తూ తనను బీసీ డిక్లరేషన్ కమిటీలో నియమించినందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నవితరణకు విరాళాలు

వన్‌టౌన్: హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన లక్కిరెడ్డి సుధ, ఆమె కుటుంబ సభ్యులు సోమవారం ట్రస్టుబోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి దివంగత సుచరిత పేరిట అన్నవితరణకు రూ.లక్ష విరాళం అందజేశారు. కొండాపూర్‌కే చెందిన మరో భక్తుడు పర్వతరెడ్డి తేజదీప్ ఆలయాధికారులను కలిసి గుడిలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాతలకు అమ్మవారి దర్శనం కల్పించి శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు అందజేశారు.

31న దివ్యక్షేత్ర రైలు యాత్ర

ధర్నాచౌక్: ఇండియన్ రైల్వే మొదటి ప్రైవేట్ ప్రీమియం టూరిస్టు ట్రైన్ దివ్యక్షేత్ర యాత్ర ఈనెల 31న ప్రారంభమవుతుందని ప్రొడక్ట్ మేనేజర్ విగ్నేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూరీ, కోణార్క్, భువనేశ్వర్, కోల్‌కత్తా, గయా, కాశీ, అయోధ్య, ప్రయాగరాజ్‌ను సందర్శించవచ్చన్నారు. మార్చి 31న గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, విజయవాడ మీదుగా ప్రయాణిస్తుందన్నారు. ఒకొక్కరికి టికెట్ ధర రూ.23,750గా నిర్ణయించామన్నారు. వివరాలకు 78761 01010 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మముల్ని విధుల్లోకి తీసుకొని మా కుటుంబాలకు ఆదుకోండి

మాజీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్

ధర్నాచౌక్, మార్చి 4: ముందస్తు నోటీసులివ్వకుండా తమను విధుల నుంచి తొలగించారని పలువురు మాజీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమను తిరిగి విధుల్లోకి తీసుకుని తమ కుటుంబాలను ఆదుకోవాలని సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఏపీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్ సివిలియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.చిట్టిబాబు మాట్లాడారు. 2020 జనవరిలో ఏపీ స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ సివిలియన్‌గా 2156 మందిని తీసుకున్నారని, చెక్‌పోస్టుల్లో అక్రమ మద్యం, ఇసుక, గంజాయి స్వాధీనం చేసుకునే విధులను నిర్వహిస్తూ ఎస్ఈబీ డిపార్టుమెంట్‌కు అనుబంధంగా పని చేశామన్నారు. తమను మరలా విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, డీజీపీ, ఉన్నతాధికారులను కలిసినా ఫలితం లేదని వాపోయారు.

ప్రియురాలి భర్త దారుణ హత్య

ఎ.కొండూరు: వివాహితతో అక్రమ సంబంధం పెట్టుకుని తమకు అడ్డుగా ఉన్నాడని ప్రియురాలి సహకారంతో ఆమె భర్తను బండరాయితో కొట్టి చంపిన ఘటన ఎ.కొండూరు చైతన్యనగర్ సమీపంలో జరిగింది. చైతన్యనగర్‌కు చెందిన పమిడిముక్కల జగదీష్ (42) గిరిజన మహిళ భూక్యా పార్వతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇటీవల జగదీష్ భార్య పార్వతి చీమలపాడుకు చెందిన షేక్ ఖలీల్ (24)తో వివాహేతర సంబంధం పెట్టుకుని భర్తను హత్య చేయాలని పథకం పన్నింది. దీంతో ప్రియుడు ఖలీల్ ఆదివారం రాత్రి జగదీష్‌ను అడవిలోకి తీసుకెవెళ్లి మద్యం తాగించి బండరాయితో తలపై కొట్టి హత్య చేశాడు.పోలీసులు కేసు నమోదు చేశారు.

కామన్ సైట్లపై కన్ను

(3వ పేజీ తరువాయి)

అయితే, ఇటీవల మరో రెండు స్థలాలపై స్థానికంగా రాజకీయ పలుకుబడి ఉన్న ఇద్దరు ఆక్రమించాలని నిర్ణయించారు.

రూ.40 లక్షల పైమాటే..

64వ డివిజన్ కండ్రిక కాలనీలో కబ్జాకు గురవుతున్న రెండు ప్రభుత్వ స్థలాల (సుమారు 100 గజాలు) విలువ రూ.40 లక్షల పైమాటే. కాలనీలోని 1097 నెంబరు ఇంటికి ఆనుకుని ఉన్న సదరు స్థలాలు ఖాళీగా కనిపిస్తుండటంతో కబ్జాదారులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. రెండు స్థలాల్లో ఒక దానికి ఓ మహిళ పేరుతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినట్టు తెలిసిం ది. ప్రభుత్వ స్థలానికి పక్కనే ఉన్న 1097 ఇంటి నెంబరు ఆధారంగా 1097/ఏ నెంబరుతో నకిలీ డా క్యుమెంట్లు సృష్టించి స్థానిక ప్రజాప్రతినిధి భర్త అండతో త్వరలో నిర్మాణాలు చేపట్టాలని చూస్తున్నారు.

ఖాళీ స్థలానికి విద్యుత్ మీటరు..!

కబ్జాకు గురవుతున్న స్థలాలు ప్రభుత్వానికి చెందినవని కాలనీలో ఎవరిని అడిగినా చెబుతారు. అలాంటి స్థలానికి పాయకాపురం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ మీటరును ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా స్థలం డాక్యుమెంట్లు పక్కాగా ఉండి, ఇంటి నిర్మాణం జరిగి, పన్ను ఉన్న ఇళ్లకే విద్యుత్ శాఖ మీటర్లను ఇవ్వాల్సి ఉంటుంది. వీటిల్లో ఏ ఒక్కటి లేకపోయినా ఒప్పుకోరు. అయితే, చిన్నపాటి లొసుగులను అడ్డం పెట్టుకుని అధికారులు నకిలీ లింక్ డాక్యుమెంట్ పత్రాల ఆధారంగా ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలానికి విద్యుత్ మీటరు ఇచ్చేశారు. ఖాళీ స్థలానికి, అందునా ప్రభుత్వ స్థలానికి ప్రైవేట్ వ్యక్తుల పేరుపై విద్యుత్ మీటరు ఇచ్చిన విద్యుత్ శాఖ అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

గతంలో ఆక్రమణలు తొలగించిన చోటే..

ఏడేళ్ల క్రితం ఇదే స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. పాకలను కూడా ఏర్పాటు చేశారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇంటి పన్నుల కోసం ప్రయత్నిస్తున్న సమయంలో అప్పటి టౌన్‌ప్లానింగ్ అధికారులు సకాలంలో స్పందించి ఆక్రమణలను తొలగించారు. తిరిగి ఏడేళ్ల తరువాత అదే వ్యక్తులు వైసీపీ ప్రజాప్రతినిధి భర్త అండతో వళ్లీ కబ్జాకు తెరలేపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కండ్రిక కాలనీలోని ప్రభుత్వ మిగులు స్థలాలను స్థానిక అవసరాల నిమిత్తం వినియోగించాలని, ప్రభుత్వ స్థలాలని బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జగన్‌ను ఓడిస్తేనే పంచాయతీలకు మనుగడ

కలెక్టరేట్ వద్ద ధర్నాలో వైవీబీ

మచిలీపట్నం టౌన్, మార్చి 4 : జగన్‌ను ఓడిస్తేనే నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలకు మనుగడ అని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ చాంబర్స్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ అన్నారు.రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం, పంచాయతీ చాంబర్స్ పిలుపు మేరకు మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద సోమవారం వైవీబీ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నేతలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి నిరసనగా రానున్న ఎన్నికల్లో జగన్‌ను ఓడించేందుకు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల సర్పంచ్‌లు ముందుకు రావాలన్నారు. మరో దారిలేక ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు. 'జగన్ ఓడితేనే మనకు మనుగడ' నినాదంతో పట్టుదలతో పనిచేయాలన్నారు.



రాష్ట్రంలో గాడి తప్పిన విద్యావ్యవస్థ

» నాగశ్రావణ్‌కు షరీఫ్ సంఘీభావం

విద్యాధరపురం, మార్చి 4 : రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడి తప్పిందని శాసనమండలి మాజీ చైర్మన్ ఎండీ షరీఫ్ అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరవధిక దీక్ష చేస్తున్న కిలారు నాగ శ్రావణ్‌కు ఆయన సంఘీభావం తెలిపారు. దీక్ష సోమవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు పెండింగ్ ఫీజులందక ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్యార్థులను, యువతను జగన్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. చిన్న వయస్సు అయినా నాగశ్రావణ్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి నిరవధిక దీక్ష చేయడం సాహసోపేత చర్యన్నారు. టీడీపీ విశాఖ ఇన్‌చార్జి మార్గాని భరత్ మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పెండింగ్ బకాయిలు, ఫీజులు విడుదల చేయాలన్నారు. జీవో 77ను ఎత్తివేయాలన్నారు. టీడీపీ బొప్పన భవకుమార్, అనుబంధ సంఘాల నేతలు మద్దతు పలికారు.



ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న వెంకటరావు

పోరంకిలో యూనియన్ బ్యాంక్ మెగా రీటైల్ ఎక్స్‌పో

భవానీపురం, మార్చి 4: పోరంకిలోని ద్వారకారెసిడెన్సీ వద్ద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ (మచిలీపట్నం) ఆధ్వర్యంలో మెగా రీటైల్ ఎక్స్‌పో-2024ను సోమవారం నిర్వహించారు. విజయవాడ డిప్యూటీ జోనల్ హెడ్‌లు మురళీ పార్థసారథి, శారదామూర్తి, రీజనల్ హెడ్ వెంకటరావు పాల్గొని ఎక్స్‌పోను ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు అభివృద్ధికి సహాయం చేసిన బిల్డర్స్, డీలర్స్ ముఖ్య ఖాతాదారులకు ధన్యవాదాలు తెలిపారు. రీజనల్ హెడ్ వెంకటరావు మాట్లాడుతూ గృహరుణాలు, వాహన రుణాలు అతి తక్కువ వడ్డీతో త్వరగా మంజూరు చేస్తామని, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మెగా రీటైల్ ఎక్స్‌పోకు లోకల్ బిల్డర్స్, కార్ డీలర్స్, ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్, విజయవాడ లోకల్ బ్రాంచి మేనేజర్స్, రీజనల్ ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల వాక్‌థాన్

లబ్బీపేట: అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం వాక్‌థాన్ నిర్వహించారు. బందరు రోడ్డులోని ఎ కన్వెన్షన్ నుంచి ఈ వాక్‌థాన్‌లో 200 మంది బ్యాంక్ ఉద్యోగులు పాల్గొనగా బందరు రోడ్డులో నిర్వహించారు. డిప్యూటీ జోనల్ హెడ్ ఎ.శారదామూర్తి మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మహిళా ఉద్యోగులను కెరీర్ మార్గంలో మరింత ఒప్పంద బాధ్యతలు చేపట్టేలా ప్రోత్సహించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మురళీ పార్థసారథి, ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

ఐటీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడిగా చిరుమామిళ్ల

వన్‌టౌన్, మార్చి 4 : టీడీపీలో ఇంటర్నెట్ విభాగం (ఐటీడీపీ) విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడిగా చిరుమామిళ్ల కృష్ణారావును నియమించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నందిగామ నియోజకవర్గానికి చెందిన చిరుమామిళ్ల కృష్ణారావును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటుగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన బుగత రవితేజను విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

గణితశాస్త్ర అధ్యయనంతోనే ఆర్థిక పురోభివృద్ధి

గుణదల, మార్చి 4: గణితశాస్త్ర అధ్యయనంతో సమాజంలో ఆర్థిక పురోభివృద్ధి సాధ్యపడుతుందని ప్రొఫెసర్ కుంచెం శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక ఆంధ్రా లయోల కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ ణితశాస్త్ర సదస్సు సోమవారం జరిగింది. కర్నాటకలోని మణిపాల్ విశ్వవిద్యాలయం గణితశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ కుంచెం శ్యామ్ ప్రసాద్ విచ్చేసి గణితశాస్త్రానికి కృత్రిమ మేధస్సుకున్న అనుబంధాన్ని వివరించారు. వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు బి.డి.సి.ఎన్. ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ నగాయ రాజ్, ప్రిన్సిపాల్ పాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ కిరణ్ కుమార్, కళాశాల గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పరుచూరి వేణుగోపాలరావు, అనురాధ, తబిత, హెప్సిబ్యాలా, నాగకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు మానవ హక్కుల కమిషన్ పర్యటన

● ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ ఢిల్లీరావు

కృష్ణలంక, మార్చి 4: జాతీయ మానవ హక్కుల కమిషన్ క్యాంపు సిట్టింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసి సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఈనెల 6న ఉదయం జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని బృందం నిర్వహించే క్యాంపు సిట్టింగ్‌కు నగరంలోని లబ్బీపేట పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చేపడుతున్న ఏర్పాట్లను సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్రానికి సంబంధించి కేసుల విచారణకు క్యాంపు సిట్టింగ్ నిర్వహించనున్నదన్నారు. కేసులను విచారణకు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్‌మిశ్రా, డీఎం మూలే, రాజీవ్ జైన్, విజయభారతి సయాని హాజరుకానున్నారన్నారు. పౌరసమాజ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మానవ హక్కుల పరిరక్షకుల ప్రతినిధులతో కమిషన్ సమావేశం నిర్వహిస్తుందన్నారు. రాష్ట్ర అధికారులు హాజరుకానున్నారన్నారు. 6న ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు క్యాంపు సిట్టింగ్‌లో కేసుల బహిరంగ విచారణ, మధ్యాహ్నం 12.30 నుంచి 3.30 గంటల వరకు సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ పౌర సమాజ సంస్థలు (సీఎస్‌వోలు), స్వచ్ఛంద సంస్థలు (ఎన్జీవోలు), హ్యూమన్‌రైట్స్ డిఫెండర్స్ (హెచ్‌ఆర్‌డీ)తో ముఖాముఖీ, అనంతరం 3.30 నుంచి 4 గంటల వరకు పాత్రికేయుల సమావేశం నిర్వహిస్తారని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనలో సబ్ కలెక్టర్ బీహెచ్ భవానీ శంకర్ ఉన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

పారామిలటరీ దళాల కవాతు

విద్యాధరపురం, మార్చి 4: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శాంతి భ ద్రతలను పరిరక్షించడానికి, ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు భరోసా కల్పిస్తూ అప్పుడే పారామిలటరీ దళాలు రంగ ప్రవేశం చేశాయి, ఈక్రమంలో సోమవారం భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలోని గొల్లపూడిలో పారామిలటరీ దళాలు, విజయవాడ పోలీసులు కవాతు నిర్వహించాయి, అప్పుడే పారామిలటరీ బలగాలు రావడంతో ఎన్నికల తేదీలు కూడా దగ్గర్లోనే ఉన్నాయని స్థానికులు చెప్పుకుంటున్నారు.



కవాతు చేస్తున్న పారామిలిటరీ బలగాలు

'టీడీపీ జయహో బీసీ' జయప్రదం చేయండి

● రజక చైతన్య సేవా సంస్థ చైర్మన్ కాకినాడ రామారావు

గవర్నర్‌పేట, మార్చి 4: టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా నిర్వహించే జయహో బీసీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రజక చైతన్య సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కాకినాడ రామారావు పిలుపునిచ్చారు. సోమవారం దుర్గాపురంలో సేవా సంస్థ కార్యాలయంలో జరిగిన సంస్థ ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించిన టీడీపీ బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తెస్తామని మిని మేనిఫెస్టోలో ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. జయహో బీసీ సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బీసీ డిక్లరేషన్ ప్రకటిస్తారని తెలిపారు. రజక సోదరులు, వృత్తిపరంగా, సామాజిక పరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ద్వారా సభలో చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. సభకు రాష్ట్ర వ్యాప్తంగా, ముఖ్యంగా కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి రజక సోదరులు పెద్ద ఎత్తున తరలివచ్చేలా చూడాలని సంస్థ సభ్యులకు పిలుపునిచ్చారు. విజయవాడ రజక చైతన్య సేవా సంస్థకు చెందిన జిల్లా, విజయవాడ అర్బన్ నుంచి సతివాడ రాము, కాటూరి శివశంకర ప్రసాద్, వాల్తేరు దుర్గాప్రసాద్, గాతలవలస మురళీ, గజ్జలకొండ నాగరాజు, భీమవరపు కోటేశ్వరరావు, ఊడిగ శ్రీనివాస్, ఆదుర్తి పెద్దిరాజు పాల్గొన్నారు.



రజక చైతన్య సేవా సంస్థ ముఖ్యుల సమావేశంలో పాల్గొన్న అధ్యక్షుడు కాకినాడ రామారావు

అజిత్‌సింగ్‌నగర్: టీడీపీ ఆధ్వర్యంలోమంగళవారం తలపెట్టిన బీసీ డిక్లరేషన్‌కు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు కోరారు. బీసీ డిక్లరేషన్ కార్యక్రమ విషయమై సెంట్రల్ బీసీ నాయకులతో సోమవారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ బీసీ అంటే బాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్ బోన్ క్యాస్ట్ అని నమ్మిన పార్టీ టీడీపీ అని పేర్కొన్నారు.

ఫ్యాన్‌కు ఓటేస్తే ఉరేసుకున్నట్లే

భవానీపురం, మార్చి 4 : ఐదేళ్ల వైసీపీ పాలన ప్రజల జీవితాలను చీకటిమయం చేసింద ని, ఈ సారి ఫ్యాన్‌కు ఓటేస్తే ఉరేసుకున్నట్లేనని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేశ్ సతీమణి విజయలక్ష్మి అన్నారు. 43వ డివిజన్ జనసేన అధ్యక్షుడు జెల్లి రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి రాబోయే మన జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో ఊర్మిళానగర్‌లో తిరిగి ఆమె ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన-టీడీపీ కూటమిని అధికారంలోకి తీసుకురావడనికి జన సైనికులు కష్టపడి పనిచేయాలని, పవన్ కల్యాణ్ ప్రజల కష్టాలను చూడలేకే రాజకీయాల్లోకి వ చ్చారని, జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు అందరూ కృషి చేయాలన్నారు.



ఊర్మిళానగర్‌లో పోతిన విజయలక్ష్మి

పాతరాజరాజేశ్వరి పేట: స్థానిక 35వ డివిజన్ పెజ్జోనిపేటలోని పలు వీధుల్లో సోమవారం డివిజన్ పార్టీ ప్రెసిడెంట్ ఎస్ఎస్ ప్రదీప్ రాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి రాబోయే జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో జనసేన పశ్చిమ ఇన్‌చార్జ్ పోతిన మహేశ్ కుమార్తె పోతిన చంద్రకీర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంలో ఇంటింటికీ తిరిగి పార్టీ కరపత్రాలు అందజేస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యువత భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే జనసేన- టీడీపీ కూటవికి ఓటు వేయాలని, పోతిన మహేశ్‌కు కూడా మద్దతుగా నిలవాలని కోరారు. నాయకులు నవీన్‌రాజ్, సుమన్ నాయక్, చంటి, దాము, ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తపేట హనుమంతరాయ మార్కెట్‌లో షాపులు సీజ్

వన్‌టౌన్, మార్చి 4: కొత్తపేట చేపల మార్కెట్‌కు అనుబంధంగా ఉన్న హనుమంతరాయ మార్కెట్‌లో కొన్ని షాపుల వారు చాలాకాలం పాటు అద్దెలు చెల్లించకపోవడంతో సోమవారం వీఎంసీ అధికారులు, సిబ్బంది ఆయా షాపులకు సీళ్లు వేశారు. అద్దె బకాయిల గురించి 'ఆంధ్రజ్యోతి'లో ఇటీవల వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. హనుమంతరాయ మార్కెట్‌లో కేటాయించిన షాపులలో వ్యాపారాలు చేసుకుంటూ ఇక్కడ అద్దెలను చెల్లించడంలో వ్యాపారులు తీవ్ర నిర్లక్ష్యం చేశారు. దీంతో సుమారు రూ.50లక్షల మేరకు బకాయిలు పేరుకుపోయాయి. షాపుల వారికి మూడు దఫాలు నోటీసులిచ్చినప్పటికీ స్పందన కనిపించలేదు. దీంతో వీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. షాపులను సీజ్ చేశారు. మరోవైపు అధికార పార్టీ నాయకులు ప్రమేయంతో కొన్ని షాపులకు సీలు వేయకుండా వదిలిపెట్టారు.

స్పందనలో 12 అర్జీలు

చిట్టినగర్, మార్చి 4: స్పందనలో వచ్చే సమస్యల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం నగరపాలక సంస్థ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్పందన నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 12 అర్జీలు వచ్చాయి. సమస్యలను ఆయా విభాగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను సూచించారు. అదనపు కమిషనర్ ప్రాజెక్ట్ కె.వి. సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాయకాపురం, మార్చి 4 : ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం పైపులరోడ్డు ప్రాంతానికి చెందిన దగ్గుల నాగేశ్వరరావు(43) వాంబేకాలనీలోని బంధువుల ఇంట్లో ఆదివారం వేప చెట్టు నరుకుతుండగా ప్రమాదవశాత్తూ కిందపడి గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం బంధువులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిగరెట్ ఇవ్వలేదని దాడి

● ఇద్దరిపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 4 : సిగరెట్ ఇవ్వలేదని ఒకరిపై దాడి చేసిన ఇద్దరిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం బుడమేరు మధ్య కట్ట ప్రాంతానికి చెందిన వేల్పూరి ఏసు ఆదివారం విధులు ముగించుకుని ఇంటికి వెళ్తూ మార్గ మధ్యంలో బుడమేరు వంతెన వద్ద ఆగాడు. పక్కనే ఉన్న బార్‌లో మద్యం కొనుగోలు చేసి ఆ పక్కనే బడ్డీకొట్టు వద్ద సిగరెట్ కొనేందుకు వెళ్లాడు. ఇంతలో మద్యం మత్తులో అక్కడికి వచ్చిన బాషా, హరీష్‌లు కలిసి ఏసును సిగరెట్ అడిగారు. అతను నిరాకరించడంతో ఇద్దరు కలసి రాయితో దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

కేశినేని చిన్ని, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా

చిట్టినగర్, మార్చి 4: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని), బుద్దా వెంకన్న, నాగుల్‌మీరాలు అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రస్తుతం ఉన్న పథకాలతోపాటు మరిన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం టీడీపీ నాయకుడు గుర్రం కొండ ఆధ్వర్యంలో కేఎల్.రావు పార్కు రోడ్డులో 46, 47 డివిజన్లకు చెందిన 200 మంది టీడీపీలో చేరారు. వారికి శివనాథ్, వెంకన్న, నాగుల్‌మీరాలు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడ మూడు నియోజకవర్గాల్లో పశ్చిమలో టీడీపీ అన్ని విధాలుగా బలంగా ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలన్నా చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. బుద్దా వెంకన్న మాట్లాడుతూ చిన్ని ఎంపీగా తప్పక విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాగుల్‌మీరా మాట్లాడుతూ కేశినేని చిన్ని పేదలకు చేస్తున్న మంచి పనులు, సేవలే అతన్ని గెలిపిస్తాయన్నారు. అనంతరం కేశినేని ఫౌండేషన్ పేదలకు కూరగాయల బండ్లు, మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు కామా దేవరాజ్, నాగోతి రామారావు, 46వ డివిజన్ అధ్యక్షుడు ప్రభుదాస్, పరిశపోగు వెంకటేశ్వరరావు, పత్తి నాగేశ్వరరావు, ఎస్.కె. కాజా, పోతినేడి లోకేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశినేని శివనాథ్(చిన్ని), పక్కనే బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా

ఇస్త్రీ పెట్టెలు, తోపుడు బండ్లు పంపిణీ

వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గం 52వ డివిజన్ పరిధి మల్లికార్జునపేటలో రజకులకు ఇస్త్రీ పెట్టెలు, చిరువ్యాపారులకు తోపుడు బండ్ల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివనాథ్, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు తదితర నాయకులతో కలిసి తోపుడు బండ్లు, ఇస్త్రీ పెట్టెలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో శివనాథ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. పేదలు స్వయం ఉపాధి పొందేందుకు చిన్ని చేస్తున్న సహకారం మరువలేనిదన్నారు. నాగుల్‌మీరా మాట్లాడుతూ శివనాథ్ సేవా కార్యక్రమాలను కొనియాడారు. జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

పాయకాపురం : 61వ డివిజన్ వైసీపీకి చెందిన కార్యకర్తలు, అభిమానులు సోమవారం టీడీపీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో బొండా ఉమామహేశ్వరరావుతో సమావేశమయ్యారు. మెరుగుమాల సాంబశివరావుతో పాటు 75 మందికి బొండా ఉమా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. దాసరి కనకారావు, దుర్గారావు, పైడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణపురం: బొండా ఉమా రావాలి-సెంట్రల్ గెలవాలి అనే నినాదంతో 31వ డివిజన్‌లో సోమవారం బొండా సిద్ధార్థ టీచర్స్‌కాలనీ ఒకటవ లైన్ నుంచి నుంచి పాదయాత్ర నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో సైకో పాలన అంతం అవుతుందని ,రామరాజ్యం రాబోతుందన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ సుపర్‌సిక్స్ కార్యక్రమాలు ఇంటింటికీ తీసుకు వెళతామన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకుడు బొండా ఉమా అన్నారు. మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, సంధిరెడ్డి గాయత్రి, డివిజన్ అధ్యక్షుడు పడమటి రామకృష్ణ, దెందుకూరి మురళీకృష్ణంరాజు, బాబి, కోలా దుర్గారావు, జనసేన, స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొండా ఉమా

వాంబేకాలనీలో బాబు ష్యూరిటీ...

అజిత్‌సింగ్‌నగర్: 60వ డివిజన్ వాంబేకాలనీలో బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బొండా ఉమా తనయుడు బొండా సిద్ధార్థ టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను స్థానిక ప్రజలకు వివరించారు. కార్పొరేటర్ కంచి దుర్గ, ధనశేఖర్, సుబ్బలక్ష్మీ పాల్గొన్నారు.

పాయకాపురం : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపుతోనే రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు రానున్నాయని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు, పరుచూరి ప్రసాద్‌లు పేర్కొన్నారు. 64వ డివిజన్ కండ్రిక కాలనీలో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ జరిగింది. ఈ కార్యక్రమంలో వారు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు.

టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం

● జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ



ప్రజలకు పథకాలను వివరిస్తున్న గద్దె అనురాధ

పటమట, మార్చి 4 : వైసీపీని అధికారం పీఠం నుంచి దించి టీడీపీ-జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకు రావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ చెప్పారు. తూర్పు పరిధిలోని 12వ డివిజన్ సంజయ్ గాంధీ కాలనీలో సోమవారం అనురాధ, కుమారుడు గద్దె క్రాంతితో కలిసి ఎన్నికల ప్రచా రంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను, ఎంపీగా కేశినేని చిన్నికి ఓట్లు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. గద్దె క్రాంతి మాట్లాడుతూ రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు రావాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు శాయన బుజ్జి, సాయిబాబు, మేదరమెట్ల నారాయణ, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, జక్కుల సుబ్బారావు, కామినేని రవిలు పాల్గొన్నారు.

బొల్లా మాల్యాద్రి చౌదరికి ఘన నివాళి

విద్యాధరపురం, మార్చి 4: టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రకాశం జిల్లా పామూరు మాజీ జడ్పీటీసీ బొల్లా మాల్యాద్రి చౌదరి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బయ్య ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు సమర్పించారు. వృద్ధులకు పిల్లలకు, మురికార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. గాడు గణేష్, గంగవరపు సురేష్, నారాయణ, శ్రీనివాసరావు, రాము, దేవినేని మాలకొండయ్య, సీనియర్ నాయకులు, కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న సుబ్బయ్య

మహిళా సాధికారతకు, అభివృద్ధికి బీజేపీ పెద్దపీట

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ

వన్‌టౌన్, మార్చి 4: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం మహిళా సాధికారతకు, అభివృద్ధికి పెద్ద పీట వేసిందని, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివన్నారాయణ అన్నారు. బీజేపీ మహిళా మోర్చా జాతీయ పార్టీ ఆదేశాల మేరకు సోమవారం కేబీఎన్ కళాశాల నుంచి 2 కే వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఇంకా అనేక పథకాలతో పాటు ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి మహిళాభివృద్ధికి కృషి చేస్తూ మహిళా సాధికారితను కల్పిస్తోందన్నారు. పార్టీ అధికార ప్రతినిధి సాదినేని యామిని, అడ్డూరి శ్రీరామ్, యర్రా సునీత, లక్ష్మి, బొమ్మదేవర రత్నకుమారి, ఇంకా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను ఏపీ రాజధానిగా కొనసాగించాలంటూ వైసీపీ కొత్త నాటకం

పెనమలూరు: అధికారంలోకి వచ్చి ఐదేళ్ల కాలం దాటినా రాజధానిని ఏర్పాటు చేయలేక ఆపసోపాలు పడుతూ తిరిగి హైదరాబాద్‌ను రాజధానిగా కొనసాగించాలంటూ వైసీపీ నాయకుల కొత్త నాటకాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారని బీజేపీ నేత డాక్టర్ కిలారు దిలీప్ విమర్శించారు. సోమవారం బీజేపీ ప్రజాపోరు యాత్రలో భాగంగా సెంట్రల్ బస్టాండ్ సమీపంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాజాధానిని అభివృద్ధి చెయ్యలేని అసమర్థ జగన్ ప్రభుత్వం తిరిగి హైదరాబాద్‌ను రాజధాని అంటూ కారుకూతలు కుయ్యడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుగూ బీజేపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీని సపోర్టు చెయ్యాలని కోరారు.



నారీ శక్తివందన్, మారథాన్‌లో సాదినేని యామిని, బిట్ర శివన్నారాయణ తదితరులు

పోలీసుల స్ట్రీట్‌వాక్

సత్యనారాయణపురం మార్చి 4: సత్యనారాయణపురం పోలీసు స్టేషన్ పరిధిలోని సత్యనారాయణపురం, బావాజీపేట, బీఆర్టీఎస్ రోడ్డు, రామకోటి మైదానం ప్రాంతాలలో సోమవారం సాయంత్రం స్ట్రీట్‌వాక్ ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న తోపుడుబండ్లను తీయించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీ కాలనీలో, వీధిలో గుర్తు తెలియన వ్యక్తులు ఎవరైనా సంచరించినట్లయితే వెంటనే 100కు కాల్ చేయాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. సీఐ వెంకటనారాయణ, ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.



గయాజుద్దీన్ ప్రజాయాత్ర

భవానీపురం, మార్చి 4 : జనసేన నగర అధికార ప్రతినిధి, ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాజుద్దీన్(ఐజా) ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి 41వ డివిజన్‌లోని దళితవాడలో సోమవారం ప్రజాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గయాజుద్దీన్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. తనకు పశ్చిమలో పోటీచేసే అవకాశం లభించవచ్చునన్న ఆశాభావంను గయాజుద్దీన్ వ్యక్తం చేశారు. సీనియర్ జనసేన నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట పాల్గొన్నారు.

వైసీపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి: జలీల్

ధర్నాచౌక్, మార్చి 4: రాబోయే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ జలీల్ ప్రజలకు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమ పథకాలను రద్దు చేసి వారి హక్కులను సీఎం జగన్ కాలరాసారని ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజరవర్గాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు లోక్‌సభ సభ్యులను ప్రకటించారు. తమ లాంటి పార్టీలను టీడీపీ- జనసేన కూటమిలో కలుపుకోవాలన్నారు.

10 లోగా జీతాలు చెల్లించకుంటే ప్రత్యక్ష ఆందోళన

ధర్నాచౌక్, మార్చి 4: యోగా ఇన్‌స్పెక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని , జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కీ లెనిన్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాసరిభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న యోగా ఇన్‌స్పెక్టర్లకు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఏడాది నుంచి బుద్ద యోగ హెల్త్ ఫౌండేషన్ సంస్థ వీరికి జీతాలు ఇవ్వకుండా అగిడిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారన్నారు. ఈ నెల 10 లోగా జీతాలు చెల్లించకపోతే ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. సంఘం నగర కార్యదర్శి లంక గోవిందరాజులు, బాధితులు వెంకటయ్య, మల్లేశ్వరి, సునీత, గొల్ల బాబ్జీ, అరుణ విమల, సంతోష్, అరుణపద్మ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీటీపీఎఫ్ నూతన అధ్యక్షుడిగా డానియల్ పోలిమెట్ల

ధర్నాచౌక్, మార్చి 4: విజయవాడ టీమ్ పాస్టర్స్ ఫెలోషిప్ (వీటీపీఎఫ్) నూతన అధ్యక్షుడిగా డానియల్ పోలిమెట్ల నియమితులయ్యారు. ఆల్ ఇండియన్ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో వీటీపీఎఫ్ కమిటీ సమావేశం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ కమిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. వాసు కాలేబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో క్లాప్ అండ్ వీటీపీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ దైవప్రకాష్, ఏఐసీఎఫ్ ప్రధానకార్యదర్శి రెవ. కే.జయసింగ్, రాజనాల జేమ్స్, విజయవాడ పాస్టర్స్ , క్లాప్ అండ్ వీటీపీఎఫ్ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డానియల్ పోలిమెట్లను ఘనంగా సత్కరించారు.



అభి, మహీ మళ్లీ కలిశారు!

మన్మథుడు సినిమాలో కలసి నటించిన నాగార్జున, అన్షు అంబానీ మళ్లీ కలిశారు. ఆ చిత్రంలో తన అందంతో అభి మనసునే కాదు ప్రేక్షకులనూ ఆకట్టుకున్నారు అన్షు. 'మన్మథుడు' చిత్రం తర్వాత ప్రభాస్ సరసన 'రాఘవేంద్ర' సినిమాలో కూడా నటించి ఆ తర్వాత తెర మరుగయ్యారు. సచిన్ సాగర్ అనే బిజినెస్ మ్యాన్‌ను పెళ్లి చేసుకుని సినిమాలకు శాశ్వతంగా గుడ్ బై చెప్పేశారు. అప్పుడు అలా మాయమైన అన్షు మళ్లీ ఇప్పుడు హఠాత్తుగా హైదరాబాద్‌లో ప్రత్యక్షమైంది. స్నేహితులను కలుసుకోవడానికి వచ్చిన అన్షు అనుకోకుండా ఓ పార్టీలో నాగార్జునని కలసింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని అన్షు అంబానీ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. బ్లాక్ డ్రెస్‌లో ఉన్న ఇద్దరి ప్రస్తుత ఫొటోను, మన్మథుడు సినిమాలోని ఫొటోను అన్షు షేర్ చేసింది. "22 ఏళ్ల తర్వాత నా కో-స్టార్ నాగార్జునను కలుసుకోవడం ఎంతో సర్‌ప్రైజింగ్‌గా ఉంది. మన్మథుడు సినిమా సెట్‌లో ఎంత హుషారుగా ఉన్నారో ఇప్పటికీ అంతే హుషారుగా ఆయన ఉన్నారు. ఈ మూమెంట్ ఎంతో ప్రత్యేకమైనది" అని పోస్ట్‌లో పేర్కొంది.



రాజమౌళి, మహేశ్ చిత్రం ఎప్పటినుంచి అంటే...!



దర్శక ధీరుడు రాజమౌళితో చేయబోయే యాక్షన్ అడ్వంచర్ చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు మహేశ్ బాబు. ఇందుకోసం తన లుక్‌ను కూడా సరికొత్తగా మార్చుకున్నారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ చిత్రం గురించి ఆయన అప్‌డేట్ ఇచ్చారు. అందరిలానే తానూ రాజమౌళితో చేసే చిత్రం షూటింగ్ ప్రారంభం కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, త్వరలోనే షూటింగ్ ప్రారంభం అవుతుందని వెల్లడించారు. ప్రొఫెషన్‌ను, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడం కత్తి మీద సాము లాంటిదని మహేశ్ అన్నారు. తన రీసెంట్ రిలీజ్ 'గుంటూరు కారం' చిత్రంపై ప్రేక్షకులు చూపిన ఆదరణ ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తన జీవితాన్ని మార్చేసిన మూడు సినిమాల గురించి మహేశ్ ప్రస్తావించారు. 'మురారి', 'పోకిరి', 'శ్రీమంతుడు' చిత్రాలు ప్రేక్షకుల ముందు తనను సరికొత్తగా ఆవిష్కరించాయని తెలిపారు. తాను నటించే చిత్రాలకు అంగీకారం తెలిపేముందు పాత్ర, నైతిక విలువలను దృష్టిలోకి తీసుకుంటానని అన్నారు. ఒకసారి చిత్రానికి సైన్ చేశాక దర్శకుడి విజన్ ప్రకారమే ముందుకెళ్తానని తెలిపారు.

తలైవా సెట్స్‌లోకి భల్లాలదేవ



రజనీకాంత్ మూవీ సెట్స్‌లోకి రానా దగ్గుబాటి అడుగుపెట్టారు. 'జైలర్' చిత్రం హిట్ అయినా, ఆ తర్వాత వచ్చిన 'లాల్ సలామ్' సినిమా దెబ్బ తినడంతో రజనీకాంత్ అభిమానులు కొంత నిరాశ చెందారు. అందుకే వాళ్లలో ఉత్సాహం పెంచడానికి మాస్ అంశాలతో ఓ కొత్త సినిమా చేస్తున్నారు తలైవా. 'జై భీమ్' ఫేం టీజీ జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఆ సినిమా పేరు 'వేట్టయాన్'. రజనీకాంత్ 170వ చిత్రంగా ఇది తెరకెక్కుతోంది. ఇందులో రానా దగ్గుబాటి ఓ ముఖ్య పాత్రలో నటిస్తున్నారంటూ ఆ మధ్య లైకా ప్రొడక్షన్స్ సంస్థ ప్రకటించింది. సోమవారం ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అయినట్లు రానా ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ చిత్రంలో ఆయన ఏ పాత్ర పోషిస్తున్నారనేది తెలియాల్సి ఉంది. ఇంకా ఈ చిత్రంలో బిగ్ బీ అమితాబ్ బచ్చన్ నటిస్తుండటం విశేషం. దాదాపు 43 ఏళ్ల తరువాత రజనీకాంత్, అమితాబ్ బచ్చన్ కలసి ఈ ప్రాజెక్ట్‌కు వర్క్ చేయడంతో ఈ చిత్రంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. వెర్సటైల్ నటుడిగా పేరొందిన ఫహాద్ ఫాసిల్, ప్రముఖ నటి మంజూ వారియర్ కూడా ఇందులో నటిస్తున్నారు.

మిడిల్ క్లాస్ రాముడు

విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం టీజర్ విడుదలైంది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. పరశురామ్ పెట్ల దర్శకుడు. వాసు వర్మ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ సినిమా విడుదల కానుంది.

గోపీసుందర్ కంపోజ్ చేసిన 'దేఖోరే దేఖో' పాటతో హీరో క్యారెక్టరైజేషన్‌ను వర్ణిస్తూ సాగిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. సర్‌నేమ్‌కు సరెండర్ అయి, ఫ్యామిలీ అంటే వీక్‌నెస్ ఉన్న మిడిల్ క్లాస్ రాముడిగా హీరో విజయ్‌ను టీజర్ లో చూపించారు. ఈ టీజర్ చివరిలో హీరోయిన్ మృణాల్ 'నేను కాలేజికి వెళ్లాలి.. కొంచెం దించేస్తారా' అని అడిగితే, 'లీటర్ పెట్రోలు కొట్టిస్తే దించేస్తా' అంటాడు హీరో. ఇలా ఫ్యామిలీ, క్లాస్, మాస్, లవ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో కట్ చేసిన టీజర్ కంప్లీట్ మూవీని షార్ప్‌గా చూసిన అనుభూతి కలిగించింది. ఈ సమ్మర్‌కు కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లా 'ఫ్యామిలీ స్టార్' ఉండబోతోందనే క్లారిటీని ఈ టీజర్ ఇచ్చింది.

'భీమ'లో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్



నిర్మాత కె.కె. రాధామోహన్

'గోపీచంద్ ఇంతకుముందు చాలా పోలీస్ పాత్రలు చేశారు. కానీ 'భీమ'లో పాత్ర విభిన్నంగా ఉంటుంది. కొత్త జానర్‌లో ఉండే కథ ఇది. ఇలాంటిది గోపీచంద్ కూడా చేయలేదు. ఇందులో సర్‌ప్రైజింగ్ ఎలిమెంట్స్ చాలా ఉన్నాయి. సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది. పోలీస్ గెటప్ కాకుండా ఇందులో గోపీచంద్ మరో గెటప్ కూడా ఉంది. అదేమిటనేది మార్చి 8న తెలుస్తుంది' అని చెప్పారు నిర్మాత కె.కె. రాధామోహన్. కన్నడ దర్శకుడు ఎ.హర్ష దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఆయన నిర్మించిన 'భీమ' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో ముచ్చటిస్తూ 'బాలకృష్ణ గారి 'అఖండ' చిత్రానికి మా సినిమాకీ ఏ మాత్రం పోలిక లేదు. బెంగళూరు, బాదమి పరిసర ప్రాంతాల్లో ఉండే పరశురామ క్షేత్రంలో జరిగే కథ ఇది. శివాలయం, అఘోరాలను యాంబియన్స్ కోసం చూపించాం. అఘోరాలకు ఈ కథతో సంబంధం లేదు' అని ఆయన స్పష్టం చేశారు. దర్శకుడు హర్షను తెలుగు తెరకు పరిచయం చేయడం గురించి వివరిస్తూ 'ముందు మనం కథని నమ్మాలి. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లు కథ ఉందా లేదా అని చూడాలి. దానికి తగ్గ నటీనటులు, సాంకేతిక నిపుణులను ఎన్నుకోవాలి. హర్ష చాలా క్లారిటీ ఉన్న దర్శకుడు. తను కొరియోగ్రాఫర్ కూడా. మా 'బెంగాల్ టైగర్' చిత్రానికి వర్క్ చేశారు. 'భీమ'ని అద్భుతంగా తీశారు. రెండు పాటలకు కొరియోగ్రఫీ కూడా చేశారు' అన్నారు.

సినిమా బడ్జెట్ పెరగడానికి కారణం చెబుతూ 'మంగులూరు, బదామిచ ఉడిపి, మారేడుమిల్లి, వైజాగ్.. ఇలా చాలా ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. అన్నపూర్ణ స్టూడియోలో టెంపుల్ సెట్ వేశాం. కథకు తగ్గట్లుగా ఎక్కడా రాజీ పడకుండా తీశాం. దీని వల్ల బడ్జెట్ పెరిగింది. అయినా బిజినెస్ పరంగా హ్యాపీగా ఉన్నాం. పెద్ద సంఖ్యలో విడుదల చేస్తున్నాం. గోపీచంద్ కెరీర్‌లో బిగ్గెస్ట్ రిలీజ్ ఇది' అని చెప్పారు రాధామోహన్. తన కొత్త సినిమాల గురించి చెబుతూ 'ఆయుష్ శర్మ హీరోగా ఓ హిందీ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఏప్రిల్ 25న విడుదల చేస్తాం. బెల్లంకొండ సాయిశ్రీనివాస్, విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో ఓ సినిమా ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది' అన్నారు.

ప్రతి భారతీయుడు గర్వించే సినిమా


నిహిర్ కపూర్

సీనియర్ నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు రూపొందించిన పాన్ ఇండియా మూవీ 'రికార్డ్ బ్రేక్' ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. నటి జయసుధ తనయుడు నిహిర్ కపూర్ ఇందులో ఒక హీరోగా నటించారు. విడుదల సందర్భంగా ఆయన సోమవారం మీడియాకు చిత్ర విశేషాలు వెల్లడించారు.



- ఇంతకుముందు నేను 'గ్యాంగ్‌స్టర్ గంగరాజు' చిత్రంలో నటించాను. ఆ సినిమా షూటింగ్‌లో శ్రీనివాసరావుగారు 'బాగా చేస్తున్నావు.. నా దగ్గర ఓ కథ ఉంది. నువ్వు యాప్ట్ అవుతావు' అని కథ చెప్పారు. చాలా ఎక్సయింటింగ్‌గా అనిపించి నేను ఈ సినిమా ఒప్పుకొన్నాను. ఇద్దరు అనాథలు అడవిలో పెరుగుతుంటారు. కవలలైన వాళ్లిద్దరూ పట్నం వచ్చి కుస్తీ పోటీల్లో పాల్గొని ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం ఈ చిత్రకథ. చాలా ఆసక్తికరంగా చూపించారు.
- 'దంగల్' చిత్రానికీ ఈ కథకు పోలిక లేదు. ఇందులో కుస్తీ పోటీల గురించి చెబుతూ ఇద్దరు అనాథల జర్నీని ఆకట్టుకొనే విధంగా చూపించారు. సెంటిమెంట్, ఎమోషనల్ అంశాలు కలిగిన కమర్షియల్ చిత్రమిది. సాంగ్స్, ఫైట్స్ బాగుంటాయి.
- రాజస్థాన్, హర్యానా వంటి ప్రాంతాల్లో కుస్తీ పోటీలు ఎక్కువగా జరుగుతాయి. డీటైలింగ్ మీద ఉత్తరాది వారు ఎక్కువ సినిమాలు తీస్తుంటారు. 'రికార్డ్ బ్రేక్' తెలుగు సినిమా అయినా ప్రతి భారతీయుడు గర్వించే విధంగా ఉంటుంది. ఇలాంటి చిత్రం తెలుగుతోనే ఆగిపోకూడదు. అందుకే ఎనిమిది భాషల్లో విడుదల చేస్తున్నాం.
- శ్రీనివాసరావుగారికి సినిమా అంటే ప్యాషన్. దేశభక్తి మిళితమైన మంచి కాన్సెప్ట్‌ను ఆసక్తికరంగా జనాలకు చెప్పాలనుకున్నారు. ఎక్కడా రాజీ పడకుండా నిర్మించారు.
- ఇక నుంచి నటనని కంటిన్యూ చేస్తా. అలాగే దర్శకత్వం కూడా చేయాలనుకుంటున్నాను. స్క్రిప్టులు తయారు చేస్తున్నా.

'రంగ్ రంగ్ రంగీలా'



హిలేరియస్ క్రైమ్ కామెడీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న చిత్రం పారిజాత పర్వం. సునీల్, చైతన్య రావు, శ్రద్ధా దాస్ , మాళవిక సతీశన్ ప్రధాన పాత్రలలో నటిస్తున్నారు. సంతోష్ కంభంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. మహిధర్ రెడ్డి, దేవేష్ నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం నుంచి 'రంగ్ రంగ్ రంగీలా' అంటూ సాగే ఓ పాటను చిత్ర బృందం విడుదల చేసింది. సంగీత దర్శకుడు రీ క్యాచీ క్లబ్ నెంబర్‌గా ఈ పాటను కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. ఈ పాటని నటి శ్రద్ధాదాస్ పాడటం విశేషం. ఆమె వాయిస్, గ్లామరస్ ప్రజన్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణ తీసుకొచ్చాయి. ఈ చిత్రానికి ఎడిటర్-శశాంక్ వుప్పుటూరి, డీవీపీ-బాల సరస్వతి, సంగీతం-రీ, ఆర్ట్ డైరెక్టర్-ఉపేందర్ రెడ్డి, సహ నిర్మాత- అనంత సాయి.

గామి నిర్మాణం.. సాహస ప్రయాణం


చాందినీ చౌదరి

విశ్వక్‌సేన్ నటించిన 'గామి' చిత్రం ఈ నెల 8న విడుదల కానుంది. ఈ చిత్ర కథానాయిక చాందినీ చౌదరి సోమవారం విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలను పంచుకున్నారు.



- 'వారణాసి, కుంభమేళ, కశ్మీర్, హిమాలయాలు.. ఇలా విభిన్న లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. ఈ టీమ్‌లో నేను ఒక్కదాన్నే అమ్మాయిని. చాలా సవాల్‌తో కూడిన సరిస్థితుల్ని ఎదుర్కొన్నాం. ముఖ్యంగా వాష్ రూమ్ ఫెసిలిటీస్ లేకపోవడంతో నీళ్లు కూడా తాగేదాన్ని కాదు. దాదాపు నెల రోజుల పాటు అలా షూటింగ్ చేశాం. స్టంట్స్ నేనే రియల్‌గా చేశా. ఒక రకంగా చెప్పాలంటే గామి నిర్మాణం..సాహస ప్రయాణం.
- కథ వినగానే చిత్ర నిర్మాణానికి ఎక్కువ సమయం పడుతుందని అర్థమైంది. ఎందుకంటే చాలా పెద్ద కాన్వాస్ ఉన్న కథ ఇది. దర్శకుడు విద్యాధర్ రాజీ పడని వ్యక్తి . తను అనుకున్నది వచ్చే వరకూ వదిలిపెట్టరు. షూటింగ్‌కు ఎక్కువ సమయం తీసుకున్నాం కనుకే విజువల్స్ అద్భుతంగా వచ్చాయి. ఇలాంటి సినిమా తెలుగులో ఇంతవరకూ రాలేదు. ఈ సినిమాను ఆదరిస్తే ఇటువంటి చిత్రాలు మరిన్ని వస్తాయి.
- పరిశ్రమలోకి వచ్చి పదేళ్లు అయింది. ఈ ప్రయాణంలో ఎన్నో నేర్చుకున్నా. ఇక్కడ ఆపకుండా ఏదో ఒకటి చేయాలి. కొన్ని సార్లు మనకి ఆప్షన్లు ఉంటాయి. కొన్ని సార్లు ఉండవు. అయినా ముందుకు సాగుతూనే ఉండాలి. పదేళ్ల కెరీర్ పూర్తి చేయడం నా దృష్టిలో పెద్ద డీల్. ఈ ఏడాది నేను నటించిన నాలుగు చిత్రాలు విడుదల అవుతాయి. వాటి వివరాలు నిర్మాతలు చెబుతారు. అలాగే 'ఝాన్సీ' వెబ్ సిరీస్ మరో సీజన్ కూడా రాబోతోంది.

వినూత్నంగా ఆయ్



మ్యాడ్ మూవీతో కుర్రకారును మెప్పించారు నార్నే నితిన్. తాజాగా ఈ నటుడు నయన్ సారికతో కలసి 'ఆయ్' చిత్రంలో నటిస్తున్నారు. అంజి కంచిపల్లి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ బన్నీ వాసుతో సంయుక్తంగా విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. 'ఆయ్' సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. దీంతో చిత్ర యూనిట్ ప్రమోషనల్ యాక్టివిటీస్‌ను వేగవంతం చేసింది. అందులో భాగంగానే ఈ హిలేరియస్ ఎంటర్టైన్‌మెంట్ టైటిల్‌ను అనౌన్స్ చేశారు. నిర్మాత బన్నీవాస్, నార్నే నితిన్, నయన్ సారిక, డైరెక్టర్ అంజిపల్లి మధ్య జరిగే సరదా ఫోన్ సంభాషణతో టైటిల్‌ను వినూత్నంగా ప్రకటించారు. సరదా సంభాషణ, ఫన్నీ మీమ్స్ రిఫరెన్స్‌లతో సాగే ఈ వీడియో అందరినీ మెప్పిస్తోంది. ఈ వీడియోలో 'సమ్మర్‌లో కలుద్దాం' అంటూ హింట్ ఇచ్చారు. మార్చి 7న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ రిలీజ్ చేస్తామని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్- సమీర్ కల్యాణి, సంగీత దర్శకుడు- రామ్ మిర్యాల, ఎడిటర్- కోదాటి పవన్ కల్యాణ్, ఆర్ట్ డైరెక్టర్- కిరణ్ కుమార్ మన్నె, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- అజయ్ గద్దె, సహ నిర్మాతలు- భాను ప్రతాప్, రియాజ్ చౌదరి.

నడిరోడ్డుపై నరికేశాడు..!

అనుమానంతో భార్య దారుణ హత్య


కుమారిపై కత్తితో దాడి చేస్తున్న రంగస్వామి, కుమారి(ఇన్‌సెట్)

- అడ్డుకోబోయిన అత్తపైనా కత్తితో దాడి.. అవుకులో పట్టపగలే ఘోరం
- ఆసుపత్రిలో అందుబాటులో లేని వైద్యులు, సిబ్బంది
- ప్రథమ చికిత్సకూ నోచుకోని బాధితురాలు
- 45 నిమిషాల పాటు నరకయాతన.. నంద్యాలకు తరలిస్తుండగా మృతి

అవుకు, మార్చి 4: అనుమానం పెనుభూతంగా మారి కట్టుకున్న భార్యపై పట్టపగలు.. అందరూ చూస్తుండగానే నడిరోడ్డుపైనే ఓ వ్యక్తి కత్తితో దాడిచేశాడు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన అత్తకూ గాయాలయ్యాయి. వెంటనే స్థానిక వైద్యశాలకు తరలించినా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో తొలుత బనగానపల్లెకు, మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలిస్తుండగా బాధితురాలు మృతి చెందింది. నంద్యాల జిల్లా అవుకు పట్టణంలో సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఎస్‌ఐ తిరుపాల్ కథనం మేరకు.. పట్టణంలోని కోటవీధిలో పోల్క రంగస్వామి, కుమారి దంపతులు నివాసం ఉంటున్నారు. రంగస్వామి మొదటి భార్య నుంచి విడాకులు తీసుకుని కుమారిని పదేళ్ల క్రితం రెండో పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. రంగస్వామి తాగుడుకు బానిసై అనుమానంతో నిత్యం భార్యను వేధించేవాడు. వేధింపులు భరించలేక ఇటీవల ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో సోమవారం కుమారితో పాటు ఆమె చిన్నమ్మ సుబ్బలక్ష్మమ్మ అవుకు మండల కేంద్రానికి చేరుకుని రంగస్వామిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న రంగస్వామి బస్టాండ్ సర్కిల్‌లో టెంకాయల దుకాణం వద్ద ఉన్న భార్యను టెంకాయలు తొలిచే కత్తితో విచక్షణా రహితంగా నరికాడు. అడ్డువచ్చిన అత్త సుబ్బలక్ష్మిపై కూడా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న కుమారిని స్థానికులు, ఆమె తరపు బంధువులు అవుకులోని క్లస్టర్ ఆసుపత్రికి తరలించారు.

అందుబాటులో లేని వైద్యులు

సాయంత్రం 4 గంటలకు దాడి జరగ్గా.. పది నిమిషాల్లో క్లస్టర్ హెల్త్ సెంటర్‌కు తరలించారు. అయితే అక్కడ బాధితురాలికి ప్రాథమిక చికిత్స అందించేందుకు డ్యూటీ డాక్టర్‌తో పాటు ఏ ఒక్కరూ అందుబాటులో లేరు. దీంతో దాదాపు 45 నిమిషాల పాటు కుమారి ఆసుపత్రిలోనే నరకయాతన అనుభవించింది. చివరకు అవుకు తహసీల్దారు భాస్కర్ ఆసుపత్రికి చేరుకుని, 108 అంబులెన్స్‌లో ఆమెను బనగానపల్లె ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో కుమారి మృతి చెందింది. అవుకు ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి కనీసం ప్రథమచికిత్స చేసినా ఆమె బతికేదని కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు అవుకు ఎస్‌ఐ తెలిపారు.


మయూరవాహనంపై విహరిస్తున్న ఉత్సవమూర్తులు

మయూర వాహనంపై విహరించిన ఆది దంపతులు

శ్రీశైలం, మార్చి 4: శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజు సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జి తాత్కాలికంగా మూసివేత

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆర్‌కే బీచ్‌లో సందర్శకుల కోసం ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జిని అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. ఈ మేరకు బీచ్‌లో సోమవారం బ్యానర్ ఏర్పాటు చేశారు. 'వాతావరణ పరిస్థితులు అనుకూలించాక ఫ్లోటింగ్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువస్తాం' అని అందులో పేర్కొన్నారు. సేఫ్టీ డ్రిల్‌లో భాగంగా 'టి జంక్షన్ వ్యూ పాయింట్'ను దూరంగా పెట్టి పరిశీలిస్తున్నామని వివరించారు.

గిరిజన ప్రాంతాల్లోని టీచర్ పోస్టులు గురుకుల బైలాస్‌కు అనుగుణంగా భర్తీ

- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం.. విచారణ మూసివేత

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లోని టీచర్ పోస్టులను గురుకుల బైలాస్‌కి అనుగుణంగా భర్తీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు నివేదించింది. డీఎస్సీలో కలిపిన గిరిజన ప్రాంత పోస్టులను చట్టనిబంధనల ప్రకారం ఐటీడీఏ పీవో ద్వారా భర్తీ చేస్తామని వివరించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కాసా జగన్మోహన్‌రెడ్డి చెప్పిన వివరాలను నమోదుచేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఈ వ్యాజ్యాన్ని పరిష్కరించారు. గిరిజన యువతతో భర్తీ చేయాల్సిన 517 టీచర్ పోస్టులను జనరల్ కేటగిరీలో చేర్చి ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన టి.విజయ్‌కుమార్‌తో పాటు మరో 9 మంది హైకోర్టును ఆశ్రయించారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో టీచర్ పోస్టులను సాధారణ డీఎస్సీ ద్వారా భర్తీ చేయడానికి వీల్లేదన్నారు. పోస్టుల భర్తీ కోసం స్వయంప్రతిపత్తి గల సొసైటీ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా బైలాస్ రూపొందించారన్నారు. టీచర్ పోస్టుల భర్తీ అధికారం ఐటీడీఏ పీవోకి మాత్రమే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న గిరిజన గురుకులాలు, ఇతర పాఠశాలలోని టీచర్ పోస్టులను చేర్చిందన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల వందలాది గిరిజన అభ్యర్థులు నష్టపోతారన్నారు. పిటిషనర్ల తరపు న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు.

4 వారాల టైమివ్వండి!

- 'టెట్, టీఆర్టీ షెడ్యూల్‌పై సర్కారుకు హైకోర్టు షాక్
- 2018లో 60రోజుల గడువు.. ఇప్పుడెందుకు కుదించారు?
- ఇది అభ్యర్థులకు న్యాయం పొందే హక్కును దూరం చేయడమే
- రెండింటికీ మధ్య తగిన సమయమివ్వండి.. రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్), ఏపీ టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ) పరీక్షల షెడ్యూల్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు షాక్ ఇచ్చింది. టెట్, టీఆర్టీ రెండు పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు తగిన సమయం ఇవ్వలేదని ఆక్షేపించింది. ఏపీ టెట్ చివరి తేదీ నుంచి ఏపీ టీఆర్టీ పరీక్ష ప్రారంభానికి మధ్య కనీసం నాలుగు వారాల సమయం ఉండాలని స్పష్టం చేసింది. పిటిషనర్లందరూ ఎస్‌జీటీ అభ్యర్థులే అయినందున ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ విషయంలో మాత్రమే తామిచ్చిన ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టం చేసింది. రిట్ పిటిషన్‌ను అనుమతిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ సోమవారం తీర్పు ఇచ్చారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా షెడ్యూల్ మార్చాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపీ టెట్), టీచర్ రిక్రూట్ టెస్ట్(ఏపీ టీఆర్టీ) మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం. పెద్దిరాజు, మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుత నోటిఫికేషన్ రద్దు చేసి టెట్, టీఆర్టీ పరీక్షల నిర్వహణకు తాజాగా నోటిఫికేషన్ జారీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు, న్యాయవాది జవ్వాజి శరత్‌చంద్ర వాదనలు వినిపించగా, ప్రభుత్వం తరఫున న్యాయవాది వి.కె. నాయుడు వాదనలు వినిపించారు. గత బుధవారం వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేసిన న్యాయమూర్తి సోమవారం నిర్ణయాన్ని వెల్లడించారు.

తీర్పులో ఏముందంటే...

'టెట్, టీఆర్టీ పరీక్షల విషయంలో ప్రాథమిక కీ ప్రచురణ, అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారం, తుది కీ జారీకి నిర్ణయించిన సమయం చాలా తక్కువగా ఉంది. ఇది సహేతుకమైనది కాదు. తక్కువ సమయం ఇవ్వడం అభ్యర్థులపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. టెట్, టీఆర్టీ.. రెండింటికీ హాజరయ్యే అభ్యర్థులు పరీక్షకు సిద్ధమయ్యేందుకు ప్రభుత్వం తగిన సమయం ఇవ్వలేదు. టెట్ నోటిఫికేషన్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 8న జారీ చేసి, 27 నుంచి పరీక్షలు ప్రారంభించారు. టీఆర్టీ పరీక్షకు ఫిబ్రవరి 12న నోటిఫికేషన్ ఇచ్చి, మార్చి15 నుంచి పరీక్షలు నిర్వహించబోతున్నారు. పరీక్షల నిర్వహణ మధ్య తక్కువ సమయం ఉన్న కారణంగా అభ్యర్థులు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను అర్థవంతంగా వినియోగించుకోలేకపోతున్నారన్న పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వాదనతో ఏకీభవిస్తున్నాం. రికార్డులను పరిశీలిస్తే టెట్‌ను ప్రభుత్వం క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. టీఆర్టీ పరీక్షను చివరిగా 2018లో నిర్వహించారు. అప్పటి టీఆర్టీ నోటిఫికేషన్ తేదీ, పరీక్ష నిర్వహణ మధ్య 60 రోజుల సమయం ఉంది. సంబంధిత నోటిఫికేషన్‌లో ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ, తుది కీ ప్రచురణకు మధ్య సహేతుకమైన సమయం ఉంది. ఇప్పుడూ అలాగే చేయాల్సింది. కానీ ప్రతి దశలోనూ సమయాన్ని కుదించారు. చక్కటి షెడ్యూల్ ప్రకటించేందుకు అధికారులకు ఐదేళ్ల సమయం దొరికినప్పటికీ, షెడ్యూల్ సమయాన్ని కుదించి పరీక్ష నిర్వహణ ఉద్దేశాన్ని దెబ్బతీశారు. ఈ నేపథ్యంలో ఏపీ టెట్, ఏపీ టీఆర్టీ పరీక్షల విషయంలో ప్రాథమిక కీ ప్రచురించిన అనంతరం అభ్యంతరాల స్వీకరణ, వాటి పరిష్కారం, ఫైనల్ కీ ప్రచురణకు ఎక్కువ సమయం ఇవ్వాలని ఆదేశిస్తున్నాం' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రస్తుత నోటిఫికేషన్ ఇచ్చిన గడువు చాలా తక్కువగా ఉందని, ఇది అభ్యర్థులకు న్యాయం పొందే హక్కును దూరం చేయడమేనని తెలిపారు. ఏపీ టెట్ పరీక్ష చివరి తేదీ నుంచి ఏపీ టీఆర్టీ పరీక్ష ప్రారంభానికి మధ్య కనీసం నాలుగు వారాల సమయం ఉండాలని స్పష్టం చేశారు.

టెట్ పరీక్షా ఫలితాల షెడ్యూల్ ఇదే!

అమరావతి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించిన టెట్ పరీక్షా ఫలితాల విడుదల షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ప్రకటించారు. సెకండరీ గ్రేడ్ టీచర్ విభాగం ప్రాథమిక కీని సోమవారం విడుదల చేశారు. దీనిపై ఈనెల 5, 6 తేదీల్లో అభ్యంతరాలను స్వీకరించి, 7న తుది కీ విడుదల చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్స్ నాన్ లాంగ్వేజస్ విభాగం ప్రాథమిక కీ మంగళవారం విడుదల చేసి, 6వ తేదీన అభ్యంతరాలు స్వీకరించి, 7న తుది కీ విడుదల చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్స్ లాంగ్వేజెస్ విభాగం ప్రాథమిక కీని ఈనెల 7న విడుదల చేసి, 8న అభ్యంతరాలను స్వీకరించి, 9న తుది కీ విడుదల చేయనున్నారు. 1బీ, 2బీ ప్రత్యేక విద్య పరీక్షా ఫలితాల ప్రాథమిక కీ ఈనెల 7న విడుదల చేసి, 8న అభ్యంతరాలను స్వీకరించి, 9న తుది కీ విడుదల చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఈ నెల 11న బహిరంగ సభ నిర్వహిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అనంతపురంలో పార్టీ ఉమ్మడి జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ పోటీ: బీఎస్పీ

విశాఖపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కాకుండా కులస్వామ్యం నడుస్తోందని బీఎస్పీ రాష్ట్ర సమన్వయకర్త, విశ్రాంత డీజీపీ జే. పూర్ణచంద్రరావు అన్నారు. సోమవారం విశాఖ పౌర గ్రంథాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలు వ్యాపారంగా మారిపోయాయన్నారు. రెండు పార్టీలు, రెండు సామాజిక వర్గాల మధ్యనే రాజకీయం నడుస్తోందన్నారు. బడుగులకు రాజ్యాధికారం దక్కినప్పుడే రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు పేదరికం నుంచి విముక్తి పొందగలుగుతారన్నారు. బహుజనుల రాజ్యాధికారమే తమ మేనిఫెస్టో అని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 స్థానాల్లోనూ బీఎస్పీ పోటీ చేస్తుందని పూర్ణచంద్రరావు తెలిపారు.

నేటి నుంచి ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచితంగా అందించే 25 శాతం కోటాలో ప్రవేశానికి మంగళవారం నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్టు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష పథక సంచాలకుడు తెలిపారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ నెల 25వ తేదీ లోపు గ్రామ, వార్డు సచివాలయాలు, ఇంటర్నెట్ సెంటర్లు, మీ-సేవా కేంద్రాలు, మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల ద్వారా ఆన్‌లైన్ (ఛిట్సఇజ్ఞాౌ.జీ)లో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నక్కపల్లి శామ్యూల్

ఈ నెల ఒకటో తేదీన జరిగిన ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ సంఘం ఎన్నికల్లో యునైటెడ్ ప్యానెల్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా నక్కపల్లి శామ్యూల్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కేవీ రామారావు, సెక్రటరీగా కె.నాగప్రసాద్ విజయం సాధించారు. 29 బ్రాంచీలలో ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లకు చెందిన 3,872 మంది ఇంజనీర్లు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు.

విష ప్రయోగంతో వందకు పైగా కోతులు మృతి

రొద్దం, మార్చి 4: శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలంలో గుర్తు తెలియని వ్యక్తులు కోతులపై విష ప్రయోగం చేశారు. దీంతో వందకు పైగా మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. వీటి కళేబరాలను మండల పరిధిలోని చోళేమర్రి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి పడేశారు. అధికారులు ఎవరూ దీని గురించి పట్టించుకోకపోవడంతో చోళేమర్రి ప్రాంత రైతులు ఎక్స్‌కవేటర్ తెప్పించి కోతుల కళేబరాలను ఖననం చేశారు.


మృత్యువాత పడిన కోతులు

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులా?: అచ్చెన్న

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే.. అరెస్టులు, నిలదీస్తే దాడులు చేస్తారా? అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. పులివెందులలో ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తున్న తెలుగు యువత నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి అరెస్టుపై సోమవారం ఓ ప్రకటన చేశారు. 'విజయ్‌కుమార్‌రెడ్డి అరెస్ట్ దుర్మార్గం. ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే పోలీసులతో వేధింపులకు గురి చేయడం వైసీపీ ప్రభుత్వానికి సర్వసాధారణమై పోయింది. కార్యకర్తలెవ్వరూ భయపడకండి. మీకు ఎప్పుడూ టీడీపీ అండగా ఉంటుంది' అని అచ్చెన్న భరోసా ఇచ్చారు.

నీళ్లడిగితే ట్రాక్టర్లతో తొక్కిస్తారా?: ధారూనాయక్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'గిరిజన భూములను కొల్లగొట్టి, పథకాలు రద్దు చేసి గుక్కెడు నీళ్లు అడిగితే ట్రాక్టర్లతో తొక్కించి చంపిస్తారా? జగన్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గిరిజనులు చావుదెబ్బ కొట్టాలి' అని టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారూనాయక్ పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లాలో గిరిజన మహిళల్ని ట్రాక్టర్లతో తొక్కించి చంపిన వైసీపీ నేతలపై చర్యలు ఎందుకు తీసుకోలేదో సీఎం సమాధానం చెప్పాలన్నారు. ఉప ముఖ్యమంత్రి రాజన్నదొరకు జగన్ భజన తప్ప గిరిజనుల సమస్యలు పట్టడం లేదన్నారు. గిరిజనులంతా ఎన్నికల్లో జగన్‌ను చావుదెబ్బ కొట్టాలని పిలుపునిచ్చారు. కాగా, బాధలు పడుతూ నిజాయితీగా వ్యాపారం చేసుకునే వాణిజ్య వర్గాలపై పోలీసుల్ని ఉసిగొల్పడం కక్ష సాధించడకోసమేనని టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండీ రాకేశ్ ఆరోపించారు.

టీడీపీ అనుబంధ విభాగాల్లోకి మరికొందరు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ వివిధ అనుబంధ విభాగాల కమిటీల్లో మరికొందరికి స్థానం లభించింది. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు అదనపు నియామకాలు జరిగాయి. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సోమవారం వేర్వేరు ప్రకటనలు జారీచేశారు. తెలుగు మహిళా కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా మన్నవ శారదదేవి (సత్తెనపల్లి), అధికార ప్రతినిధిగా ఆడారి జానకి (యలమంచిలి), కార్యదర్శులుగా పోతుగంటి అలేఖ్య (కావలి), మెట్ట పద్మావతి (టెక్కలి) నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర తొగట/తొగటి సాధికార సమితి కన్వీనర్‌గా మడక చక్రధర్(కడప), టీడీపీ రాష్ట్ర కుర్ని/కరికాల భక్తుల/నిస్సి కన్వీనర్‌గా టంకశాల హనుమంతప్ప(రాయదుర్గం), టీడీపీ రాష్ట్ర ఆరెకటిక కన్వీనర్‌గా హనుమంతకారి హరికృష్ణారావు(తాడిపత్రి)ని నియమించారు.

జగన్ మాటలు అబద్ధం: లోకేశ్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'నీ మాటలు అబద్ధం.. నీ చేతలు అబద్ధం.. నాడు-నేడు మరో అబద్ధం' అంటూ సీఎం జగన్‌ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. 'రంగులేయడం తప్ప.. ఐదేళ్లలో కనీసం ఒక్క టీచర్ నియామకం కూడా జరగలేదు. రాష్ట్రంలోని ఏకోపాధ్యాయ పాఠశాలలు 12,386. పబ్లిసిటీ మీద పెట్టిన శ్రద్ధలో సగం పాఠశాలల మీద పెట్టి ఉంటే.. విద్యార్థులకు ఈ ఖర్మ తప్పేది' అని ట్వీట్ చేశారు.

తాకట్టుకు మనుషులే మిగిలారు: జీవీ రెడ్డి

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఈ రాష్ట్రంలో ఇక తాకట్టు పెట్టడానికి మనుషులు మాత్రమే మిగిలారని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీరెడ్డి వ్యాఖ్యానించారు. 'మార్చి 1న ఏపీ ప్రభుత్వం ఎంత నీచ స్థితికి దిగజారిందంటే.. రాష్ట్రంలోని గనులను తొమ్మిది సంవత్సరాల 11 నెలల కాల వ్యవధికి తాకట్టు పెట్టి రూ.7,000 కోట్లు 8.70% వడ్డీకి ప్రైవేట్ సంస్థల నుంచి అప్పు తెచ్చింది' అని సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు.

నేడు ఉపాధి సిబ్బంది చలో విజయవాడ

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధి హామీ సిబ్బంది చలో విజయవాడ కార్యక్రమాన్ని తలపెట్టారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, జేఈలు మంగళవారం తాడేపల్లికి తరలివచ్చి గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరేట్ ముందు నిరసన తెలపాలని నిర్ణయించారు. గ్రేడ్ ఫిక్సేషన్, మిగతా శాఖల ఉద్యోగులకు ఇచ్చినట్లు పీఆర్సీ అమలు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఎఫ్‌టీఈ ఉద్యోగులుగా గుర్తించే ప్రక్రియపై ఉన్నతాధికారులతో తాడో పేడో తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు.

వెంకట్రామిరెడ్డికి ఆ అర్హత లేదు!

▸ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ ధ్వజం

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హత సచివాలయ ఉద్యోగ సంఘ నేత వెంకట్రామిరెడ్డికి లేదని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు గుడి నాగరాజు పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, 9 నెలలు ఆలస్యంగా ప్రొబేషన్ ప్రకటించి, బకాయిలు ఇవ్వకపోవడం, జూనియర్ అసిస్టెంట్ స్కేల్ ఇవ్వకపోవడం తదితర సమస్యల పరిష్కారానికి ఏ మాత్రం ప్రయత్నాలు చేయకుండా తమను ప్రలోభపెట్టడమేంటని ప్రశ్నించారు.

శ్రీశైలం కారిడార్‌ను త్వరగా నిర్మించండి

▸ ప్రధాని మోదీకి జస్టిస్ ఎన్వీ రమణ లేఖ

న్యూఢిల్లీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌ను త్వరగా నిర్మించాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు సోమవారం ప్రధాని మోదీకి ఆయన లేఖ రాశారు. శ్రీశైలం కారిడార్ గురించి గతంలో తాను రాసిన లేఖనూ దీనికి జతచేశారు. శ్రీశైలం దక్షిణ కాశీగా వెలుగొందుతుందని, కావున శ్రీశైలం కారిడార్‌ను నిర్మిస్తే రహదారి కనెక్టివిటీ మరింత మెరుగవుతుందని లేఖలో పేర్కొన్నారు.

జగన్ సర్కార్ స్కీంలన్నీ స్కాంలే: రఘురామ

న్యూఢిల్లీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జనాభా కంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారులే ఎక్కువగా ఉండటం విడ్డూరంగా ఉందని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు ఎద్దేవా చేశారు. రచ్చబండలో భాగంగా సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిజమైన లబ్ధిదారులకు కేంద్రప్రభుత్వం ఇచ్చే రేషన్ సరిపోతుందని చెప్పారు. అయినా అదనపు కుటుంబాలున్నాయని, వారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రేషన్ సరఫరా చేస్తున్నామని చెప్పి ఇక్కడ ఖర్చు రాసి, కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకు రేషన్ సరుకులను ఎగుమతి చేస్తున్నారని ఆరోపించారు. జగన్ సర్కారు ప్రతి స్కీమూ ఒక స్కామేనన్నారు. ఒకవైపు మోదీ డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తుంటే, జగన్ మాత్రం డిజిటలైజేషన్ ప్రక్రియకు ఇష్టపడటం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో లక్ష కోట్లు ఖర్చుపెట్టినా జగన్ గెలిచేది లేదన్నారు. రాష్ట్ర సచివాలయాన్ని సీఎం జగన్ తాకట్టు పెట్టిన వైనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లేందుకు ఆయనకు సుదీర్ఘ లేఖ రాశానని రఘురామ కృష్ణంరాజు వివరించారు.

విశాఖలో కాంగ్రెస్ 'న్యాయ సాధన' సభ

విశాఖపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): 'న్యాయ సాధన' పేరుతో నగరంలోని రైల్వే గ్రౌండ్స్‌లో ఈ నెల 11-13 తేదీల మధ్య బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్ రెడ్డి తెలిపారు. ఈ సభకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఏఐసీసీ పెద్దలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల, తదితరులు హాజరవుతారన్నారు. ఈ సభలో స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి డిక్లరేషన్ చేయనున్నట్లు వెల్లడించారు.

క్విడ్ ప్రో కోకు ఆద్యుడు జగన్: హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 4: 'నీకు భూమి ఇస్తా... నీ పరిశ్రమలో నాకు వాటా ఇవ్వు... అనే విధానామే క్విడ్ ప్రో కో. దీన్ని రాష్ట్రానికి తీసుకువచ్చిన ఘనుడు సీఎం జగన్. ఇప్పుడు రాష్ట్ర ప్రజలతో కూడా క్విడ్ ప్రో కోకు పాల్పడుతున్నాడు' అని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన మాట్లాడారు. 'జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో పరిస్థితులను దారుణంగా మార్చేశాడు. ప్రభుత్వ ధనం ఒక్కొక్క కుటుంబానికి ఎంత ఖర్చు చేశాడో లెక్కగట్టి వలంటీరు, అభ్యర్థితో వారికి ఆ లెక్క చెప్పి కచ్చితంగా ఓటు జగన్‌కే వేయాలని చెప్పడం క్విడ్ ప్రో కో. పేదలకు అనేక వాగ్దానాలు చేసి మోసం చేశాడు. ఇటువంటి వాడు ముఖ్యమంత్రిగా ఉండడానికే అర్హుడు కాదు. జగన్ చేసిన దారుణాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. అతను మళ్లీ రాకుండా ప్రజలను చైతన్యం చేయాలి' అని హర్షకుమార్ పిలుపునిచ్చారు.

గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటుకు మోదీ శంకుస్థాపన

పరవాడ, మార్చి 4: అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలోని సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ)లో రూ.30 కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటు నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు. తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా నుంచి వర్చువల్‌గా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మోదీ.. దీనికి శ్రీకారం చుట్టారు.

నిన్నటిదాకా నరకంలో పడేసి...

ఎన్నికల వేళ రెవెన్యూ డే

▸ సంఘం అలా లేఖ రాయగానే ఇలా ఓకే

▸ ఎన్నికల్లో రెవెన్యూ సేవలపై జగన్ కన్ను

▸ మచ్చిక చేసుకునేందుకు వారిపై 'డే'లం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్వాతంత్ర్యం రాకముందు 1786, జూన్ 20వ తేదీన బోర్డు ఆఫ్ రెవెన్యూను బ్రిటిష్ పాలకులు ఏర్పాటుచేశారు. ఆ రోజును అనధికారికంగా రెవెన్యూడేగా పిలుస్తున్నారు. 238 సంవత్సరాల తర్వాత అంటే...2024లో సరిగ్గా ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్‌కు ఈ విషయం గుర్తుకొచ్చింది. అంతే....హడావుడిగా రెవెన్యూ సంఘం ఆదివారం లేఖ రాయడం, ఆ మరుసటి రోజే జగన్ ప్రభుత్వం ఆమోదించేయడం చకచకా జరిగిపోయింది. ఇప్పుడు ఇదే రెవెన్యూ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రెవెన్యూ డే సందర్భంగా మండలాలు, జిల్లాల స్థాయిలో సభలు, సమావేశాలు జరిపి.. ప్రతిభ కలిగిన రెవెన్యూ ఉద్యోగులను, సర్వీసులో ఉత్తమ సేవలు అందించిన రిటైర్డు సిబ్బందిని గుర్తించి వారికి సత్కారాలు, సన్మానాలు చేస్తారు.

ఇదీ వ్యూహం!

తనకు ప్రయోజనం లేదనుకుంటే జగన్ ఏదీ చేయరని ఆయన పాలనే చెబుతున్న వాస్తవం. ఎన్నికల విధుల్లో అత్యంత కీలక బాధ్యతలు నిర్వహించేది రెవెన్యూ ఉద్యోగులే. ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారి నుంచి పర్యవేక్షకులు, చివరకు బూత్ లెవల్ వరకు వారే ఉంటారు. అందువల్లే గడిచిన నాలుగున్నరేళ్లుగా వారితో నరకం స్పెల్లింగ్ రాయించి, ఇప్పుడు ఒక్కసారిగా 'రెవెన్యూడే' అంటూ హడావుడి మొదలుపెట్టారు. ఇది జగన్ మాత్రమే చేయగల దమ్మున్న మేలని ఇదే రెవెన్యూ సంఘం నేత బొప్పరాజు, మరి కొందరితో మహా అద్భుతమైన భజన కూడా చేయించుకున్నారు.

తిట్టారు.. కొట్టారు.. తొక్కేశారు..

గత నాలుగున్నరేళ్ల కాలంలో రెవెన్యూ ఉద్యోగులు అష్టకష్టాలుపడ్డారు. విజిలెన్స్, ఏసీబీలతో దాడులు చేయించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడేవారు ఏ శాఖ ఉద్యోగి అయినా క్షమించాల్సిన పనిలేదు. కానీ, తాము చెప్పిన అడ్డగోలు పనులు చేయడం లేదనో, అడ్డగోలుగా భూమి రికార్డులు మార్చడం లేదనో కారణంగా వైసీపీ నేతలు రెవెన్యూ ఉద్యోగులను రాచిరంపాన పెట్టారు. ఉద్దేశపూర్వకంగా కొందరిని ఏసీబీకి పట్టించారు. మరికొందరిపై విజిలెన్స్ విచారణలు చేయించారు. అయినా రెవెన్యూ వారు దారికి రావడం లేదని వైసీపీ నేతలే అనేక చోట్ల ఉద్యోగులు, అధికారులపై భౌతిక దాడులకు పాల్పడ్డారు. భూముల సర్వే సందర్భంగా అడ్డగోలు తప్పులు చేయాలన్న పెద్దల మాటలు వినలేక, తప్పులు చేయలేక అనేక మంది సర్వేయర్లు ఒత్తిడి కారణంగా గుండెపోటుతో మరణించారు. కలెక్టర్, డీఆర్వో, ఇతర అధికారులు రెవెన్యూ ఉద్యోగుల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ బూతులు తిట్టిన ఉదంతాలు అనేకం వెలుగుచూశాయి. వీటిపై రెవెన్యూ ఉద్యోగ సంఘం ఏనాడూ స్పందించలేదు. బాధిత ఉద్యోగులకు న్యాయం దక్కేలా గట్టిగా పోరాటాలు చేస్తే సర్కారు పెద్దలు కన్నెర్ర చేస్తారేమోనని భయపడి సంఘం నేతలు మిన్నకుండిపోయారు. రెవెన్యూ ఉద్యోగులకు సర్వీసు పరీక్షలు, పదోన్నతులు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు కల్పించే విషయంలో ప్రభుత్వం చొరవ తీసుకుంది లేదు. కొత్తగా నియమితులైన వీఆర్వో, సర్వేయర్ల ప్రొబేషన్ డిక్లరేషన్, వారి పరీక్షల విషయంలో అనేక సమస్యలున్నా ప్రభుత్వ పెద్దలు పరిష్కారమార్గాలు అన్వేషించలేదు. ఈ విషయంలో సంఘ నేత బొప్పరాజు ఏం చేశారని ఉద్యోగులే ప్రశ్నించిన ఉదంతాలు అనేకం ఉన్నాయి.

> గత నాలుగున్నరేళ్లలో రెవెన్యూ ఉద్యోగులను జగన్ సర్కారు రాసిరంపాన పెట్టింది. నరకం అనే మాటకు స్పెల్లింగ్‌ను వారితో రాయించింది. మాట వినని సిబ్బందిపై ఇటు విజిలెన్స్, ఏసీబీ దాడులు, అటు వైసీపీ నేతల భౌతిక దాడులతో అల్లాడించారు. ఇన్నాళ్లలో వీలు చిక్కినప్పుడల్లా తొక్కేశారే గానీ, పిలిచి చిన్న ప్రోత్సాహకం ఇచ్చిన పాపాన కూడా పోలేదు. అలాంటిది.. ఎన్నికల వేళ రెవెన్యూ ఉద్యోగులపై ఒక్కసారిగా ప్రేమ పొంగుకొచ్చింది. పోలింగ్ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించేది వీరే కావడంతో.. వారికి ఒక 'డే' ఉన్నట్టు హఠాత్తుగా గుర్తించి.. అంతే అనూహ్యంగా జీవో తెచ్చారు.

సరిగ్గా ఎన్నికల వేళ..

మరికొద్దిరోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఎన్నికల విధుల్లో రెవెన్యూ సిబ్బంది కీలకపాత్ర పోషించబోతున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయవర్గం జగన్ తీరుపై గుర్రుగా ఉంది. ఈ నేపథ్యంలో రెవెన్యూ డే ప్రకటనతో రెవెన్యూ సిబ్బందిని మచ్చిక చేసుకోవాలన్నది పెద్దల ఆలోచన. అందుకే బొప్పరాజు నాయకత్వంలోని సంఘంతో ఈ నెల 3వ తేదీన ప్రభుత్వానికి లేఖపెట్టించారు. 4వ తేదీన ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలుపుతూ సీఎస్‌తో ఉత్తర్వులు ఇప్పించారు.

ఏటా జూన్ 20న రెవెన్యూ డే

▸ ప్రభుత్వ ప్రకటనపై అసోసియేషన్ హర్షం

విజయవాడ, మార్చి 4: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ విజ్ఞప్తిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా ప్రకటించిందని అసోసియేషన్ నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రమేశ్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ శాఖలో వీఆర్ఏ స్థాయి నుంచి కలెక్టర్ వరకు 24 గంటలూ ప్రజాసేవలోనే ఉంటారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సంబంధిత బాధ్యతలు, విద్యార్థులకు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల జారీ, మెజిస్టీరియల్ బాధ్యతలు, ప్రకృతి వైపరీత్యాల్లో పౌరులకు సరైన రక్షణ, వసతి కల్పించడం, ఓటరు నమోదు కార్యక్రమం, ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వహణ బాధ్యతలు, వీఐపీ, వీవీఐపీ ప్రోటోకాల్ బాధ్యతలను రెవెన్యూ శాఖ సమర్థంతంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం రెవెన్యూ డే ఉపయోగపడుతుందన్నారు.

టీడీపీ నేత నారాయణ అల్లుడిపై

కేసు నమోదు

▸ పన్నులు ఎగ్గొట్టారని డీటీసీ ఫిర్యాదు

▸ రాజకీయ వర్గాల్లో కలకలం.. కక్ష సాధింపే: టీడీపీ

నెల్లూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ అల్లుడు కొత్తప పునీత్‌పై బాలాజీ నగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పన్నులు ఎగ్గొట్టారంటూ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్(డీటీసీ) బి. చందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో సోమవారం పలువురు టీడీపీ నాయకులు, సానుభూతిపరులు, ఆడిటర్ల ఇళ్లపై దాడులు నిర్వహించారు. సెర్చ్ వారెంట్ లేకుండా, నోటీసు ఇవ్వకుండా పోలీసులు సోదాలు నిర్వహించడం రాజకీయంగా కలకలం రేపింది. ఈ సోదాల్లో లెక్కలు చూపని రూ.1.81 కోట్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, కేసుకు సంబంధం లేని టీడీపీ మహిళా నేత ముప్పాళ్ల విజేత నివాసంలో పోలీసులు సోదాలు చేయడంపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తనిఖీలపై నెల్లూరు ఎస్పీ కె. తిరుమలేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. డీటీసీ నుంచి వచ్చిన రిపోర్టు ఆధారంగా పునీత్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. నారాయణ విద్యాసంస్థలకు అనుబంధంగా ఎన్‌స్పైరా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ అనే సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోందని, పునీత్ డైరెక్టర్‌గా ఉన్నారని తెలిపారు. గత జూన్‌లో ఎన్‌స్పైరా సంస్థ నారాయణ సంస్థతో 92 బస్సులు అద్దె రూపంలో సమకూర్చేలా ఒప్పందం కుదుర్చుకుందని, ఇదే కంపెనీ జీఎస్టీని క్లెయిమ్ చేసుకుందని చెప్పారు. కానీ, ఇన్‌వాయిస్ మాత్రం నారాయణ విద్యాసంస్థల పేరుతో తీసుకుని, డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి నారాయణ విద్యాసంస్థల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారని వివరించారు. డీటీసీ బి. చందర్ మాట్లాడుతూ.. ఇన్‌స్పైరా సంస్థకు ఎలాంటి స్కూళ్లు లేవని, కానీ ఆ సంస్థ బస్సులను కొనుగోలు చేసిందని తెలిపారు. కాగా, విద్యాసంస్థలకు నడుస్తున్న బస్సులన్నీ ఆ విద్యా సొసైటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఫలానా చట్టం ప్రకారం ట్యాక్స్ తక్కువ కడుతున్నారని నోటీసు ఇస్తే, దానిని పరిశీలించి కడతామన్నారు.

కేసుల్లో ఇరికించాలనే

నారాయణను ఏదోరకంగా కేసులో ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. సొసైటీ పేరుతో ఫోర్జరీ డాక్యుమెంట్లతో బస్సులు రిజిస్టర్ చేశారని, దీనివల్ల రవాణా శాఖకు చెల్లించాల్సిన పన్నును ఎగ్గొట్టారని చేస్తున్న అభియోగాల్లో ఏమాత్రం పసలేదని, వేధింపుల కోసం ఈ కారణాలను వెతుకున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. బస్సుల రికార్డులకు, సోదాలు జరిగిన ఇళ్ల యజమానులకు ఎలాంటి సంబంధం లేదని అంటున్నారు. ఇదే సమయంలో సోమవారం సోదాలు చేసిన వారిలో నారాయణ సంస్థలో పనిచేసే ఒకఉద్యోగి, ఒక డాక్టర్ ఉన్నారు. ముగ్గురు వ్యాపారులు, మరో ఇద్దరు టీడీపీ సానుభూతిపరులు, నారాయణ అనుచరుల ఇళ్లు ఉన్నాయి. ఎన్నికల డబ్బులు దొరుకుతాయనే ఉద్దేశంతోనే వీరి ఇళ్లలో సోదాలు చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. మూడు రోజుల కిందట నారాయణ ఎన్నికల కోసం రూ.వందల కోట్లు పోగు చేసి నెల్లూరులో భద్రపరిచారంటూ అధికార పార్టీకి అనుకూల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ నిధులను స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో స్కూలు బస్సుల రికార్డుల పేరుతో దాడులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోలీసులకు ఆ అర్హత లేదు

జీఎస్టీకి ప్రత్యేక చట్టం ఉంది

కేసు మాచవరం పరిధిలోకి రాదు

ప్రత్తిపాటి శరత్ కస్టడీ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

విజయవాడ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): "పన్ను ఎగవేతదారులకు ఎలాంటి శిక్షలు వేయాలి అన్న దానికి సంబంధించి ప్రత్యేకంగా జీఎస్టీ చట్టం ఉంది. ఆ చట్టం పరిధిలోని అంశంపై కేసు నమోదు చేసే అర్హత మాచవరం పోలీసులకు లేదు. పైగా శరత్‌ను కస్టడీకి కోరే అవకాశం లేదు" అని న్యాయవాది కిలారు బెనర్జీ వాదనలు వినిపించారు. పన్ను ఎగవేత కేసులో అరెస్టయి జైలులో ఉన్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ పోలీసు కస్టడీ పిటిషన్‌పై విజయవాడ ఒకటో ఏసీఎంఎం కోర్టులో సోమవారం వాదనలు జరిగాయి. శరత్ తరఫున బెనర్జీ వాదనలు వినిపించారు. పోలీసుల తరఫున హైకోర్టు పీపీ దుష్యంత్ రెడ్డి వాదనలు వినిపించారు. జీఎస్టీ ఎగవేతలో శరత్ కీలకంగా వ్యవహరించారన్నారు. ఆయన కనుసన్నల్లోనే స్కాం జరిగిందన్నారు. ఆసమయంలో శరత్ తండ్రి పుల్లారావు మంత్రిగా ఉన్నారన్నారు. ఇరువర్గాల వాదనలను విన్న తర్వాత న్యాయాధికారి కరీముల్లా తీర్పును ఈ నెల ఆరో తేదీకి రిజర్వు చేశారు.

ఎన్నికల 'విజన్'

▸ నేడు విశాఖ పారిశ్రామికవేత్తలతో సీఎం జగన్ భేటీ

▸ అవసరం వస్తేనే గుర్తొచ్చే 'విశాఖ'

▸ ఐదేళ్లలో ఇదే తొలిసారి, అదీ ఎన్నికల ముందు..

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సీఎం జగన్‌కు ఎన్నికల వేళ విశాఖపట్నం అభివృద్ధి గుర్తుకు వచ్చింది. ఇక్కడ పారిశ్రామికవేత్తలు ఉన్నారని, వారితో చర్చించాలనే ఆలోచన కలిగింది. ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా వారికి అవకాశం ఇవ్వని, ఆయన ఇప్పుడు అందరినీ సమావేశానికి రావాలని పిలుపునిచ్చారు. రుషికొండలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో 'వైజాగ్ విజన్..ఫ్యూచర్ విశాఖ' పేరుతో మంగళవారం నిర్వహించే సమావేశానికి రావాలని ఐటీ, పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్నాథ్.. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తలను కోరారు. దీనికి ఇతర రాష్ట్రాల నుంచి కూడా పారిశ్రామివేత్తలు, వ్యాపారులు వస్తున్నారని, మొత్తం రెండు వేల మందికి ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. విశాఖ నగరంలోని పారిశ్రామికవేత్తలు అంతా వచ్చేలా చూసే బాధ్యతను విశాఖపట్నం పోర్టు అధికారులకు అప్పగించారు. దీనికి సన్నాహక సమావేశం పోర్టు అధికారులు సోమవారం రాత్రి నోవాటెల్‌లో నిర్వహించారు.

10శాతం కూడా రాని పెట్టుబడులు

ఏడాది క్రితం సరిగ్గా మార్చిలోనే భారీ పెట్టుబడిదారుల సదస్సు నిర్వహించారు. దీనికి అంబానీ, అదానీలను రప్పించారు. వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్టు ప్రకటనలు చేయించారు. ఈ సదస్సు నిర్వహణ బాధ్యతలను బైమ్స్ గ్రూపు సంస్థకు అప్పగించారు. రూ.52 కోట్లు ఖర్చు చేశారు. ఇరవై వేల మంది హాజరవుతున్నారని ప్రచారం చేశారు. ఏయూ విద్యార్థులు, వైసీపీ నాయకులతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేయించేశారు. కానీ అంతా కలిపి ఐదు వేల మందికి మించి రాలేదు. సదస్సులో రూ.13.05 లక్షల కోట్ల పెట్టుబడులకు 352 ఎంఓయూలు చేసుకున్నామని, వీటి ద్వారా 6.03 లక్షల మందికి ఉద్యోగాలు దక్కుతాయని ప్రకటించారు. పర్యాటక రంగంలో 117 ఒప్పందాల ద్వారా రూ.22,096 కోట్లు వస్తాయని, వాటి ద్వారా 30,787 మందికి ఉపాధి లభిస్తుందని ఆ శాఖ మంత్రి రోజా నాడు వెల్లడించారు. ప్రతి రెండు వారాలకు ఒకసారి సమీక్షలు నిర్వహించి, ప్రతి నెల రెండు ప్రాజెక్టులు లాంచ్ అయ్యేలా చూస్తామని మంత్రి గుడివాడ అప్పట్లో చెప్పారు. ఇందులో ఏదీ కార్యరూపం దాల్చలేదు. పెట్టుబడుల్లో కనీసం పది శాతమూ రాలేదు.

శంకుస్థాపన చేసినా..

విశాఖలో 400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అదానీ డేటా సెంటర్‌కు గత ఏడాది మే నెలలో జగన్ శంకుస్థాపన చేశారు. రూ.22 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. మధురవాడలో 290 ఎకరాల కొండను దఫదఫాలుగా రాసిచ్చేశారు. లీజు పద్ధతిన ఇవ్వాల్సిన భూములకు నేరుగా సేల్ డీడ్ ఇచ్చారు. ఆ కొండపైకి అందమైన రహదారి నిర్మించారు. కానీ ఇప్పటికీ అక్కడ పని ప్రారంభం కాలేదు. ఎవరూ పైకి వెళ్లకుండా అడ్డంగా బండరాళ్లను వేశారు. మంత్రి అమర్నాథ్ విశాఖపట్నానికి తామే ఇన్ఫోసిస్ కంపెనీని తెచ్చామని బుకాయిస్తున్నారు. కానీ అందులో రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయమే లేదు. రీజనల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటులో భాగంగా ఇన్ఫోసిస్... విశాఖలో ఒక కేంద్రం ఏర్పాటు చేసింది. అందులో కొత్తగా ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదు. పదేళ్లకుపైగా పనిచేస్తున్నవారే అక్కడ ఉన్నారు. రాన్‌స్టాడ్ సంస్థ ఒకటి ఏర్పాటైంది. అది ఉద్యోగులను సరఫరా చేసే ఏజెన్సీ. అందులో కూడా ఏపీ ప్రభుత్వ పాత్ర ఏమీ లేదు. డబ్ల్యూఎన్ఎస్, పాత్ర తదితర పాత కంపెనీలు కేంద్ర పథకాలను ఉపయోగించుకొని ఎస్‌టీపీఐ ద్వారా విస్తరణకు వెళ్లాయి. వాటిలో బీపీవో ఉద్యోగాలు కల్పించాయి. అందులో కూడా రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేదు. విశాఖ ఐటీ కంపెనీలకు రాయితీలను వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఇవ్వడం లేదు. ఓ సామాజిక వర్గానికి చెందిన కొద్ది కంపెనీలకు మాత్రమే ఇచ్చారు. సుమారు రూ.130 కోట్ల బకాయిలు ఉన్నాయి. లాభం లేదని కొందరు హైకోర్టులో కేసు వేశారు. అయినా ఇంకా నిధులు విడుదల చేయలేదు.

అవసరమైనప్పుడే సమావేశాలు

విశాఖలో పారిశ్రామికవేత్తల అవసరం వచ్చినప్పుడే వైసీపీ ఇన్‌చార్జులు, మంత్రులు, భేటీలు ఏర్పాటు చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక స్థానిక సంస్థల ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చాయి. ఈ రెండు సమయాల్లో ఆయా వర్గాల ఓట్లను ఆకర్షించడానికి ఎంపీ విజయసాయిరెడ్డి అధ్యక్షతన ఒకసారి, వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన మరోసారి పారిశ్రామికవేత్తలతో సమావేశాలు పెట్టారు. విశాఖ జాతీయ రహదారిలో 12 ఫ్లైఓవర్లు నిర్మిస్తామని, ట్రాఫిక్ సమస్యలు తీరుస్తామని హామీలిచ్చారు. కానీ ఏదీ చేయలేదు. రుషికొండ ఐటీ పార్కులో ఐటీ సంస్థల కోసం రూ.190 కోట్లతో నిర్మించిన మిలీనియం టవర్లను నాలుగేళ్లుగా ఖాళీగా ఉంచారు. బాబు హయాంలో వచ్చిన కాండ్యుయెంట్ తప్ప ఆ కొండపైకి కొత్త కంపెనీ ఏదీ రాలేదు. ఐదేళ్లలో విశాఖలో పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ కావడం ఇదే ప్రథమం.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎస్ జవహర్ రెడ్డి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

బాలల భారత రాజ్యాంగ ప్రవేశిక

▸ పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎస్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శాసన మండలి సభ్యులు కేఎస్ లక్ష్మణరావు ప్రచురించిన 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకాన్ని సోమవారం అమరావతి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీని జవహర్‌రెడ్డి అభినందించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ బాల బాలికల్లో రాజ్యాంగ ప్రవేశిక గొప్పదనాన్ని తెలియజేసే లక్ష్యంతో ఈ పుస్తకాన్ని ప్రచురించడం జరిగిందన్నారు. భారత రాజ్యాంగ లక్ష్యాలను పరిరక్షించుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

ఏటా జనవరి 22న ఉద్యోగ నోటిఫికేషన్లు

▸ 50 పంటలకు కనీస మద్దతు ధర.. ఎక్కడి కక్కడ డీ అడిక్షన్ కేంద్రాలు

▸ బీజేపీ రాష్ట్ర మేనిఫెస్టో కమిటీ నిర్ణయాలు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఏటా జనవరి 22న నోటిఫికేషన్, కేంద్రం ఇచ్చేది కాకుండా రాష్ట్రం తరఫున రైతులకు కనీసం 50పంటలకు మద్దతు ధర అమలు, అప్పుల నుంచి ఆదాయం దిశగా రాష్ట్రాన్ని తీసుకెళ్లడం.. మహిళల మాన, ప్రాణాలకు భరోసా.. దేవాలయాల రక్షణకు ప్రత్యేక చర్యలు.. పారిశ్రామిక పురోభివృద్ధి.. రెవెన్యూ చట్టాలు ప్రజలు ఉపయోగపడేలా చేయడం'.. వంటి పలు అంశాలను బీజేపీ మేనిఫెస్టో కమిటీ పేర్కొంది. సుధీష్ రాంబొట్ల అధ్యక్షుడిగా, రిటైర్డ్ ఐఏఎస్ దాసరి శ్రీనివాసులు, వినూష రెడ్డి, పాకా సత్యనారాయణ, విల్సన్, దినకర్‌లతో కూడిన మేనిఫెస్టో కమిటీ పది అంశాలపై 'కసరత్తు చేసి పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి నివేదిక ఇచ్చింది. మద్యం మహమ్మారి రాష్ట్రంలో ఎన్నో కుటుంబాల్ని నాశనం చేస్తోంది.. నిషేధం చేస్తానని మాటిచ్చిన వైసీపీ మడమ తిప్పేసి నాసిరకం లిక్కర్‌తో ప్రజల్ని దోచుకొంటూ మరోవైపు చంపేస్తోంది.. గంజాయి, డ్రగ్స్‌కు రాష్ట్రంలో యువతను అలవాటు చేస్తోంది.. ఎక్కడి కక్కడ డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు మత్తు రక్కసి నుంచి వ్యసనపరుల్ని బయట పడేయాలి' అని కమిటీ అభిప్రాయ పడింది. రాష్ట్రంలో యువత ఉద్యోగ, ఉపాధిలేక తీవ్ర అసంతృప్తితో ఉందని, ఏటా జనవరి 22న జాబ్ క్యాలెండర్ ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తామని పేర్కొంది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలంటే తీరప్రాంత అనుకూలతలు చూసి పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు మేకిన్ ఆంధ్రకు వీలైనంత ప్రోత్సాహం కల్పించాలనే ఆలోచన కమిటీ చేసింది. రైతులు, మధ్య తరగతివారి భూములకు రక్షణ లేకుండా పోయిందని, పూర్తి రక్షణ ఉండేలా రెవెన్యూ చట్ట సవరణ చేయాల్సి ఉందని ఒక సభ్యుడు అభిప్రాయ పడగా, దేవాలయాల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రంగరాజు ప్రతిపాదించారు. హిందూ ఆలయాలపై ప్రభుత్వ పెత్తనాన్ని తగ్గించడంతోపాటు రాజకీయ జోక్యాన్ని పూర్తిగా నిషేధించి ధర్మ పరిరక్షకుల చేతిలో ఆలయాలు పెట్టాలని, ప్రభుత్వానికి కేవలం పర్యవేక్షణ బాధ్యత మాత్రమే ఉండాలని సూచించింది. అందరి అభిప్రాయాలు విన్న తర్వాత పురందేశ్వరి మాట్లాడుతూ.. ఏదో రాజకీయ పార్టీ వెయ్యి రూపాయలు ఇస్తే మనం రెండు వేలు ఇస్తామనే ధోరణికి ఎట్టి పరిస్థితుల్లోనూ వెళ్లొద్దని మేనిఫెస్టో కమిటీకి సూచించారు. 'గుజరాత్ ఎలా అభివృద్ధి చెందింది. యూపీ పేదరికం నుంచి మిగులు బడ్జెట్ ఎలా సాధించింది. ఉచితాలతో కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు ఎలా ఇబ్బంది పడుతున్నాయో పరిశీలించి ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ఏమిచేయవచ్చో పరిశీలించి, వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి' అని సూచించారు. ప్రజలు అభివృద్ధితోపాటు ఉద్యోగ, ఉపాధి కోరుకొంటున్నారని.. మెరుగైన పాలనతోపాటు కేంద్రం సహకారంతో రాష్ట్రానికి ఏమేమి తీసుకొచ్చి డబులింజన్ ప్రగతి సాధించగలమో కసరత్తు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతితోపాటు.. పరిశ్రమలు, మౌలిక వసతులు, రోడ్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. సభ్యులందరి అభిప్రాయాలు తీసుకుని, తన సూచనలు దృష్టిలో పెట్టుకుని మరో పది రోజుల్లో మేనిఫెస్టో పూర్తిస్థాయిలో రూపొందించాలని సుధీష్ రాంబొట్ల, పాకా సత్యనారాయణకు బాధ్యతలిచ్చారు.

సెల్‌టవర్‌పై 11 గంటలు..

▸ ఉద్యోగాలివ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటా!

▸ పురుగు మందు డబ్బాతో నిరుద్యోగి హల్‌చల్

మంగళగిరి సిటీ, మార్చి 4: డీఎస్సీ 1998లో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు జిల్లాకు చెందిన డీఎస్సీ-1998 అభ్యర్థి భైరవకోన శ్రీనివాసరావు సోమవారం ఉదయం మంగళగిరి ఎన్నారై వైజంక్షన్ సమీపంలోని సెల్ టవర్ ఎక్కాడు. మెడలో వైసీపీ కండువా వేసుకుని.. సీఎం జగన్ ఫొటోతో కూడిన ఫ్లెక్సీ, వైసీపీ జెండాలు, పురుగు మందు డబ్బా తీసుకుని పైకి వెళ్లాడు. అక్కడి నుంచే ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. డీఎస్సీ 1998లో మిగిలిన 1,840 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరాడు. ఇప్పటికే 4వేల మందిని ఉద్యోగాల్లోకి తీసుకోగా, వారిలో దాదాపు రెండు వేల మంది ఉద్యోగ విరమణ పొందారని, వారి స్థానంలో మిగిలిన అభ్యర్థులను భర్తీ చేయాలని డిమాండ్ చేశాడు. ఉద్యోగాలిచ్చేందుకు సీఎం జగన్ సుముఖంగా ఉన్నా మంత్రి బొత్స సత్యనారాయణ అడ్డుతగులుతున్నారని ఆరోపించాడు. వైసీపీ కార్యకర్తనైన తన పరిస్థితే ఇలా వుంటే.. ఇక సామాన్య నిరుద్యోగుల పరిస్థితేమిటని ప్రశ్నించాడు. ఉద్యోగాలిస్తామని మంత్రి బొత్స స్పష్టమైన హామీ ఇస్తేనే కిందకు దిగుతానని, సాయంత్రంలోగా సమాధానం ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాసరావును కిందకు దించేందుకు ప్రయత్నాలు చేశారు. రాత్రి 8:30 వరకు ఆహారం, తాగునీరు లేకపోవడంతో శ్రీనివాసరావు ఓపిక నశించి ఎట్టకేలకు సెల్‌టవర్ దిగాడు. కిందకు వచ్చిన వెంటనే స్పృహ కోల్పోవడంతో పోలీసులు సపర్యలు చేశారు.



సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న శ్రీనివాసరావు
పురుగు మందు డబ్బాతో శ్రీనివాసరావు



గొంతులోకి ఆహారం తన్నుకురావడం, ఛాతీలో మంట, పుల్లటి త్రేన్పులు లాంటి అసిడిటీ లక్షణాలు కనిపిస్తే, చేతికందిన యాంటాసిడ్ మింగేస్తూ ఉంటాం. కానీ సమస్యను తాత్కాలికంగా దూరం చేసే ఈ మందుల మీదే ఆధారపడుతూ ఉంటే, సమస్య మరింత ముదిరి కడుపులో అల్సర్లు తయారవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అల్సర్... ఆమడదూరం

తిన్న ఆహారం జీర్ణం కావడానికి కడుపులో ఒక ఏర్పాటు ఉంటుంది. అదే హైడ్రోక్లోరిక్ యాసిడ్. ఈ ఆమ్లం నుంచి రక్షణ కోసం జీర్ణాశయం లోపల పల్చని పొర ఉంటుంది. అయితే ఈ యాసిడ్ అవసరానికి మించి ఉత్పత్తి అయినా, జీర్ణాశయం లోపలి రక్షణ పొర బలహీనపడినా సమస్యలు మొదలవుతాయి. అరుదుగా కొందరిలో అసలు లక్షణాలే కనిపించవు. అయితే అసిడిటీ నుంచి తప్పించుకోవడం కోసం యాంటాసిడ్స్ మీద ఆధారపడుతూ ఉంటాం. కానీ నిజానికి ఈ మందులన్నీ ఆ ఆమ్లాన్ని పలుచన చేసేవే తప్ప దాని స్రావాన్ని నియంత్రించలేవు. అలాగే జీర్ణాశయం లోపలి రక్షణ పొర బలహీన పడటానికి కారణాల్ని తెలుసుకుని వాటిని సరిద్దిదనంతకాలం ఈ సమస్య పదే పదే తలెత్తుతూనే ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే మూల కారణాన్ని కనిపెట్టి తగిన చికిత్సనందించాలి. ఒకవేళ పూర్తిగా యాంటాసిడ్‌ల మీదే ఆధారపడుతూ కాలం గడిపేస్తూ ఉంటే కొంతకాలానికి సమస్య మరింత ముదిరి జీర్ణాశయం లోపలి గోడలు దెబ్బతిని పరిస్థితి సర్జరీకి దారితీయవచ్చు.

అల్సర్లలో రకాలు

సాధారణంగా అల్సర్లు జీర్ణాశయం, చిన్న పేగు మొదటి భాగమైన డియోడినమ్‌లో తలెత్తుతాయి. అల్సర్లు తలెత్తటానికి ఎన్నో కారణాలుంటాయి. శరీరంలో రక్షణ వ్యవస్థ మందగించటం వల్ల జీర్ణాశయం లోపలి పొర బలహీనమయితే అందుకు కారణాలను కనిపెట్టి వాటిని చక్కదిద్దాలి. ఒకవేళ ఆమ్లం అవసరానికి మించి ఉత్పత్తి అవుతుంటే దానికి మూల కారణాన్ని వెతికి దాన్ని సరిచేయటంతోపాటు స్రావం ఉత్పత్తిని నియంత్రించాలి. అలాగే అల్సరు రకం, తీవ్రత, మందులకు స్పందించే విధానం ఆధారంగా చికిత్సనందించాలి. అల్సర్లలో కూడా రకాలుంటాయి. అవేంటంటే...

- **ఆమ్లం కారణంగా:** అవసరానికి మించిన ఆమ్ల స్రావం వల్ల అల్సర్లు తలెత్తుతాయి.
- **బ్యాక్టీరియా వల్ల:** కలుషిత నీటి ద్వారా హెలికోబాక్టర్ పైలోరి అనే బ్యాక్టీరియా పొట్టలోకి చేరి అల్సర్లు తయారవుతాయి. ఈ అల్సర్లని నిర్లక్ష్యం చేస్తే క్యాన్సర్‌గా కూడా మారతాయి.
- **క్యాన్సర్:** క్యాన్సర్‌తో కూడిన అల్సర్లు కూడా తయారవుతాయి.

అల్సర్లకు ప్రధాన కారణాలు

అస్తవ్యస్థ జీవన విధానం, ఆహార నియమాలు పాటించకపోవటం, ఎక్కువ మసాలాలు, కారం ఉన్న ఆహారం ఎక్కువగా తీసుకోవటం, ఒత్తిడి, ఆందోళన, నొప్పి తగ్గించే మందులు, యాంటిబయాటిక్ మందుల్ని విచక్షణారహితంగా వాడటం, మద్యపానం, ధూమపానం, పొగాకు నమలటం, కాఫీలు ఎక్కువగా తాగటం, హెచ్.పైలోరీ బ్యాక్టీరియా జీర్ణాశయంలోకి చేరటం, క్యాన్సర్ మొదలైన కారణాల వల్ల అల్సర్లు తయారవుతాయి.

లక్షణాలు ఇలా...

ఛాతీ ఎముక, నాభికి మధ్య, పక్కటెముకల కింద, వీపులో నొప్పి అల్సర్ ప్రధాన లక్షణాలు. సాధారణంగా ఈ లక్షణాలు ఆహారం తీసుకున్న కొన్ని గంటల తర్వాత మొదలవుతూ ఉంటాయి. అంటే భోజనానికి భోజనానికి మధ్య ఖాళీ సమయంలో, రాత్రి వేళ విడవకుండా నొప్పి ఉంటుంది. అలాగే ఏదైనా ఆహారం తీసుకున్న వెంటనే నొప్పి తగ్గిపోతూ ఉంటుంది. కొందరిలో వాంతి, ఉబ్బరం లక్షణాలు కూడా ఉంటాయి. ఇవన్నీ అల్సర్ ప్రారంభ లక్షణాలు. అల్సర్ మరింత ముదిరినప్పుడు జీర్ణాశయం రక్తనాళాలు చిట్లి రక్తస్రావం అవుతుంది. రక్తస్రావం ఎక్కువగా ఉంటే రక్తం, యాసిడ్ కలిసి కాఫీ రంగులో వాంతులవుతాయి. మలం కూడా నలుపు రంగులో ఉంటుంది.

ఈ సమస్య మరింత ముదిరితే జీర్ణాశయంలో రంధ్రం పడి తిన్న ఆహారం పేగులు, పొట్ట మధ్య ఉండే ఖాళీ ప్రదేశంలోకి వెళ్లిపోతుంది. అప్పుడు ఎంతో ప్రమాదకరమైన పరిస్థితి వస్తుంది. ఈ స్థితికి చేరుకున్న రోగి ప్రాణాలను కాపాడటం కష్టం. కొందరిలో డియోడినమ్‌లో పదే పదే అల్సర్లు తయారవుతూ వాటంతటవే మానుతూ ఆ ప్రదేశంలో మచ్చలా తయారవుతుంది. ఈ మచ్చ వల్ల చిన్నపేగు మార్గం మూసుకుపోయి సమస్య తలెత్తుతుంది. దాంతో తిన్న ఆహారం వెంటనే వాంతి అయిపోతూ ఉంటుంది.

యాంటాసిడ్స్ వాడొచ్చా?

యాంటాసిడ్‌లు ప్రభావవంతమైనవి కావు. అవి కేవలం తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే అందించగలుగుతాయి. ఎందుకంటే ఏ రకమైన యాంటాసిడ్ అయినా పొట్టలోని ఆమ్లాన్ని స్థిరం చేయగలుగుతుందే తప్ప దాని ఉత్పత్తిని తగ్గించలేదు. ఆమ్లం ఉత్పత్తి కారణంగా తలెత్తే అల్సర్‌కైతే యాంటాసిడ్లను వాడినా పర్వాలేదు. అల్సర్‌కు కారణం బ్యాక్టీరియా, క్యాన్సర్‌లు అయిన పక్షంలో యాంటాసిడ్‌లు వాడుతూపోతే సమస్య మరింత ముదిరి ప్రాణాలకే ప్రమాదం తలెత్తే అవకాశం ఉంటుంది. కాబట్టి ఏ రకమైన అల్సరో తెలుసుకోకుండా తక్షణ ఉపశమనం కోసం యాంటాసిడ్లను వాడుతూ కూర్చోకూడదు. అల్సర్ లక్షణాలు అడపాదడపా అందరిలో ఏదో ఓ సందర్భంలో కనిపిస్తాయి. అయితే ఎప్పుడైనా భారీ భోజనం తిని అల్సర్ లక్షణాలు కనిపించినప్పుడు యాంటాసిడ్ వాడి ఉపశమనం పొందటం మంచిదే! అయితే ఆ అవసరం ఎంత తరచుగా వస్తుందో గమనించాలి. ఒకవేళ వారంలో నాలుగైదు రోజులు అల్సర్ లక్షణాలు కనిపించినా, పదే పదే యాంటాసిడ్ వాడాల్సిన అవసరం పడుతున్నా ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి. యాంటాసిడ్‌లకు దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. మెగ్నీసియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ అనే రెండు రకాల యాంటాసిడ్‌లలో వేర్వేరు సైడ్ ఎఫెక్ట్స్ కనిపిస్తాయి. అల్యూమినియం హైడ్రాక్సైడ్ కలిగిన యాంటాసిడ్ వల్ల మలబద్ధకం, మెగ్నీసియం హైడ్రాక్సైడ్ కలిగిన యాంటాసిడ్ వల్ల డయేరియా వస్తుంది. మనంతట మనం యాంటాసిడ్‌లను ఎంపిక చేసుకుంటే ఈ దుష్ప్రభావాలను బలవంతంగా భరించాల్సి ఉంటుంది. అలాకాకుండా వైద్యుల పర్యవేక్షణలో వాడితే ఆ సైడ్ ఎఫెక్ట్స్‌ను వైద్యుల దృష్టికి తీసుకెళ్తాం కాబట్టి వైద్యులు వేరే మందులను లేదా కాంబినేషన్ డ్రగ్స్‌ను సూచిస్తారు.

అల్సర్లు రాకుండా...



- సమయానికి ఆహారం తీసుకోవాలి.
- మసాలాలు, కారం, కొవ్వులు, పుల్లటి పదార్థాలు వీటిలో వేటి వల్ల మంట తలెత్తుతుందో కనిపెట్టి వాటికి దూరంగా ఉండాలి.
- కలుషిత నీరు తాగకూడదు. పరిశుభ్రత పాటించాలి.
- నొప్పి తగ్గించే మందులు పరిమితంగా వాడాలి.
- ఒత్తిడి తగ్గించుకోవాలి.
- ధూమపానం, మద్యం మానేయాలి.

మూలికా వైద్యం

యూరియా పెరిగితే?

ప్రతి ఒక్కరి రక్తంలో యూరియా ఉంటుంది. అయితే శరీరంలోని నిర్దిష్ట ప్రదేశంలో పనితీరు క్రమం తప్పడం మూలంగా రక్తంలోని అధిక యూరియాను శరీరం తొలగించలేకపోతూ ఉంటుంది. దాంతో పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ ఇబ్బందులను తొలగించాలంటే యూరియా ప్రభావాల పట్ల అవగాహన కలిగి ఉండాలి.

రక్తంలో యూరియా స్థాయి పెరిగితే మూత్రపిండాలు, ఇతర అంతర్గత అవయవాల్లో ఇబ్బందులు తలెత్తుతాయి. ఫలితంగా హార్ట్ ఫెయిల్యూర్, మూత్రసంబంధ సమస్యలు, వాంతులు, పల్చని విరేచనాలు, మధుమేహం వేధిస్తాయి. ఇదే పరిస్థితి దీర్ఘకాలం పాటు కొనసాగితే తీరని దాహం, ఒంట్లో నీరు నిల్వ ఉండిపోవడం, తలనొప్పి, నీరసం, తలతిరుగుడు, పొట్టలో నొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ ఇబ్బందులను తొలగించాలంటే రక్తంలో యూరియా స్థాయిని నియంత్రించాలి.




మూలిక ఔషధాలు

మూత్రక్రిచంతక చూర్ణం, పునర్నవ మందుర్, వరుణాధి వటి లాంటివి యూరియా వల్ల పెరిగిన మూత్రపిండాల మీది ఒత్తిడిని తగ్గిస్తాయి. రక్తంలోని యూరియాను తగ్గించి, మూత్ర వ్యవస్థ పనితీరును సరి చేస్తాయి.

- **పునర్నవ:** పున, నవ అనే రెండు పదాల నుంచి పునర్నవ జనించింది. పున అంటే మళ్లీ అనీ, నవ అంటే కలిసి అనీ అర్థం. రెండు ఔషధాలు కలిసి మూత్ర వ్యవస్థ పనితీరును మెరుగు చేస్తాయని చెప్పడమే ఈ మందు పేరు వెనక ఉన్న ఉద్దేశం. ఈ ఔషధం మూత్రపిండాల్లో నిల్వ ఉండిపోయిన అత్యధిక ద్రవాలను బయటకు వెళ్లగొట్టి, మూత్రపిండాల వాపును తగ్గిస్తుంది. ఈ ఔషధానికి ఎటువంటి దుష్ప్రభావాలూ ఉండవు.
- **వరుణ:** మూత్ర పిండాల్లోని సూక్ష్మ రాళ్లను విరగ్గొట్టి మూత్రం ద్వారా బయటకు వెళ్లగొట్టే శక్తి ఈ ఔషధానికి ఉంది. మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లను కూడా ఈ మందు నయం చేయగలదు. మూత్రనాళంలో పేరుకుపోయి మూత్రవిసర్జనకు ఆటంకంగా మారిన అంశాలను బయటకు వెళ్లగొట్టగలదు. మూత్రపిండాల వాపు, నొప్పులను కూడా నయం చేయగలదు.
- **గోఖుర:** మూత్రపిండాల్లో బలహీనపడిన కణాలకు కొత్త జీవం అందిస్తుంది. కొత్త కణాల పుట్టుకకు తోడ్పడుతుంది.
- **హైగ్రోఫిలియా ఆరిక్యులేటా:** రక్తంలో పెరిగిన యూరిక్ ఆమ్లాన్ని తగ్గించే ఔషధమిది.

ఈ ఔషధాలతో పాటు ఆహారంలో మాంసకృత్తుల స్థాయిని తగ్గించి, ఎక్కువగా ద్రవాహారం తీసుకుంటూ మర్దన, యోగాసనాలను అనుసరించాలి.

డ్రగ్స్... ఈ మధ్య కాలంలో తరచూ వార్తల్లో వినిపిస్తున్న పదం. యువతను నిర్వీర్యం చేసే ఈ డ్రగ్స్‌లో అనేక రకాలు ఉన్నాయంటారు అమెరికా గ్రీన్‌వ్యాలీలోని 'బ్రాడీ స్కూల్ ఆఫ్ మెడిసిన్'లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ ఉత్పల స్రవంతి. మత్తు పదార్థాలకు బానిసలైన వారికి చికిత్స చేయటంలో విశేషమైన అనుభవం ఉన్న స్రవంతి... మత్తు పదార్థాల్లో ఉన్న తేడాల గురించి... వాటికి అందుబాటులో ఉన్న చికిత్సల గురించి 'నవ్య డాక్టర్'కు ప్రత్యేకంగా వివరించారు.



డ్రగ్స్ వాడకం.. ఒక రోగమే!

"డ్రగ్స్ అనే పదాన్ని అందరూ విరివిగా వాడేస్తూ ఉంటారు. కానీ అన్ని డ్రగ్స్ మాదకద్రవ్యాలు కావు. వాస్తవానికి కొన్ని రకాల మత్తు పదార్థాలను పరిమితమైన డోస్‌లో శరీరానికి ఎక్కువ నొప్పి తెలియకుండా ఉండటానికి ఇస్తూ ఉంటారు. ఇవి తాత్కాలికమైనవి. మెదడుపై పని చేయనవి. ఉదాహరణకు మన దేశంలో కొన్ని వందల సంవత్సరాలుగా నల్లమందును కొన్ని రకాల మానసిక వ్యాధుల నివారణకు వాడుతున్నారు. అయితే ఈ మధ్యకాలంలో అమెరికాలో జరిపిన తాజా అధ్యయనాలలో నల్లమందు లాంటి వాటివల్ల తాత్కాలిక ఉపశమనమే తప్ప వేరే ఇతర దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉండవని తేలింది. ఇక కొందరు మాదకద్రవ్యాలకు ఎందుకు అలవాటుపడతారనేది చాలా ముఖ్యమైన ప్రశ్న. కొందరు ఏంగ్జైటీని తగ్గించుకోవటానికి వీటిని వాడటం మొదలుపెడితే... మరికొందరు తమలో ఉన్న భయాలను తొలగించుకోవటానికి వాడతారు. దీనివల్ల తమకు స్వేచ్ఛ లభించినట్లు భావిస్తారు. క్రమేపీ దానిని అలవాటుగా మార్చుకుంటారు.

ఎన్ని రకాల డ్రగ్స్ ఉన్నాయి?

మనం ప్రతి రోజూ రకరకాల మాదకద్రవ్యాల పేర్లు వింటూ ఉంటాం.



వీటిలో ముఖ్యమైనవి గంజాయి(కెనబీస్), కొకైన్, హెరాయిన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ, ఎల్ఎస్‌డీ. వీటిలో ఎక్కువ ప్రమాదకరమైనవి హెరాయిన్, కొకైన్. మన దేశంలో ఇప్పటిదాకా హెరాయిన్ అలవాటు వదిలించటానికి ట్రీట్‌మెంట్‌లు అందుబాటులోకి రాలేదు. మనం ఈ మాదకద్రవ్యాల గురించి తెలుసుకుందాం.

గంజాయి: ఒకప్పుడు దీనిని కేవలం నిద్రపట్టడానికి అవసరమైన సాధనంగా వాడేవారు. ఆ తర్వాత దీని వాడకం బాగా పెరిగింది. ఈ మధ్యకాలంలో మన తెలుగు రాష్ట్రాల్లో విరివిగా లభిస్తోందని వార్తలు వినిపిస్తున్నాయి. దీని ఖరీదు తక్కువ కాబట్టి.. స్కూళ్లలోను, కాలేజీలలోను చదివేవారు ఎక్కువగా వాడుతూ ఉంటారు. ఈ మధ్యకాలంలో ఇది ఆన్‌లైన్‌లో కూడా ప్రవేశించింది. ఆన్‌లైన్‌లో 'సీబీడీ' పేరిట గంజాయి వేర్వేరు రూపాల్లో దొరుకుతూ ఉంటుంది. సాధారణంగా గంజాయి... మన మెదడులో ఎనండోమైడ్ అనే ఒక కెమికల్‌పై ప్రభావం చూపిస్తుంది. దీనివల్ల భయం, సంకోచం, బెరుకుతనం... తొలగిపోతాయి. స్వేచ్ఛగా తమకు నచ్చిన విషయాలను చెప్పగలుగుతారు. నిర్ణయాలు తీసుకోవటానికి అవసరమైన రియాక్షన్ సమయం తగ్గిపోతుంది. అందువల్ల యుక్తవయస్సులో ఉన్నవారు దీనిని ఎక్కువగా వాడుతూ ఉంటారు. దీని వల్ల తాత్కాలికంగా అనేక లాభాలు ఉన్నట్లు కనిపిస్తాయి. కానీ దీని దీర్ఘకాల ప్రభావం చాలా చెడు చేస్తుంది. దీనిని ఎక్కువ కాలం ఉపయోగిస్తే- మెదడులోని ముందు భాగం ఫ్రంటల్ కార్టెక్స్‌పై ప్రభావం చూపుతుంది. దీనికి బానిస అయినవారి కోసం ప్రత్యేకమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

హెరాయిన్: అత్యంత ప్రమాదకరమైన మాదకద్రవ్యమిది. రకరకాల రంగుల్లో లభిస్తుంది. రంగుల ఆధారంగా దీని శక్తి మారుతూ ఉంటుంది. హెరాయిన్ మన మెదడులోని కణాలపై నేరుగా ప్రభావం చూపిస్తుంది. దీని వల్ల అతివేగంగా దీనికి అలవాటు పడిపోతారు. ఇప్పటి దాకా మన దేశంలో ఈ అలవాటు ఉన్నవారికి చికిత్స చేసే సమర్థమైన పద్ధతులు అందుబాటులోకి రాలేదు. అమెరికాలో అయితే హెరాయిన్ డిఎడిక్షన్‌కు మంచి చికిత్సలు ఉన్నాయి. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి.

- 'జీన్స్ లోడ్ ది గన్... బట్ ఎన్విరాన్‌మెంట్ పుల్స్ ది ట్రిగ్గర్' అంటారు. మాదకద్రవ్యాల వాడకం అలవాటు కావటానికి జన్యువులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. చుట్టుపక్కల ఉన్న వాతావరణం వీటికి తోడ్పడితే ఆ ప్రభావం మరింతగా ఉంటుంది.
- మాదకద్రవ్యాలకు అలవాటుపడిన వారిని క్రిమినల్స్‌లా చూడకూడదు. సానుభూతితో అర్థం చేసుకోవాలి. అప్పుడే వారు త్వరగా కోలుకుంటారు.
- తల్లితండ్రులు యుక్త వయస్సులో ఉన్న పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. వారు ఏవైనా మానసిక సమస్యలతో బాధపడుతున్నారేమో గమనించాలి. మానసిక సమస్యలు ఉన్నవారు త్వరగా మాదకద్రవ్యాలకు అలవాటు పడే అవకాశముంది.

హెరాయిన్ అలవాటు నుంచి తప్పించటానికి చవకగా లభించే ఒక మందును మన దేశానికి చెందిన రెడ్డి ల్యాబ్స్ తయారు చేసి సరఫరా చేస్తోంది. కానీ ఆ మందు మన దేశంలో లభించదు. దేశంలో హెరాయిన్ బారినపడే వారి సంఖ్య పెరుగుతోంది కాబట్టి- ఈ మందు మన దేశంలో కూడా లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటే మంచిది.

కొకైన్: ఇతరులతో మాట్లాడటానికి సంకోచించేవారు.. భయాలు ఎక్కువగా ఉన్నవారు తీసుకొనే మాదక ద్రవ్యమిది. ఉన్నత వర్గాల్లో దీనిని ఎక్కువగా తీసుకుంటారు. ముఖ్యంగా పార్టీలకు వెళ్లేవారిలో దీని వాడకం ఎక్కువ కనిపిస్తుంది. దీనిని వాడిన తర్వాత సంకోచాలన్నీ తొలగిపోతాయి. ఎటువంటి భయం లేకుండా ఇతరులతో మాట్లాడగలుగుతారు. డ్యాన్స్ చేయగలుగుతారు. అందువల్ల దీనిని ఎక్కువగా పార్టీ డ్రగ్‌గా పిలుస్తూ ఉంటారు.

క్లబ్ డ్రగ్స్: ఎండీఎంఏ, ఎక్స్‌టసీ, ఎల్ఎస్‌డీ మొదలైన వాటిని మనం క్లబ్ డ్రగ్స్‌గా పిలుస్తూ ఉంటారు. వీటి వల్ల ఎక్కువ సేపు ఉత్సాహంగా ఉండగలుగుతారు. ముఖ్యంగా యువతలో వీటి వాడకం చాలా ఎక్కువగా కనిపిస్తుంది. ఇవి ఒకసారి అలవాటు అయితే తరచూ వాటినే కోరుకుంటూ ఉంటారు.

చికిత్సలు: అమెరికాలో మాదకద్రవ్యాల వినియోగం ఆధారంగా చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. సొసైటీ ఆఫ్ ఎడిక్షన్ మెడిసిన్ వారి నిర్వచనం ప్రకారం... మాదకద్రవ్యాలకు అలవాటుపడటం కూడా ఒక దీర్ఘకాలిక రోగం లాంటిదే! దీర్ఘకాలిక రోగాలకు ఏ విధమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయో.. అదే విధంగా మాదక ద్రవ్యాల అలవాటు నుంచి తప్పించటానికి అలాంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. కొద్దిగా అలవాటు ఉన్నవారికి చికిత్సను అందిస్తే- 30 నుంచి 90 రోజుల్లో అలవాటు నుంచి బయట పడే అవకాశం ఉంటుంది. అయితే ఒకసారి చికిత్స పొందిన తర్వాత కూడా మళ్లీ ఆ మార్గంలో ప్రయాణించే అవకాశాలు ఉంటాయి. అలాంటి పరిస్థితులు రాకుండా చూడాల్సింది కుటుంబ సభ్యులు.. చుట్టూ ఉన్న సమాజమే!

డాక్టర్ ఉత్పల స్రవంతి, ఎండీ
అసిస్టెంట్ ప్రొఫెసర్ - అడిక్షన్ మెడిసిన్
బ్రాడీ స్కూల్ ఆఫ్ మెడిసిన్
గ్రీన్‌వెల్లి, నార్త్‌కెరిలినా, అమెరికా



వేసవిలో బరువు తగ్గడం తేలిక. కాబట్టి ఈ రుతువును శరీరంలో పేరుకున్న కొవ్వును కరిగించుకోవడానికి ఉపయోగించుకోవాలి. ఇందుకోసం జిమ్‌కు వెళ్లలేని వారు ఇంట్లోనే కొవ్వు కరిగించే వ్యాయామాలు చేసుకోవచ్చు.

ఇంటిపట్టునే వ్యాయామం

ఎలాంటి వ్యాయామం మొదలుపెట్టాలన్నా మొదట శరీరాన్ని వ్యాయామానికి సిద్ధం చేయాలి. ఇందుకోసం స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. ఆ తర్వాతే అసలైన వ్యాయామాలను మొదలుపెట్టాలి. ఇందుకోసం నేల మీద పడుకుని సీతాకోకచిలుక ఆకారంలో కాళ్లూ, చేతులూ కదిలించాలి. ఆ తర్వాత...

కాంబో వర్కవుట్!

- **హై నీస్:** కాళ్ల మధ్య అడుగు దూరం ఉండేలా నిలబడాలి. మోకాళ్లను మడిచి నడుము దగ్గరకు మార్చి, మార్చి లేపుతూ ఉండాలి. ఇలా కాళ్లను లేపినప్పుడు చేతులతో మోకాళ్లను తాకుతూ ఉండాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- **బర్పీ:** రెండు చేతులు గాల్లోకి లేపి ఎగరాలి. వెంటనే ముందుకు నేల మీద పడుకోవాలి. ఆలస్యం చేయకుండా లేచి నిలబడి మళ్లీ గాల్లోకి లేవాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- **మౌంటెయిన్ క్లైంబ్:** చేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో మిగతా శరీరం నేలను తాకకూడదు. ఈ భంగిమలో ఉండి, పర్వతం ఎక్కుతున్నట్టుగా కాళ్లను నడుము దగ్గరకు, కిందకూ మార్చి, మార్చి కదిలించాలి. ఇలా 30 సెకండ్ల పాటు చేయాలి.
- **ప్లాంక్:** మోచేతులు, పాదాల ఆసరాతో నేల మీద బోర్లా పడుకోవాలి. ఈ భంగిమలో మిగతా శరీరం నేలను తాకకూడదు. ఇలా 30 సెకండ్లు ఉండాలి.

ఈ వ్యాయామాలు 3 సెట్లు చేయాలి.

సూపర్‌మ్యాన్!

చేతులు, కాళ్లూ చాపి కొద్దిగా వంపు తిరిగిన విల్లులా శరీరాన్ని వంచి ఉంచే సూపర్‌మ్యాన్ వ్యాయామం ఇది. ఇందుకోసం...

- నేల మీద బోర్లా పడుకోవాలి.
- చేతులు ముందుకు చాపాలి.
- ఛాతీ, పొట్ట, నడుము నేల మీద ఆనించి ఉంచి, ముందుకు చాపిన చేతులను గాల్లోకి లేపాలి.
- చేతులు లేపిన విధంగానే కాళ్లూ వెనక్కి లేపాలి.

ఈ భంగిమలో 30 నిమిషాలు ఉంటూ, 5 సెట్లు చేయాలి.

పొత్తికడుపు వ్యాయామాలు!

- **క్రంచెస్:** నేల మీద వెల్లకిలా పడుకుని, రెండు చేతులు తల దగ్గర ఉంచి, నడుము పైభాగాన్ని వీలైనంతగా ముందుకు లేపే వ్యాయామం ఇది. ఇలా 25 క్రంచెస్ 3 సెట్లు చేయాలి.
- **లెగ్ రైజ్:** వెల్లకిలా పడుకుని, కాళ్లు రెండూ ఒకే సారి నిటారుగా పైకి లేపి, నడుముకు సమాంతరంగా తీసుకువచ్చి, మళ్లీ దింపేయాలి. ఇలా 25 సార్లు, మూడు సెట్లు చేయాలి.
- **సైడ్ ఆబ్లిక క్రంచెస్:** పక్కకు తిరిగి పడుకుని, కాళ్లు మడవాలి. చేతులను తల వెనకకు తీసుకువచ్చి, మెడకు ఆసరాగా ఉంచాలి. ఈ భంగిమలో నడుము పైభాగాన్ని పక్కకు లేపే ప్రయత్నం చేయాలి. ఇలా 25 సార్లు, మూడు సెట్లు చేయాలి.

ఇలా మొత్తం వ్యాయామాలకు కనీసం 45 నిమిషాలు కేటాయించాలి. ఒక్కొక వ్యాయామానికి మధ్య 30 సెకండ్ల పాటు విరామం తీసుకోవచ్చు. ఈ వ్యాయామాలు చేస్తున్నప్పుడు ఫ్యాన్ లేదా ఎసి వేసుకోకూడదు.

స్ట్రెచింగ్!



ఏ ఓఆర్ఎస్ ఉత్తమం?

ఎండదెబ్బ తగలకుండా ఉండాలంటే ఒంట్లోని లవణాలు కోల్పోకుండా చూసుకోవాలి. చమటతో లవణాలను కోల్పోతే వాటిని వెంటనే భర్తీ చేయాలి. లేదంటే ఎండదెబ్బ బారిన పడతాం. ఈ విషయం మనందరికీ తెలిసిందే! కాబట్టే ఓఆర్ఎస్‌లను తాగుతూ ఉంటాం. అయితే మనకు తెలియని విషయం ఏంటంటే... మెడికల్ షాపుల్లో దొరికే టెట్రాప్యాక్‌లన్నీ అసలైన ఓఆర్ఎస్‌లు కావు. వాటిలో విలువైన ఖనిజ లవణాల కంటే చక్కెర ఎక్కువగా ఉంటుంది. మరి అలాంటప్పుడు అసలైన ఓఆర్ఎస్ ఏదో తెలుసుకోవడమెలా? అని కంగారు పడకండి. ఓఆర్ఎస్ కొనే ముందు ఈ విషయాలను తెలుసుకోండి.

అవగాహన



ఎఫ్ఎస్ఎస్ఎఐ పర్మిషన్‌తో...

ఓఆర్ఎస్‌లను తయారు చేసే కొన్ని ఔషధ సంస్థలు 'ఫుడ్ అండ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' ఆమోదంతో ఓఆర్ఎస్‌ను తలపించే పానీయాలను తయారుచేస్తున్నాయి. ప్యాకెట్ల మీద 'ఓఆర్ఎస్‌ఎల్, విబిటి'ఓఆర్ఎస్' అనే లేబుళ్లు కనిపిస్తే, వాటి జోలికి వెళ్లకండి. ఈ వింత పేర్లన్నీ మనల్ని పక్కదారి పట్టించి, కొనుగోళ్లు పెంచుకోవడం కోసం ఔషధ సంస్థలు అనుసరించే చిట్కాలని గుర్తు పెట్టుకోండి. ఏది సరైన ఓఆర్ఎస్ పానీయమో, ఏది కాదో తేలికగా కనిపెట్టాలంటే ఇవిగో ఈ అంశాలను గమనించాలి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం పొందినవి

వీటి మీద డబ్ల్యుహెచ్ఒ ఫార్ములా అని స్పష్టంగా ముద్రించి ఉంటుంది. అలాగే ఈ పదాల కోసం గమనించాలి.

- ఎలెక్ట్రాల్
- వాలైట్
- రాన్‌బాక్సీ ఓఆర్ఎస్
- వాలైట్ ఓఆర్ఎస్
- సిప్లా తయారీ ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్)

మీరొక మంత్రి.. ఆ మాత్రం తెలియదా?



సనాతన ధర్మంపై ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలను తప్పుబట్టిన సుప్రీం

న్యూఢిల్లీ, మార్చి 4: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుబట్టింది. హానికరమైన వ్యాఖ్యలు చేసిన తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ఆయన తీసుకున్న నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ.. 'ఒక మంత్రిగా ఆ వ్యాఖ్యల పర్యవసానం ఎలా ఉంటుందో మీకు తెలిసే ఉండాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ అంశంలో తనపై దాఖలైన కేసులన్నింటినీ కలిపి విచారించాలని కోరుతూ ఉదయనిధి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ), ఆర్టికల్ 25 కింద మీ హక్కుల్ని మీరు దుర్వినియోగం చేశారు. ఇప్పుడు ఆర్టికల్ 32 కింద మీ(సుప్రీంకోర్టులో అభ్యర్థన దాఖలు చేసే) హక్కును వినియోగించుకుంటున్నారు. మీరు చేసిన వ్యాఖ్యల పర్యవసానం ఏమిటో మీకు తెలియదా? మీరేమీ సామాన్యుడు కాదు. మీరొక మంత్రి. పర్యవసానాలు మీకు తెలిసే ఉండాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈనెల 15వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసుల నుంచి ఉదయనిధికి ఉపశమనం కల్పించాలని ఆయన తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లన్నింటినీ కలిపి విచారించాలని కోరారు. ఉత్తరప్రదేశ్, కర్ణాటక, బిహార్, జమ్మూకశ్మీర్, మహారాష్ట్రల్లో ఈ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఉదయనిధి గతేడాది సెప్టెంబరులో నిర్వహించిన ఒక సదస్సులో మాట్లాడుతూ సామాజిక న్యాయానికి, సమానత్వానికి సనాతన ధర్మం వ్యతిరేకమని వ్యాఖ్యానించారు. దాన్ని నిర్మూలించాలన్నారు. ఆయన మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆయన వ్యాఖ్యలు వివాదాన్ని సృష్టించాయి.

హైకోర్టు స్థలంలో ఆప్ కార్యాలయమా?

» జూన్ 15లోగా ఖాళీ చేయండి.. సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 4: హైకోర్టుకు కేటాయించిన స్థలంలో ఆప్ ప్రధాన కార్యాలయం నిర్మించడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. జూన్ 15లోగా ఖాళీ చేయాలని ఆదేశించింది. ప్రత్యామ్నాయ స్థలం కోసం కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసేందుకు అనుమతి ఇచ్చింది. దరఖాస్తుపై నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని లాండ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసుకు సూచనలు ఇచ్చింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలు ఇచ్చింది. ఢిల్లీ హైకోర్టు విస్తరణ కోసం కేటాయించిన స్థలంలో ఆప్ కార్యాలయాన్ని నిర్మించడం ఆక్రమణల కిందకే వస్తుందని గత నెలలో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కోర్టు ఉత్తర్వుల మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌తో సమావేశం జరిపిన ఢిల్లీ ప్రభుత్వ అధికారులు రెండు నెలల్లోగా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయితే ఇంతవరకు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు జరగకపోవడంతో జస్టిస్ చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

లోకం తీరు



చండీగఢ్ డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం

చండీగఢ్, మార్చి 4: చండీగఢ్ సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. ఆ పార్టీకి చెందిన కుల్జీత్ సంధూ 19 ఓట్లతో సీనియర్ డిప్యూటీ మేయర్‌గా, రాజిందర్ శర్మ 19 ఓట్లతో డిప్యూటీ మేయర్‌గా ఇండియా కూటమి అభ్యర్థులపై గెలుపొందారు. ఇండియా కూటమి(ఆప్+కాంగ్రెస్) తరఫున సీనియర్ డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా బరిలో నిలిచిన గురుప్రీత్ సింగ్‌కు 16 ఓట్లు వచ్చాయి. డిప్యూటీ మేయర్ అభ్యర్థి నిర్మలాదేవికి 17 ఓట్లు వచ్చాయి. సీనియర్ డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఒక ఓటు చెల్లలేదు. ఈ ఎన్నికలకు మేయర్ కుల్దీప్‌కుమార్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. జనవరి 30న నిర్వహించిన చండీగఢ్ మేయర్ ఎన్నికలు, ప్రిసైడింగ్ ఆఫీసర్ అనిల్ మాసిహ్ బ్యాలెట్లపై గుర్తులను చెరపడం తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. అప్పుడు అనిల్ మాసిహ్.. బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్‌ను మేయర్‌గా ప్రకటించారు. వెంటనే మనోజ్.. సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు నిర్వహించి కుల్జీత్ సంధూ, రాజిందర్ శర్మలను విజేతలుగా ప్రకటించారు. అయితే, మేయర్ ఎన్నిక వ్యవహారం సుప్రీంకోర్టుకు వెళ్లింది. కోర్టు మనోజ్ సోంకర్‌ను కాదని ఆప్ అభ్యర్థి కుల్దీప్ కుమార్‌ను మేయర్‌గా ప్రకటించింది. దీంతో, సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికలను సోమవారం మళ్లీ నిర్వహించారు.

ఎన్నికల బాండ్ల సమాచారం సమర్పణకు జూన్ 30 వరకు సమయం ఇవ్వండి: ఎస్బీఐ

న్యూఢిల్లీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎన్నికల బాండ్లపై మొత్తం సమాచారాన్ని ఇచ్చేందుకు గడువు పెంచాలని ఎస్బీఐ సోమవారం సుప్రీంకోర్టును కోరింది. ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధమని గత నెల 15న తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు.. వాటి జారీని నిలిపివేయాలని తెలిపింది. ఇంతవరకు జారీ చేసిన మొత్తం బాండ్ల సమాచారాన్ని ఈ నెల 6వ తేదీలోగా ఎన్నికల సంఘానికి సమర్పించాలని స్టేట్ బ్యాంకును ఆదేశించింది. ఆ వివరాలను మార్చి 13లోగా వెబ్‌సైట్‌లో ఉంచాలని ఎన్నికల సంఘానికి సూచించింది. అయితే ఇందుకు తగినంత సమయం లేనందున వివరాల సమర్పణకు జూన్ 30 వరకు గడువు పెంచాలని స్టేటు బ్యాంకు కోరింది. 2012 ఏప్రిల్ 12 నుంచి 2024 ఫిబ్రవరి 15 వరకు తాము వివిధ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు 22,217 బాండ్లను జారీ చేశామని స్టేట్ బాంక్ తెలిపింది. మొత్తం 44,434 సమాచార పత్రాలను డీకోడ్ చేసి సమీకరించి, పోల్చి, వివరాలను తయారు చేయాల్సి ఉంటుందని వివరణ ఇచ్చింది. ఇందుకు గడువు పెంచాలని కోరింది. ఈ విజ్ఞప్తి చేయడం ద్వారా లోక్‌సభ ఎన్నికలయ్యేంత వరకూ ఎస్‌బీఐ తప్పించుకోవాలని భావిస్తోందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

క్యాన్సర్‌ను జయించిన ఇస్రో చైర్మన్

» ఆదిత్య-ఎల్1 ప్రయోగం రోజే బయటపడిన వ్యాధి

» ఓ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించిన సోమనాథ్



న్యూఢిల్లీ, మార్చి 4: చంద్రయాన్-3 ప్రయోగం విజయంతో భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటిన ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ కేన్సర్ బారినపడ్డారు. ఇస్రో తొలి సోలార్ విషన్ ఆదిత్య-ఎల్1 ప్రయోగం చేపట్టిన రోజే ఈ చేదు నిజం బయటపడింది. 'తార్మాక్ మీడియా హౌస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూ సందర్భంగా ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. "చంద్రయాన్-3 ప్రయోగ సమయంలోనే కొన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. సెప్టెంబరు 2, 2023న ఆదిత్య-ఎల్1 ప్రయోగం రోజు కడుపులో సమస్యగా ఉందని వైద్య పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్ అని తేలింది. కడుపులో క్యాన్సర్ కణితి పెరిగిందని, అది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి అని నిర్ధారణ అయింది. ఆ తర్వాత వైద్యుల సూచన మేరకు శస్త్రచికిత్సతోపాటు కీమోథెరపీ కూడా తీసుకున్నాను" అని సోమనాథ్ పేర్కొన్నారు. "చికిత్స నిమిత్తం నాలుగు రోజులే ఆస్పత్రిలో ఉన్నా. ఐదో రోజు నుంచి ఇస్రోలో రోజువారీ విధులు నిర్వర్తించా. ప్రస్తుతం నేను పూర్తిగా కోలుకున్నాను" అని సోమనాథ్ చెప్పారు.

మహువా అభ్యర్థనను తోసిపుచ్చిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 4: లోక్‌సభ నుంచి బహిష్కరణకు గురైన టీఎంసీ నేత మహువా మొయిత్రాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్లమెంటులో ప్రశ్నలు అడిగేందుకు లంచం తీసుకున్నట్లు తనపై జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుకోవాలన్న మొయిత్రా అభ్యర్థనను సోమవారం కోర్టు తోసిపుచ్చింది. పార్లమెంటులో మోదీ సర్కారును ఇరుకున పెట్టే ప్రశ్నలు అడిగేందుకు వ్యాపారవేత్త దర్శన్ హీరానందని నుంచి రూ.2 కోట్ల నగదుతో పాటు ఖరీదైన కానుకలను లంచంగా స్వీకరించారంటూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే, న్యాయవాది అనంత్ దేహ్రాదాయ్ ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. అలాగే పార్లమెంటరీ వెబ్‌సైట్‌లో ప్రశ్నలను పోస్టు చేసేందుకు లాగిన్ అయ్యేందుకు ఐడీ, పాస్‌వర్డ్‌ను కూడా ఇచ్చారంటూ మొయిత్రాపై ఆరోపణలు వచ్చాయి.

లోక్‌సభ బరి నుంచి తప్పుకొన్న బీజేపీ ఎంపీ రావత్

లఖ్‌నవూ, మార్చి 4: ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీ సిటింగ్ ఎంపీ, తాజా అభ్యర్థి ఉపేంద్రసింగ్ రావత్ ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నట్లు సోమవారం ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలోనే రావత్ పేరు ఉంది. అయితే ఆయనకు సంబంధించిన అభ్యంతరకరమైన వీడియో ఒకటి వెలుగులోకి వచ్చింది. వీడియోలో రావత్ ఓ విదేశీ మహిళతో అభ్యంతరకర స్థితిలో ఉన్నట్లుగా చూపారు. ఆయనకు బీజేపీ టికెట్ ఖరారైన వెంటనే ఈ వీడియో వైరల్ కావడం గమనార్హం. అయితే అది నకిలీ వీడియో అంటూ రావత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రత్యర్థులు డీప్‌ఫేక్ టెక్నాలజీతో ఈ దారుణ చర్యకు ఒడిగట్టారని ఆరోపించారు. "నేను ఏ తప్పూ చేయలేదని తేలే వరకు ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేయను" అని రావత్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

మోదీ ఓ అబద్ధాల మాంత్రికుడు: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, మార్చి 4: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల కోసం వివిధ రాష్ట్రాల్లో పర్యటనలకు కదిలిన ప్రధాని మోదీ తీరును కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విమర్శించింది. మోదీ ప్రారంభించేందుకు సంకల్పించిన ప్రాజెక్టుల్లో దాదాపు అన్నీ ఆయన ప్రధాని కాకముందే పూర్తి చేసిన ప్రాజెక్టులో లేదంటే విస్తరించిన ప్రాజెక్టులే ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ నెల 4 నుంచి 6వ తేదీ దాకా తెలంగాణ, తమిళనాడు, ఒడిసా, పశ్చిమ బెంగాల్, బిహార్‌లో పర్యటించనున్న మోదీ, ఆ రాష్ట్రాల్లో 1,10,600 కోట్ల విలువైన ప్రాజెక్టుల ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈ క్రమంలో మోదీపై 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. మోదీ ప్రారంభించనున్న ప్రాజెక్టులన్నీ ఆయన ప్రధాని కాకముందు నాటివేనని, ఆయన ఓ 'అబద్ధాల మాంత్రికుడు' (జూట్ కే జాదూగర్) అని, మీడియాను తన చుట్టూ తిప్పుకోవడం కోసం, ఫొటోల కోసం ఈ ప్రాజెక్టులను ఓ అవకాశంగా తీసుకున్నారని విమర్శించారు. తమిళనాడు కల్పకంలోని ప్లుటోనియం ఫాస్ట్ బ్రీడ్ రియాక్టర్ 22 ఏళ్ల క్రితమే ప్రారంభమైందని, పదేళ్ల క్రితం తాను అక్కడికి వెళ్లినప్పుడు 95శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని, ఇదంతా కూడా మోదీనే పూర్తిచేసినట్లుగా క్రియేట్ చేస్తున్నారని చెప్పారు.

చట్టాలకు మీరేమీ అతీతులు కాదు!

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి నిరోధక చట్టం కింద విచారించ వలసిందేనని స్పష్టం చేసింది. ఇలాంటివారు పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ పొందలేరని పేర్కొంది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ ఏఎస్ బోపన్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం సోమవారం చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఇదే సమయంలో అవినీతి, లంచాల కేసుల విషయంలో చట్టసభ సభ్యులకు అనుకూలంగా 1998లో ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టి వేసింది. "1998లో ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 105(2), 194(2)లకు పూర్తి విరుద్ధంగా ఉంది. అందుకే ఆ తీర్పును కొట్టేస్తున్నాం" అని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా వెల్లడించింది. "1998నాటి పీవీ నరసింహారావు(నాటి ప్రధాని) కేసు విషయంలో ఇచ్చిన తీర్పుతో మేం విభేదిస్తున్నాం. ఆ తీర్పులో చట్ట సభల సభ్యులు లంచాలు తీసుకుని ఓటు వేసిన కేసుల్లో విచారణ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇది అనేక పర్యవసానాలకు దారితీస్తోంది" అని జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. అంతేకాదు, రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేసే ఎమ్మెల్యేలు లంచం తీసుకుంటే వారిని కూడా అవినీతి నిరోధక చట్టం కింద విచారణ చేయాల్సిందేనని ధర్మాసనం తేల్చి చెప్పింది.

అప్పట్లో ఏం జరిగింది?

1993లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వం పార్లమెంటులో అవిశ్వాసాన్ని ఎదుర్కొంది. మైనారిటీలో ఉన్న పీవీ సర్కారు 265 ఓట్ల స్వల్ప మార్జిన్‌తో గట్టెక్కింది. పీవీ సర్కారుకు వ్యతిరేకంగా 251 ఓట్లు పడ్డాయి. ఆ తర్వాత ఏడాది పెద్ద కుంభకోణం వెలుగు చూసింది. పీవీ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేసేందుకు జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) సహా ఐదు పార్టీల ఎంపీలు లంచాలు తీసుకున్నారనే ఆరోపణలు వెలుగుచూశాయి. ఈ కేసును సీబీఐ విచారించింది. అయితే, ఆరోపణలు వచ్చిన సభ్యులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిని విచారించిన న్యాయస్థానం సభలో జరిగే కార్యకలాపాల(ఓటు వేయడం, ప్రసంగించడం)కు పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ ఉంటుందని తీర్పు వెలువరించింది.

తాజా కేసు ఇదీ..

2012లో జార్ఖండ్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో జేఎంఎం అధినేత శిబు సోరెన్ కోడలు, ఆ పార్టీ ఎమ్మెల్యే సీతా సోరెన్ ఓ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు లంచం తీసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ క్రిమినల్ కేసు నమోదు చేయడంతో ఆమె తొలుత హైకోర్టును ఆశ్రయించారు. కేసును కొట్టివేయాలని అభ్యర్థించారు. హైకోర్టు తిరస్కరించడంతో 2014లో సీతా సోరెన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తొలుత ముగ్గురు సభ్యుల ధర్మాసనం దీనిని విచారించింది. అయితే, 1998 నాటి సుప్రీం తీర్పును ఉటంకించడంతో దీనిని పరిశీలిస్తామని తెలిపింది. ఈ పిటిషన్‌ను 2019లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్.. ఐదుగురు సభ్యుల ధర్మాసనానికి రిఫర్ చేశారు. 1998 నాటి తీర్పును పునఃపరిశీలన చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో గత ఏడాది సెప్టెంబరు 20న నాటి తీర్పుపై ధర్మాసనం పునఃపరిశీలన చేసేందుకు అంగీకరించింది. తాజాగా తీర్పు వెలువరించింది. కాగా, మోదీ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా గతంలో సుప్రీం ఇచ్చిన తీర్పును వ్యతిరేకించారు. ప్రజా ప్రతినిధులు నిర్భయంగా తమ విధులు నిర్వహించి, ఓటు వేసేందుకే వారికి ఆర్టికల్ 105 భద్రత కల్పించిందని, ముడుపులు తీసుకునేందుకు కాదని వాదించారు. పార్లమెంట్ లోపల ముడుపులకు ఒప్పందం కుదిరినంత మాత్రాన ప్రజా ప్రతినిధులు చట్టానికి అతీతులు కాదన్నారు.

ఈ ఆర్టికల్స్ ఏమిటి?



రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 105, 194 ప్రకారం ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ విధులను నిర్భయంగా నిర్వర్తించే క్రమంలో న్యాయపరమైన విచారణ నుంచి రక్షణ కల్పిస్తున్నాయి. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసింది. చర్చలు, అభిప్రాయాల వెల్లడిలో సభ్యులకు రక్షణగా నిలుస్తున్నాయని తెలిపింది.

గొప్ప తీర్పు: మోదీ

న్యూఢిల్లీ, మార్చి 4 : జేఎంఎం లంచం కేసులో సుప్రీం కోర్టు తీర్పును ప్రధాని మోదీ ప్రశంసించారు. "గౌరవనీయ సుప్రీంకోర్టు గొప్ప తీర్పు ఇచ్చింది.. తద్వారా స్వచ్ఛ రాజకీయాలకు గ్యారెంటీ ఉంటుంది... ప్రజలకు వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుంది..." అని 'ఎక్స్'లో పేర్కొన్నారు. సుప్రీం తీర్పును కాంగ్రెస్ పార్టీ కూడా స్వాగతించింది. ఈ తీర్పు అవసరమని, ఇప్పటికే ఈ నిర్ణయం తీసుకుని ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ ఈ విషయమై ఒక వీడియో సందేశంలో మాట్లాడుతూ... ఇది ఏళ్లుగా సరిచేయకుండా ఉన్న అంశం అన్నారు. సుప్రీం తీర్పు వాంఛనీయం, అలాంటి తీర్పు ఇచ్చినందుకు వందనం.. స్వాగతం.. అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి విధులు సజావుగా నిర్వహించేందుకు మాత్రమే రాజ్యాంగం రక్షణ కల్పించిందని, లంచాలు తీసుకొనేందుకు కాదని సింఘ్వీ పేర్కొన్నారు. చట్టసభల సభ్యుల అవినీతి, లంచగొండితనం దేశ పార్లమెంటరీ డెమొక్రసీ పునాదులనే పెకలించి వేస్తుందని ఆయన చెప్పారు.

'పీవీ కేసు' తీర్పు వైరుధ్యాల పుట్ట

న్యూఢిల్లీ, మార్చి 4: ప్రజాప్రతినిధులకు కల్పించిన రాజ్యాంగ రక్షణలు లంచాలు, ఓటుకు నోటు వంటి అవినీతి అభియోగాలను ఎదుర్కొనే సందర్భంలో వర్తించబోవని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సోమవారం తీర్పు ఇచ్చింది. ఇంతకీ, ప్రజాప్రతినిధులకు రాజ్యాంగంలో కల్పించిన రక్షణలు ఏమిటనేది పరిశీలిస్తే.. రాజ్యాంగంలో ప్రధానంగా 105, 194 అధికరణలు ఎంపీలు, ఎమ్మెల్యేలకు ఉన్న రక్షణలను తెలియజేస్తున్నాయి. చట్టపరమైన చర్యలకు గురవుతామేమోనన్న భయ సందేహాలకు తావులేకుండా ప్రజాప్రతినిధులు తమ విధులను నిర్భీతిగా నిర్వర్తించేందుకు ఈ అధికరణలను రాజ్యాంగంలో పొందుపరిచారు. ప్రజాప్రతినిధులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగలగాలని, తమ ఓటింగ్ అధికారాలను సమర్థంగా వినియోగించుకోవాలని రాజ్యాంగకర్తలు భావించారు. చట్టసభల్లో ప్రజా ప్రతినిధుల వ్యాఖ్యలు, ఓటింగ్‌పై కోర్టుల్లో ప్రశ్నించకుండా రక్షణలు కల్పించారు. అయితే, వీరిపై చర్యలకు స్పీకరుకు అధికారం ఉంటుంది. అయితే, తాజా తీర్పులో సుప్రీంకోర్టు "ప్రజాప్రతినిధులు లంచాలు తీసుకోవడం చట్టసభ సభ్యులుగా వారి విధులతో ఎటువంటి సంబంధం లేని స్వతంత్ర నేరం. అందువల్ల సభ్యులకు లభిస్తున్న రాజ్యాంగ రక్షణ ఇటువంటి కేసుల్లో వారిని కాపాడలేదు. ఒకవేళ ఇటువంటి కేసుల్లో రక్షణ కల్పిస్తే, అనియంత్రిత మినహాయింపులు పొందే ఒక బృందం సమాజంలో తయారవుతుంది. అది పార్లమెంటరీ ప్రజాతంత్రం పనితీరును నిర్వీర్యం చేస్తుంది" అని పేర్కొంది. "పీవీ నరసింహారావు కేసులో తీర్పు పరస్పర వైరుధ్యాల పుట్టలా తయారైంది" అని రాజ్యాంగ ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

విద్యుత్ రంగంలో అగ్రగామిగా భారత్

ఈ ప్రయాణంలో తమిళనాడు పాత్ర కీలకం: మోదీ

చెన్నై, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో భారత్‌ను అగ్రస్థానంలో నిలబెడతామని, దీనిలో తమిళనాడు కీలకపాత్ర పోషించనుందని ప్రధాని మోదీ అన్నారు. తమిళనాట 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 'ప్రొటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' (పీఎఫ్‌బీఆర్)ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ తరహా రియాక్టర్‌ను దేశంలోనే తొలిసారిగా కల్పాక్కంలో ఏర్పాటు చేయడం విశేషం. సోమవారం మోదీ చెన్నైలో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ' పథకం ద్వారా కోటి కుటుంబాలు లబ్ధి పొందనున్నాయని, దీనికోసం రూ.75 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని మోదీ ప్రకటించారు. స్థానిక వైఎంసీఏ మైదానంలో జరిగిన బహిరంగసభలో మోదీ మాట్లాడుతూ.. ముఫ్త్ బిజిలీ పథకం వల్ల ప్రజలు ఇంట్లోనే ఉంటూ.. సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని చెప్పారు. ఇలా ప్రజలు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను కేంద్రం కొనుగోలు చేస్తుందని అన్నారు. అంటే ప్రజలు ఇంట్లోనే ఉంటూ డబ్బులు సంపాదించవచ్చని వివరించారు. తాను చెన్నై వస్తున్నానంటేనే కొందరికి కడుపు నొప్పి వస్తోందని, రోజురోజుకు ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణే కారణమని డీఎంకే, కాంగ్రెస్ పార్టీలనుద్దేశించి ఎద్దేవా చేశారు. డీఎంకే పాలకులు చేస్తున్న అవినీతిని అడ్డుకుంటున్నామని, వారు అక్రమంగా సంపాదించిన దాన్ని కక్కిస్తామని మోదీ హెచ్చరించారు.

మోదీ కా పరివార్!

వచ్చే ఎన్నికల్లో ఇదే బీజేపీ నినాదం!

» మోదీకి కుటుంబమే లేదన్న లాలూ వ్యాఖ్యలపై ఫైర్

» దేశమే తన కుటుంబమన్న ప్రధాని మోదీ

» 'ఎక్స్'లో తమ పేర్ల చివర 'పరివార్' చేర్చిన కేంద్ర మంత్రులు, బీజేపీ సీనియర్లు



అమిత్ షా ఎక్స్ ప్రొఫైల్‌లో 'మోదీ కా పరివార్' క్యాప్షన్

న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గత లోక్‌సభ ఎన్నికల సమయంలో ప్రధాని మోదీని 'చౌకీదార్ చోర్ హై' అని ఎద్దేవాచేసి కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ బీజేపీకి మంచి ప్రచారాస్త్రాన్ని అందించారు. తాజాగా ఆర్‌జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్.. కుటుంబ పాలనను వ్యతిరేకిస్తున్న మోదీకి కుటుంబమే లేదని పట్నాలో ఆదివారం వ్యాఖ్యానించారు. అంతే.. అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతామన్ వంటి కేంద్ర మంత్రుల నుంచి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా సీనియర్ నేతల వరకు.. తమను తాము మోదీ కుటుంబంగా పేర్కొంటూ సోమవారం 'ఎక్స్'లో తమ పేరు పక్కన 'మోదీ కా పరివార్' అన్న నినాదాన్ని చేర్చారు. వచ్చే ఎన్నికలకు ఇది వారి ప్రచారాస్త్రంగా మారింది. అటు ప్రధాని కూడా తెలంగాణలో జరిగిన సభలో లాలూ వ్యాఖ్యలపై స్పందించారు. యావద్దేశం తన కుటుంబమేనని ఉద్ఘాటించారు. 'నా జీవితం తెరచిన పుస్తకం. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు నా కుటుంబమే. ఏ తోడూ లేనివారికి మోదీ ఉన్నాడు. మోదీకి వారంతా ఉన్నారు. నా యావజ్జీవితం పేదలకు అంకితం' అని తెలిపారు. ప్రస్తుతం దేశమంతటా ఇదే చర్చనీయాంశమైంది. లోక్‌సభ ఎన్నికల ముంగిట బీజేపీ చేతికి ఆర్‌జేడీ గట్టి అంశాన్ని ఇచ్చిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. 2019 ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ రాఫెల్ జెట్ల కొనుగోలుపై ఆరోపణలు చేస్తూ 'చౌకీదార్ దొంగ(చోర్ హై)' అని విమర్శించారు. అప్పుడు మోదీ 'మై భీ చౌకీదార్ (నేను కూడా చౌకీదార్‌నే)' అనే నినాదాన్ని సృష్టించారు. బీజేపీ నేతలంతా అదే కోణంలో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. 'మోదీపై విపక్షాల వ్యక్తిగత విమర్శలు ఇంతవరకు పనిచేయకపోగా.. వాటినే దెబ్బతీశాయి. 2014లో కాంగ్రెస్ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్.. చాయ్‌వాలా అంటూ మోదీని ఎద్దేవాచేయడం కాంగ్రెస్‌ను ఓటమిపాలు చేసింది. ఇప్పుడు ఇండియా కూటమి వంతు' అని బీజేపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించారు.

'ఇండియా' ఎదుగుతోందనే

ఎన్నికల వేళ అసలు అంశాల నుంచి దృష్టి మళ్లించేందుకే బీజేపీ 'మోదీ కా పరివార్' నినాదాన్ని అందుకుందని కాంగ్రెస్ ఆరోపించింది. విపక్ష ఇండియా కూటమి ప్రజాదరణ పొందుతుండడం ఆ పార్టీని ఆందోళనకు గురిచేస్తోందని వ్యాఖ్యానించింది. 'మోదీ కుటుంబంలో మణిపూర్ మహిళలకు చోటు ఉంటుందా? ఢిల్లీ సరిహద్దుల్లో ఆందోళన చేస్తున్న రైతులను మోదీ తన కుటుంబమేనని చెబుతారా? ఆత్మహత్యలకు పాల్పడుతున్న నిరుద్యోగులను మోదీ తన కుటుంబమని ఎందుకు చెప్పుకోరు' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ కూడా తన బయోకు 'మోదీ కా పరివార్'ను యాడ్ చేశారు..

ప్రతి మహిళకు నెలకు 1,000


» లోక్‌సభ ఎన్నికల వేళ బడ్జెట్‌లో కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రకటన

» రూ.2వేల కోట్ల కేటాయింపు..18 ఏళ్లు పైబడినవారు అర్హులు

న్యూఢిల్లీ/సిమ్లా, మార్చి 4: ఢిల్లీలోని అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,000 ఇవ్వనున్నట్టు సోమవారం ప్రకటించింది. 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన' కింద 2024-25 ఆర్థిక సంవత్సరం నుంచి దీన్ని అమలు చేయనుంది. ఆర్థిక మంత్రి అతిషి మర్లేనా ఢిల్లీ అసెంబ్లీలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.76,000 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మహిళలకు ఆర్థిక ప్రయోజనం కల్పించే పథకాన్ని ప్రకటించారు. 'రామ రాజ్యం' కలను సాకారం చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. 18 ఏళ్లు లేదా పైబడిన ప్రతి మహిళలకు కేజ్రీవాల్ ప్రభుత్వం నెలకు రూ.1,000 ఇస్తుందని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ పథకాన్ని ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం రూ.2,000 కోట్లు కేటాయించింది. ఈ పథకం మహిళా సాధికారత దిశగా ప్రపంచంలోనే అతిపెద్ద ముందడుగు అని ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అభివర్ణించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత 'ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన'ను అమలు చేస్తామని చెప్పారు. ఈ పథకం ద్వారా సుమారుగా 45-50 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరుతుందన్నారు.

హిమాచల్ మహిళలకు నెలకు రూ.1,500

హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు సోమవారం ఆ రాష్ట్ర మహిళలకు శుభవార్త ప్రకటించారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉన్న మహిళలకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి నెలకు రూ. 1500 ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీని కోసం బడ్జెట్‌లో ప్రతి ఏడాది రూ. 800 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇందిరాగాంధీ ప్యారీ బెహ్నా సుఖ్ సమ్మాన్ నిధి యోజనా పేరుతో ప్రారంభిస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 5 లక్షల మంది మహిళలు లబ్ధి పొందనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన పది గ్యారెంటీల్లో ఐదో హామీని నెరవేర్చినట్లు సుఖ్విందర్ సింగ్ వెల్లడించారు.



ఈడీ విచారణకు ఎనిమిదోసారీ కేజ్రీవాల్ డుమ్మా

న్యూఢిల్లీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కేజ్రీవాల్ ఈడీ విచారణకు ఎనిమిదోసారి కూడా హాజరు కాలేదు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కొంతకాలంగా ఈడీ సమన్లను తిరస్కరిస్తూ వస్తున్న కేజ్రీవాల్.. సోమవారం కూడా విచారణకు వెళ్లలేదు. అయితే మార్చి 12 తర్వాత మాత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాను విచారణకు హాజరవుతానని కేజ్రీవాల్ ఈడీకి తెలిపారు. ఈడీ సమన్లు చట్టవిరుద్ధమని ఆయన ఆరోపించారు. అయినప్పటికీ వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీ మద్యం విధానంలో మనీలాండరింగ్ జరిగిందనే ఆరోపణలతో గతేడాది నవంబర్ 2న తొలిసారిగా కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీ చేసింది.

కొలంబియాలో ట్రంప్‌పై నిక్కీ హేలీ పైచేయి

» ప్రైమరీ ఎన్నికల్లో 62.9% ఓట్లు



వాషింగ్టన్, మార్చి 4: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున బరిలోకి దిగేందుకు పోటీపడుతున్న భారత సంతతికి చెందిన నిక్కీ హేలి ఆదివారం తన తొలి విజయాన్ని నమోదు చేసుకున్నారు. కొలంబియాలో జరిగిన ప్రైమరీ ఎన్నికల్లో ఆమె గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఆమెకు 1,274 ఓట్లు(62.9%) దక్కాయి. ఆమె ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్ 676(33.2%) ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో రేసులో దూసుకుపోతున్న డొనాల్డ్ ట్రంప్ విజయ పరంపరకు బ్రేక్ పడింది. అయితే, ట్రంప్‌ను అధిగమించడానికి మంగళవారం జరగనున్న 15 రాష్ట్రాల ప్రైమరీల్లో నిక్కీ భారీ విజయాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది.

అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ పోటీకి తొలగిన అడ్డంకులు

వాషింగ్టన్, మార్చి 4: ట్రంప్‌నకు సోమవారం ఆ దేశ సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి అడ్డంకులు తొలగిపోయాయి. గత అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిని అంగీకరించని ట్రంప్ క్యాపిటల్ హిల్‌పై దాడి చేయించారని, అమెరికా రాజ్యాంగం ప్రకారం ఆయన ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేదని కొలరాడో, ఇల్లినాయీ తదితర రాష్ట్రాలు నిషేధం విధించాయి. అయితే, ఇలాంటి అంశాలపై అమెరికా కాంగ్రెస్ మాత్రమే నిర్ణయం తీసుకోగలదని, రాష్ట్రాలకు ఆ అధికారం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అమెరికాలో ముసుగు వ్యక్తుల కాల్పుల్లో నలుగురి మృతి

కింగ్‌సిటీ (యూఎస్), మార్చి 4: సెంట్రల్ కాలిఫోర్నియాలోని కింగ్ సిటీలో ముసుగులు ధరించిన వ్యక్తులు కాల్పులు జరపడంతో నలుగురు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఒక ఇంటి బయట అవుట్‌డోర్ పార్టీ జరుగుతుండగా నల్లని ముసుగులు, దుస్తులు ధరించిన ముగ్గురు వ్యక్తులు సిల్వర్ రంగు కారులో వచ్చి కాల్పులు జరిపారు. వెంటనే అదే కారులో పరారయ్యారు. సంఘటన స్థలంలో ముగ్గురు పురుషులు ప్రాణాలు కోల్పోగా, మరో మహిళ ఆస్పత్రిలో మరణించారు. వారెవరు, ఎందుకు కాల్పులు జరపారన్నది ఇంకా తెలియరాలేదు.

- అహంకారం, విధ్వంసంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన సైకోను ఇంటికి పంపించే సమయం ఆసన్నమైంది. టీడీపీ, జనసేన పొత్తు సూపర్ హిట్. రాబోయే ఎన్నికల్లో గెలిచేది ఈ కూటమే.
- జగన్ సైకో పాలనలో ప్రజల ప్రాణాలకు.. నా ప్రాణాలకు రక్షణ ఉందా....? ఆడబిడ్డల మానానికి రక్షణ ఉందా..? ఇలాంటి దుర్మార్గుడు అవసరమా?
- పేదరిక నిర్మూలనకు నా వద్ద బ్లూ ప్రింట్ ఉంది. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తాం. ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలబెట్టే బాధ్యత తీసుకుంటా. - చంద్రబాబు


శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం కియ వద్ద నిర్వహించిన 'రా.. కదలిరా..' సభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబు

వివేకా హత్యపై చర్చకు సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

ఎవరి హయాంలో అభివృద్ధి జరిగింది.. ఎవరిది దోపిడీయో ప్రజలు ఆలోచించుకోవాలని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమ ఎదురుగా సోమవారం నిర్వహించిన చివరి 'రా.. కదలిరా' బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వివేకా హత్యపై సీబీఐ విచారణ జరిపించాలని చెల్లెలు కోరితే.. అవినాశ్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లిపోతాడంటూ సీబీఐ విచారణ కోరని దొంగ జగన్ అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనకు ధైర్యం ఉంటే వివేకా హత్య.. జగనాసుర రక్త చరిత్రపై పెనుకొండకు చర్చకు రావాలని సూచించారు. చిన్నాన్న ఎవరు చంపారో చెప్పాల్సిన అవసరం ఆయనకు లేదా అని నిలదీశారు. హత్యలు చేసే వాళ్లకు ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉందా అని ప్రశ్నించారు. 'నలభై ఏళ్లుగా సభలు పెట్టాను, పర్యటనలు చేశాను. మీ ఉత్సాహం చూస్తుంటే కసితో.. ఆగ్రహంతో ఉన్నారు. సైకోను ఇంటికి పంపించేందుకు మీరంతా సిద్ధమా..' అని చంద్రబాబు జనాన్ని అడిగారు. 'యుద్ధానికి సిద్ధం' అని వారు నినదించారు. బంగారు రాష్ట్రాన్ని భస్మాసురులు నాశనం చేస్తుంటే ఉపేక్షిస్తారా అని యువతను చంద్రబాబు ప్రశ్నించారు. తాము అధికారం చేపట్టాక సంక్షేమం, అభివృద్ధి అన్‌స్టాపబుల్ అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తాను, పవన్ కల్యాణ్ ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామని, అందుకు మీరు సిద్ధమా అని ఆయన ప్రశ్నించగానే.. టీడీపీ, జనసేన శ్రేణులు సిద్ధమేనని బదులిచ్చాయి. ఆయన ఇంకా ఏమన్నారంటే..

స్కీమ్‌లో స్కామ్..

గతంలో వైఎస్ సైన్స్ సిటీతోపాటు లేపాక్షి నాలెడ్జ్ హబ్‌కు కేటాయించిన రైతుల భూములు పోయాయి. ఏ ఒక్కరికీ ఉద్యోగం రాలే దు. అప్పట్లో స్కీమ్‌లన్నీ స్కామ్‌ల కోసమే రూపొందించారు. లేపా క్షి నాలెడ్జ్ హబ్‌లో ఇప్పటి సీఎం జగన్ పెద్ద సంఖ్యలో అవినీతికి పాల్పడ్డాడు. ఆ హబ్‌కు 4,500 ఎకరాలు కేటాయిస్తే, ఒక్క కంపెనీ పెట్టలేదు. ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదు.. ఇది మోసం కాదా? స్కీమ్‌లో స్కామ్‌లు జరిగితే.. ఆ స్కామ్‌ల్లోనే స్కామ్‌లకు పాల్పడే దొంగ జగన్. నేను కియ పరిశ్రమ స్థాపనకు 600 ఎకరాలు ఇస్తే.. 50 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఇక్కడ తయారు చేసిన 12 లక్షల కార్లు దేశ, విదేశాల్లో తిరుగుతున్నాయంటే అదే టీడీపీ మార్క్.. మేం అధికారంలో ఉండి ఉంటే కియ అనుబంధ పరిశ్రమలు వచ్చేవి.

నాడు సీబీఐ దర్యాప్తు అడిగావా లేదా?

వివేకా హత్యను మొదట గుండెపోటు అన్నారు. ఆ తర్వాత గొడ్డలిపోటు అన్నారు. ఆ గొడ్డలి ఎవరిచ్చారని మీ చెల్లెలు అడుగుతోంది. తమ మధ్యనే హంతకులు ఉంటే గుర్తించలేకపోయానని మీ చెల్లెలు చెప్పింది. ప్రతిపక్ష నేత హోదాలో కోర్టుకు వెళ్లి.. సీబీఐ దర్యాప్తు కావాలని అడిగావా లేదా..? మళ్లీ సీబీఐ వద్దని నాటకాలు ఆడి... సీబీఐ అధికారులపైనే కేసులు పెట్టారు. జగన్.. నీ మార్క్ జగనాసుర రక్తచరిత్ర. మీ బాబాయ్ హత్య నీ మార్క్.. సొంత చెల్లి పుట్టుకపైనే నీచ ప్రచారం నీ మార్క్.. అమ్మను గెంటేయడం నీ మార్క్.. చెత్తపన్ను నీ మార్క్.. రూ.200 ఇంటి కరెంటు బిల్లును రూ.800కు పెంచడం, రూ.60 విలువైన మద్యం బాటిల్ రూ.200కు పెంచడం నీ మార్క్.. 25 వేల కిలో మీటర్ల సిమెంట్ రోడ్ల నిర్మాణం, రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు, 12 లక్షల ఇళ్ల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులపై రూ.68 వేల కోట్ల వ్యయం, చంద్రన్న బీమా, పండుగలకు చంద్రన్న కానుకలు, విదేశీ విద్య, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, ఉద్యోగాల కల్పనలో నంబర్ వన్.. ఇలాంటివి వంద సంక్షేమ పథకాలు అమలు చేసిన మార్క్ టీడీపీది.

వలంటీర్లను తొలగించం

వలంటీర్ల ఉద్యోగాలను తొలగించను. అయితే వారు వైసీపీ దొంగలకు పనిచేయకూడదు. వలంటీర్లకు మంచి భవిష్యత్ ఇచ్చే బాధ్యత నాది. రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న సైకో పోతే తప్ప యువతకు భవిష్యత్ ఉండదు. నేను ఐటీ ఉద్యోగాలు ఇస్తే.. జగన్ మటన్ కొట్టు, ఫిష్ మార్కెట్, మద్యం షాపుల్లో ఉద్యోగాలిచ్చాడు. నెలకు రూ.5 వేలతో వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు పోతున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలిస్తాం. ఏటా 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తాం. యువతను ప్రపంచానికి అనుసంధానం చేసి వారి భవిష్యత్‌ను బంగారం చేసే బాధ్యత నాది. మరో 40 రోజులు సైకిల్ ఎక్కండి. తెలుగుదేశం, జనసేన జెండాలు కట్టుకుని ఇంటింటికీ వెళ్లి సైకోను సాగనంపేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురండి.

ఈ బచ్చాలకు తెలుసా..?

పింఛన్లు ఇచ్చానని జగన్ అంటున్నాడు. పింఛన్లు ప్రారంభించిందే ఎన్టీఆర్. ఈ విషయం వైసీపీ బచ్చాలకు తెలుసా? రూ.200 పింఛన్‌ను రూ.2వేలు చేసింది టీడీపీనే. గత ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే తొలి నెలలోనే రూ.3 వేలు పింఛన్ ఇచ్చే వాళ్లం. మేం కూడా ఇంటింటికీ పింఛన్లు ఇస్తామని.. సక్రమంగా ఇవ్వకుండా జగన్ అన్యాయం చేశాడు. మేమొస్తే.. ఎవరికీ కోత లేకుండా ఇంటి వద్దే పింఛన్లు ఇస్తాం. కాగా, రాప్తాడు 'సిద్ధం' సభలో వైసీపీ మూకల దాడిలో గాయపడి, కోలుకుని.. 'రా కదలి రా' సభ కవరేజ్‌కు వెళ్లిన 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను చంద్రబాబు పరామర్శించారు. శ్రీకృష్ణను వేదికపైకి పిలిచి ఆరోగ్యంపై ఆరా తీశారు.

పొత్తు గెలవాలి.. వైసీపీ పోవాలి..

టీడీపీ-జనసేన గెలుపు ఖాయం

రెండు పార్టీల శ్రేణులు పాలు-నీళ్లలా కలిసిపోవాలి

మీ భవిష్యత్ బాధ్యత నాది

టీడీపీ, జనసేన శ్రేణులు పాలు, నీళ్లలాగా కలిసిపోవాలి. అభ్యర్థిని గెలిపించే బాధ్యత మీది. మీ భవిష్యత్ కాపాడే బాధ్యత నాది. పొత్తు గెలవాలి.. వైసీపీ పోవాలి. స్మగ్లర్లు, మాఫియా డాన్లు, అవినీతిపరులు, ఎర్రచందనం దొంగలకు సీఎం జగన్ సీట్లు ఇచ్చాడు. చదువుకున్న వ్యక్తులు, ప్రజలు ఆమోదించిన అభ్యర్థులకు మేం సీట్లు కేటాయించాం. జగన్ ఆ మధ్య రాప్తాడులో సిద్ధం సభ పెట్టాడు. ఆకాశంలో వచ్చాడు.. భూమి మీద దిగలేదు. ఆర్టీసీ బస్సుల్లో జనాన్ని తోలారు. ఏ పార్టీ డబ్బులు కడితే ఆ పార్టీకి ఆర్టీసీ బస్సులు ఇవ్వాలి. టీడీపీకి బస్సులు ఇవ్వకుండా సైకో జగన్ రూల్ పెట్టాడు. ఈ రాష్ట్రం వాళ్ల తాత జాగీరా? ఆర్టీసీ బస్సులు ఇవ్వకపోయినా, మా తమ్ముళ్లకు మోటారు బైక్‌లు ఉన్నాయి. ఎవడైనా అడ్డం వస్తే తొక్కించుకుంటూ రండి. మీకు నేను అండగా ఉన్నా. ఓడిపోయేందుకు గప్ సిద్ధం. టీడీపీ, జనసేన కూటమి ఏర్పడినప్పుడే గెలుపు డిక్లేర్ అయింది. వైసీపీకి డిపాజిట్లు కూడా రావు. సీమ ద్రోహి జగన్. మేలు చేయబోయేది టీడీపీయే!

నేను రెడీ..

నార్కో అనాలసిస్‌కు అవినాశ్ సిద్ధమా!

ఎన్నికల నేపథ్యంలోనే జగన్ మీడియాలో తప్పుడు కథనాలు: బీటెక్ రవి

కడప, మార్చి 4: 'మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నేను నార్కో అనాలసిస్‌కు సిద్ధం. ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సిద్ధమా..!' అని మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ అభ్యర్థి బీటెక్ రవి సవాల్ చేశారు. సోమవారం కడప నగరంలోని టీడీపీ జిల్లా అధ్యక్షుడి కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ పత్రికలో వచ్చిన కథనంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'ముంబై పేలుళ్ల కేసులో కసబ్‌కు ఏ విధంగా అయితే నార్కో ఎనాలసిస్‌ను ప్రత్యక్ష ప్రసారం చేశారో అదే మాదిరిగా జరగాలి. అది కూడా ఎన్నికల ముందే పూర్తి చేయాలి. కేసును సీబీఐకి ఇవ్వాలని తాను డిమాండ్ చేస్తే... అలా చేస్తే అవినాశ్‌రెడ్డి బీజేపీలోకి పోతాడని జగన్‌రెడ్డి అన్నారని సునీత ఆరోపించారు. ఆమె చెప్పింది అబద్ధమైతే జగన్ బైబిల్ మీద ప్రమాణం చేసి తాను అలా అనలేదని చెప్పాలి. ఒకవేళ అలా చేయలేకుంటే ప్రెస్‌మీట్‌లోనైనా చెప్పాలి. నూటికి నూరు శాతం తనతో జగన్ అన్నాడు కాబట్టే సునీత చెపుతున్నారు. సీబీఐ ఎంక్వయిరీ వచ్చేందుకు ఒకటిన్నర సంవత్సరం పడితే నిజానిజాలు తేల్చేందుకు మరలా సంవత్సరం పట్టింది.



గొడ్డలితో వైఎస్ వివేకాను హత్య చేసినట్లు సీబీఐకి రెండున్నర సంవత్సరాలకు అర్థమైంది. కానీ, ఘటన జరిగిన రోజు హైదరాబాద్‌లో ఉన్న జగన్‌రెడ్డి అదే రోజు సాయంత్రం పులివెందులలో మాట్లాడుతూ గొడ్డలితో తన బాబాయిని చంపారని చెప్పారు. ఆ విషయం ఆయనకు ఎలా తెలిసింది? మాకున్న సమాచారం అవినాశ్‌రెడ్డికి కానీ, జగన్ వాళ్ల ఇంటిలో ఉన్న వాళ్లకి కానీ వీడియో చూపిస్తూ వివేకాను చంపారు. అందుకే అంత స్పష్టంగా వైఎస్ జగన్ చెప్పగలిగాడు. గొడ్డలి కొనేందుకు దస్తగిరిని పంపించారు. దాన్ని కొనడానికి అయ్యే ఖర్చు భాస్కర్‌రెడ్డి ఇంటి నుంచి సునీల్ కుమార్ యాదవ్ ఫోన్‌పే చేశారు. ఫోన్‌పే రశీదును కూడా సీబీఐ బయటికి తీసింది. ప్రపంచంలో ఎవరికీ తెలియకముందే జగన్‌కు గొడ్డలితో చంపినట్లు తెలిసిందనీ, సాక్షాత్తు ఐఏఎస్ అజయ్ కల్లం ఆమేరకు వాగ్మూలం ఇచ్చారనీ, వివేకా హత్య గురించి జగన్‌రెడ్డికి ముందుగానే తెలుసుననడానికి సాక్ష్యం ఇదే. స్పష్టమైన ఆధారాలు ఉన్నా వారి సొంత పత్రికలో తప్పుడు రాతలు రాయిస్తున్నారు. గుండెపోటుతో వివేకా చనిపోయాడని ఆదినారాయణరెడ్డి చెప్పినట్లు జగన్ పత్రికలో రాశారు. ఆదినారాయణరెడ్డికి ఏమైనా దీంతో సంబంధం ఉందా? మొదటగా హత్యాప్రదేశానికి అవినాశ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి వెళ్లారు. వారు ఏది చెబితే ప్రపంచమంతా అదే తెలిసింది. అంతెందుకు విజయసాయిరెడ్డి మొదట ప్రెస్‌మీట్ పెట్టి వివేకానందరెడ్డి గుండెపోటుతో మరణించాడని చెప్పారు' అని గుర్తు చేశారు. హత్యా ప్రాంతంలో దొరికిందని చెపుతున్న లేఖపై జగన్‌రెడ్డే మాటమార్చారంటూ వివరించారు. 'హత్య జరిగిన తరువాత చంద్రబాబుకు రెండు నెలలు సమయం ఉందని, ఆయన ఏమీ చేయలేదని అభాండాలు వేయడం దుర్మార్గం. కేంద్రం నుంచి సరైన సహకారం లేక చంద్రబాబు ఏమీ చేయలేకపోయారు. అయితే జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సంవత్సరాలు ఆ కేసును ఎందుకు తేల్చలేదు? ఒక పక్క ముఖ్యమంత్రి మరో పక్క సొంత బాబాయి అప్పుడే తేల్చేసి ఉండొచ్చుకదా? ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ ఎంక్వయిరీ కావాలని జగన్ అన్నారు. తరువాత అతనే సీబీఐ ఎంక్వయిరీ వద్దని అఫిడవిట్‌లో సంతకం చేసి హైకోర్టులో దాఖలు చేశారు.. సాక్ష్యాలు ఉన్నా కూడా జగన్‌రెడ్డి ఏమీ చేయకుండా మౌనంగా ఉన్నారు. అలాగే ప్రస్తుతం జైలులో ఉన్న ఉదయ్ కుమార్‌రెడ్డి వాళ్ల అమ్మకు ఉదయం 5.30 గంటలకే వివేకా హత్య జరిగినట్లు ఎలా తెలిసింది? ఆమె ఎలా పక్కింటోళ్లకు చెప్పింది? వీరందరికీ వివేకా హత్య విషయం ముందే తెలుసు. ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో రాజకీయం చేసేందుకే తప్పుడు రాతలు రాయిస్తున్నారు' అని బీటెక్ రవి ఆరోపించారు. సునీత ప్రెస్‌మీట్‌తో అభద్రతకు గురైన వైసీపీ ఆమెపై కూడా ఆరోపణలు చేస్తోంది. టీడీపీ తమ కుటుంబంలో చిచ్చు పెడుతోందంటూ జగన్ ఆరోపించడం హాస్యాస్పదం. కేశినేని నాని, దగ్గుబాటి వెంకటేశ్వరరావు విషయంలో వైసీపీ చేసింది ఏమిటి? అంటే మీరు చేస్తే సంసారం, వేరే వారు చేస్తే వ్యభిచారమా?' అంటూ బీటెక్ రవి మండిపడ్డారు. సింహం సింగిల్‌గానే వస్తుందని పదే పదే చెపుతున్న జగన్... పులివెందులలో సతీశ్‌రెడ్డిని పార్టీలోకి ఎలా చేర్చుకున్నారు? వైసీపీ ప్రభుత్వం, జగన్‌రెడ్డి చెపుతున్నవన్నీ అబద్ధాలు, చేస్తున్నవి అరాచకాలు. వివేకానందరెడ్డిని చంపితే ఎవరికి లాభం? అంటూ జగన్ మీడియాలో రాశారు. వివేకా హత్య జరిగేటప్పుడు నేను ఎమ్మెల్యే అభ్యర్థిని కాదు. అప్పుడు ఎమ్మెల్యే అభ్యర్థిగా సతీశ్‌రెడ్డి ఉన్నారు. ఆ సతీశ్‌రెడ్డినే ఇప్పుడు పార్టీలోకి తీసుకున్నారు. ఇప్పుడు వాళ్లు చెప్పాలి... లాభం ఎవరికో. వీటన్నింటిపైనా ప్రజలు ఆలోచన చేయాలి' అని బీటెక్ రవి విజ్ఞప్తి చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... సొంత పత్రిక ఉంది కదా అని ఇష్టమొచ్చినట్లు రాసుకుంటూ పోతే ప్రజలు తగిన రీతిలో ఎన్నికల్లో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నిజానిజాలను సీబీఐ వెల్లడించేరకూ వేచి చూడాలని అన్నారు.


ఎమ్మెల్సీ రఘురాజు భార్య సుధారాణి టీడీపీలో చేరిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న లోకేశ్

ఎస్.కోటలో వైసీపీకి భారీ షాక్

- ఎమ్మెల్సీ రఘురాజు భార్య టీడీపీలో చేరిక
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన లోకేశ్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ ఒంటెత్తు పోకడలు భరించలేక.. అధికార పార్టీకి చెందిన పలువురు నేతలు టీడీపీ వైపు చూస్తున్నారు. తాజాగా శృంగవరపుకోట నియోజకవర్గానికి చెందిన వైసీపీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సతీమణి సుధారాణి నేతృత్వంలో పలువురు నేతలు టీడీపీలో చేరారు. శృంగవరపుకోట నుంచి భారీ కాన్వాయ్‌తో సోమవారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. సుధారాణితో పాటు 15 మంది సర్పంచ్‌లు, 17 మంది ఎంపీటీసీలు, ఐదుగురు కన్వీనర్లు సహా 150 మంది వైసీపీ నాయకులకు యువనేత లోకేశ్ కండువాలు కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరిలో ఎస్.కోట ఎంపీపీ సంధి సోమేశ్వరరావు, ఎంపీటీసీలు లాగుడు లక్ష్మి, మోపాడ గౌరీశ్వరి, దారా గిరి, మజ్జి దేవి, వాకాడ సింహాచలం, మోపాడ సునీత, బి.ఆదిలక్ష్మి, భోజంకి వెంకటలక్ష్మి, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ బషీర్, సర్పంచ్‌లు సోలుబొంగు కనకం, రామకృష్ణ, సంతోషి కుమారి, వొబ్బిన త్రినాథమ్మ, లాగుడు సూర్యనారాయణ, ఎర్ర సన్యాసిరావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సతీమణి సుధారాణి మాట్లాడుతూ.. వైసీపీలో ఎన్నో అవమానాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామని, తమ సమస్యలను జగన్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. విజనరీ లీడర్ చంద్రబాబు విజయానికి మనస్ఫూర్తిగా పని చేస్తామన్నారు.

టీడీపీ ద్వారాలు తెరిచే ఉంటాయి: లోకేశ్

రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీతో కలిసి పనిచేసే వారికి ద్వారాలు తెరిచే ఉంటాయని లోకేశ్ అన్నారు. పార్టీలో ఇప్పటికే పని చేస్తున్న సీనియర్లు కొత్తగా వచ్చిన వారిని కలుపుకొని పోతూ.. ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. 'గత ఎన్నికల్లో జగన్‌ను నమ్మి 151 సీట్లతో అధికారమిస్తే.. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన ప్రారంభించి, ప్రజల ఆశలు, రాష్ట్ర ప్రయోజనాలకు గండికొట్టారు. 2019లో పాదయాత్ర చేసిన జగన్ రాష్ట్రానికి, ప్రజలకు మంచి చేస్తారని అందరూ అనుకుంటే.. విధ్వంసం, వేధింపులు, కక్ష సాధింపులకు ప్రాధాన్యమిచ్చారు. స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారు. యువగళం పాదయాత్రతో అన్ని వర్గాల ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నా. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తా' అని అన్నారు.

ఆంధ్రకు ప్రత్యేక పరిశీలకులను పంపాలి

- అవసరమైతే ఈసీ కేంద్ర బలగాలను దించాలి: లోకేశ్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఏపీలో అధికార పార్టీ అరాచక పర్వానికి తెరలేపిందని.. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక పరిశీలకులను పంపించాలని, అవసరమైతే కేంద్రబలగాలను రంగంలోకి దించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ కోరారు. ఓటమి ఖాయమని తేలిపోవడంతో సీఎం జగన్ ముసుగు తీసేసి, ఫ్యాక్షనిస్టు పోకడలతో బరితెగింపు చర్యలకు పాల్పడుతున్నాడని సోమవారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. 'జగన్ నియంత పోకడలు తట్టుకోలేక ఇటీవల నెల్లూరు జిల్లాలోని సీనియర్ నేతలంతా టీడీపీలో చేరడాన్ని జీర్ణించుకోలేక, టీడీపీ నేతల ఇళ్లపైకి పోలీసులను ఉసిగొల్పాడు. మాజీ మంత్రి నారాయణ అనుచరులైన విజేతారెడ్డి, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, ఫైనాన్షియర్ గురుబ్రహ్మం ఇళ్లపైకి పోలీసులను పంపి, భయానక వాతావరణం సృష్టించారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడబోతున్న సమయంలో పోలీసులు జగన్ చేతిలో కీలుబొమ్మలుగా మారడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఎన్నికల సంఘం జోక్యం చేసుకుని, జగన్ తొత్తులుగా మారిన కొంత మంది పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

బీసీలకు జగన్ దగా

(మొదటి పేజీ తరువాయి)

అన్నింటిలోనూ తమకు అన్యాయం చేశారని బీసీలు గగ్గోలు పెడుతున్నారు. బీసీలకు గత చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన 34 రకాల పథకాలను సీఎం జగన్ అధికారంలోకి వస్తూ వస్తూనే అటకెక్కించారు. అదేమంటే నవరత్నాల ద్వారా అందరినీ ఉద్ధరిస్తున్నామని చెప్పుకొచ్చారు. అంతేకాదు, బీసీల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో సైతం తన వర్గం వారికే పెత్తనం ఇచ్చి రాష్ట్రంలో ఎక్కడా బీసీలకు రాజకీయంగా పెత్తనం లేకుండా అడ్డుకున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇళ్ల పట్టాల పేరుతో బీసీల్లో పేదల భూములను 8 వేల ఎకరాల మేరకు తీసుకుని వారిని రోడ్డున పడేశారని బీసీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత ఇసుక రద్దు చేయడం, అన్నా క్యాంటీన్లు ఎత్తేయడం ద్వారా ఎక్కువగా బీసీ వర్గాలే నష్టపోయాయని పేర్కొంటున్నారు. బీసీలకు మెరుగైన విద్యను అందించే బెస్ట్ అవైలబుల్ స్కూల్, స్టడీ సర్కిల్, విదేశీ విద్య లాంటి పథకాలు వారికి అందకుండా చేశారు. నామినేటెడ్ పదవులు, కాంట్రాక్టు పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఇస్తామన్న జగన్ ఆ హామీని ఎప్పుడో అటకెక్కించారు. 90 శాతం పనులు తాడేపల్లి ప్యాలెస్ పెద్దల అనుచరులకే దక్కాయి. బీసీ భవనాల నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపేయడం, బడ్జెట్‌లో కేటాయించిన నిధులను సైతం దారిమళ్లించడం, 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటుచేసి ఒక్క పైసా కూడా ఇవ్వకపోవడం వంటివి బీసీల పట్ల జగన్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో చాటిచెబుతున్నాయని ఆయా వర్గాలు అంటున్నాయి.

జగన్ తాతల కాలం నుంచి: టీడీపీ ఎమ్మెల్యే అనగాని

సీఎం జగన్ తాత రాజారెడ్డి హయాం నుంచి బీసీలపై హత్యలు, దాడులు జరుగుతూనే ఉన్నాయని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. చేనేత వర్గానికి చెందిన వ్యక్తిని దారుణంగా హత్యచేసి బైరటీస్ గనులను సొంతం చేసుకున్నారని చెప్పారు. అప్పట్లో జగన్ తాత రాజారెడ్డి ప్రారంభించిన పెత్తందారీ దోపిడీ ప్రస్థానం నేటికీ కొనసాగడం బీసీలు ఎన్నటికీ మరువలేరన్నారు.

- జగన్ ఒక అర్జునిడిలా మేమంతా కౌరవుల్లా మాట్లాడుతున్నారు. సొంత చెల్లికే గౌరవం ఇవ్వలేని వాడు, రాష్ట్రంలోని ఆడపిల్లలను ఎలా గౌరవిస్తాడు? వైసీపీలో సామాజిక న్యాయం నేతి బీరలా ఉంది. బీసీలకు న్యాయం చేసే పరిస్థితి వైసీపీలో లేదు.
  - జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ
- వైసీపీలో బీసీలకు పెద్ద పీట వేస్తున్నారనేది ఒట్టిమాటే. బీసీలను అణగదొక్కుతున్నారు. నియోజకవర్గంలో 10 శాతం కూడా అభివృద్ధి చేయలేకపోయాను. బీసీలను వంచించారు.
  - ఎంపీ సంజీవ్‌కుమార్, కర్నూలు ఎంపీ
- నన్ను నియోజకవర్గ ప్రజలు గుర్తించినా.. జగన్ మాత్రం ఎప్పుడూ గుర్తించలేదు. ప్రజలు మాత్రం నన్ను గుండెల్లో పెట్టుకున్నారు.
  - కొలుసు పార్థసారథి, పెనమలూరు ఎమ్మెల్యే

నేడే బీసీ డిక్లరేషన్!

నాగార్జున వర్సిటీ సమీపంలో 'జయహో బీసీ' సభ

హాజరు కానున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బీసీల సమగ్రాభివృద్ధి, సంరక్షణ కోసం టీడీపీ-జనసేన కూటమి మంగళవారం బీసీ డిక్లరేషన్ విడుదల చేయనుంది. ఇందుకోసం 'జయహో బీసీ' సదస్సును నాగార్జున వర్సిటీ సమీపంలో నిర్వహిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ పాల్గొంటారు. బీసీ డిక్లరేషన్‌కు సంబంధించి వివిధ అంశాలను చర్చించేందుకు సోమవారమిక్కడ టీడీపీ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో అచ్చెన్నాయుడు, డిక్లరేషన్ కమిటీ సభ్యులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, దువ్వారపు రామారావు, పంచుమర్తి అనూరాధ, కాల్వ శ్రీనివాసులు, బీద రవిచంద్ర, వీరంకి గురుమూర్తి(టీడీపీ), పోతిన మహేష్, బి.శ్రీనివాస్ యాదవ్(జనసేన)తో పాటు వివిధ బీసీ ప్రతినిధులు పాల్గొన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు పార్టీకి బలమైన మద్దతుదారులుగా నిలబడ్డారని, వారి ఉన్నతి కోసం టీడీపీ ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయని టీడీపీ ఏపీ చీఫ్ అచ్చెన్న తెలిపారు. బీసీల సమగ్రాభివృద్ధి కోసం నిర్దిష్ట విధానాలు, చర్యలతో సమగ్ర బీసీ డిక్లరేషన్‌ను చంద్రబాబు, పవన్ విడుదల చేస్తారని చెప్పారు.


సదస్సు ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అచ్చెన్నాయుడు తదితరులు

బీసీల ఉపప్రణాళిక ఎక్కడ?

బీసీల అభ్యున్నతికి సంవత్సరానికి రూ.15 వేల కోట్లు చొప్పున 5 ఏళ్లలో రూ.75 వేల కోట్లు ప్రత్యేక ఉప ప్రణాళిక ద్వారా ఖర్చు చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. కానీ, ఆచరణలో మాత్రం విఫలమయ్యారు. ఏటా అసెంబ్లీలో ఉప ప్రణాళిక కోసం బడ్జెట్ పెడుతున్నట్లు ఆర్భాటం చేయడమే తప్ప వారికి ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించిన దాఖలాల్లేవు. కేటాయించిన సొమ్మును సైతం ఖర్చు చేసిన దాఖలాలు లేక పోవడం గమనార్హం. చంద్రబాబు హయాంలో బీసీలకు 34 శాతం స్థానికసంస్థల్లో రిజర్వేషన్లు దక్కాయి. వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారు. ఫలితంగా స్థానిక సంస్థల్లో బీసీలు 16,800 పదవులను కోల్పోయారు.

మోసం మామూలుగా లేదు!

- ఆర్థిక ఎదుగుదల కోసం అన్ని నామినేటెడ్, కాంట్రాక్టు పనుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని జగన్ 2019 ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారు. అయితే, రాష్ట్రంలో ఎక్కడా సివిల్ కాంట్రాక్టు పనులు జరగకుండా ప్రభుత్వమే అడ్డుతగిలింది. ఎక్కడైనా పనులు జరిగినా.. ఆయా ప్రాంతాల్లోని వైసీపీ కార్యకర్తలకు మాత్రమే ఈ పనులు దక్కాయి. ఇక, రిజర్వేషన్ల ప్రకారం నామినేటెడ్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చిన పరిస్థితి కూడా కనిపించలేదు.
- మగ్గం ఉన్న చేనేత కార్మికుల కుటుంబాలకు సంవత్సరానికి రూ.24 వేలు ప్రోత్సాహకంగా ఇస్తామన్న జగన్ మేనిఫెస్టో హామీ నేతిబీర చందంగా మారింది. రాష్ట్రంలో 4 లక్షల మంది చేనేత కార్మికులు ఉంటే అందులో 1.25 లక్షల మంది అర్హత కలిగిన మగ్గం కలిగిన కార్మికులున్నారు. వడపోత ద్వారా కేవలం 80 వేల మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి ప్రోత్సాహకం అందిస్తున్నారు.
- జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2.14 కోట్ల బీసీ జనాభాలో కేవలం ఐదు కులాలకు చెందిన 44 లక్షల జనాభా సంక్షేమమే బీసీ సంక్షేమమని పేర్కొన్నారు. మిగతా 1.70 కోట్ల బీసీ జనాభాను గాలికొదిలేశారు. బీసీల్లోని రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్ వృత్తిలో ఉన్న కొన్ని కులాలు, మత్స్యకారులు, చేనేత వృత్తికి చెందిన వారికి మాత్రమే నవరత్నాలు అందుతున్నాయి.
- గత చంద్రబాబు ప్రభుత్వంలో బీసీల కోసం కేటాయించిన ఆర్థిక యూనిట్లు అందాయి. ప్రస్తుతం నవరత్నాల పేరుతో చేస్తున్న హడావుడి పరిశీలిస్తే బీసీలకు మొండిచేయి చూపిస్తున్నారని స్పష్టమవుతోంది. గత ప్రభుత్వం 137 రకాల బీసీ కులాలను కలుపుకొని 13 కార్పొరేషన్లు, 9 ఫెడరేషన్లు ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ.1000 కోట్లకు పైగా స్వయం ఉపాధి యూనిట్లు అందించింది. వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరిట కేవలం 4.37 లక్షల మందికి ఏడాదికి రూ.10 వేలు మంజూరు చేసి చేతులు దులుపుకొంటోంది.
- గత చంద్రబాబు ప్రభుత్వం బీసీ కుల వృత్తులను ప్రోత్సహించేందుకు 'ఆదరణ' పేరిట పనిముట్ల పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఆయా కులాలకు సంబంధించిన వారికి అధునాతన పనిముట్లను కేవలం రూ.10 శాతం చెల్లిస్తే రూ.90 శాతం సబ్సిడీగా అందించారు. వైసీపీ ప్రభుత్వం ఆ పథకానికి స్వస్తి పలికింది. అప్పట్లో పంపిణీ చేయకుండా విగిలిపోయిన పనిముట్లను వైసీపీ కార్యకర్తలు అవిన్మ సొమ్ము చేసుకున్నారు.
- గత ఐదేళ్లుగా రాష్ట్రంలో బీసీలపై హత్యలు, దాడులు జరుగుతూనే ఉన్నాయి. తోట చంద్రయ్య, కంచర్ల జల్లయ్య యాదవ్ లాంటి ఎంతో మంది బీసీలు హత్యకు గురైనా సీఎం జగన్ నోరువిప్పలేదు. తన సామాజికవర్గానికి చెందిన నేతల ముందు బీసీ మంత్రులు మోకరిల్లడం, కూర్చోవడానికి వారికి కనీసం కుర్చీ ఇవ్వకపోవడం వైసీపీ సభలో స్పష్టంగా కనిపించాయి. ఒక్క పైసా బీసీల స్వయం ఉపాధి కోసం ఇవ్వక పోవడంతో బీసీ కార్పొరేషన్లు అచేతనంగా మారాయి.

అభ్యర్థులపై ఎడతెగని పంచాయితీ!

మంత్రి ధర్మానకు సీఎం పిలుపు


- శ్రీకాకుళం సీటుపై చర్చ.. తాడేపల్లికి పలువురు రాక

అమరావతి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులపై సీఎం జగన్మోహన్‌రెడ్డి కసరత్తు ఇంకా కొలిక్కిరాలేదు. ప్రకటించినవారిని కూడా మార్చేస్తున్న నేపథ్యంలో సిటింగ్‌లెవరూ అభ్యర్థిత్వాలపై పెద్దగా ఆసక్తి కనిపించడం లేదు. ఇప్పటిదాకా 9 జాబితాల్లో 72 అసెంబ్లీ.. 18 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారుచేశారు. ఇంకా 103 అసెంబ్లీ, ఏడు ఎంపీ స్థానాలకు ప్రకటించాల్సి ఉంది. మార్పులూ చేర్పులూ చేస్తూ అతి కష్టం మీద తొమ్మిది జాబితాల్లో విడుదల చేయించగలిగారు. కసరత్తులో భాగంగా ఆయన సోమవారం రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి పిలిపించుకున్నారు. శ్రీకాకుళంలో ఆయనకు టికెట్ ఇవ్వడంపై చర్చించారు. ఓపక్క ఆయన్నే ఇన్‌చార్జిగా నియమిస్తామని వైసీపీ పెద్దలు చెబుతున్నా.. ఇప్పటివరకూ స్పష్టత ఇవ్వలేదు. వారి చర్చల సారాంశం తెలియరాలేదు. కాగా.. ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదనరెడ్డి (శ్రీకాళహస్తి), కేతిరెడ్డి పెద్దారెడ్డి (తాడిపత్రి) అబ్బయ్య చౌదరి (దెందులూరు), రాపాక వరప్రసాదరావు (రాజోలు), పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (మాచర్ల), ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి (కాకినాడ సిటీ), బ్రిజేంద్రరెడ్డి (నంద్యాల), మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త రామసుబ్బారెడ్డి సోమవారం సీఎంవోకు వచ్చి జగన్‌తో సమావేశమయ్యారు. నంద్యాల బీజేపీ ఇన్‌ఛార్జి భూమా కిశోర్‌రెడ్డి వైసీపీలో చేరారు. జగన్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రేపు ఢిల్లీకి పవన్?

- బీజేపీ పెద్దలతో 'పొత్తు' మంతనాలు!
- రెండో జాబితాపై కసరత్తు

అమరావతి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ బుధవారం ఢిల్లీ వెళ్లే అవకాశం ఉంది. పొత్తులు సహా వివిధ అంశాలపై బీజేపీ పెద్దలతో చర్చించనున్నారు. వారి పిలుపు కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు రెండో విడత అభ్యర్థుల జాబితాపై ఆయన కసరత్తు సాగిస్తున్నారు. 2, 3 రోజుల్లో మరో 10 మంది పేర్లు ప్రకటించవచ్చని తెలుస్తోంది. కాగా.. సోమవారం మంగళగిరి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. నేడు టీడీపీ-జనసేన ఉమ్మడి బీసీ డిక్లరేషన్ సభలో పాల్గొంటారు. ఈ డిక్లరేషన్ కమిటీ సమావేశంలో పాల్గొన్న బీసీ నేతలు బొనబోయిన శ్రీనివాసయాదవ్, పోతిన మహేశ్‌తో చర్చించి వివరాలు తెలుసుకున్నారు.


గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో హెలిప్యాడ్ నిర్మించారు. జనసేన అధ్యక్షుడు పవన్ ప్రయాణించిన హెలికాప్టర్ తొలిసారిగా సోమవారం ఇక్కడ ల్యాండ్ అయ్యింది. పవన్‌కు పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు.
-మంగళగిరి

'తాకట్టు'పై కనికట్టు!

- సమర్థించుకోలేక సీఆర్డీయే తంటాలు
- సంస్థ ఖాతాలో నుంచి 385 కోట్లు మాయం
- సీఆర్డీయేకు చెప్పకుండా లాగేసుకున్న సర్కారు
- వెనక్కి ఇవ్వాలని ఆర్థిక శాఖకు లేఖ
- అవి తాకట్టు పెట్టగా వచ్చిన డబ్బులేనా?
- కాదని... సీఆర్డీయే చెప్పగలదా?
- అప్పు తేలేదు... ఆదాయం లేదు..
- మరి... రూ.385 కోట్లు ఎక్కడివి?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'తాకట్టులో సచివాలయం' అనే వార్త చూడగానే సీఆర్డీయే ఉలిక్కి పడింది. సర్కారు వారి చర్యలను సమర్థించలేక, అది నిజమని ఒప్పుకోలేక, అబద్ధమని గట్టిగా చెప్పలేక ఇరకాటంలో పడిపోయింది. 'సచివాలయాన్ని తాకట్టు పెట్టి అప్పు తీసుకురాలేదు. 2018 తర్వాత మేం అప్పులేవీ చేయలేదు. 'ఆంధ్రజ్యోతి' వార్త రాసిన కథనం అసత్యం' అంటూ తూతూమంత్రపు వివరణతో 'ఖండన' పంపింది. కానీ... అదే సీఆర్డీయే సర్కారుకు రాసిన ఒక లేఖతో అడ్డంగా దొరికిపోయింది. దీని ప్రకారం.. సీఆర్డీయేలో దొంగలు పడ్డారు. దోచుకున్నది ఎవరో కాదు! స్వయంగా సర్కారు వారే. ఈ విషయంపై స్వయంగా ప్రభుత్వానికి సీఆర్డీయే లేఖ రాసింది. 'మా ఖాతాలో నుంచి, మాకు తెలియకుండా రూ.385 కోట్లు తీసేసుకున్నారు. అవి ఇచ్చేయండి' అని సర్కారు వారికి లేఖ కూడా రాసింది. సీఆర్డీయేకు ప్రభుత్వం పైసా ఇవ్వడంలేదు. బడ్జెటరీ సపోర్ట్ లేదు. ఆదాయం అసలే లేదు. పోనీ... అప్పు తెచ్చారా అంటే, 2018 నుంచి అప్పులే చేయలేదని సీఆర్డీయే చెబుతోంది. మరి... రూ.385 కోట్లు ఎక్కడివి? అవి మాయమై పోవడమేమిటి? తిరిగి ఇవ్వాలని కోరడమేమిటి? సీఆర్డీయేకు కూడా తెలియకుండా ప్రభుత్వం సచివాలయం తాకట్టు పెట్టిందా? ఆ డబ్బు సీఆర్డీయే ఖాతాలో పడగానే, ఆ సంస్థకు తెలియకుండానే తాను తీసుకుందా? తమ ఖాతాలో పడిన డబ్బు మాయమై పోయిందని తెలుసుకుని... తిరిగి చెల్లించాలని ఆర్థిక శాఖను డిమాండ్ చేసిందా? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు! 'తాకట్టులో సచివాలయం' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. సచివాలయంలోని ఐదు బ్లాక్‌లను హెచ్‌డీఎఫ్‌సీకి తాకట్టు పెట్టి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రూ.370 కోట్లు తెచ్చుకున్నట్లు తొలుత తెలిసింది. కానీ... అది రూ.385 కోట్లు అని ఇప్పుడు తెలుస్తోంది. దీనిపై సీఆర్డీయే ఒక వివరణ పంపింది. "ఆ కథనం పూర్తిగా సత్యదూరం" అని తెలిపింది. 'ఆంధ్రజ్యోతి' కథనం అసత్యమైతే ఈ ప్రశ్నలకు సీఆర్డీయే బదులిస్తుందా?

- తమ పీడీ ఖాతా నుంచి రూ.385 కోట్లు తమకు తెలియకుండా మాయమైపోయాయని, తక్షణమే వాటిని తిరిగి జమ చేయాలని ఆర్థిక శాఖను రాతపూర్వకంగా కోరారా? లేదా?
- 2018 తర్వాత ఎలాంటి అప్పులు తేలేదు అంటున్నారు కదా! మీకు ఆదాయ మార్గమేదీ లేదు. వైసీపీ వచ్చాక బడ్జెటరీ సపోర్ట్ కూడా లేదు. అలాంటిది మీ ఖాతాలోకి రూ.385 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి?
- రూ.385 కోట్లకు సంబంధించి తాము ఎలాంటి బిల్లులు సమర్పించలేదని అతి స్పష్టంగా ఆర్థిక శాఖకు చెప్పారు. అయినా, వాటిని లాగేసుకున్నారని వాపోయారా, లేదా?
- సాధారణంగా డబ్బు పీడీ ఖాతాల్లో ఉంటే సంబంధిత శాఖ, ఆర్థిక శాఖ ఆ బిల్లుకు క్లియరెన్స్ ఇవ్వగానే... 'ఈ-కుబేర్' ద్వారా ఆర్‌బీఐ చెల్లింపులు చేస్తుంది. డబ్బు ఎస్క్రో ఖాతాలో ఉంటే పాసైన బిల్లులకు బ్యాంకుల ద్వారా చెల్లింపులు జరుగుతాయి. మాయమైన రూ.385 కోట్ల విషయంలో ఈ రెండూ జరగలేదు కదా!
- 'మా డబ్బు మాయమైంది. తిరిగి మా ఎస్క్రో ఖాతాలోకి వేయండి' అని మీరు ఆర్థిక శాఖను నేరుగా డిమాండ్ చేసినట్టుంది. ఆ డబ్బు ఆర్థిక శాఖే మాయం చేసిందని మీరెలా నిర్ధారణకు వచ్చారు? విచారణేమైనా చేశారా?
- సీఆర్డీయే అధిపతికి అనుమతి లేకుండా, అస్సలు తెలియకుండా డబ్బులు ఎలా మాయమయ్యాయి? దీనికి సీఆర్డీయే బాధ్యత వహిస్తుందా? ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు బాధ్యత వహిస్తారా?
- ఒక ప్రభుత్వ శాఖ ఖాతాలో నుంచి వారికి తెలీకుండా మరొక ప్రభుత్వ శాఖ డబ్బులు కొట్టేయడం ప్రపంచంలో ఎక్కడా జరిగి ఉండదు. రాష్ట్రంలో ఆర్థిక నిర్వహణ ఎంత అస్తవ్యస్తంగా ఉందో ఈ ఉదంతం నిరూపించడం లేదా?
- కనిపించకుండా పోయిన ఆ రూ.385 కోట్లు, సచివాలయం తాకట్టు పెట్టి తెచ్చిన రూ.370 కోట్లు ఒకటా? కాదా? 'కాదు' అంటే.. ఆ రూ.385 కోట్లు ఎక్కడివో చెబుతారా?

ఇదో రకం 'సర్దుబాటు'

సీఆర్డీయే ఒక్కటే కాదు.. అనేక శాఖల ఖాతాల నుంచి ఉన్నట్టుండి డబ్బు మాయమైపోతోంది. ఇలా డబ్బులు మాయం చేయడానికి ప్రభుత్వం 'సర్దుబాటు' అని పేరు పెట్టింది.

ఇవన్నీ అడగలేదా?

మాయమైన రూ.385 కోట్లు, ఇవి కాకుండా క్యాష్ రూపంలో రావాల్సిన మరో రూ.180 కోట్లతో పాటు, బడ్జెటరీ సపోర్ట్ కింద మరో రూ.430 కోట్లు తక్షణమే కావాలని సీఆర్డీయే ఆర్థిక శాఖను రాతపూర్వకంగా అడిగింది. "ఈ డబ్బులు ఇస్తేనే ఐఏఎస్, ఐపీఎస్, ప్రభుత్వోద్యోగుల క్వార్టర్స్ నిర్మించగలం. మొత్తం 3840 క్వార్టర్స్ కట్టాలి. ఇందులో ఇప్పటి వరకు 3201 కట్టాం. ఇంకా 639 క్వార్టర్స్ కట్టాలి. మా వద్ద డబ్బుల్లేవు. మాయమైన డబ్బులతో పాటు, మరో 180 కోట్లు, బడ్జెట్ ద్వారా ఇంకో రూ.430 కోట్లు ఇస్తే వాటిని పూర్తి చేస్తాం" అని సీఆర్డీయే పేర్కొంది.



మరో 7వేల కోట్ల అప్పు!

- ఏపీఎండీసీ ఆదాయం తాకట్టు
- బేషరతు ష్యూరిటీ ఇచ్చిన సర్కారు
- రేటింగ్ లేదు, అన్‌లిస్టెడ్ బాండ్లు..
- అయినా కేవలం 8.7శాతం వడ్డీ!
- కొన్నదెవరు అనేది మిస్టరీ
- వాడుకునేది మాత్రం ప్రభుత్వమే


(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు సమీపిస్తున్న వేళ... సర్కారు వారి 'రుణదాహం' అంతకంతకు పెరుగుతోంది. 'కాదేదీ తాకట్టుకు అనర్హం' అంటూ రాష్ట్ర సచివాలయాన్నే తాకట్టు పెట్టారు. తాజాగా... రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఆదాయాన్ని తాకట్టుపెట్టేసి రూ.7వేల కోట్లు తీసుకొచ్చారు. బేషరతుగా గ్యారంటీ ఇచ్చి, స్టాక్ మార్కెట్లో బాండ్లు జారీ చేసి మరీ ఈ అప్పు తెచ్చారు. గత శుక్రవారం ఈ బాండ్లు జారీ చేశారు. శని, ఆదివారాల్లో బీఎస్ఈకి సెలవు. శుక్రవారం జరిగిన కార్యకలాపాల సమాచారాన్ని బీఎస్ఈ తిరిగి సోమవారమే అప్‌డేట్ చేస్తుంది. అందుకే 7వేల కోట్లు అప్పు తెచ్చిన వార్త 3 రోజులు ఆలస్యంగా... సోమవారం వెలుగులోకి వచ్చింది. ఏపీఎండీసీ ద్వారా బాండ్లు జారీ చేసి రూ.7,000 కోట్లు అప్పు తేవాలని ఫిబ్రవరిలో జరిగిన ఈజీఎంలో నిర్ణయించినట్లు తెలిసింది. శుక్రవారం బాండ్లు జారీ చేయడం, అదే రోజున సొమ్ము సర్కారు ఖాతాలో పడిపోవడం జరిగిపోయింది. అంటే... అప్పు కార్పొరేషన్‌ది. వాడకం... జగన్ సర్కారుది. గనుల శాఖకు సంబంధించి గత ఆర్థిక సంవత్సరంలో రూ.900 కోట్లు, అంతకు ముందు ఏడాది రూ.400 కోట్లు ప్రభుత్వం వాడుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా చూపించి ఈ బాండ్లు జారీ చేశారు.

ఎవరితో కొనిపించారు?: ఏపీఎండీసీ జారీ చేసిన బాండ్లకు రేటింగే లేదు. పైగా అవి అన్‌లిస్టెడ్. అంటే, ఈ బాండ్లు పెట్టుబడులకు సురక్షితం కాదని అర్థం. అయినప్పటికీ... 8.7 శాతం వడ్డీకే బాండ్లు అమ్ముడుపోవడం గమనార్హం. ఇది మార్కెట్ నిపుణులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. క్రెడిట్ రేటింగ్ లేని, అన్‌లిస్టెట్ బాండ్లపై ఏ ఇన్వెస్టర్‌కూ నమ్మకం ఉండదు. అందుకే... బాగా ఎక్కువ వడ్డీ ఆదాయం వస్తేనే 'రిస్క్' తీసుకుంటారు. ఇటీవల వేదాంతా లిమిటెడ్ స్టాక్ మార్కెట్లో రేటింగ్ లేని, అన్‌లిస్టెడ్ బాండ్లను విడుదల చేయగా వీటిపై 12 శాతంపైగా వడ్డీరేటు కోట్ చేశారు. అలాగే, క్రెడిట్ రేటింగ్ ఉన్న లిస్టెడ్ బాండ్లపై వడ్డీరేటు 10 శాతంపైనే ఉంటోంది. ఇదీ ప్రస్తుతం మార్కెట్ ట్రెండ్. అలాంటిది... ఏపీఎండీసీ జారీ చేసిన రేటింగ్ లేని, అన్‌లిస్టెడ్ బాండ్లను కేవలం 8.7 శాతం వడ్డీకే కొనడం పెద్ద మిస్టరీగా చెబుతున్నారు. కార్పొరేషన్ల పేరుతో 'అప్పుల పండగ' చేసుకోవడం జగన్ సర్కారుకు కొత్తేమీ కాదు. గతంలో మద్యంపై ఖజానాకు రావాల్సిన వ్యాట్‌లో 90 శాతాన్ని బేవరేజెస్ కార్పొరేషన్‌కు తరలించి, దాన్ని ఆదాయంగా చూపించి రూ.22,500 కోట్లు తెచ్చారు. మొత్తం రూ.25వేల కోట్లు తేవాలన్నది టార్గెట్! ఈ రెండేళ్లలో కలిపి 'వ్యాట్' రూపంలో బేవరేజెస్ కార్పొరేషన్‌కు రూ.9వేల కోట్లదాకా జమ అయ్యింది.

ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఎవరిది?

బేవరేజెస్ కార్పొరేషన్ రూ.22,500 కోట్లు అప్పు తేవడానికి ఉపయోగపడిన బ్రోకరేజ్ సంస్థ ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ కంపెనీ! ఇప్పుడు ఇదే సంస్థే ఏపీఎండీసీ ద్వారా రూ.7,000 కోట్లు తీసుకొచ్చేందుకు మార్కెట్లో ఏర్పాట్లు చేసింది. ఈ సంస్థను మాత్రమే ఎందుకు ఎంపిక చేసుకుంటున్నారనేది మిస్టరీ. ఈ సంస్థ ఎంపికకు టెండర్లు పిలవలేదు. మూడేళ్ల క్రితం 'నామినేషన్' పద్ధతిలో దీనిని ఎంపిక చేశారు. అప్పటి నుంచి ఏటా ఈ ట్రస్ట్ గడువు పొడిగిస్తూ వస్తున్నారు. ఇప్పుడు ఇదే సంస్థకు ఏపీఎండీసీ ద్వారా అప్పులు తెచ్చే బాధ్యత అప్పగించారు. కార్పొరేషన్ ద్వారా తెచ్చిన అప్పులో 1.44 శాతం మొత్తాన్ని ఈ సంస్థకు ఫీజుగా చెల్లిస్తున్నట్టు జీవోలో ఉంది. ఏపీఎండీసీ ద్వారా తెచ్చిన అప్పు విషయంలోనూ ఇదే తరహాలో ఫీజు చెల్లిస్తారు. 'ట్రస్ట్ ఇన్వెస్ట్‌మెంట్' సంస్థకు కోట్లకు కోట్లు ఫీజులు ధారపోస్తున్నారు. దీంతో ఈ సంస్థ వెనుక ఉన్నది ఎవరు? ప్రభుత్వ పెద్దల 'ఆశీర్వాదాలు' లేకుండానే చెల్లింపులు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్పొరేషన్లు అప్పు తెచ్చుకోవడం తప్పు కాదు. ఆ అప్పులకు ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వడం కొత్తేమీ కాదు. కానీ... కార్పొరేషన్ల పేరుతో ప్రభుత్వమే అప్పు తెచ్చి, తాను వాడుకోవడం మాత్రం జగన్ సర్కారు హయాంలోనే మొదలైంది!



ఆ వార్త అవాస్తవం: సీఆర్డీయే

'**తాకట్టులో సచివాలయం**' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం పూర్తిగా సత్యదూరమని సీఆర్డీయే తెలిపింది. "సాధారణ పరిపాలనా శాఖ నుంచి ఈ విషయమై మాకు ఎటువంటి ప్రతిపాదనలు రాలేదు. కన్సార్టియం బ్యాంకులు, హడ్కోల నుంచి ఏపీసీఆర్డీయే పొందిన రుణాన్ని ముఖ్యమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించాం" అని సీఆర్డీయే అకౌంట్స్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

భూములు అమ్మి బిల్లులు!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా భూములు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఒక పథకం ప్రకారం స్థానిక వైసీపీ నేతలు తక్కువ ధరకు భూములు కొని, ప్రభుత్వానికి భారీ ధరకు విక్రయించారు. దీనికి సంబంధించిన బిల్లులు చాలా నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో అస్మదీయుల బిల్లులను ఆగమేఘాల మీద క్లియర్ చేయడంపై దృష్టి సారించారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో రూ.65 కోట్లు, రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలో రూ.255 కోట్లు చెల్లించేందుకు మాస్టర్ ప్లాన్ వేశారు.

వందల్లో కాంట్రాక్టర్లు... వేల కోట్లరూపాయల బిల్లులు! అన్నీ పెండింగ్! కానీ... రెండు నియోజకవర్గాల్లో జగనన్న భూసేకరణ బిల్లుల చెల్లింపునకు మాత్రం సర్కారు సిద్ధమైంది. 'రాజీవ్ స్వగృహ భూములు అమ్మేయండి. ఆ సొమ్ములతో మా వాళ్ల బిల్లులు చెల్లించండి' అని ఆదేశాలు జారీ చేసింది.

విశాఖ భూములు బలి...

'రాజీవ్ స్వగృహ' పథకంలో భాగంగా విశాఖలోని ఎండాడ వద్ద సుమారు 70 ప్లాట్లు డెవలప్ చేశారు. ఇవి మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి నివాసాల కోసం ఉద్దేశించినవి. జగన్ సర్కారు అసంబద్ధ నిర్ణయాల కారణంగా వీటిని వేలంలో కొనేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. ఈ భూములు మాత్రం విలువైనవే. 'అస్మదీయుల బిల్లుల' చెల్లింపునకు సరిగ్గా ఈ భూములనే వాడుకోవాలని నిర్ణయించారు. ఇవి రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ (ప్రస్తుతం టిడ్కో)కు సంబంధించిన భూములు. వీటిని చూపించి ఎలాగోలా ఆర్థిక సంస్థల నుంచి రూ.255 కోట్లు అప్పు తేవాలని 'స్వగృహ' కార్పొరేషన్‌ను ఆదేశించారు. ఆ మొత్తాన్ని హౌసింగ్ కార్పొరేషన్‌కు బదిలీ చేయాలని జీవోలో పేర్కొన్నారు. దీంతోపాటు... రాజీవ్ స్వగృహ వద్ద ఉన్న మరో రూ.35 కోట్లను కూడా హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇవ్వాలన్నారు. మొత్తం రూ.290 కోట్లను అనపర్తి, రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గాల్లో జగనన్న కాలనీ భూముల బిల్లులకు చెల్లించాలని హౌసింగ్ కార్పొరేషన్‌కు సూచించారు. అప్పులు, నిధులు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌వి! ఆ డబ్బులు బదిలీ చేయాల్సింది హౌసింగ్ కార్పొరేషన్‌కు! అంతిమంగా బిల్లుల చెల్లింపులో లబ్ధి చేకూరేది... వైసీపీ నేతలకు! ఇదీ... సర్కారు పెద్దల మాస్టర్ ప్లాన్.

అప్పు తీర్చేదెలా?: సర్కారు ఆదేశాల మేరకు తెస్తున్న రూ.255 కోట్లు అప్పు ఎలా తీర్చాలి? ఈ ప్రశ్నకు కూడా జీవోలోనే సమాధానం ఇచ్చారు. ఎండాడలో డెవలప్ చేసిన ప్లాట్లనే తెగనమ్మి రుణం చెల్లించాలని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు సూచించారు. మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీలక్ష్మి ఈ ఆదేశాలు జారీ చేశారు. భూముల అమ్మకం, చెల్లింపుల్లో ఆలస్యం లేకుండా చూడాలని కూడా స్పష్టం చేశారు. మరి... రాజీవ్ స్వగృహకు ఈ డబ్బులను హౌసింగ్ కార్పొరేషన్ ఎలా తిరిగి చెల్లిస్తుంది? జగనన్న కాలనీల పథకం కోసం ఆస్తులమ్మి డబ్బు సమకూరుస్తున్న 'రాజీవ్ స్వగృహ'కు జరుగుతున్న నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు? ఆదాయం, ఆస్తుల్లేని హౌసింగ్ శాఖ.. 'రాజీవ్ స్వగృహ'కు తిరిగి ఎలా ఆ నిధులు చెల్లిస్తుంది? ఈ ప్రశ్నలకు మాత్రం సమాధానం లేదు. సాధారణంగా ఖజానాకు వచ్చే ఆదాయం నుంచే ప్రభుత్వం బిల్లులు చెల్లించాలి. కానీ.. 'అస్మదీయుల' కోసం రాజీవ్ స్వగృహకు ఉన్న కొద్దిపాటి ఆస్తులను కూడా అమ్మించి ఆ సంస్థను పూర్తిగా దివాలా తీయిస్తున్నారు.

బిల్లులు భారీగా పెండింగ్

వైసీపీ అధికారంలోకి వచ్చాక లక్షల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వివిధ శాఖల్లో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. చాలామంది కోర్టులను కూడా ఆశ్రయించారు. దాదాపు 4 లక్షల పిటిషన్లు కోర్టుల్లో ఉన్నాయి. ఇప్పటికీ బిల్లులు అందక కాంట్రాక్టర్లు, వెండర్లు గింగిరాలు తిరుగుతున్నారు. కానీ... అస్మదీయ కాంట్రాక్టర్లకు మాత్రమే డబ్బులు అందుతున్నాయి.

ఈ వేసవిలో మంటలే!

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేసింది. ఎల్‌నినో ప్రభావంతో మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మండిపోతాయని, వడగాడ్పులు కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించింది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కూర్మనాథ్ సోమవారం ఒక ప్రకటన చేశారు. మార్చి నుంచి మే వరకు కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఎక్కువగా, అల్లూరి సీతారామ రాజు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, విశాఖపట్నం, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ఎండలతో పాటు క్యుములోనింబస్ మేఘాల వల్ల ఆకస్మికంగా భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కోరారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. వేసవిలో ఓఆర్ఎస్, మజ్జిగ, మంచినీరు వంటివి అధికంగా సేవించాలని సూచించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి రియల్ టైమ్‌లో ముందుగానే ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల తీవ్రతపై సూచనలు జారీ చేస్తామన్నారు. ఎండలు, వడగాల్పులు, పిడుగుల సమాచారం కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే స్టేట్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101ను సంప్రదించాలని సూచించారు. ఎండలు, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉండే జిల్లాలపై అధికారులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

సచివాలయం తాకట్టు పెడితే తప్పేంటి?

- పెట్టకూడదని రాజ్యాంగంలో రాశారా
- అదేమైనా చంద్రబాబు తండ్రి సొత్తా.. కొడాలి వ్యాఖ్యలు



గుడివాడ, మార్చి 4: ప్రజలకు అవసరమైనప్పుడు ప్రభుత్వ ఆస్తులను బ్యాంకులకు తాకట్టు పెట్టడం సాధారణ విషయమేనని వైసీపీ నేత, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. రాష్ట్ర సచివాలయాన్ని ప్రభుత్వం తాకట్టు పెట్టడాన్ని సమర్థించారు. సోమవారం గుడివాడలో ఆయన మాట్లాడుతూ, ఆస్తులు తాకట్టు పెట్టకుండా బ్యాంకులు అప్పులు ఎలా ఇస్తాయని ప్రశ్నించారు. ఏయే ఆస్తులు తాకట్టు పెట్టుకోవాలో అంబేడ్కర్ రాజ్యాంగంలో ఏమైనా రాసి ఉందా అని ప్రశ్నించారు. సచివాలయాన్ని తాకట్టు పెట్టారని చంద్రబాబు గగ్గోలు పెడుతున్నాడని, అదేమైనా ఆయన బాబు సొత్తా అని నిలదీశారు. రాష్ట్రం రూ.4 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, దీనిలో రూ.2.50 లక్షల కోట్ల అప్పు చంద్రబాబు చేసిందేనని విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెట్టకుండానే చంద్రబాబు అంత అప్పు చేశారా? అని నాని ప్రశ్నించారు. సచివాలయం అనేది కేవలం 10 ఎకరాల ఆస్తి మాత్రమేనని, ప్రజల అవసరాల కోసం, ప్రభుత్వ వెసలుబాటును బట్టి ఆస్తులు తాకట్టు పెట్టడం సబబేనని పేర్కొన్నారు.

వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి గిఫ్ట్‌ల గేలం!

- సమాచార శాఖ వాహనంలో బహుమతులు తరలింపు
- మంత్రి చెల్లుబోయిన వేణు కుమారుడి బరితెగింపు



ధవళేశ్వరంలో వలంటీర్లకు పంచడానికి సమాచార శాఖ వాహనంలో తరలిస్తున్న డిన్నర్ సెట్లు

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, మార్చి 4: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా ఉన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పోటీ చేస్తున్న ప్రాంతంలో ఆయన కుమారుడు వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి గిఫ్ట్‌ల గేలం వేస్తున్నారు. ఈ మేరకు రోజుకో ప్రాంతంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. సోమవారం ధవళేశ్వరం గ్రామంలో మంత్రి వేణు కుమారుడు సమావేశం నిర్వహించి వలంటీర్లకు డిన్నర్ సెట్లు పంచిపెట్టారు. ఈ గిఫ్ట్‌లను తీసుకురావడానికి సమాచార శాఖకు చెందిన వాహనాన్ని వినియోగించడం విమర్శలకు దారితీసింది. సమావేశం ముగిసిన తర్వాత వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి డిన్నర్ సెట్లు అందించారు. వచ్చే ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించి వైసీపీని గెలిపించాలని కోరారు. కాగా.. ప్రభుత్వ, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించే అధికారం మంత్రి వేణు తనయుడికి ఎక్కడిదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అరాచకమల్లు!

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాన్ని శాసించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాసే మీడియాను తిట్టడమే పనిగా పెట్టుకుంటారు. టీడీపీ ఇన్‌చార్జిపై తప్పుడు కేసు పెట్టి రెండు మార్లు జైల్లో పెట్టారు. ఎమ్మెల్యే గురించి స్థానికంగా పుంఖానుపుంఖాలుగా చెబుతారు. ఆయన బయటికి మాత్రం నీతి, నిజాయితీ, ధర్మం అంటూ పెద్ద పెద్ద కటింగ్‌లు ఇస్తారు. ఆ ఉపన్యాసాలు చూసి పేదల పాలిట పెన్నిధి అన్నట్లుగా కవరేజ్ చేస్తారు. తొలినాళ్లలో జూదం, బలవంతపు వసూళ్ల వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు. 1996-97లో కాంగ్రెస్ కార్యకర్తగా మాజీ ఎమ్మెల్యే వద్ద చేరారు. కౌన్సిలర్‌గా ఉన్న తన మేనమామ అకాల మరణంతో ఆయన ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. 2005లో తనకు మునిసిపల్ ఛైర్మన్ టికెట్ ఇవ్వలేదన్న అసంతృప్తితో కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. 2008లో టీడీపీలో చేరారు. జగన్ పార్టీ పెట్టాక ఆయన వెంట నడిచారు. 2014, 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తన విశ్వరూపం చూపించారు. అడ్డగోలుగా అక్రమ సంపాదనకు తెరలేపారు.

అడ్డగోలుగా ఆక్రమణలు



ఎమ్మెల్యే సోదరుడు రియల్ ఎస్టేట్ చేస్తుంటారు. ఎమ్మెల్యే, ఆయన బామ్మర్ది, సోదరుడు చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. 2019 తరువాత బీసీలు, ఆర్య వైశ్యులకు చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే భూములు లాక్కుని కోట్లు గడించారనే ప్రచారం ఉంది. వాగులు, వంకలు, కాల్వలు, కుంటలు, దేవుడిమాన్యం, చుక్కల భూములు ఇలా అన్నింటినీ ఆక్రమించి చుట్టూ వెంచర్లు వేసి జనాలకు అంటగట్టారని అంటారు. ఓ లింక్ కెనాల్‌కు సంబంధించి సుమారు రూ.5 కోట్ల విలువ చేసే 2.5 ఎకరాలను ఆక్రమించేసి తన కుటుంబీకులకు చెందిన వెంచర్లు కలిపేసి అమ్ముకున్నట్లు చెబుతారు. చర్చి భూములకు చెందిన 5 ఎకరాలు స్వాహా చేసినట్లు ప్రచారం ఉంది. ఎమ్మెల్యే ఇటీవల నిర్మించుకున్న ఇంటికి ఎదురుగా ఉన్న 4 ఎకరాల ఆలయ భూములను ఆక్రమించుకుని రోడ్డు వేయించుకున్నారు.

బెట్టింగ్, జూదం, ఇసుక

క్రికెట్ బెట్టింగ్‌కు ముంబై అడ్డా అయితే ఇప్పుడు నియోజకవర్గం కేరాఫ్‌గా మారిందంటారు. ఎమ్మెల్యే తన బావమరిది ఆధ్వర్యంలో టీ-20, వన్డే, ఐపీఎల్ మ్యాచ్‌లకు బెట్టింగ్‌లు నిర్వహిస్తారని చెబుతారు. ఈ వ్యవహారంపై యువగళం పాదయాత్రలో లోకేశ్ విమర్శలు చేశారు. రికార్డింగ్ మ్యాచ్‌కు కూడా ఎమ్మెల్యే బెట్టింగ్ కట్టారని, ఆయన పేరు బెట్టింగ్ రెడ్డి అంటూ ఆరోపణలు చేయడం సంచలనం రేపింది. ఇక మట్కా, జూదం ఇతరత్రా కార్యక్రమాలన్నీ సదరు నేత అడ్డాలోనే నిర్వహించారనే టాక్ ఉంది. ఇక పెన్నానది నుంచి ఇసుకను అడ్డగోలుగా తన అనుచరుల ద్వారా తరలించి కోట్లాది రూపాయలను కొల్లగొట్టారనే ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ.200 కోట్ల ఇసుక బొక్కేశారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల ఇసుక అక్రమ రవాణా అడ్డుకున్న ఎస్ఐపై రాళ్ల దాడి చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. ఇక జగనన్న కాలనీల పేరుతోసేకరించిన భూములు ఎమ్మెల్యేకు కల్పతరువుగా మారాయి. నివాసయోగ్యానికి పనికిరాని చౌడు భూములను ఎకరాకు రూ.40 లక్షల చొప్పున ప్రభుత్వానికి అమ్మి కమీషన్ల రూపంలో కొట్టేశారని ప్రచారం ఉంది. మరో ప్రాంతంలో ఎకరా రూ.30 లక్షలతో 30 ఎకరాలు కొనుగోలు చేసి జగనన్న కాలనీలకు అమ్మేశారు. అగ్రిమెంట్ల ద్వారానే రూ.20 కోట్లు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. విలువైన చుక్కల భూములను రాత్రికి రాత్రి సెట్ చేశారంటారు.

టీడీపీ బీసీ నేత దారుణహత్య

నియోజకవర్గానికి చెందిన చేనేత కులస్తుడు, టీడీపీ అధికార ప్రతినిధిని అత్యంత దారుణంగా హత్య చేశారు. జగనన్న కాలనీల లేఅవుట్ల కోసంసేకరించిన 400 ఎకరాల్లో స్కాం జరిగిందని, అలాగే ఎమ్మెల్యే ఇసుక దందాపై విచారణ జరిపించాలంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన పట్టపగలే అత్యంత దారుణ హత్యకు గురయ్యారు. ఎమ్మెల్యే అనుచరులే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు ప్రచారం ఉంది. సదరు నాయకుడు ఎన్నో దౌర్జన్యాలకు పాల్పడ్డారు. జూదంపై కన్నెర్రజేసిన ఓ సీఐపై ఆయన దాడి చేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా విద్యాసంస్థలు నిర్వహించిన ఓ వ్యక్తికి, వేరేవారికి లావాదేవీల్లో తేడాలు వచ్చాయి. వారి నుంచి కాపాడాలని విద్యాసంస్థల అధినేత ఎమ్మెల్యే వద్దకు వెళ్లగా... 'మీ ఆస్తులు నా పేరు మీద రాయండి.. అవి ఎక్కడికీ పోవు' అంటూ అభయమిచ్చి వాటిని కొట్టేసినట్లు ప్రచారం ఉంది. ఓ గోడౌన్ యజమాని ఆర్థిక నష్టాలతో ఆత్మహత్య చేసుకోగా.. ఆయనకు డబ్బు ఇచ్చిన బాధిత రైతులకు న్యాయం చేస్తామని చెప్పి ఆ యజమాని ఆస్తులను రాయించుకున్నట్లు ప్రచారం ఉంది. విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఆపరేటరు, ఇతరత్రా పోస్టుల కోసం కొందరి నుంచి రూ.8-10 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఓ కౌన్సిలర్ భర్త ఆక్రమించిన స్థలానికి అనుకూలంగా ఉండేందుకు పెద్దఎత్తున అమ్యామ్యాలు తీసుకున్నట్లు ప్రచారం ఉంది. మరో బీసీ కుల సంఘం నాయకుడికి సంబంధించి మున్సిపాలిటీలో వివాదాన్ని సెటిల్ చేసేందుకు పెద్దఎత్తున డబ్బు తీసుకున్నట్లు చెబుతారు. ఓ మహిళా విద్యాసంస్థ యాజమాన్యం తన భూములు విక్రయించిన దానిలో రూ.3 కోట్లు కమీషన్ తీసుకున్నట్లు ప్రచారం ఉంది. మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో రోడ్ల విస్తరణలో భూములు పోకుండా ఉండేందుకు భారీగా కొట్టేసినట్లు ఆరోపణలున్నాయి.

ఎన్నో అరాచకాలు

అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలకు ప్లాన్ కావాలంటే బావ బామ్మర్దుల ఆశీస్సులు ఉండాల్సిందే. మున్సిపాలిటీలో జరిగే పనులకు సింగిల్ టెండర్లు పడేలా రింగ్ చేస్తారని చెబుతారు. ఎగ్జిబిషన్‌లో కూడా ఎంట్రీ ఫీజు పెట్టి ఎక్కువ ధరలకు టికెట్లు విక్రయించేవారని చెబుతారు. మున్సిపల్ మార్కెట్ గదుల నిర్మాణం నుంచి అన్నింటా చిలక్కొట్టుడు కొట్టినట్లు చెబుతారు. కరోనా సమయంలో మున్సిపల్ అధికారి, ఓ పోలీసు అధికారిని అడ్డుపెట్టుకుని పాల ప్యాకెట్లు మొదలుకుని ఇతరత్రా వస్తువుల విక్రయాల్లో భారీగా పోగేసినట్లు చెబుతారు. ఇక బియ్యం మాఫియాకు అడ్డూఅదుపూ లేదు. బయో డీజిల్, అనుమతి లేని డీజిల్‌కు అడ్డాగా మారిందని చెబుతారు. ఇక ఎమ్మెల్యే అనుచరురాలు నకిలీ నోట్లు మారుస్తుండగా పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 5 మార్చి 2024
diksuchi@andhrajyothy.com

ఆంధ్రప్రదేశ్ గురుకులాల్లో ప్రవేశానికి ఏపీఆర్‌జేసీ సెట్

గుంటూరులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీఆర్‌ఈఐఎస్) - ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఉద్దేశించిన కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏపీఆర్‌జేసీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 జనరల్ కేటగిరీ, 3 మైనారిటీ కేటగిరీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. మైనారిటీ కాలేజీల్లో ఉర్దూ మీడియం కూడా ఉంది. ట్యూషన్ ఫీజు ఉండదు. ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. అకడమిక్ యాక్టివిటీస్‌తోపాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తారు. విద్యార్థులకు అవసరమైన ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, డిజిటల్ క్లాసెస్, రీడింగ్ రూమ్‌లు, ప్లే గ్రౌండ్‌లు అందుబాటులో ఉంటాయి. ఐఐటీ/నీట్/సీఏ-సీపీటీ ఎగ్జామ్స్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ ఇస్తారు. 15 నుంచి 20 మంది విద్యార్థులను ఒక గ్రూప్‌గా చేసి వారి సంరక్షణ కోసం ఒక లెక్చరర్‌ను లోకో-పేరెంట్‌గా నియమిస్తారు.

సీట్ల వివరాలు

ఆంధ్ర రీజియన్ గురుకులాలు(జనరల్)

- విజయనగరం జిల్లా-తాటిపూడి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 12, సీఈసీ 15, ఈఈటీ 10, సీజీటీ 11 సీట్లు; బాలికలకు ఎంపీసీ 25, బైపీసీ 15, ఎంఈసీ 13, సీఈసీ 15, ఈఈటీ 11, సీజీటీ 10 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునాసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 68, బైపీసీ 51, ఎంఈసీ 42, సీఈసీ 39 సీట్లు ఉన్నాయి.
- తిరుపతి జిల్లా-వెంకటగిరి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.

రాయలసీమ రీజియన్ గురుకులాలు(జనరల్)

- కర్నూలు జిల్లా బనవాసి గురుకులంలో బాలికలకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- అన్నమయ్య జిల్లా-గ్యారంపల్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 60, బైపీసీ 40, ఎంఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- శ్రీ సత్యసాయి జిల్లా-కొడిగెనహళ్లి గురుకులంలో బాలురకు ఎంపీసీ 50, బైపీసీ 30, ఎంఈసీ 25, సీఈసీ 30 సీట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా-నిమ్మకూరు గురుకులంలో బాలురకు ఈఈటీ 5, సీజీటీ 5 సీట్లు; బాలికలకు ఈఈటీ 4, సీజీటీ 4 సీట్లు ఉన్నాయి.
- పల్నాడు జిల్లా-నాగార్జునాసాగర్ గురుకులంలో బాలురకు ఎంపీసీ 12, బైపీసీ 9, ఎంఈసీ 3, సీఈసీ 6 సీట్లు ఉన్నాయి.

మైనారిటీ గురుకులాలు

- గుంటూరు, కర్నూలు జిల్లాల్లో బాలుర గురుకులాలు ఉన్నాయి. అన్నమయ్య జిల్లా-వాయల్పాడులో బాలికల గురుకులం ఉంది. ఒక్కో గురుకులంలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకుగాను ఒక్కోదానిలో మైనారిటీలకు 32, ఎస్సీలకు 6, ఎస్టీలకు 2 సీట్లు; సీఈసీలో మైనారిటీలకు 28, ఎస్సీలకు 5, ఎస్టీలకు 2 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఈ గురుకులాల్లో ప్రవేశానికి ప్రస్తుతం పదోతరగతి పరీక్షలు రాసే రాష్ట్ర విద్యార్థులందరూ(బాలురు, బాలికలు) దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు మొదటిసారే ఉత్తీర్ణులు కావాలి. జనరల్ అభ్యర్థులకు 60 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు రావాలి. అభ్యర్థులందరికీ ఇంగ్లీష్‌లో కనీసం 40 శాతం మార్కులు ఉండాలి. గత సంవత్సరాల్లో పదోతరగతి పూర్తిచేసినవారు ప్రస్తుతం దరఖాస్తుకు అనర్హులు. పదోతరగతి స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా చదివినవారు మాత్రమే ఉర్దూ మీడియంలో చేరేందుకు అర్హులు.

ఏపీఆర్‌జేసీ సెట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఎంపీసీ/ఈఈటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, మేథమెటిక్స్, ఫిజికల్ సైన్స్; బైపీసీ/సీజీటీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, బయో సైన్స్, ఫిజికల్ సైన్స్; ఎంఈసీ/సీఈసీ అభ్యర్థులకు జనరల్ ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, మేథమెటిక్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 50 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ పదోతరగతి స్థాయిలోనే ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్; ఇంగ్లీష్, ఉర్దూ మాధ్యమాల్లో ఇస్తారు.

ఎంపిక వివరాలు

- జనరల్ కేటగిరీ గురుకులాల్లో చేరే విద్యార్థులు; మైనారిటీ గురుకులాల్లో చేరాలనుకున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు మాత్రమే పరీక్ష రాయాలి. పరీక్షలో సాధించిన మెరిట్ ప్రకారం విద్యార్థులను 1:5 నిష్పత్తిలో షార్ట్‌లిస్ట్ చేసి కౌన్సెలింగ్‌కు పిలుస్తారు. ఆంధ్ర, రాయలసీమ రీజియన్లకు విడివిడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. స్థానికత, రిజర్వేషన్ నిబంధనలు, స్పెషల్ కేటగిరీ రిజర్వేషన్స్ తదితరాలను పరిశీలించి అడ్మిషన్స్ ఇస్తారు.
- మైనారిటీ వర్గాల విద్యార్థులు ఏపీఆర్‌జేసీ సెట్ రాయనవసరం లేదు. వీరికి పదోతరగతిలో సాధించిన మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

ఏపీఆర్‌జేసీ సెట్ రాసే విద్యార్థులకు:

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 17 నుంచి
- **ఏపీఆర్‌జేసీ సెట్ తేదీ:** ఏప్రిల్ 25
- **ఫలితాలు విడుదల:** మే 14
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** మే 20, 21, 22
- **సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్:** మే 28, 29, 30
- **థర్డ్ ఫేజ్ కౌన్సెలింగ్:** జూన్5, 6, 7

మైనారిటీ విద్యార్థులకు:

- దరఖాస్తు ఫీజు లేదు
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** మే 1 నుంచి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 20
- **ఎంపికైన విద్యార్థుల మొదటి లిస్ట్ విడుదల:** మే 21
- **రెండో లిస్ట్ విడుదల:** మే 31
- **మూడో లిస్ట్ విడుదల:** జూన్ 11
- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** జూన్ 18
- **వెబ్‌సైట్:** https://aprs.apcfss.in



సీఎంఐలో మేథ్స్ ప్రోగ్రామ్‌లు

చెన్నై మేథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఐ)- డిగ్రీ, పీజీ, రీసెర్చ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీఎస్సీ ఆనర్స్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

బీఎస్సీ ఆనర్స్: మేథమెటిక్స్ - కంప్యూటర్ సైన్స్, మేథమెటిక్స్ - ఫిజిక్స్ విభాగాలు ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఏడాదికి రెండు చొప్పున మొత్తం ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తమ్మీద 28 రెగ్యులర్ కోర్సులు నిర్దేశించారు. ఒక్కోదానికి 4 చొప్పున మొత్తం 112 క్రెడిట్స్ ఇస్తారు. కొన్ని స్వల్పకాలిక ఎలక్టివ్ కోర్సులు కూడా ఉంటాయి. వీటికి రెండు లేదా ఒక క్రెడిట్ ఇస్తారు. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో నాన్ క్రెడిట్ కోర్సుని అభ్యర్థులందరూ తప్పనిసరిగా పూర్తిచేయాలి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ సైన్స్ ఒలింపియాడ్స్(మేథమెటిక్స్/ఫిజిక్స్)లో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు.

స్కాలర్‌షిప్: అకడమిక్ ప్రతిభ, సెమిస్టర్ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేసిన 30-35 మంది అభ్యర్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు. వీరికి ట్యూషన్ ఫీజుతోపాటు నెలకు రూ.5000ల ఫెలోషిప్ ఇస్తారు. కుటుంబ వార్షికాదాయం రూ.8లక్షలలోపు ఉంటే ప్రోగ్రామ్ ఫీజు నుంచి మినహాయింపునిస్తారు. అదే రూ.12లక్షలలోపు ఉంటే 50 శాతం రాయితీ ఇస్తారు.

ఎమ్మెస్సీ: మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు చొప్పున మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తమ్మీద 16 రెగ్యులర్ కోర్సులు రూపొందించారు. ఒక్కోదానికి 4 చొప్పున మొత్తం 64 క్రెడిట్స్ ఇస్తారు. చివరి సెమిస్టర్లలో కొన్ని స్వల్పకాలిక ఎలక్టివ్ కోర్సులను కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటికి ఒకటి లేదా రెండు క్రెడిట్‌లు ఇస్తారు.

అర్హత: మేథమెటిక్స్/కంప్యూటర్ సైన్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా బీఏ/బీఎస్సీ లేదా బీ మేథ్స్/బీ స్టాటిస్టిక్స్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

స్కాలర్‌షిప్: మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో ఎంపిక చేసిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజుతోపాటు నెలకు రూ.6,000 ఫెలోషిప్ ఇస్తారు. డేటా సైన్స్ సహా అన్ని విభాగాల అభ్యర్థులకు వారి ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని ట్యూషన్ ఫీజులో రాయితీ/మినహాయింపు ఇస్తారు.

పీహెచ్‌డీ: మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్ విభాగాలు ఉన్నాయి. మొదటి రెండు విభాగాలకు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ద్వారా ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తారు. ఫిజిక్స్‌లో జాయింట్ ఎంట్రెన్స్ స్క్రీనింగ్ టెస్ట్(జెస్ట్), ఇంటర్వ్యూల ద్వారా మాత్రమే ప్రవేశాలు కల్పిస్తారు. విభాగానికి నిర్దేశించిన పేపర్లలో జెస్ట్ అర్హత ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ రాయకుండా నేరుగా ప్రవేశాలు పొందవచ్చు. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. మొదటి రెండేళ్లు కంపల్సరీ కోర్సు వర్కు పూర్తి చేయాల్సి ఉంటుంది. తరవాత క్వాలిఫయింగ్ ఎగ్జామ్ నిర్వహిస్తారు. దీనిలో చూపిన ప్రతిభ ఆధారంగా డాక్టోరల్ కమిటీ నిర్ణయం మేరకు రీసెర్చ్ వర్క్‌కు అనుమతిస్తారు. పార్ట్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ కూడా అందుబాటులో ఉంది.

అర్హత: మేథమెటిక్స్ విభాగానికి ఎమ్మెస్సీ(మేథ్స్)/తత్సమాన కోర్సు; కంప్యూటర్ సైన్స్ విభాగానికి ఎమ్మెస్సీ(కంప్యూటర్స్)/ఎంసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. ఈ రెండు విభాగాలకు అధిక మార్కులతో బీఈ/బీటెక్/బీఎస్సీ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఫిజిక్స్ విభాగానికి ఎమ్మెస్సీ(ఫిజిక్స్) ఉత్తీర్ణత తప్పనిసరి. ఎన్‌బీహెచ్‌ఎం అర్హత పొందిన అభ్యర్థులకు మేథ్స్ విభాగంలో నేరుగా ప్రవేశం కల్పిస్తారు.

స్కాలర్‌షిప్: మొదటి రెండేళ్లు నెలకు రూ.37,000; తరవాతి మూడేళ్లు నెలకు రూ.42,000ల స్టయిపెండ్ ఇస్తారు. బుక్ గ్రాంట్ కింద ఏడాదికి రూ.10,000 చెల్లిస్తారు. హాస్టల్ సౌకర్యాన్ని వినియోగించుకోని అభ్యర్థులకు స్టయిపెండ్‌లో 27 శాతాన్ని హెచ్‌ఆర్‌ఏగా చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- బీఎస్సీ పూర్తిచేసిన అభ్యర్థులు తదుపరి కోర్సుల్లో తమ విభాగాన్ని మార్చుకోదలచుకొంటే ప్రీ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో చేరవచ్చు. ఇందులో తాము ఎంచుకొన్న విభాగంలో మొదటి రెండేళ్ల కోర్సు పూర్తిచేసి రెగ్యులర్ ఎమ్మెస్సీ అభ్యర్థులతో సమానంగా పీహెచ్‌డీ క్వాలిఫయింగ్ ఎగ్జామ్‌నకు హాజరు కావచ్చు. వీరికి తక్కువ మొత్తంలో స్కాలర్‌షిప్ కూడా ఇస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 12 నుంచి
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్:** మే 19
- **ఇంటర్వ్యూలు:** పీహెచ్‌డీ మేథ్స్ ప్రోగ్రామ్‌నకు జూలై 1 నుంచి 4 వరకు; ఎమ్మెస్సీ మేథ్స్ ప్రోగ్రామ్‌నకు జూలై 4 నుంచి 5 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు మొదటి వారంలో
- **వెబ్‌సైట్:** cmi.ac.in

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థ

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

బయాలజీ

స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలో ఒక జత స్త్రీ బీజకోశాలు, ఒక జత స్త్రీ బీజవాహికలు, గర్భాశయం, యోని, అనుబంధ గ్రంథులు ఉంటాయి. ఈ భాగాలు స్త్రీలలో శ్రోణి ప్రాంతంలో ఉంటాయి.

స్త్రీ బీజకోశాలు: ఇవి ఉదర కుహరంలో ఒక జతను కలిగి ఉండి, అండాలను, స్త్రీ బీజకోశ హార్మోనులను ఉత్పత్తి చేస్తాయి. వీటిలో అనేక స్త్రీ బీజ కోశపుటికలు ఉంటాయి. ఈ పుటికలలో అండాలు అభివృద్ధి చెందుతాయి. ఈ పుటికలు ప్రారంభంలో చిన్న చిన్న బుడగల రూపంలో ఉం టాయి. ప్రతి పుటిక లోను ఒక అండం ఉంటుంది. అండం పరిపక్వం చెందినపుడు, పుటిక పగిలి అండం విడుదలవుతుంది. ఇలా అండం విడుదల కావడాన్ని అండోత్సర్గం అంటారు. అండాలు స్త్రీ బీజ వాహికలోకి ప్రవేశిస్తాయి.

స్త్రీ బీజవాహిక: దీనిని ఫాలోపియన్ నాళం అని కూడా పిలుస్తారు. ఇవి ఒక జత ఉంటాయి. స్త్రీ బీజకోశం నుంచి ఇవి బయలుదేరుతాయి. దీనిలో కాలాంచిక, కలశిక, ఇస్తమస్ అనే నిర్మాణాలు ఉంటాయి. కాలాంచిక అనేది గరాటు ఆకారంలో ఉండి స్త్రీ బీజకోశం నుంచి విడులైన అండాలను సేకరిస్తుంది. కాలాంచిక నిర్మాణం తరవాత భాగమైన కలశికలోకి, కలశిక చివరి భాగమైన సన్నటి గ్రీవము(ఇస్తమస్) ద్వారా గర్భాశయంలోకి తెరచుకుంటుంది. ఫాలోపియన్ నాళంలోని కలశికలో శుక్రకణాలు, అండంలో ఫలదీకరణ చెందుతాయి.

గర్భాశయం: రెండు వైపులా ఉండే స్త్రీ బీజవాహికలు ఈ గర్భాశయంలోకి తెరచుకుంటాయి. గర్భాశయం... శ్రోణి ప్రాంతంలో మూత్రాశయానికి, పురీషనాళానికి మధ్య విశాలంగా, ధృడంగా, కండరయుతమై అధిక ప్రసరణ గల తలకిందులైన పియర్ ఆకారం పరిమాణంలో ఉండే కోశం లాంటి నిర్మాణం. పెరిమెట్రియం, మయోమెట్రియం, ఎండోమెట్రియం అనే మూడు కణజాలపు పొరలతో గర్భాశయకుడ్యం నిర్మితమైంది. గర్భాశయ ఎండోమెట్రియం రుతుచక్రంలో చక్రీయ మార్పులకు లోనైతే, ప్రసవ సమయంలో గర్భాశయ మెయోమెట్రియం ధృడమైన సంకోచాలను ప్రదర్శిస్తుంది. దీనిలో పిండ ప్రతిస్థాపనకు అనుకూల వాతావరణపు నియంత్రిత వ్యవస్థ ఉంటుంది. ప్రొజెస్టిరాన్ హార్మోన్ సహాయంతో ఫలదీకరణ చెందిన అండము గర్భాశయ కుడ్యంలో వున్న మృదు కణజాలానికి అతుక్కుంటుంది.

యోని: యోని విశాలంగా ఉండే తంతు-కండరయుత నాళం. దీనిని స్త్రీ బాహ్యజననాంగముగా పేర్కొంటారు. యోనిలో ఊర్ధ్వ, నిమ్న అనే రెండు రంధ్రాలుంటాయి. ఊర్ధ్వ రంధ్రాన్ని బాహ్యప్రసేక రంధ్రం అని, నిమ్న రంధ్రాన్ని యోని రంధ్రం అని పేర్కొంటారు. ప్రసేకం రంధ్రంపైన క్లిటోరిస్ అనే సున్నితమైన సంభించగల నిర్మాణం ఉంటుంది. ఇది పురుష మేహనానికి సమజాతము. యోనిపై భాగంలోని ఉబ్బెత్తు ప్రాంతాన్ని మాన్స్‌ప్యూబిస్ అంటారు. దీని చర్మంపై జఘన రోమాలు, చర్మం కింద కొవ్వు కణజాలపు దిండు ఉంటుంది.

అనుబంధ గ్రంథులు: స్త్రీలలో ప్రత్యుత్పత్తి అనుబంధ గ్రంథులు వరుసగా... బార్తోలిన్ గ్రంథులు, స్కీన్ గ్రంథులు, క్షీర గ్రంథులు. యోని రంధ్రానికి కొద్దిగా కిందగా ఇరువైపులా అమరి ఒక జత బార్తోలిన్ గ్రంథులు ఉంటాయి. వీటి స్రావం యోని మార్గాన్ని సులభంగా జారేటట్లు చేస్తుంది. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని బల్బోయూరెత్రల్ గ్రంథులకు సమజాతం. స్కీన్ గ్రంథులు అనేవి ప్రసేకం కింద ఉంటాయి. ఈ గ్రంథులు పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థలోని పౌరుష గ్రంథులకు సమజాతం. ఇవి ప్రేరేపితమైనప్పుడు క్షార జిగట ద్రవాన్ని స్రవిస్తాయి. ఒక జత క్షీర గ్రంథులు శిశు జననాంతరం మాత్రమే పనిచేయడం ప్రారంభిస్తాయి. పురుషులలో ఇవి క్రియారహిత అవశేషాంగాలుగా ఉంటాయి.

బీజ కణోత్పత్తి: బీజకణోత్పత్తి అంటే ప్రాథమిక లైంగిక అవయవాలైన ముష్కం, స్త్రీ బీజకోశాల నుంచి బీజకణాలు(సంయోగ బీజాలు) ఏర్పడటం. పురుషులలో జరిగే బీజకణోత్పత్తిని శుక్రకణోత్పత్తి అని, స్త్రీలలో జరిగే బీజకణోత్పత్తిని అండోత్పత్తి అని అంటారు.

శుక్రకణ నిర్మాణం: శుక్రకణ సూక్ష్మ నిర్మాణంలో...తల, మెడ, మధ్యభాగం, తోక అనే భాగాలు ఉంటాయి. తలభాగంలో ఏక్రోజోమ్ అనే టోపిలాంటి నిర్మాణం ఉంటుంది. ప్రోటియేజ్‌లు, ఏసిడ్ ఫాస్పటేజ్, హైలురోనిడేజ్ అనే ఎంజైములు ఏక్రోజోమ్‌లో ఉంటాయి. ఏక్రోజోమ్ అనేది ఫలదీకరణ సమయంలో శుక్రకణం, అండంలోకి చొచ్చుకొని పోయేందుకు సహాయపడుతుంది. తల భాగంలో ఏకస్థితిక కేంద్రం ఉంటుంది. మెడ అనేది తలభాగానికి, మధ్య భాగానికి ఉండే భాగం. మెడ కింది భాగాన్ని మధ్యభాగంగా పేర్కొంటారు. ఈ మధ్యభాగంలో మైటోకాండ్రియాలు చాలా ఉంటాయి. ఇవి శుక్ర కణాల తోక కదలిక, చలనానికి కావలసినంత శక్తిని అందిస్తాయి. మధ్యభాగం కింద ఉన్న నిర్మాణాన్ని తోకగా పేర్కొంటారు. ఈ తోక శుక్రకణం చలించడానికి తోడ్పడుతుంది.



అండం: స్త్రీ బీజకోశం నుంచి విడుదలైన అండం పూర్తిగా పరిణితి చెందినది కాదు. ఇది జోనా పెల్యూసిడా చేత ఆవరించి ఉంటుంది. అండం విడుదల కావడాన్ని అండోత్సరం అంటారు. అండోత్సరం తరవాత గ్రాపియన్ పుటికలలోని గ్రాన్యులోసా కణాలు విభజన చెంది కార్పస్ లూటియం అనే పసుపు రంగులో ఉండే తాత్కాలిక అంతఃస్రావగ్రంథి కణజాలంగా ఏర్పడుతుంది. కార్పస్ లూటియం ప్రొజెస్టిరాన్ అనే హార్మోనును స్రవిస్తుంది.

రుతుచక్రం: స్త్రీ జీవులలో జరిగే ప్రత్యుత్పత్తి వలయాన్ని రుతుచక్రం అంటారు. రుతుచక్రం అంటే ప్రతి నెల గర్భాశయ అంతర ఉపకళ(ఎండోమెట్రియం)లో జరిగే మార్పుల చక్రం. స్త్రీలలో ప్రతి 28 రోజుల కొకసారి రుతుచక్రం జరుగుతుంది. రుతుచక్రం మధ్యలో ఒక అండం విడుదలవుతుంది. రుతుచక్రాన్ని రుతుస్రావ దశ, పుటిక దశ, అండోత్సర దశ, టాలియల్ దశ అనే నాలుగు దశలుగా విభజించవచ్చు. మొదటి రుతుచక్రం యవ్వన దశలో(10 నుంచి 14 సంవత్సరాలు) ప్రారంభమవుతుంది. దీన్ని రజస్వల లేదా మెనార్కి అంటారు. స్త్రీలలో 45 నుంచి 50 సంవత్సరాల వయసు మధ్యలో రుతుచక్రం ఆగిపోవడాన్ని రుతువిరతి లేదా ముట్టుడగడం(మెనోపాజ్) అంటారు.


సంపర్కం - ఫలదీకరణం: సంపర్క సమయంలో మేహనం యోనిలోకి శుక్రద్రవాన్ని స్ఖలిస్తుంది. చలన సహిత శుక్రకణాలు వేగంగా, ఈదుతూ గర్భాశయ ద్వారం గుండా గర్భాశయంలోకి ప్రవేశించి చివరకు ఫాలోపియన్ నాళం ఇస్తమస్ ద్వారా కలశికలోకి చేరుతాయి. ఇక్కడ స్త్రీ బీజకోశం నుంచి విడుదలై కాలాంచిక ద్వారా వచ్చిన అండంతో కలుస్తుంది. మానవునిలో అంతర ఫలదీకరణ జరుగుతుంది. ఫలదీకరణ తర్వాత సంయుక్త బీజం అనే నిర్మాణం ఏర్పడుతుంది.

పిండ త్వచాలు: పిండ ప్రతిస్థాపన అనంతరం పిండంలోని కొన్ని కణాలు పిండానికి పోషణ, రక్షణ, ఆధారమునివ్వటానికి వేర్వేరు త్వచాలుగా అభివృద్ధి చెందుతాయి. వీటినే పిండ త్వచాలు అంటారు. అవి.. పరాయువు, ఉల్బము, అళిందము, సోనసంచి.



కె.నాగేశ్వరరావు,
సీనియర్ ఫ్యాకల్టీ

లిటిల్స్




మీకు తెలుసా?

- ఈ బుల్లి పక్షి పేరు 'పివావు'. న్యూజిలాండ్ రాక్ వెన్ అని కూడా పిలుస్తారు. ఇవి న్యూజిలాండ్‌లో ఉంటాయి.
- కాళ్లు కొంచెం పొడవుగా ఉంటాయి. బాల్ మాదిరి గుండ్రంగా ఉంటుంది. తోక కనపడదు.
- కేవలం 10 సెం.మీ. పొడవు ఉంటాయివి.
- ఆడపక్షులు 16 గ్రాములు, మగ పక్షులు 20 గ్రాములు ఉంటాయి. ఆడపక్షులు బ్రౌన్ రంగులో ఉంటే.. మగ పక్షులు గ్రీనిష్ రంగులో ఉంటాయి.



- ఇవి ఒక చోట నుంచి మరోచోటకు వెళ్తాయి. చలికాలంలో మాత్రం రాళ్ల కింద గూళ్లు పెట్టుకుని నివసిస్తాయి.
- పాటలు పాడుకుంటూ జంట పక్షులు గాల్లో వెళ్తుంటాయి.
- వీటి గుండ్రని రెక్కల వల్ల ఇవి రెండు మీటర్ల కంటే ఎక్కువ పైకి ఎగరలేవు. అది కూడా ముప్ఫయి మీటర్ల కంటే దూరం ఎగరలేవు. అందుకే ఇవి పూర్ ఫ్లయర్స్.
- ఇవి కేవలం మూడు గుడ్లు మాత్రమే పెడతాయి. వీటి పొదిగే కాలం మూడు వారాలు.
- వీటి ఆనవాళ్లు వెయ్యేళ్ల కిందట నుంచి ఉన్నాయి.
- న్యూజిలాండ్‌లో అత్యధికంగా నెటిజన్లు ఈ పక్షికే ఓటు వేయటంతో ఓ ఏడాది 'ఇయర్ ఆఫ్ ది బర్డ్' అయ్యింది.
- చిన్నపాటి పురుగులు, పండ్లు తింటాయి.


జంతువులు ఎన్ని



12 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 246

7	3		4				5	
			5			1		9
					1	3	8	
1					4	5		7
5		7	3					2
	1	5	6					
6		3			8			
	9				5		6	8

సుడోకు - 245 సమాధానం

2	9	7	5	3	6	8	4	1
1	5	4	7	9	8	6	2	3
6	3	8	2	1	4	5	7	9
9	4	5	8	6	7	1	3	2
7	1	6	4	2	3	9	5	8
3	8	2	9	5	1	4	6	7
5	2	1	6	7	9	3	8	4
8	7	9	3	4	5	2	1	6
4	6	3	1	8	2	7	9	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.